

'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 45

మంగళవారం 7-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ ఒక్కటే

'కాంగ్రెస్.. వైఎస్సార్ కాంగ్రెస్ రెండూ ఒక్కటే.. వీటితో అవధుల్లేని అవినీతి తప్ప మరే ఉపయోగంలేదు' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు.

- వివరాలు 5లో



నేడే మూడో దశ పోలింగ్

నేడు మూడో దశ పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 93 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ఏర్పాట్లు ఈసీ పూర్తిచేసింది.

- వివరాలు 6లో

సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్





రైతుబంధు వచ్చింది..

పిడికిలి బిగిస్తేనే!

నేను నిలదీస్తేనే కాంగ్రెస్ సర్కారు రైతుల ఖాతాల్లో డబ్బులు వేసింది

ఇక రైతుల రుణమాఫీ కోసం పోరాడుతాం.. కాంగ్రెస్ మెడలు వంచుతాం

నిజామాబాద్ రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

2లో

- రుణమాఫీ కావాలన్నా, ఇతర హామీలు అమలు కావాలన్నా బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలి
- దేవుళ్ల కాడ ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లు.. తప్ప రేవంత్ చేసేదేమీ లేదు
- సీఎంఆర్ఎఫ్ సాయం, కేసీఆర్ కిట్లు, విదేశీ విద్యానిధి.. ఇలా అన్నీ ఆగిపోయాయి
- తెలంగాణకు ఏమీ చేయని మోదీకి ఓటెందుకు వేయాలి?
- ఈసారి కేంద్రంలో వచ్చేది ప్రాంతీయ పార్టీల ప్రభుత్వమే
- తెలంగాణకు శక్తి, గళం, బలం బీఆర్ఎస్సే
- పార్లమెంటులో తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడేది మేమే.. ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి

ఏబీసీ పార్టీలది ముస్లిం లీగ్ ఎజెండా

- ఏఐఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ధ్వజం
- శ్రీరాముడు, సనాతన ధర్మం, దేశానికి కాంగ్రెస్ వ్యతిరేకం
- డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట కేసీఆర్ ప్రజల్ని మోసం చేశారు
- తెలంగాణలో మెజారిటీ ఎంపీ సీట్లు గెలుచుకుంటాం
- పెద్దపల్లి, చౌటుప్పల్, నల్లగొండ జనసభల్లో ప్రసంగం



సోమవారం నల్లగొండ జనసభలో తనకు బహూకరించిన ఖడ్గంతో జేపీ నడ్డా

సాక్షి, పెద్దపల్లి/సాక్షి, యాదాద్రి, నల్లగొండ టూటౌన్: 'ఏ అంటే ఏఐఎంఐఎం.. బీ అంటే బీఆర్ఎస్.. సీ అంటే కాంగ్రెస్. ఈ మూడు ఏబీసీ పార్టీలు ముస్లిం లీగ్ ఎజెండాతో పనిచేస్తున్నాయి. ఇవి తబ్లిగీ జమాతేను అనుసరిస్తున్నాయి' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. రజాకార్ పాలనను సమర్థించే పార్టీలుగా వాటిని అభివర్ణించారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం ఆ పార్టీలు నిర్వహించవని.. బీజేపీ అధికారంలోకి వస్తే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. సోమవారం పెద్దపల్లి ఎంపీ స్థానం పరిధిలోని పెద్దపల్లి జిల్లా కేంద్రంతోపాటు భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చౌటుప్పల్, నల్లగొండ ఎంపీ స్థానం పరిధిలోని నల్లగొండ పట్టణంలో నిర్వహించిన జన సభల్లో ఆయన ప్రసంగించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తాం

ప్రధాని మోదీ దేశంలో రిజర్వేషన్లు ఎత్తేస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారని నడ్డా దుయ్యబట్టారు. రిజర్వేషన్ల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లలోంచి 4% కోత పెట్టి ముస్లింలకు రిజర్వేషన్లు తెచ్చిందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవి దక్కేలా చూస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, మిగతా 3వ పేజీలో ▶

కాంగ్రెస్ టార్గెట్‌గా కమల వ్యూహం..

- చివరి ఐదు రోజులు.. అదే ప్రణాళికతో ప్రచారంలోకి బీజేపీ
- అగ్రనేతల సభలకు రంగం సిద్ధం.. రాష్ట్రానికి మోదీ, అమిత్‌షా, నడ్డా

3లో

వారిది చీకటి ఒప్పందం..

- బీఆర్ఎస్, బీజేపీలపై ముఖ్యమంత్రి రేవంత్ ధ్వజం
- మల్కాజిగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థిని దిష్టిబొమ్మలా పెట్టారు
- ఈటల మంత్రిగా ఉన్నప్పుడే లక్షల కోట్లు కొల్లగొట్టారు
- సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డికి ఓటేస్తే ఉపయోగం లేదు
- కేంద్రంలో మళ్లీ బీజేపీ సర్కారు వస్తే రిజర్వేషన్లు హుళక్కే..
- వైఎస్ హయాంలోనే విశ్వనగరానికి పునాది
- ఉప్పల్, అంబర్‌పేట, కంటోన్మెంట్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం

ఉప్పల్/మల్లాపూర్/అంబర్‌పేట/కంటోన్మెంట్: బీఆర్ఎస్ బీజేపీలది పొద్దుటి పూట బంధం.. చీకట్లో ఒప్పందం అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీలోనే లేదన్నారు. చీకటి ఒప్పందంలో భాగంగానే మల్కాజిగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థిని దిష్టిబొమ్మలా నిలబెట్టారని ధ్వజమెత్తారు. ఇక్కడి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడే లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనే హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకునేందుకు పునాది పడిందని చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజలు రాష్ట్రంలో ద్వితీయ శ్రేణి పౌరుల్లా జీవిస్తున్నారని, కంటోన్మెంట్ ప్రాంతాన్ని మిగతా 5వ పేజీలో ▶



హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇదండీ సంగతి



దాని వల్ల నీ భూముల సేఫ్!
ఎటొచ్చి నా భూములకే ఎసరు!!



మచిలీపట్నంలో ఏపీ సీఎం జగన్ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కూటమి కుట్రలు

రేపల్లె, మాచర్ల, మచిలీపట్నం ఎన్నికల సభల్లో ఏపీ సీఎం జగన్ ధ్వజం

ఇప్పటికే కొనసాగుతున్న పథకాలనూ అడ్డుకుంటారా?.. ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఆపేస్తారా?

అక్కచెల్లెమ్మల ఖాతాలకు పోవాల్సిన డబ్బులను దిక్కుమాలిన చంద్రబాబు ఆపుతున్నాడు

నిన్న అవ్వాతాతల పెన్షన్లు.. నేడు ఆన్ గోయింగ్ స్కీమ్స్‌పై చంద్రబాబు కుట్రలు

7లో

ఇష్టానుసారంగా అధికారులను మారుస్తున్నారు.. ఎన్నికలు బాగా జరుగుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది

పేదలకు మంచి చేసే మీ జగన్ ఉండకూడదనే ఇవన్నీ చేస్తున్నారు

రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత చాలా అవసరం.. అలాంటి వారికే ఓటు వేస్తామని గట్టి సందేశం ఇవ్వాలి

రైతు భరోసా నిధుల విడుదల

6.65 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,423 కోట్లు జమ



సాక్షి, హైదరాబాద్: యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. లోక్ సభ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయడం గమనార్హం. ఇప్పటివరకు ఐదెకరాలలోపు రైతులకే నిధులు విడుదల కాగా, సోమవారం ఐదెకరాలకు పైగా ఉన్న రైతులందరి ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్టు వ్యవసాయశాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు రైతుల ఫోన్లకు మెసేజ్‌లు కూడా వచ్చాయి. గత వానాకాలం సీజన్ లెక్కల ప్రకారం రైతుబంధు సొమ్ము తీసుకున్న రైతులు 68.99 లక్షలు ఉన్నారు. ఈ యాసంగి సీజన్‌లోనూ అంతేమంది రైతులకు సొమ్ము విడుదల చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. ఆ ప్రకారం 1.52 కోట్ల ఎకరాలకు రూ.7,625 కోట్లు విడుదల చేయాలి. కాగా ఇప్పటివరకు ఐదెకరాల వరకున్న రైతులకు రూ.5,202 కోట్ల రైతుబంధు సాయం అందిందని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. తాజాగా ఐదెకరాలకు పైగా మిగతా 5వ పేజీలో ▶

3 రోజులు తేలికపాటి వానలు!

- 19 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ
- రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు
- కొన్ని చోట్ల జల్లులు కురిసినా తగ్గని వేడి
- జగిత్యాల జిల్లా గుల్లకోట, అల్లిపూర్‌లలో 46.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు
- మరో 23 ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి వాతావరణ శాఖ కాస్త చల్లని కబురు చెప్పింది. వచ్చే మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వానలు పడతాయని ప్రకటించింది. మరోవైపు ఈ మూడు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగానే నమోదుకావొచ్చని పేర్కొంది.

19 జిల్లాల్లో వానలకు చాన్స్: ప్రస్తుతం తూర్పు విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ, దక్షిణ అంతర్గత కర్ణాటక మీదుగా మిగతా 8వ పేజీలో ▶

'రైతుబంధు' వచ్చింది.. పిడికిలి బిగిస్తేనే!

నేను నిలదీస్తేనే కాంగ్రెస్ సర్కారు రైతుల ఖాతాల్లో డబ్బులు వేసింది: కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆరు గ్యారంటీల పేరిట కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని.. హామీలు అమలు చేయకుండా తప్పించుకోవాలని చూస్తోందని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ పిడికిలి బిగించి నిలదీయడంతోనే.. కాంగ్రెస్ సర్కారుకు దెబ్బకు దెయ్యం వదిలి రైతుల ఖాతాల్లో రైతుబంధు (రైతు భరోసా) డబ్బులు వేసిందని చెప్పారు. ఇక రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కోసం పిడికిలి బిగించి పోరాటం చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి హామీలన్నీ అమలు చేసేలా చేయాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాల్సిందేనన్నారు. 12–14 సీట్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. సోమవారం నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఆర్మూర్, నిజామాబాద్‌లలో కేసీఆర్ బస్సు యాత్ర నిర్వహించారు. నిజామాబాద్ నగరంలో రోడ్ షో నిర్వహించి.. నెహ్రూ పార్క్ వద్ద కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలలుగా ఆరు గ్యారంటీల పేరిట మోసం చేస్తూ వస్తోంది. అరచేతిలో వైకుంఠం చూపుతోంది. కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా మళ్లీ రాష్ట్రంలో చేనేతల ఆత్మహత్యలు మొదలయ్యాయి. దేవుళ్ల కాడ ఒట్లు.. కేసీఆర్ మీద తిట్లు.. అనే పాలసీతో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. అంతకుమించి చేస్తున్నదేమీ లేదు. రేవంత్ ప్రభుత్వం వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్, అంబేడ్కర్ ఓవర్సీస్, సీఎంఆర్ఎఫ్, కేసీఆర్ కిట్లు.. వంటివన్నీ ఆగిపోయాయి. కరెంటు సరిగా రావడం లేదు.. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పంటలన్నీ ఎండబెట్టింది. గోదావరి నీళ్లను మోదీ వేరే రాష్ట్రాలకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే సీఎం రేవంత్ అడ్డుకోలేకపోతున్నారు.



నిజామాబాద్ రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్. చిత్రంలో బాజిరెడ్డి గోవర్ధన్, వేముల ప్రశాంత్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు అండగా నిలవాలి..

కేసీఆర్ పిడికిలి బిగించి నిలదీయడంతోనే దెబ్బకు దెయ్యం వదిలి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో వేశారు. అయినా రైతుబంధుకు 5 ఎకరాలకే కటాఫ్ పెట్టడం ఏమిటి? 6, 7 ఎకరాలున్న రైతులు బతకొద్దా? ఇక రూ.2 లక్షల రుణమాఫీ కోసం పిడికిలి బిగించి పోరాటం చేస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఆరు గ్యారంటీలు అమలు చేసేలా చేయాలంటే బీఆర్ఎస్ ఎంపీలు గెలవాల్సిందే. తెలంగాణ శక్తి, తెలంగాణ గళం, తెలంగాణ బలం బీఆర్ఎస్సే. 12–14 సీట్లలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి. బీడీ కార్మికులకు పింఛన్లు ఇచ్చేది ఒక్క తెలంగాణలో మాత్రమే. మోదీ పింఛన్లు ఇవ్వలేదు. బీడీ కార్మికులంతా బీఆర్ఎస్‌కు అండగా నిలబడాలి.

కేంద్రంలో వచ్చేది ప్రాంతీయ పార్టీల ప్రభుత్వమే

బీజేపీకి 400 సీట్లు వస్తాయని మోదీ గొప్పగా చెప్తున్నారు. కానీ 200లోపే సీట్లు వస్తాయి. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రావు. కేంద్రంలో వచ్చేది ప్రాంతీయ పార్టీల ప్రభుత్వమే. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కుమ్మక్కయ్యాయి. అందుకే పరస్పరం బలహీన అభ్యర్థులను నిలబెట్టుకున్నాయి. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అంటున్న నరేంద్ర మోదీ... దేశంలో 157 మెడికల్ కళాశాలలు ఇస్తే తెలంగాణకు ఒక్కటి కూడా ఎందుకు ఇవ్వలేదు? ఒక్క నవోదయ పాఠశాల సైతం ఇవ్వలేదేం? ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తానన్న మోదీ.. ఏం చేశారు? తెలంగాణకు ఏమీ చేయని మోదీకి ఎందుకు ఓటెయ్యాలి? నేను ప్రాణాలకు తెగించి కొట్లాడి తెలంగాణ తెచ్చిన. యావత్ తెలంగాణకు కేసీఆర్ ఆత్మబంధువు. నేను కూడా హిందువునే. కానీ మత విద్వేషాలు రెచ్చగొట్టవద్దన్నదే నా అభిమతం. నేను ప్రధాని మోదీని నిలదీసినందుకే.. నా కుమార్తె కవితను జైల్లో పెట్టారు. అయినప్పటికీ లొంగిపోయే ప్రసక్తే లేదు.

గులాబీ జెండాను గుండెలో పెట్టుకోవాలి

యువత ఆవేశంగా ఓట్లు వేయకుండా ఆలోచించి ఓట్లేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి. విద్యు త్, రైతుబంధు సరిగా రావాలన్నా.. మన గోదావరి నీళ్లు మనకే దక్కాలన్నా.. పార్లమెంటులో తెలంగాణ ప్రయోజనాల కోసం కొట్లాడాలన్నా.. బీఆర్ఎస్ ఎంపీలు గెలవాలి. ప్రజల మంచి కోసం పేగులు తెగే దాకా కొట్లాడతాం. గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకోవాలి..'' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

రాకేశ్ రెడ్డికి ఎమ్మెల్సీ బీఫాం ఇచ్చిన కేసీఆర్

నిజామాబాద్ నాగారం: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్ రెడ్డికి బీఫాంను స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ సోమవారం రాత్రి నిజామాబాద్‌లో అందజేశారు. నగరంలో రోడ్ షో ముగిసిన అనంతరం కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నివాసంలో బస చేశారు. ఈ సందర్భంగా బీఫాం అందజేసిన కేసీఆర్‌కు రాకేశ్ రెడ్డి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, నాయకులు మహేశ్ బిగాల, రాజారాం యాదవ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఫాం అందుకుంటున్న ఏనుగుల రాకేశ్ రెడ్డి

కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

జగిత్యాల క్రైం: ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సుయాత్ర చేస్తున్న కేసీఆర్.. సోమవారం సాయంత్రం జగిత్యాల నుంచి కోరుట్లకు వెళ్తుండగా చల్‌గల్ గ్రామశివారులో ఎన్నికల అధికారులు ఆయన బస్సును, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏమీ లభించలేదని వారు ప్రకటించారు.





తాను రచించిన పుస్తకాలను కేసీఆర్‌కు అందిస్తున్న జైశెట్టి రమణయ్య

నాటి రోజులు గుర్తుకొస్తున్నాయి

- తనకు హిస్టరీ బోధించిన రమణయ్య మాస్టారును కలుసుకున్న కేసీఆర్
- శిష్యుడిని చూసి సంబరపడిన గురువు రమణయ్య

జగిత్యాల: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సిద్దిపేట కళాశాలలో చదువుకున్న రోజుల్లో జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు జైశెట్టి రమణయ్య ఆయనకు పాఠాలు బోధించారు. బస్సుయాత్రలో భాగంగా జగిత్యాలకు వచ్చిన కేసీఆర్ ఈ విషయాన్ని గుర్తు చేసుకున్నారు. రమణయ్య మాస్టారి ఇంటికి వెళ్లి కలిశారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. సిద్దిపేట జూనియర్ కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా రమణయ్య తనకు పాఠాలు నేర్పారని గుర్తు చేసుకున్నారు. రమణయ్య స్వయంగా దేశంలో, రాష్ట్రంలో చారిత్రక ప్రాంతాల్లో తిరిగి వచ్చి, బోధించేవారని కేసీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజల పట్ల కేసీఆర్‌కు ఎంతో శ్రద్ధ: రమణయ్య

కేసీఆర్ చిన్నతనం నుంచే తెలంగాణ ప్రజల పట్ల ఎంతో శ్రద్ధగా ఉండేవారని జైశెట్టి రమణయ్య మాస్టారు చెప్పా రు. కష్టనష్టాలు, జయాపజయాలను సమస్థితిలో స్వీకరించడం కేసీఆర్‌కు చిన్నతనం నుంచే అలవాటు అని పేర్కొన్నారు. 30 ఏళ్ల కిందే సిద్దిపేట జిల్లా కావాలంటూ కేసీఆర్ నాటి కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఇంకా చేయాల్సి ఉందని కేసీఆర్‌తో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమణయ్య తాను రచించిన 'ఎలగందుల ఖిల్లా' పుస్తకాన్ని కేసీఆర్‌కు అంకితం చేశారు. తాను రచించిన మరికొన్ని పుస్తకాలను కేసీఆర్‌కు అందజేశారు.

అధికార గర్వంతో రేవంత్ మాట్లాడుతుండు

- ఎంపీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాల్సిందే
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): సీఎం రేవంత్‌రెడ్డి అధికార గర్వంతో అసభ్యంగా మాట్లాడుతున్నారని, ఇందుకు అడ్డుకట్ట పడాలంటే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు.



కొండపాకలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలో సోమవారం రాత్రి 10 గంటల వరకు రోడ్ షో సాగింది. మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టగానే రైతుబంధు డబ్బులు జమ అవుతున్న విషయాన్ని ప్రజలు ఆలోచించాలని కోరారు. అధికారం కోసం కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చిందని విమర్శించిన ఆయన రాష్ట్రంలో మళ్లీ కరెంట్ కష్టాలు మొదలయ్యాయని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు కేలండర్లు పంచుతూ ఓట్లు అడుగుతున్నారని నిందించారు. మెదక్ పార్లమెంట్ ప్రజలకు ఆసరాగా నిలిచేందుకు పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రూ.100 కోట్లతో ట్రస్టును ఏర్పాటుకు ముందుకు రావడం ప్రజల అదృష్టమన్నారు.

వాళ్లను నేనే కాంగ్రెస్‌లోకి పంపా : మల్లారెడ్డి



కంటోన్మెంట్: మేడ్చల్ నియోజకవర్గం పరిధి లోని బీఆర్ఎస్ నేతలను తానే కాంగ్రెస్‌లోకి పంపానని మాజీ మంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం బోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం అనంతరం ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, నియోజకవర్గ ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డిలతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 4 నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన వాళ్లు సైతం బాధపడుతున్నారని చెప్పారు. మేడ్చల్ పరిధిలోని కార్పొ రేటర్లు, కౌన్సిలర్లను తానే కాంగ్రెస్‌లోకి పంపి, కోవర్టులుగా పనిచేయాలని సూచించానన్నారు. వాళ్లు కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ బీఆర్ ఎస్ అభ్యర్థులకే ఓట్లు వేస్తారని చెప్పారు.

ఎమ్మెల్యే కారును ఢీకొని ఇద్దరు మృతి

- వెల్జాల్ సమీపంలో ప్రమాదం
- కారును ఢీకొన్న బైక్
- ఒకరు అక్కడికక్కడే దుర్మరణం
- మరొకరు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి
- ఎమ్మెల్యేకూ గాయాలు.. హైదరాబాద్‌లో చికిత్స



ఎమ్మెల్యే కసిరెడ్డి



నరేశ్ (ఫైల్)

తలకొండపల్లి, కల్వకుర్తి /కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి ప్రయాణిస్తున్న కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. తలకొండపల్లి మండల పరిధి వెల్జాల్ సమీపంలో సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా.. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే నారాయణ్‌రెడ్డి వెల్జాల్ నుంచి మిడ్జిల్ వెళ్తుండగా రామాసిపల్లి మైసమ్మ దేవాలయం వద్ద ఎదురుగా వచ్చిన బైక్ ఆయన ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. బైక్‌ను తప్పించే క్రమంలో ఎమ్మెల్యే వాహనం రోడ్డు దిగి పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వెంకటాపూర్ గ్రామానికి చెందిన పబ్బతి నరేశ్ (25) అక్కడిక్కడే మృతి చెందగా బైరపాక పరశురాం(35) గాయపడ్డాడు. అతన్ని చికిత్స కోసం వెల్దండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే కారులోని ఎయిర్ బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో ఎమ్మెల్యేతో సహా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. ఎమ్మెల్యే నారాయణరెడ్డిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఆ రెండూ ప్రతిష్టాత్మకమే

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నికపై బీఆర్ఎస్ ఫోకస్
వరంగల్– ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపైనా వ్యూహం

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికలతోపాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఉపఎన్నికలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పార్లమెంట్ ఎన్నికలతోపాటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి, ఆ తర్వాత 'వరంగల్–ఖమ్మం– నల్లగొండ' పట్టభద్రుల స్థానానికి కూడా ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ రెండూ బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు కావడంతో వాటిని తిరిగి గెలుచుకోవడంపై బీఆర్ఎస్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో కంటోన్మెంట్‌కు ఉపఎన్నిక రాగా, ఈ నెల 13న జరిగే లోక్‌సభ పోలింగ్‌తోపాటు ఈ అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా పోలింగ్ జరగనుంది. మరోవైపు 'వరంగల్–ఖమ్మం– నల్లగొండ' పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో పల్లా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఎమ్మెల్సీగా పల్లా పదవీకాలం 2027 ఏప్రిల్‌లో ముగియనుంది. తాజాగా ఎన్నికల కమిషన్ ఉపఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 9 వరకు నామినేషన్ల స్వీకరణ, ఈ నెల 27న పోలింగ్ జరుగుతుంది.



లాస్య నందిత సోదరి కోసం..

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో తమ అభ్యర్థి నివేదిత గెలుపు కోసం బీఆర్ఎస్ సర్వశక్తులూ ఒడ్డుతోంది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి ప్రచార సమన్వయ బాధ్యతలు అప్పగించగా, పార్టీ నేత రావుల శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ ప్రచార ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు మల్కాజిగిరి ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఎనిమిది వార్డులు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఒక డివిజన్ వారీగా ప్రచార బాధ్యతలు పంచుకొని పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ బీఆర్ఎస్ టికెట్ ఆశించిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఇతర ఆశావహులు గజ్జెల నాగేశ్ కేసీఆర్ బస్సు యాత్రలో ఉండగా, ఎర్రోళ్ల శ్రీనివాస్ సంగారెడ్డి ప్రచార సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. నివేదిత తరఫున సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరడంతో ప్రచారంపై ఆ ప్రభావం పడకుండా చూడాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్సు యాత్ర చేస్తున్న కేసీఆర్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో రెండు రోజుల క్రితం ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆరా తీశారు. మరోవైపు ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్‌షోల్లో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రచార సరళిని పర్యవేక్షిస్తున్నారు.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్

శాసనమండలి ఆరంభం నుంచి బీ ఆర్ఎస్ అభ్యర్థులే 'వరంగల్–ఖమ్మం–నల్లగొండ' పట్టభద్రుల స్థానం నుంచి గెలుస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేరును అధినేత కేసీఆర్ రెండు రోజుల క్రితం ఖరారు చేశారు. రాకేశ్ రెడ్డి మంగళ వారం నల్లగొండ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. బీఆర్ఎస్ టికెట్ పార్టీ నేతలు ఓ.నర్సింహారెడ్డి, డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, సుందర్ రాజు తదితరులు ఆశించారు. అయినా అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన రాకేశ్ రెడ్డికి టికెట్ దక్కింది. ఇక్కడ గెలుపును బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని సమ న్వయంతో పనిచేయడం ద్వారా ప్రచారంలో పైచేయి సాధించాలని భావిస్తోంది. దీంతో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఉన్న పార్టీ అధినేత కేసీఆర్ ఈ నెల 12న లేదా 14న మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌చార్జ్‌లు, ఇతర ముఖ్యనేతలతో తెలంగాణభవన్‌లో భేటీ అవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



సిరిసిల్ల గాంధీ సర్కిల్ వద్ద ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ సెల్ఫీ కోసం ఎగబడుతున్న యువతులు.



కొండాపూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఏ అధికారంతో ఢిల్లీ పోలీసులు గాంధీభవన్‌కు వచ్చారు?

రాజ్యసభ ఎంపీ రేణుకాచౌదరి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ పోలీసులు తెలంగాణలో ఏ అధికారంతో దిగారని, ఏ హక్కుతో గాంధీభవన్‌కి వచ్చి కాంగ్రెస్ పార్టీ వాళ్ల మీద కేసులు పెట్టారని రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నించారు. తెలంగాణ తడాఖా ఏంటో చూపిస్తామని సవాల్ విసిరారు. గాంధీభవన్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకులు దేశాన్ని తమ జాగీరుగా భావిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ వాళ్లకి దమ్ముంటే కర్ణాటకలో అరాచకాలకు పాల్పడి, విదేశాలకు పారిపోయిన ప్రజ్వల్ రేవణ్ణను పట్టుకోవాలని సవాల్ విసిరారు. నీరవ్ మోదీ తదితరులు పారిపోయినట్టే రేవణ్ణ కూడా పారిపోయాడని, ప్రజ్వల్‌ని బలపరిస్తే తనను బలపర్చినట్టే అని మోదీ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులు ఏం చేసినా ఎన్నికల అధికారులు మౌనంగా ఉంటున్నారని విమర్శించారు. ముస్లింలకు మోదీ ప్రధాని కారా అని ప్రశ్నించారు. పెద్ద ఛాతీ ఉండటం కాదని, దానిలో గుండె, మనసు కూడా ఉండాలన్నారు.

మోదీని ఆపే దమ్ము కేసీఆర్‌కే ఉంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు

- 10 నుంచి 12 ఎంపీ సీట్లు ఇస్తే కేసీఆర్ చక్రం తిప్పడం ఖాయం
- తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా రేవంత్ ఇయ్యడు
- 'న.మో' అంటే నమ్మించి మోసం చేసేవాడు అని అర్థం
- ఇప్పుడైనా, ఎప్పుడైనా తెలంగాణకు కేసీఆరే రక్ష అని స్పష్టీకరణ
- హైదరాబాద్, సిరిసిల్లలో ఎన్నికల ప్రచారం

గచ్చిబౌలి, శంషాబాద్ (హైదరాబాద్)/ సిరిసిల్ల: దేశంలో ప్రధాని నరేంద్ర మోదీని నిలువరించగలిగే శక్తి, కేంద్రంలో రానున్న సర్కారుతో పోరాడే దమ్ము కేవలం మాజీ సీఎం కేసీఆర్‌కు, అలాగే కేజ్రీవాల్, మమతా బెనర్జీ లాంటి వారికే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు అన్నారు. కేసీఆర్‌ను మరింత బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో 10 నుంచి 12 సీట్లు బీఆర్ఎస్‌కు ఇస్తే ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పడం ఖాయమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని, రాజీవ్‌గాంధీ లైన్‌లో కాకుండా మోదీ లైన్‌లో నడుస్తున్నాడని విమర్శించారు. బీజేపీ వాళ్లు ఇంటింటికీ పంపే రాముడి ఫొటోకు, అక్షింతలకు మోసపోవద్దని కోరారు. అవి అయోధ్య నుంచి రాలేదని ఇక్కడి రేషన్ బియ్యానికే పసుపు పూసి పంపుతున్నారని ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని కొండాపూర్, శంషాబాద్‌లో, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు.

ఆయనేమన్నా బోటి కొట్టేటోడా?

'కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపి, అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఈ ఐదు నెలల్లో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. సిరిసిల్ల నేతన్నలకు భరోసా ఇచ్చే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వలేదు. హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలి? కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెడితేనే పిచ్చి వాగుడు వాగుతున్న రేవంత్‌రెడ్డికి బుద్ధి వస్తుంది. ఆయన తులం బంగారం కాదు కదా తులం ఇనుము కూడా ఇయ్యడు. రూ.2,500 నగదు, రూ.4 వేల పింఛను, స్కూటీలు ఇప్పటివరకు ఇయ్యలేదు. రూ.4 వేలు కాదు కదా రూ.400 కూడా ఇయ్యడు. రూ.2,500 కాదు ఉన్న రూ.500 ఇస్తే అదే గొప్ప. రేవంత్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ అడ్రస్ లేకుండా పోయింది. ఫార్మాసిటీ లేకుండా పోయింది.. ఒప్పందం చేసుకున్న కంపెనీలు కూడా వెనక్కి వెళ్లిపోతున్నాయి.. కొత్తవి రావడం లేదు. పేగులు మెడకు వేసుకుంటా అంటున్నాడు.. ఆయనేమన్నా బోటి కొట్టేటోడా? కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని పెట్టింది. సిరిసిల్ల రోడ్డుపై రాజేందర్‌రావు నిల్చుంటే.. బస్సు కోసం చూస్తుండని భావిస్తారే కానీ కాంగ్రెస్ అభ్యర్థి అని గుర్తుపట్టరు..' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

మోదీకి ఎందుకు ఓటెయ్యాలి?

'మోదీ పచ్చి మోసగాడు. న.మో అంటే న మ్మించి మోసం చేసేవాడని అర్థం. ఐటీఐ ఆర్, మెట్రో విస్తరణ, మూసీ సుందరీకర ణకు నిధులు అడిగితే ఇప్పటివరకు ఇయ్యని మోదీకి ఎందుకు ఓటు వేయాలి? జన్‌ధన్ ఖాతాలు తెరవండి ధనాధన్ 15 లక్షలు వేస్తా, బుల్లెట్ రైళ్లు..ఇలా పదేళ్ల కాలంలో ఎన్నో చెప్పారు. కానీ బడే భాయ్ మోదీ మ నకు ఒక్క రూపాయి కూడా ఇయ్యలేదు. గు డి కట్టుడు ఒక్కటే ఓటు వేసేందుకు కారణ మైతే కేసీఆర్ యాదాద్రి కట్టలేదా? హైదరా బాద్ నగరంలో అన్ని మతాలు, కులాల వారూ ఉంటారు. ముస్లింలను తిట్టడమే లక్ష్యంగా మోదీ పెట్టుకున్నారు. పదేళ్లు ప్రధానిగా పనిచేసిన వ్యక్తి చేయాల్సిన పని ఇదా?. దేవుడిని మొక్కండి.. బీజేపీని తొక్కండి..' అంటూ మాజీమంత్రి ధ్వజమెత్తారు.

గ్రేటర్ ప్రజలు కేసీఆర్‌నే కోరుకున్నారు

'హైదరాబాద్ నగరంలో అత్యధికంగా 36 ఫ్లైఓవర్లు నిర్మించాం. అత్యధిక ఐటీ కంపెనీలు ఉన్న నియోజకవర్గం శేరిలింగంపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే గాంధీ కష్టపడి పనిచేస్తున్నాడు. ఆయనకు జోడేదార్‌గా ఇప్పుడు ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తే వారిద్దరికీ నేను పూర్తి అండగా ఉంటా. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో 16 స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించారు. బీజేపీకి ఒక్క సీటు ఇచ్చారు. కాంగ్రెస్‌కు ఒక్కటి కూడా ఇవ్వలేదు. గ్రేటర్ ప్రజలు కేసీఆరే సీఎంగా ఉండాలని కోరుకున్నారు. ఇప్పుడైనా, ఎప్పుడైనా తెలంగాణకు కేసీఆరే రక్ష..' అని కేటీఆర్ చెప్పారు. రోడ్ షోల్లో జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు గాంధీ, ప్రకాశ్‌గౌడ్, పార్టీ సీనియర్ నేత గణేష్‌గుప్తా పలువురు స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

హిందువులకు సీఎం రేవంత్ క్షమాపణలు చెప్పాలి



బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందువుల మనోభావాలు కించపరిచే విధంగా దిగజారి మాట్లాడుతున్నారని వెంటనే హిందువులకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీపై నిరాధార ఆరోపణలతో పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ...సీఎం రేవంత్‌రెడ్డికి హిందువునని చెప్పుకునే అర్హత లేదన్నారు. కులాధారిత రిజర్వేషన్లు వద్దని నెహ్రూ అప్పటి సీఎంలకు లేఖ రాసిన మాట వాస్తవమా కాదో రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ వ్యతిరేకించలేదా అని ప్రశ్నించారు. వీటిపై రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకే గాడిదగుడ్డు ప్రచారం చేపట్టాల్సిన దుస్థితి ఆ పార్టీకి నెలకొందన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికలు దేశాభివృద్ధికి, కుటుంబ రాజకీయాలకు మధ్య జరుగుతున్న పోటీగా లక్ష్మణ్ అభివర్ణించారు. జూన్ 4 తర్వాత కాంగ్రెస్‌కు పరాభవం తప్పదని, ఇక ఆ పార్టీ నేతలకు మిగిలేది గాడిద గుడ్డేనని ఎద్దేవా చేశారు.

ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఉత్తమ ఫలితాలు

- జేఈఈ మెయిన్స్ టాపర్ల వెల్లడి



సాయి



రిషి

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్–2024 టాపర్లుగా నిలవడానికి ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ దోహదం చేసిందని జేఈఈ మెయిన్స్‌లో 15, 19వ ర్యాంకులు సాధించిన సాయి దివ్యతేజ రెడ్డి, రిషి శేఖర్ చెప్పారు. తెలంగాణ నుంచి టాపర్లుగా నిలిచిన వీరు తమ విజయంలో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ కీలకంగా వ్యవహరించిందన్నారు. ఈ సందర్భంగా రిషి మాట్లాడుతూ జేఈఈ ప్రిపరేషన్‌లో వినడం, చదవడం, ప్రాక్టీస్ చేయడం, సందేహాలు నివృత్తి చేసుకోవడం చాలా ముఖ్యమని తెలిపాడు. ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ టీచర్లు తనకు విలువైన సలహాలు, సూచనలిచ్చారని దీంతో ఫైనల్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించానని పేర్కొన్నాడు. సాయి దివ్యతేజ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో రెండేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో చేరానని చెప్పాడు. ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో టీచర్ల గైడెన్స్ తన విజయంలో దోహదం చేసిందన్నాడు. రోజువారీ మాక్ టెస్టులు, రివిజన్ సెషన్లలో పాల్గొనడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని పేర్కొన్నాడు.

కాంగ్రెస్ టార్గెట్‌గా కమల వ్యూహం

చివరి ఐదు రోజులు..అదే ప్రణాళికతో ప్రచారంలోకి బీజేపీ

అగ్రనేతల సభలకు రంగం సిద్ధం.. రాష్ట్రానికి మోదీ, అమిత్‌షా, నడ్డాల త్రయం

సాక్షి, హైదరాబాద్ : ఎన్నికల ప్రచార గడువు దగ్గర పడుతుండటంతో బీజేపీ అగ్రనేతల పర్యటనలతో 'కార్పెట్ బాంబింగ్'కు కమలదళం సిద్ధమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఆ పార్టీ జాతీయ నాయకత్వంపై ప్రచారంలో భాగంగా బీజేపీ ముఖ్యనేతల ప్రసంగాలతో ఎదురుదాడికి దిగనుంది. రిజర్వేషన్ల రద్దు ఉండబోదని ప్రధాని మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా పదేపదే స్పష్టం చేస్తున్నా, కాంగ్రెస్ అదే ప్రచారాన్ని కొనసాగించడాన్ని ఖండిస్తూ అగ్రనేతలు ప్రచారం చేస్తారని పార్టీనేతలు చెబుతున్నారు. రిజర్వేషన్ల రద్దు అంశాన్ని కాంగ్రెస్ నేతలు పనిగట్టుకొని ఎన్నికల ఎజెండాగా మార్చడాన్ని ఎండగడుతూ పార్టీ తుదివిడత ప్రచారం కొనసాగేలా ప్లాన్ చేసినట్టు సమాచారం.

కాంగ్రెస్‌పై ముప్పేట దాడికి...

కాంగ్రెస్ పార్టీ ఏడున్నర దశాబ్దాల్లో వివిధ సందర్భాల్లో దేశ ప్రయోజనాలకు భిన్నంగా ఎలా వ్యవహరించింది..భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ రిజర్వేషన్లు తేవడానికి చేసిన కృషి, దానికి తూట్లు పొడిచేలా నెహ్రూ నుంచి రాహుల్‌గాంధీ వరకు అనుసరించిన పద్ధతులు, విధానాలను తీవ్రస్థాయిలో బీజేపీ అగ్రనేతలు ఎండగడతారని పార్టీవర్గాలు తెలిపాయి. తెలంగాణ, కర్ణాటక, హిమచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక, ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను ఏ విధంగా మోసం చేస్తోందో వివరిస్తారని తెలుస్తోంది. తెలంగాణలో అధికారాన్ని ఆర్ఆర్ టాక్స్, ఇతర రూపాల్లో వసూళ్ల ద్వారా కాంగ్రెస్ ఉపయోగించుకొని దేశవ్యాప్తంగా ఎన్నికల కోసం ఏ విధంగా ఖర్చు చేస్తోందనే దానిపైనా తీవ్రస్థాయిలో మోదీ, అమిత్‌షా, నడ్డా విమర్శల దాడిని కొనసాగించి, వారి బండారాన్ని బయటపెడతారని చెబుతున్నారు.



- ఈ నెల 8న రెండు, మూడు లోక్‌సభ స్థానాల్లో సభల్లో పాల్గొనడంతోపాటు, 10వ తేదీన హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో మోదీ సభతో రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ముగించనున్నారు.
- 9న చేవెళ్ల పరిధిలోని వికారాబాద్‌లో, 11న నాగర్‌కర్నూల్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని వనపర్తిలో, భువన గిరి లోక్‌సభ స్థానాల్లో ప్రచారానికి అమిత్‌షా రానున్నారు.
- ప్రచారం ముగిసేలోగా కేంద్రరక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఇతర మంత్రులు కూడా రాష్ట్రంలో ప్రచారం నిర్వహిస్తారని తెలుస్తోంది.
- బీజేపీ చీఫ్ నడ్డా కూడా ప్రచారం గడువు ముగిసేలోగా కనీసం రెండుసభల్లో పాల్గొనే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

పక్కా ప్లానింగ్‌తో క్షేత్రస్థాయి ప్రచారం

మంగళవారం నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు పార్టీపరంగా ప్రచారం తీవ్రతరం చేయడంపై రాష్ట్ర నాయకత్వం దృష్టి పెట్టింది. మెజారిటీ ఎంపీ స్థానాల్లో రెండోవిడత ప్రచారం దాదాపుగా పూర్తి చేసినట్టుగా రాష్ట్ర కార్యాలయానికి నివేదికలు అందుతున్నాయి. చివరి ఐదు రోజులు పార్టీ పోటీచేస్తున్న అన్ని సీట్లలో అగ్రనేతల ప్రచారం ఉండేలా నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

- ఈ నెల 8, 9, 10 తేదీల్లో మూడోవిడత 'ఇంటింటి బీజేపీ'తో పోలింగ్ బూత్‌స్థాయిలో ఓటర్లను కలుసుకోనున్నారు.
- ఎంపీ సీట్లలో నాలుగైదు పోలింగ్ బూత్‌లకు కలిపి 'స్ట్రీట్ కార్నర్' మీటింగ్‌లు, ఈ చివరి వారమంతా కూడా ముమ్మర ప్రచారం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీనియర్ నేతలు బండిసంజయ్, డీకే అరుణ, ఈటల రాజేందర్, అర్వింద్ ధర్మపురి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు ఇతర నేతలు ఇప్పటికే తమ ప్రచారస్పీడ్ పెంచేశారు.
- పార్టీ కచ్చితంగా గెలిచే అవకాశమున్న సీట్లతోపాటు ముఖ్యనేతలు బరిలో ఉన్న స్థానాల్లో అంటే 12 సీట్లలో మోదీ ప్రచారసభలతో దృష్టి కేంద్రీకరించినట్టు పార్టీనేతలు చెబుతున్నారు. ఈ స్థానాలతో పాటు మిగతా సీట్లను కూడా కవర్‌చేసేలా అమిత్‌షా, నడ్డా ప్రచారం నిర్వహిస్తున్నారు.
- తెలంగాణ, హైదరాబాద్‌లోని వివిధ రాష్ట్రాలు, భాష, సామాజికవర్గాలకు చెందిన ప్రజలను ఆకట్టుకొని, ఓట్ల రూపంలో మద్దతు సాధించేలా గుజరాత్‌ సీఎం భూపేంద్ర భాయ్ పటేల్ , రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌ధామి, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రులు, ముఖ్యనేతలు, రాష్ట్ర మాజీ గవర్నర్ డా. తమిళిసై, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, మలయాళం హీరో సురేష్‌గోపీ, కర్ణాటకకు చెందిన బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వీ సూర్య విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఏబీసీ పార్టీలది ముస్లిం లీగ్ ఎజెండా

▶ మొదటి పేజీ తరువాయి

ఓబీసీ రిజర్వేషన్లు తొలగించబోమనే విషయాన్ని లిఖితరూపంలో ఇచ్చే దమ్ముందా..? అని ప్రధాని మోదీ నాలుగు రోజుల క్రితం కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తే.. ఇప్పటివరకు రాహుల్ స్పందించలేదని ఎద్దేవా చేశారు. బీజేపీ రాజ్యాంగానికి వ్యతిరేకం కాదని, మతం పేరిట ముస్లిం రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమన్నారు.

శ్రీరాముని వ్యతిరేకి కాంగ్రెస్..

శ్రీరాముడు, సనాతన ధర్మం, దేశాన్ని వ్యతిరేకించేది కాంగ్రెస్ పార్టీ అని నడ్డా ఆరోపించారు. సనా తన ధర్మం గురించి కాంగ్రెస్ మిత్రపక్షమైన డీఎంకే ఎన్ని విమర్శలు చేసినా సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీ స్పందించలేదన్నారు. దేశాన్ని ముక్కలు చేస్తామన్న వారికి రాహుల్ మద్దతిస్తున్నారని ఆరోపించారు. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు జరిపితే అందుకు ఆధారాలు అడిగిన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. అలాంటి వారికి అధికారమిస్తే దేశం పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు డబుల్ బెడ్రూం ఇళ్ల పేరిట కేసీఆర్ పేదలను మోసగించారని నడ్డా ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనను కేసీఆర్ ఉపయోగించలేదని, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా దానిపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.



పెద్దపల్లిలో జరిగిన సభకు హాజరైన బీజేపీ శ్రేణులు, ప్రజలు. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జగత్‌ప్రకాశ్ నడ్డా

5వ ఆర్థిక శక్తిగా భారత్..

గత పదేళ్లలో ప్రధాని మోదీ దేశం విలువను పదింతలు పెంచారని నడ్డా తెలిపారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలతో విదేశీ ఎగుమతులు పెరిగాయని చెప్పారు. ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్ మోదీ విధానాలతో 5వ ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. మోదీ పాలనలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. అందుకే దేశాభివృద్ధికి పాటుపడుతున్న బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని నడ్డా కోరారు. ఆయా సభల్లో పార్టీ ఎంపీ అభ్యర్థులు గోమాస శ్రీనివాస్ (పెద్దపల్లి), బూర నర్సయ్యగౌడ్ (భువనగిరి), శానంపూడి సైదిరెడ్డి (నల్లగొండ)తోపాటు సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత, పార్టీ రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శివాలయంలో కాకతీయ రాజు పూజలు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచిలోని కాకతీయుల కాలం నాటి శివాలయాన్ని కాకతీయ సామ్రాజ్య వారసుడు, బస్తర్ రాజు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ సోమవారం దర్శించుకున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున ఎన్నికల ప్రచారం కోసం ఆయన జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కూసుమంచిలోని శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శేషగిరిశర్మ ఆయనకు ఆలయ విశిష్టతను వివరించారు. తమ వంశీకులు నిర్మించిన ఈ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కాగా, తన సన్నిహితుడైన తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని.. దేశాభివృద్ధి కోసం మరోమారు మోదీకి పట్టం పట్టాలని ప్రజలను కోరారు.

పీఆర్సీ కమిటీతో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రెండో పీఆర్సీ కమిటీతో భేటీ అయింది. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లు, ప్రధానాచార్యులు ఇతర ఉన్నతాధికారుల వేతన సవరణకు సంబంధించి సమగ్ర నివేదికను అందించడంతోపాటు కూలంకషంగా చర్చించారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతన సవరణ చేయాలని కమిటీని కోరింది. కార్యక్రమంలో ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ పి.మధుసూదన్‌రెడ్డి, సంఘం నేతలు కృష్ణకుమార్, కేఎస్ రామారావు, రవీందర్‌రెడ్డి, రామానుజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కమలం వికసిస్తుంది

- కారు కార్ఖానాకు పోయింది.. చేయి పనైపోయింది
- ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి
- పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీకి ప్రజల కష్టాలు తెలుసు: కిషన్‌రెడ్డి

ముషీరాబాద్/సనత్‌నగర్ (హైదరాబాద్): 'రాష్ట్రంలో కారు కార్ఖానాకు పోయింది... చెయ్యి పనైపోయింది' అని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి విమర్శించారు. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ముషీరాబాద్ కషిష్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం బీజేవైఎం యువ సమ్మేళన సభ జరిగింది. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ఈ సమావేశానికి పుష్కర్‌సింగ్ ధామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా బీజేపీ హవా నడుస్తోందని, మూడవసారి కూడా నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ తోడుదొంగలని ఆయన ధ్వజమెత్తారు. కేసీఆర్ కుటుంబం పదేళ్ల అవినీతికి పాల్పడిందని, లిక్కర్ స్కాంలో ఆయన కూతురు జైల్లో ఉందని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేసులు ఉన్నాయని వారు కూడా బెయిలుపై బయట ఉన్నారని తెలిపారు. కిషన్‌రెడ్డి మచ్చలేని నాయకుడని ఆయన మరోసారి ఎంపీగా గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. యూసీసీ(ఉమ్మడి పౌరసత్వం) చట్టాన్ని ఉత్తరాఖండ్‌లో మొదటిసారి అమలు చేశామని ఈ చట్టం దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రధాని సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తుంటే, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని పని చేస్తున్నారని అన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మోదీకి ప్రజల కష్టాలు తెలుసని.. అందుకే దేశవ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అనేకమార్లు ఇందిరాగాంధీ కుటుంబం అవమాన పరిచిందని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను మోదీ ఏనాడూ తొలగిస్తామని అనలేదని, మతపరమైన రిజర్వేషన్లు వద్దని మాత్రమే అన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీకి ప్రజాదరణ లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రచనశ్రీ, పావని వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి. చిత్రంలో కిషన్‌రెడ్డి తదితరులు

అభివృద్ధి, సంక్షేమమే మోదీ ఎజెండా..

అభివృద్ధి, సంక్షేమమే ప్రధానమంత్రి మోదీ ఎజెండా అని, దేశం కోసం మరోసారి ఆయనను గెలిపించుకోవాలని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అథావలేతో కలిసి సనత్‌నగర్ నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం జరిగిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, పేదవాడి టాయిలెట్ల నిర్మాణం నుంచి చంద్రయాన్ వరకు ప్రతిచోటా మనం ప్రగతి సాధిస్తున్నామని ఇది మోదీ ప్రభుత్వ ఘనత అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డు, గుండేనా.. గ్యారంటీలు పట్టవా?

సీఎం రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ ఫైర్

- కాంగ్రెస్ నేతలు దిగజారుడు భాష మాట్లాడుతున్నారని మండిపాటు
- ఈవీఎంలో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే కాంగ్రెస్‌కు ఓటేయాలని ప్రజలకు సూచన
- బీజేవైఎం కార్యకర్తలు, పార్టీ పోలింగ్ ఏజెంట్లతో సమావేశం

ఎల్కతుర్తి/హుజూరాబాద్: తాము పువ్వు గుర్తుకు ఓటేయాలని తిరుగుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం గాడిద గుడ్డు పట్టుకొని ఎన్నికల ప్రచారం చేస్తున్నారని బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. అలాగే తనను అరగుండు అంటూ విమర్శించడంపైనా స్పందించారు. గాడిద గుడ్డు, తన గుండుపై సీఎంకు ఉన్న శ్రద్ధ ఆరు గ్యారంటీల అమలుపై ఎందుకు లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం జమ్మికుంటలో బీజేవైఎం యువ సమ్మేళనం తోపాటు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హుస్నాబాద్ నియోజకవర్గ పోలింగ్ ఏజెంట్ల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు.

ఇదేం భాష?: సీఎం స్థానంలో కూర్చొనే వ్యక్తి మాట్లాడే భాష, వ్యవహార శైలి పది మందికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలే తప్ప ప్రజలు అసహ్యించుకొనేలా ఉండకూడదని బండి సంజయ్ సూచించారు. యథారాజా తథాప్రజా అన్నట్లు కిందిస్థాయి నాయకులు సైతం అదే భాష మాట్లాడే స్థితికి దిగజారుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ 6 గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దీనిపై జనం తిడుతుంటే గాడిద గుడ్డు గుర్తు పేరుతో సీఎం చర్చను పక్కదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. హామీలను నెరవేర్చనప్పుడు కాంగ్రెస్‌కు ప్రజలు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు గాడిద గుడ్డు పట్టుకొని తిరుగుతున్నందున ప్రజలు ఈ ఎన్నికల్లో ఈవీఎంలో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే ఓటేయాలని పిలుపునిచ్చారు.



జమ్మికుంటలో జరిగిన బీజేవైఎం యువ సమ్మేళనంలో మాట్లాడుతున్న బండి సంజయ్. చిత్రంలో అన్నామలై తదితరులు

మోదీ గుండెల్లో బండికి ప్రత్యేక స్థానం

బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బండి మండిపడ్డారు. బీజేపీ ఏ రోజూ రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పలేదని స్పష్టం చేశారు. కాగా, ప్రధాని మోదీ గుండెల్లో బండి సంజయ్‌కు ప్రత్యేక స్థానం ఉందని బీజేవైఎం యువ సమ్మేళనంలో పాల్గొన్న బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చెప్పారు. బండి గెలిస్తే సామాన్యుడు గెలిచినట్లేనని, పోలయ్యే ఓట్లలో 60 శాతం బీజేపీకి పడేలా ఇంటింటికీ తిరిగి గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు.

9 జిల్లా జడ్జి పోస్టుల భర్తీ

14న నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: 9 మంది జిల్లా జడ్జిల పోస్టులకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మే 14న నోటిఫికేషన్ వచ్చిన రోజే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై జూన్ 13న ముగుస్తుంది. ఆగస్టు 24, 25 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈడబ్ల్యూఎస్ మహిళ, బీసీ–ఏ, బీసీ–బీ, బీసీ–సీ, బీసీ–డీ మహిళ, బీసీ–ఈ మహిళ, ఎస్సీ జనరల్, ఎస్సీ మహిళ, ఎస్టీలకు ఒక్కొక్కటి చొప్పున పోస్టులు రిజర్వు చేశారు. వివరాలకు హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలి.



ఒక బొద్దింకను చంపితే మీరు ఒక హీరో.
ఒక సీతాకోకచిలుకను చంపితే మీరు చెడ్డవారు.
నైతికతకు కళాత్మక ప్రమాణాలు ఉన్నాయి.
– నీషే

సాక్షి
మంగళవారం, 7 మే 2024

రాయ్‌బరేలీ వ్యూహం

ఎట్టకేలకు ఒక చర్చ ముగిసింది, మరో చర్చ మొదలైంది. కాంగ్రెస్ నేత, గాంధీ కుటుంబ వారసుడు రాహుల్ శుక్రవారం రాయ్‌బరేలీ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయడంతో ఉత్తర ప్రదేశ్‌లో ఆయన పోటీ చేస్తారా, లేదా అన్న చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. అదే సమయంలో 2019 ఎన్నికల్లో బీజేపీ నేత స్మృతీ ఇరానీ చేతుల్లో ఓటమి పాలైన అమేథీని కాకుండా, ఇటీవల రాజ్యసభకు వెళ్ళేంత వరకు తన తల్లి ప్రాతినిధ్యం వహించిన రాయ్‌బరేలీని ఆయన ఎన్నుకోవడంతో కొత్త చర్చ మొదలైంది. భారత రాజకీయాలకు గుండెకాయ లాంటి ఉత్తరప్రదేశ్ నుంచి మళ్ళీ పోటీ చేసేందుకు రాహుల్ తీసుకున్న నిర్ణయంపై అంచనాలున్నాయి, అనుమానాలూ ఉన్నాయి. ఈ పోటీతో ఎన్నికల వ్యూహంలోనూ, ఇటు విస్తృత రాజకీయ కథనంలోనూ కాంగ్రెస్ పార్టీ గట్టి మార్పు తెస్తున్నట్టు కనిపిస్తోంది. ఉత్తరాదిన పార్టీకి మళ్ళీ జవసత్వాలు అందించడానికి దీన్ని ఒక అవకాశంగా కాంగ్రెస్ భావిస్తోంది.

అమేథీ స్థానంలో కాకున్నా కుటుంబానికి కలిసొచ్చిన రాయ్‌బరేలీని ఎంచుకోవడం ద్వారా యూపీ ఎన్నికల క్షేత్రంలో పార్టీకి రాహుల్ కొత్త ఉత్సాహం తెచ్చారనుకోవాలి. చిరకాలంగా గాంధీ కుటుంబ వారసులే పోటీ చేస్తున్న కంచుకోట లాంటి అమేథీ స్థానాన్ని... నియోజకవర్గం బాగోగులు చూసే మరో విధేయ నేత కేఎల్ శర్మకు కట్టబెట్టారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 20 ఎన్నికల్లో 17 సార్లు కాంగ్రెస్‌కే జై కొట్టిన స్థానం రాయ్‌బరేలీ. ప్రధాని ఇందిరాగాంధీ మొదలు పలువురు గాంధీ కుటుంబ సభ్యులకు పట్టం కట్టిన మరో కంచుకోట. అక్కడ పోటీ ద్వారా యూపీలో క్రియాశీలకంగా నిలవడమే కాక, తనపై బీజేపీ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు రాహుల్ వీలు చిక్కించుకున్నారు. అయితే, ఆఖరు నిమిషంలో ప్రకటించిన ఈ అభ్యర్థిత్వంతో అనేక సవాళ్ళూ తప్పవు. వాటిని ఎలా అధిగమించి, సంక్లిష్ట సామాజిక – రాజకీయ కోణాలున్న హిందీ హార్ట్‌ల్యాండ్‌లో పట్టు సాధిస్తారన్నది చూడాలి. ఆ రాష్ట్రంలో బీజేపీకి ఉన్నంత బలమైన ఎన్నికల యంత్రాంగం, పార్టీ వ్యవస్థ ప్రస్తుతం కాంగ్రెస్‌కు లేకపోవడం లోటు. వాటిని అధిగమించి, ప్రస్తుత ఉత్సాహాన్ని ఎన్నికల లబ్ధిగా ఎలా మలచగలుగుతారో వేచిచూడాలి.

నిజానికి, క్రితంసారి ఉత్తరాదిన కాంగ్రెస్ ఊపు తగ్గినా దక్షిణాదిలో ఉనికి నిలిపిన కేరళలోని వయనాడ్ స్థానమంటే సహజంగానే రాహుల్‌కు ప్రత్యేక అభిమానం. అది ఆయన మాటల్లో, చేతల్లో కనిపిస్తూనే ఉంటుంది. దక్షిణాదిన హస్తం హవా కొనసాగేందుకు వయనాడ్ భావోద్వేగ బంధంగా ఉపకరిస్తుందని ఆయన ఆలోచన. అందుకే, ఈసారీ ఆయన అక్కడ నుంచి కూడా పోటీ చేశారు. వయనాడ్‌లో రాహుల్ స్థానికేతరుడనీ, యూపీలో గెలిస్తే ఈ స్థానాన్ని వదిలేస్తాడనీ ప్రత్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నందు వల్లే అక్కడ ఎన్నికలయ్యేంత వరకు తెలివిగా తన రాయ్‌బరేలీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించలేదు. ఆఖరి వరకూ అమేథీ, రాయ్‌బరేలీలలో పోటీ అంశాన్ని సస్పెన్స్‌లోనే ఉంచుతూ, అధికార పార్టీని ఇరుకునపెట్టారు. బీజేపీ సైతం పోటీకి భయపడి రాహుల్ వెనుకంజ వేస్తున్నారన్న ప్రచారంతో ఒత్తిడి పెంచింది. ఆ ప్రచారాన్ని తిప్పికొడుతూ, ముఖాముఖీ పోరుకు వెరవడం లేదని నిరూపించేందుకు రాహుల్‌కు ఈ రాయ్‌బరేలీ అభ్యర్థిత్వం ఉపకరించనుంది.

హస్తం పార్టీకి రాయ్‌బరేలీ ఎంత అడ్డా అయినా, రాహుల్ పోటీలో రిస్కులూ ఉన్నాయి. యూపీలోని మొత్తం 80 లోక్‌సభా స్థానాల్లో క్రితంసారి 64 సీట్లు గెలిచిన బీజేపీ ఈసారి అంతకు మించి ఫలితాలు సాధించాలని చూస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆయన అలవాటైన స్థానం వదిలేసి, సాహసించారు. కానీ, ఆయన ఛరిష్మా, కాంగ్రెస్‌కు చిరకాలంగా ఉన్న స్థానిక సంబంధాలు పనికొస్తాయని భావిస్తున్నారు. అసలు అమేథీలో ప్రియాంక, రాయ్‌బరేలీలో రాహుల్ పోటీ చేయాలన్న ఆలోచనా ఒక దశలో జరిగింది. కానీ, ప్రతిపక్షం ఆరోపిస్తున్న వారసత్వ రాజకీయాలు, బంధుప్రీతికి ఊతమిచ్చినట్టు అవుతుందని దానికి స్వస్తి చెప్పారు. ఇక, అమేథీలో పోటీచేస్తున్న కేఎల్ శర్మ పంజాబ్ నుంచి వచ్చినవారైనప్పటికీ, ఇరుగుపొరుగు స్థానాలైన అమేథీ, రాయ్‌బరేలీల్లో గత 30 ఏళ్ళుగా పార్టీ తరఫున పనిచేస్తున్నారు. జనంతో, కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలున్న ఆయన, స్టార్ అభ్యర్థి స్మృతీ ఇరానీపై గెలుస్తారని కాంగ్రెస్ ఆశ. 1977లో ఇందిరా గాంధీపై రాజ్‌నారాయణ్, గడచిన 2019లో రాహుల్‌పై స్మృతి గెలిచినట్టే, రేపు స్మృతిపై శర్మ గెలవకూడదని ఏమీ లేదు. అధిక సంఖ్యాక ప్రజల మద్దతే కీలకమైన ప్రజాస్వామ్యంలో ఏమైనా జరగవచ్చు.

అసలు ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది సదరు వ్యక్తుల, పార్టీల నిర్ణయం. అయితే, దేశంలోని అనేక ప్రధాన సమస్యల కన్నా అమేథీ, రాయ్‌బరేలీలలో రాహుల్ పోటీ చేస్తారా, లేదా అన్నదే ముఖ్యమన్నట్టుగా జాతీయ టీవీ ఛానళ్ళు దీనిపైనే చర్చోపచర్చలు చేయడం విచిత్రం. 1952లో ఫిరోజ్ గాంధీ, తర్వాత ఇందిర, అటుపైన సోనియా, ఇప్పుడు రాహుల్ పోటీతో రాయ్‌బరేలీతో కాంగ్రెస్ బంధం అమేథీ కన్నా పాతది, పట్టున్నది. కానీ, ఇల్లలకగానే పండగ కాదు. సాక్షాత్తూ ప్రియాంక యూపీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నప్పటికీ గత అసెంబ్లీ ఎన్నికల్లో యూపీలో కాంగ్రెస్ 398 స్థానాల్లో పోటీ చేసినా, రెండంటే రెండింట్లో గెలిచింది. ఇప్పుడు లోక్‌సభకు 17 స్థానాల్లో బరిలో నిలిచింది. అభ్యర్థుల పేర్లు కూడా ఎవరికీ పెద్దగా తెలియదు. ఒకవేళ రేపు వయనాడ్, రాయ్‌బరేలీ – రెంటిలోనూ రాహుల్ గెలిస్తే, దేన్ని వదులుకోవాలన్నదీ చిక్కే. రాగల రోజుల్లో మరిన్ని విడతల పోలింగ్‌తో ఎన్నికల వేడి పెరిగాక కానీ, యూపీలో రాహుల్ పోటీ తాలూకు సిసలైన ప్రభావమేమిటో అర్థం కాదు. ఒకవేళ పాచిక పారి, రాయ్‌బరేలీలోనే కాక యూపీ అంతటా రాహుల్ ప్రభావం కనిపిస్తే రాజకీయాలు మళ్ళీ మలుపు తిరుగుతాయి. హస్తం పార్టీ ఆశ కూడా అదే!

పుట్టుకతోనే మతం ముద్రా?!

డీఎన్‌ఏ వల్ల కలిగే శారీరక, మానసిక వైకల్యాలను సాంకేతికత ద్వారా గుర్తించవచ్చు, సరిదిద్దవచ్చు. కానీ ఒకరి విశ్వాస వ్యవస్థ వల్ల కలిగే బలహీనతలు శాశ్వతంగా ఉంటాయి. ఒక బిడ్డ జన్మించిన మతపు నమ్మకాలే అతడికి వాస్తవికంగా, నిజంగా మారిపోతాయి. పిల్లలు పెరిగే వాతావరణమే వారి మనస్తత్వాన్ని మలచే శక్తిని కలిగి ఉంటుంది. అందుకే పుట్టినప్పుడే పిల్లలకు మతాన్ని అంటగట్టడం అనేది తిరోగమనంతో కూడిన, ప్రమాదకరమైన పద్ధతి. పిల్లల మతాన్ని నమోదు చేయడాన్ని తప్పనిసరి చేసే చట్టం ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది. అది పితృస్వామ్యాన్నీ, మెజారిటీ వాదాన్నీ ప్రోత్సహిస్తుంది. వారి స్వేచ్ఛపై పరిమితులను విధిస్తుంది. వారి ఎదుగుదలను ఆపివేస్తుంది. ఆ కోణంలో చూస్తే ఇది మానవ హక్కుల ఉల్లంఘనే. అందుకే మతాన్ని 'వయోజనులకు' సంబంధించిన అంశంగానే చూద్దాం.

ఏప్రిల్ 5 నాటి ప్రముఖ వార్తాపత్రికలోని ఒక ప్రధాన శీర్షిక, 'జననాల నమోదు కోసం తల్లిదండ్రుల మతాన్ని పొందుపరచనున్న ప్రభుత్వం' అని చెబుతోంది. జనన మరణాల నమోదు (సవరణ) చట్టం, 2023ను గత ఏడాది ఆగస్టు 11న పార్లమెంటు ఆమోదించింది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్పీఆర్), ఓటర్ల జాబితాలు, ఆధార్ నంబర్, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆస్తి నమోదు, నోటిఫై చేసిన ఇతర అంశాలతో సహా వివిధ డేటాబేస్‌లను అప్‌డేట్ చేయడానికి ఉపయోగించే జాతీయ స్థాయిలో జనన, మరణ డేటాబేస్ నిర్వహణను ఈ చట్టం తప్పనిసరి చేస్తోంది. పిల్లల మతానికి చెందిన కాలమ్‌లో తల్లిదండ్రులు వేర్వేరు మతాలకు చెందినవారైతే వారిద్దరి మతాన్ని నమోదు చేయడాన్ని కూడా ఈ సవరణ చట్టం తప్పనిసరి చేస్తోంది. ఇది, మోసపూరితంగా చట్టానికి ఉదారమైన రూపాన్ని ఇస్తోంది. కానీ మాకు సంబంధించి, పుట్టినప్పుడే పిల్లలకు మతాన్ని అంటగట్టడం అనేది తిరోగమనంతో కూడిన, ప్రమాదకరమైన పద్ధతి.

వయోజనులు అనే అంశాన్ని ముందు స్పష్టం చేద్దాం. ఇది ఓటు వేయడానికి లేదా వివాహం చేసుకోవడానికి కావాల్సిన చట్టబద్ధమైన వయస్సు కాదు. ఇక్కడ వయోజనుడు అంటే వ్యక్తిగత నైతిక చట్రాన్ని అభివృద్ధి చేసుకునేంత స్థాయిలో ఎదిగిన వ్యక్తి అని అర్థం. మతం అనే పదం వ్యవస్థీకృతమైన మతాలను సూచిస్తుంది.

చట్టపరంగా, వయోజనులు భౌతిక స్వభావం గల లక్షణాలను కలిగి ఉంటారు. అయితే, మతం పాక్షికంగా ఆధిభౌతికమైనది. పిల్లలు పొందిన డీఎన్‌ఏతో దానిని కలపడం అనేది వారి స్వేచ్ఛపై పరిమితులను విధిస్తుంది. వారి ఎదుగుదలను ఆపివేస్తుంది. ఆ కోణంలో చూస్తే ఇది మానవ హక్కుల ఉల్లంఘనే. ఇది ప్రమాదకరమైన చట్టం. ఎందుకంటే ఇది ప్రజాస్వామ్యపు విలువలను దెబ్బతీస్తుంది. అంతే కాక, మతతత్వం, పితృస్వామ్యం, మెజారిటీతత్వాలను ప్రోత్సహిస్తుంది. కొన్ని రాష్ట్రాలు 'లవ్ జిహాద్'కు (హిందూ అమ్మాయితో ముస్లిం పురుషుడి సంబంధం లేదా వివాహం) వ్యతిరేకంగా చట్టాన్ని ఆమోదించిన వాస్తవాన్ని గమనిస్తే, ఆ నిబంధన అంత అమాయకమైనది కాకపోవచ్చు. కనీసం, ఇది పితృస్వామికతతో కూడుకుని ఉన్నది.

మొదటిది, మానవ హక్కులకు సంబంధించిన ప్రశ్న. ఓటింగ్ లేదా వివాహం గురించిన అవకాశాన్ని ఎంపిక చేసుకోవడానికి ఒక పిల్లవాడు యుక్తవయస్సుకు ఎదగవలసి ఉంటుంది. అయితే, ఓటు వేయమని లేదా వివాహం చేసుకోవాలని ఎవరినీ బలవంతం చేసే చట్టం లేదు. వయోజనుడైన బిడ్డకు ఎంపిక చేసుకోకుండా ఉండటానికి స్వేచ్ఛ ఉంది. కానీ వ్యవస్థీకృత మతం కొన్నిసార్లు ప్రచ్ఛన్నంగా, కానీ తరచుగా నేరుగానే చేయవలసినవీ, చేయకూడనివీ చెబుతుంటుంది. వాటితోపాటు, తప్పు ఒప్పులను విధిస్తుంది. పౌరాణిక సత్యాలు, తల్లిదండ్రులు, ఇతర పెద్దల సాంప్రదాయిక జ్ఞానం, సామాజిక



ఒత్తిళ్లు, 'సంస్కారం' ఆశించే నియమాలు, ఆచారాలు, సంప్రదాయాలను అంగీకరించడం తప్ప అభాగ్యుడైన బిడ్డకు వేరే మార్గం లేదు. ఇటువంటి సూక్ష్మమైన, కానీ తీవ్రమైన బ్రెయిన్ వాష్ వల్ల, పిల్లల సహజసిద్ధమైన శాస్త్రీయ ఉధృతికి, ఆధ్యాత్మిక, వ్యక్తిత్వ పరమైన ఎదుగుదలకు ఆటంకం కలుగుతుంది.

పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం జీవితంలో మొదటి 1,000 రోజులలోనే జరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఈ కాలంలో ఛాందస, ఉదారవాద పరిసరాలు పిల్లల జీవితకాలం చెరగని వైఖరులకు కారణమవుతాయి. పైగా అవి స్థూలంగా తిరోగమనం, అణచివేత, అమానవీయమైనవి కూడా కావచ్చు. ఏది సరైనది ఏది తప్పు అనే సొంత నైతిక చట్రం ఆధారంగా పిల్లల అభివృద్ధిని వారి పరిసరాలు ప్రభావితం చేస్తాయి. డీఎన్‌ఏ వల్ల కలిగే శారీరక, మానసిక వైకల్యాలను సాంకేతికత లేదా వైద్య శాస్త్రాల ద్వారా గుర్తించవచ్చు, సరిదిద్దవచ్చు. అయితే ఒకరి విశ్వాస వ్యవస్థ, మానవత్వం, సున్నితత్వం, ప్రవర్తన, ముందుగా నిర్ణయించిన 'సత్యాల' వల్ల కలిగే బలహీనతలు శాశ్వతంగా ఉంటాయి. ఒక బిడ్డ జన్మించిన మతపు నమ్మకాలే అతడికి వాస్తవికంగా, నిజంగా మారిపోతాయి.

30 ఏళ్ల వయస్సు తర్వాత తాను సాగించిన ప్రయాణంలో, గౌతమ బుద్ధునికి 'నేను ఇంకా జీవించాల్సిన జీవితం, అది నా స్వభావానికి ప్రతిబింబంగా ఉండితీరాలి' అనిపించింది. 'నా భ్రాంతిమయమైన కచ్చితత్వాల ఆశ్రయం నుండి, నా సొంత సరిహద్దుల నుండి నేను విముక్తి పొందాల్సి ఉంటుంది' అని ఆయన భావించాడు.

గౌతముడు ఆధ్యాత్మిక పరిపక్వత సాధించకుంటే, ఆయన తన అసలైన స్వభావాన్ని గుర్తించడంలో విఫలమై, నిజంగా తన సొంతం కాని నమ్మకాలు, అంతర్దృష్టిలో తెలియకుండానే చిక్కుకుని ఉండేవాడు. పర్యవసానంగా, ప్రపంచవ్యాప్తంగా అసంఖ్యాకులైన వ్యక్తులకు ఓదార్పును అందించి దిశానిర్దేశం చేసిన మానవీయ జీవిత తత్వశాస్త్రం ప్రపంచానికి నిరాకరించబడి ఉండేది. ప్రతి ఒక్కరూ గౌతమ బుద్ధుడిని అనుకరించలేరు కాబట్టి, వారి సొంత ప్రత్యేక మార్గాన్ని ఏర్పరచుకునే పిల్లల సామర్థ్యానికి సామాజిక నిబంధనలు, చట్టం అధిగమించలేని అడ్డంకులను సృష్టించకూడదు.

స్థాపితమైన మతం శాస్త్రీయ ఆలోచనాపరులు, స్వేచ్ఛా ఆలోచనా పరులు, మేధావుల పట్ల విపరీతమైన క్రూరత్వాన్ని ప్రదర్శిస్తుంది. ఉదాహరణకు, రోమన్ క్యాథలిక్ చర్చి, ఇటాలియన్ భౌతిక శాస్త్రవేత్త, ఖగోళ శాస్త్రవేత్త అయిన గెలీలియోను మతవిశ్వాసిగా ముద్ర వేసి శిక్షకు గురిచేసింది. 1633లో, గెలీలియోపై చర్చి... సూర్యుడు ప్రపంచానికి కేంద్రం మరియు నిశ్చలమనీ; భూమి దాని చుట్టూ తిరుగుతుందనీ... తప్పుడు, మత గ్రంథాలకు విరుద్ధంగా భావించే నమ్మకాన్ని ఆమోదించాడనీ ఆరోపించింది. హాస్యాస్పదంగా, గెలీలియో పేర్కొన్న ఈ సంచలనాత్మక ఆవిష్కరణలు న్యూటన్, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలకు పునాది వేయడమే కాకుండా, ఈ రోజు మనకు తెలిసిన ఆధునిక భౌతికశాస్త్ర అభివృద్ధికి మార్గం సుగమం చేశాయి.

'ద చైల్డ్ ఈజ్ ఫాదర్ ఆఫ్ ద మ్యాన్' అనే పదబంధం, విలియం వర్డ్స్‌వర్త్ కవిత 'మై హార్ట్ లీప్స్ అప్' నుండి ఉద్భవించింది. ఇది కేవలం కవిత్వ వ్యక్తీకరణ మాత్రమే కాదు. వరుసగా తరాలను రూపొందించడంలో పిల్లలు కీలకమైన పాత్ర పోషిస్తారనే లోతైన సత్యాన్ని ఇది వ్యక్తీకరిస్తుంది. పిల్లలు పెరిగే వాతావరణమే వారి మనస్తత్వాన్ని మలచే శక్తిని కలిగి ఉంటుంది. అంటే అదే వారి చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ఏది ఏమైనప్పటికీ, ఈ ప్రభావం ద్వంద్వ స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఇది స్వధర్మం ముసుగులో ఉన్న మతతత్వం, కులతత్వం, ద్వేషపు తాలూకు హింసాత్మక వ్యక్తీకరణల వంటి విభజన భావజాలాలను పిల్లల్లో శాశ్వతంగా కలిగించడంలోనో లేదా బాధితులుగా మార్చడంలోనో గణనీయమైన ప్రభావాన్ని కలిగివుంది. ఇటువంటి ధోరణులు మెజారిటీ వాదాన్ని పెంపొందించవచ్చు. సామాజిక, ఆర్థిక అసమానతలకు వ్యక్తులను స్పందించకుండా చేయవచ్చు. శతాబ్దాల తరబడి వారసత్వంగా వచ్చిన నమ్మకాల్లో స్థిరపడిన మంచి ఉద్దేశం ఉన్న తల్లిదండ్రులు కూడా అనుకోకుండా తమ పిల్లల నిజమైన సారాన్ని అణచివేయవచ్చు. ఇక, చట్టసభ సభ్యులు క్రూరత్వానికి చెందిన అటువంటి రూపాలను శాశ్వతం చేసి సంస్థాగతీకరించే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

– అశోక్ లాల్ | రచయిత, నాటకరంగ కళాకారుడు
– నసీరుద్దీన్ షా | హిందీ, ఉర్దూ నాటక రచయిత, నటుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ముగియని ఘర్షణలు



ఇండియాకు ప్రాసంగికమైన పాఠాలు గాజా కన్నా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నుంచి ఎక్కువ వస్తున్నాయి. అందులో అన్నింటికంటే ముఖ్యమైనది ఘర్షణ కాలపు వ్యవధి. అన్ని యుద్ధాలూ వేగంగా, సంక్షిప్తంగా ఉండవని రష్యా, ఉక్రెయిన్ చూపించాయి.

– సుశాంత్ సింగ్, సీనియర్ ఫెలో

పోటీ పడుతున్నారా?

పంజాబ్ (ఫిరోజ్‌పూర్‌లోని బండాలా అనే గ్రామం) లోని ఒక గురుద్వారాలో గురుగ్రంథ్ సాహిబ్ పేజీలను చించాడన్న ఆరోపణలతో ఒక పంతొమ్మిదేళ్ల యువకుడిని దారుణంగా కొట్టి చంపారని వార్త. చూస్తుంటే... దైవదూషణ ఒలింపిక్స్‌లో సిక్కులు ముస్లింలతో పోటీపడటానికి ప్రయత్నిస్తున్నట్టున్నారు! (ఆ యువకుడికి మానసిక ఆరోగ్య సమస్యలున్నాయనీ, చికిత్స తీసుకుంటున్నాడనీ తల్లితండ్రులు చెబుతున్నారు.)

– ఒమర్ అలీ, వ్యాఖ్యాత

తీవ్ర నేరాలు



రెండు కర్మాగారాల్లో తయారైన 15 టన్నుల నకిలీ సుగంధ ద్రవ్యాలను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారని వార్త. ఇదేమీ చిన్న నేరం కాదు. ఈ నేరస్థుల చర్య వల్ల జనాలు చచ్చిపోతారు. కానీ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా, భారతదేశం లాంటి చోట వీళ్లకు ఇరవై నాలుగు గంటల్లో బెయిల్ వస్తుంది; చిన్న జరిమానాతో బయటపడిపోతారు.

– సౌమిత్రా పఠారే, సైకియాట్రిస్ట్

గయానాలో ఇండియన్లు



గయానా (దక్షిణ అమెరికా) గడ్డ మీద భారతీయులు అడుగు పెట్టి 186 ఏళ్లవుతోంది. 'పశ్చిమానికి' వచ్చిన భారతీయుల్లో వీళ్లే తొట్టతొలివారు. చికాగోకు స్వామి వివేకానంద వచ్చినదాని కంటే (1893) చాలా ముందర!

– షాన్ బిందా, ఇండో–కరీబియన్ మూలాలున్న కెనడియన్

ఏం చేస్తాం మరి?



మీరు పరీక్షలో ఫెయిల్ అయ్యారంటే... తప్పు మీది కాదు! ప్రశ్నాపత్రం రూపొందించిన వారిదే ఆ తప్పు!!

– జాఫర్, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

ఉద్యోగులకు మేలే చేశారు!

ప్రభుత్వంలో ముఖ్యభాగం ప్రభుత్వ ఉద్యోగులే. ప్రభుత్వ ఉద్యోగులు నేటి ప్రభుత్వానికి వ్యతిరేకం అనే మాట ఎందుకు వస్తోంది అనేది ఆలోచించవలసిన విషయం. ఒకే ఒక్క కారణం ఏమిటంటే మొదటి తారీఖున జీతం ఇవ్వలేకపోవడం. ప్రస్తుతం ఇస్తున్నారు. గతంలో ఇవ్వలేకపోవడానికి కారణం ఏమిటి అనేది చాలామందికి ఏమాత్రం ఆలోచించినా తెలుస్తుంది. కరోనా రెండు సంవత్సరాలు లాక్ డౌన్. రెండేళ్లు ఏమీ చేయకపోతే ఆదాయం ఎక్కడి నుండి వస్తుంది? అంతకుముందు విభజన హామీలు ఏమీ అమలు చేయకుండా అర్ధంతరంగా విభజించి పడేశారు. అవి తర్వాత కూడా అమలు కాలేదు. దీనితో ఆర్థిక దుస్థితి కొంత ఉంది. అయినప్పటికీ ప్రభుత్వం పాలన స్తంభింప చేయకుండా ఎక్కడా ఒక ఆకలి చావు లేకుండా చూసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్లు కాస్త ఆలస్యం అయ్యాయి.

డీఏ విషయానికొస్తే కరోనా టైంలో ప్రధాని మోదీ డీఏని వెంటనే రద్దు చేసేశారు. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం అలా చేయలేదు. విడతలు విడతలుగా ఇస్తామన్నారు. ఇచ్చారు కూడా. ఆర్టీసీ వ్యవస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంలో ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఉన్న సానుకూల ధోరణి కారణం. పోలీసులకు ఆదివారం సెలవు లేకపోవడం గుర్తించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం సెలవు ఇవ్వడం ఒక చారిత్రక సంఘటన. మహిళా ఉద్యోగులకు 60 రోజుల పిల్లల సంరక్షణ సెలవును 180 రోజులకి పెంచడమే గాక పిల్లల వయసుతో సంబంధం లేకుండా సెలవు పెట్టుకునే సదుపాయం కల్పించారు. ఇది ఉద్యోగినుల పట్ల సానుభూతితో చేసినదే. అలాగే సెక్రటేరియట్ ఉద్యోగులు వారానికి ఐదు రోజులు తాము పనిచేస్తామంటే అందుకు ఒప్పుకుంది ప్రభుత్వం.

ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉద్యోగులు ఎంతోమంది మేనేజ్మెంట్ ఇబ్బంది పెడుతోందనీ, ప్రభుత్వంలో విలీనం చేయమనీ కోరడం వల్ల వారిని విలీనం చేసింది. అలాగే మేనేజ్మెంట్‌లు కూడా 'మాకు ఎయిడ్ వద్ద'ని రాశాయి. ఉదాహరణకు ఉత్తరాంధ్రలో బీవీకే కళాశాల, ఎంఆర్ కళాశాల యాజమాన్యాలు మొట్టమొదట ఈ విధంగా రాశాయి. ప్రజాభీష్టం అనుకునే ప్రభుత్వం సిబ్బందిని విలీనం చేసుకుంది. అయితే కాస్త వ్యతిరేకత ప్రదర్శించగానే నాలుగు ఆప్షన్స్ ఇచ్చారు. కావాలంటే ఎయిడెడ్ కాలేజీగా నడుపుకోండి, లేదా అధ్యాపకులను అప్పజెప్పి ప్రైవేటుగా నడుపుకోండి, నడపలేమంటే కాలేజీని అధ్యాపకుల్నీ కూడా ప్రభుత్వానికి అప్పజెప్పండి... వంటి ఆప్షన్‌లు ప్రభుత్వం ఇచ్చింది. దీన్ని బట్టి జగన్ ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని అనుకున్నారనేది స్పష్టం. నిజానికి ఈ ప్రభుత్వం వల్లే 3,000 స్కూల్స్, ఆ స్కూళ్లలో పనిచేసే టీచర్స్ క్షేమంగా ఉన్నారనడం ఒక చారిత్రక సత్యం.

ఇక చివరిగా ఒక ముఖ్య విషయం. ముఖ్యమంత్రి జగన్ వచ్చి ఆకస్మికంగా తనిఖీలు చేసి ఏ చిరుద్యోగినో, ఆయమ్మ లాంటి వాళ్ళనో సస్పెండ్ చేయటం, భయభ్రాంతులకు గురి చేయడం లాంటివి ఎప్పుడూ చేయలేదు. ఆలోచించగలిగే ప్రతి వ్యక్తికీ ఉద్యోగులకు ప్రభుత్వం వ్యతిరేకం అనేది కేవలం ఓ దుష్ప్రచారమనే స్పష్టమవుతుంది.

– యోగేశ్వర్, విశ్రాంత ఆచార్యులు, గీతమ్ కళాశాల

సమాన అవకాశాల... విద్యా విప్లవం

అభిప్రాయం



శ్యాంమోహన్

భారతీయ సమాజంలో అసమానతలు అధికంగా ఉండటానికి ప్రధాన కారణం అవకాశాలు అందరికీ సమానంగా లేకపోవడం. ముఖ్యంగా మంచి విద్యను అభ్యసించే అవకాశం కొందరికే ఉండటం. దీన్ని గమనించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కనివిని ఎరుగని రీతిలో విద్యావ్యవస్థ రూపురేఖలను మార్చేశారు. దీంతో ఎక్కడో కొండ కోనల్లో నివసించే ఆదివాసీ పిల్లలు సైతం పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిపుచ్చుకుంటున్నారు. ఇదో విప్లవం. ఈ విప్లవ ఫలితాలు ఇప్పుడిప్పుడే దృశ్యమానమవుతున్నాయి. కొండబారిడి గిరిజన గ్రామానికి చెందిన బాలిక మనస్విని ఐక్యరాజ్య సమితి దాకా వెళ్లడం ఇందుకు ఒక ఉదాహరణ.

కొండబారిడి ఒక సవర ఆదివాసీ పల్లె. ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడ వెంపటాపు సత్యం అనే బడి పంతులు భూమి కోసం, భుక్తి కోసం ఉద్యమించి సాయుధ విప్లవం సృష్టించాడు. నేడు అదే గ్రామంలో ఇపుడు చదువుల విప్లవం కూడా మొదలైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నదే కొండబారిడి. ఆ పల్లెకు చెందిన ఎస్. మనస్విని ఆంగ్లంలో అరుదైన ప్రతిభ చూపడంతో తనతో పాటు మరో 9 మంది విద్యార్థులను అమెరికాలోని ఐక్యరాజ్య సమితి ఆహ్వానించగా... అక్కడ ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ సంస్థల సదస్సులో పాల్గొని వచ్చింది.

'ఏపీలో విద్యావ్యవస్థపై ఐక్యరాజ్య సమితిలో మాట్లాడాను. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యావిధానం, 'నాడు–నేడు'తో మా స్కూల్ స్వరూపమే మారిపోవడం గురించి వివరించాను. మన ప్రభుత్వం మాలాంటి పేదల చదువు కోసం చేస్తున్న కృషిని తెలుసుకొని వారు ఎంతో ఆశ్చర్యపోయారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను స్కూల్స్‌లో ఎలా ప్రవేశ పెడుతున్నారు? వాతావరణ మార్పుల ప్రభావం గురించి చెప్పాను. మారుమూల గిరిజన పల్లెకు చెందిన నాకు ఇదొక మరువలేని అనుభూతి' అని సంతోషంగా చెప్పింది మనస్విని. సింగిల్ పేరెంట్‌కు చెందిన ఈ ఆదివాసీ బాలిక గుమ్మలక్ష్మీపురం, కేజీబీవీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది.

సర్కారు బడుల్లో చదివే పేద పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే తపనతో ఆధునిక విద్యాబోధన, మౌలిక వసతుల కల్పన కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'నాడు–నేడు' కార్యక్రమంలో 44,512 ప్రభుత్వ బడులను బాగు చేసే కార్యక్రమాన్ని మూడు దశలుగా విభజించి ముందుకెళుతోంది. 'అమ్మ ఒడి' వంటి వినూత్న



పథకాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్‌ను పెంచాయి. దాదాపు 2,47,000 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడులకు మారడం ఇందుకు నిదర్శనం.

అరకు నుండి డుంబ్రిగుడ వెళ్లేదారిలో జైపూర్ బస్‌స్టాప్ ఎదురుగా కొండల మధ్య ఇంద్రధనుస్సులా మెరిసిపోతున్న కోట లాంటి రెసిడెన్షియల్ గిరిజన పాఠశాల దగ్గర ఆగాం. విశాలమైన ప్లే గ్రౌండ్‌లో ఆడుకుంటున్న తమ పిల్లలను చూడడానికి వచ్చిన పేరెంట్స్‌ని పలకరించినపుడు... 'ప్రభుత్వం తన ఆలోచనలకు అనుగుణంగా చేపట్టిన పనులతో ఈ ప్రభుత్వ స్కూళ్లు కార్పొరేట్ స్కూళ్లను మించి మారిపోయాయి. మా పాపను ఈ స్కూల్‌లో చేర్పించడానికి సీట్లు లేక చాలా కష్టపడాల్సి వచ్చింది. ప్రభుత్వ ప్రయత్నం బాగుంద'ని అన్నారు.

'గిరిజన గ్రామాల్లో బడులను ఏకపక్షంగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడం లేదు. ప్రతిదీ పద్ధతి ప్రకారం, శాస్త్రీయ విధానంలో సాగుతోంది. ప్రతి పుస్తకాన్నీ బైలింగ్యువల్ పద్ధతిలో... అంటే ఒక పేజీ ఇంగ్లిష్, పక్క పేజీ తెలుగులో ముద్రించారు . దీని వల్ల పిల్లలు తెలుగును మర్చిపోకుండా ఇంగ్లిషును నేర్చుకుంటున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం వల్ల బడి మానేసే పిల్లల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింద'ని పార్వతీపురం మన్యం జిల్లా, చాపరాయి బిన్నిడి పాఠశాల ఉపాధ్యాయుడు వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 40 వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌బీలు ఏర్పాటు చేసినట్టు ఆమధ్య ఒక ఆంగ్ల ఛానెల్ జర్నలిస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం వై.ఎస్. జగన్ చెప్పినపుడు అవి విద్యార్థులకు ఎలా ఉపయోగపడుతున్నాయో తెలుసుకుందామని, గుమ్మలక్ష్మీపురం గ్రామంలోని ఒక స్కూల్‌కి వెళ్లాం. అక్కడ విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ఉన్న ట్యాబ్స్ ఇచ్చారు. ఆరో తరగతి నుంచి, ఆపై తరగతుల్లోని ప్రతి క్లాస్‌రూమ్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. గుండె పనిచేసే విధానాన్ని డిజిటల్ స్క్రీన్ మీద విద్యార్థులకు టీచర్లు బోధించడం చూశాం.

ఇలా ఒక ప్రణాళికా బద్ధంగా పాఠశాల విద్యారంగంలో వినూత్న మార్పులు మొదలై టీచర్లలో నైపుణ్యం, సామర్థ్యం పెంపుకు కూడా సర్కారు కృషి చేస్తున్నది. ఏపీ విద్యారంగం సరికొత్త మార్పు దిశగా అడుగులు వేస్తోంది. ఇందువల్ల సమాన విద్యావకాశాలకు నోచుకుంటున్నారు బడుగులు. ఇంతకంటే కావలసినదేముంది?

వ్యాసకర్త కార్టూనిస్ట్, జర్నలిస్ట్
మొబైల్: 94405 95858

విధికి అసాధ్యమే లేదు!

కౌరవ పాండవుల మధ్య కురుక్షేత్రంలో జరిగిన యుద్ధాన్ని ఏరోజు కారోజు ధృతరాష్ట్రుడికి వివరించి చెబుతాడు సంజయుడు. యుద్ధంలో చివరి రోజైన పద్దెనిమిదవ రోజున, రణరంగం నుండి బిగ్గరగా ఏడ్చుకుంటూ వచ్చి, భీముడితో జరిగిన గదాయుద్ధంలో దుర్యోధనుడు ఓడిపోయి, తొడలు విరిగి మట్టి గొట్టుకుపోయిన శరీరంతో పడి ఉన్నాడని చెప్పాడు. దీంతో రాజమహలులో ఒక్కసారిగా హాహాకారాలు చెలరేగాయి. 'హా కుమారా!' అని పెద్దపెట్టున నిట్టూర్చి ధృతరాష్ట్రుడు మూర్ఛపోయాడు. ముఖం మీద నీళ్ళు చల్లి, మరికొన్ని సపర్యలు చేసి

జ్యోతిర్మయం

తెలివిలోకి తెచ్చిన తరువాత, కొంతసేపటికి పూర్తిగా తేరుకున్న ధృతరాష్ట్రుడు 'రణభూమి నుండి వచ్చిన నీవు పాండవులైదుగురూ మరణించలేదు సరికదా, వారికి చిన్న గాయం కూడా కాలేదు అని చెప్పే మాటలు నాకు భరించ శక్యం కాకుండా ఉన్నాయి. మనసు, శరీరం దహించుకు పోతూ ఉన్నాయి ఆ మాటలు వింటూ ఉంటే! నా గుండె నిజానికి వజ్రంతో చేసినదై యుండాలి. లేకుంటే నా కుమారులందరూ చనిపోయారనే మాట విన్న తరువాత కూడా ఈ పాడు గుండె వెయ్యి ముక్కలు కాకుండా ఇంకా గట్టిగానే ఎలా ఉంటుంది చెప్పు?' అంటాడు సంజయుడితో! ధృతరాష్ట్రుడి నిజ ప్రవృత్తిని, తన సొంత తమ్ముడి కొడుకులే అయినప్పటికీ, ధర్మరాజాదుల పట్ల అతడి వైఖరిని, ఈ మాటలు స్పష్టం చేస్తాయి. భరించలేని అసహనంతోను, నిరాశతోను ఉన్న ఆ స్థితిలో ధృతరాష్ట్రుడి నోటి నుండి తాను జీర్ణించుకోలేని ఒక చేదు నిజాన్ని ఇలా చెప్పించాడు తిక్కన మహాకవి, శల్యపర్వం ఆరంభంలో!

**క. అమరనదీతనయుడు సిం
హము గాక నరుండె? పార్థుడట్టి మహాత్మున్
సమయించెనట్లు జంబుక
సముని శిఖండిగొని, విధి కసాధ్యముగలదే!**

"గంగాపుత్రుడైన భీష్ముడు మామూలు వీరుడా? సింహము వంటి వీరుడు కదా! అంతటి వీరుడిని అర్జునుడు, నక్క వంటి శిఖండిని ముందుంచుకుని, గెలిచాడు. విధికి సాధ్యం కానిది ఉంటుందా!" అన్నది భీష్ముడి మరణానికి ధృతరాష్ట్రుడి విశ్లేషణ! భీష్ముడిని దాటి కురుక్షేత్ర సంగ్రామం ముందుకు వెళుతుందని ఊహించని ధృతరాష్ట్రుడికి... విధి తలచుకుంటే జరగనిది ఏదీ ఉండదని ఆలస్యంగా అర్థమైన నిజం!

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.10.58 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** అశ్వని ప.3.14 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ఉ.11.28 నుండి 12.57 వరకు, తిరిగి రా.12.23 నుండి 1.54 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.06 నుండి 8.57వరకు, తదుపరి రా.10.57 నుండి 11.33 వరకు, **అమృతఘడియలు:** ఉ.8.26 నుండి 9.54 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.17.

రైతు భరోసా నిధుల విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ భూమి కలిగిన రైతుల ఖాతాల్లో రూ.2,423 కోట్లు జమయ్యాయి.

6.65 లక్షల మందికి 'భరోసా'

రాష్ట్రంలో ఎకరా లోపున్న రైతులు 22.55 లక్షల మంది ఉన్నారు. మొత్తం రైతుల్లో వీరే అత్యధికం. అయితే వారి చేతిలో ఉన్న భూమి కేవలం 12.85 లక్షల ఎకరాలు మాత్రమే. ఎకరా నుంచి రెండెకరాల వరకున్న రైతులు 16.98 లక్షల మంది కాగా, వారి చేతిలో ఉన్న భూమి 25.57 లక్షల ఎకరాలు. రెండెకరాల నుంచి మూడెకరాల లోపున్న రైతులు 10.89 లక్షల మంది ఉండగా, వారి చేతిలో అత్యధికంగా 26.50 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇక మూడెకరాల నుంచి నాలుగెకరాల లోపున్న రైతులు 6.64 లక్షల మంది ఉండగా, వారి చేతిలో 22.62 లక్షల ఎకరాలుంది. నాలుగెకరాల నుంచి ఐదెకరాల లోపున్న రైతులు 5.26 లక్షల మంది రైతులు ఉన్నారు. వారి చేతిలో 21.04 లక్షల ఎకరాల భూమి ఉంది. మొత్తం ఐదెకరాలోపు భూమి ఉన్న రైతుల సంఖ్య 62.34 లక్షల మంది కాగా, వారి చేతిలో కోటి ఎకరాల భూమి ఉంది. తాజాగా ఐదెకరాలకు పైగా ఉన్న 6.65 లక్షల మంది రైతులకు నిధులు అందజేసినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు వివరించాయి.

కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ ఒక్కటే

- వీటివల్ల అవినీతి తప్ప ఒరిగిందేమీ లేదు
- ఉగ్గినపాలెం, రాజమహేంద్రవరం ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని నరేంద్ర మోదీ



అనకాపల్లి సభలో ప్రధాని నరేంద్ర మోదీతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు

సాక్షి అనకాపల్లి/రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం రూరల్: 'కాంగ్రెస్.. వైఎస్సార్ కాంగ్రెస్ రెండూ ఒక్కటే.. ఏపీలో కాంగ్రెస్ పోయింది.. వైఎస్సార్ కాంగ్రెస్ వచ్చింది.. అయినా, పెద్దగా తేడాలేదు.. వీటితో అవధుల్లేని అవినీతి తప్ప మరే ఉపయోగం లేదు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది.. అక్కడ ట్యాంకర్ మాఫియా.. భూ మాఫియాతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఇక్కడ ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, మద్యం మాఫియా రాజ్యమేలుతోంది'.. అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో.. ఆ తర్వాత అనకాపల్లి జిల్లా కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామంలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. ఉగ్గినపాలెంలో అనకాపల్లి నూకాలమ్మ తల్లికి నమస్కరిస్తూ మోదీ ప్రసంగం ప్రారంభించి ఈనెల 7న విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఇదే వేదిక నుంచి ఆ మహనీయుడికి నివాళులర్పిస్తున్నాన న్నారు. రెండేళ్ల క్రితం భీమవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం దక్కిందన్నారు. అలాగే, 'గోదావరి మాతకు ప్రణామాలు.. ఈ నేల మీదే ఆదికవి నన్నయ తొలి కావ్యం రాశారు. ఇక్కడి నుంచే కొత్త చరిత్ర లిఖించబోతున్నాం'.. అంటూ వేమగిరిలో మోదీ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రెండుచోట్లా మోదీ ఇంకా ఏమన్నారంటే..

ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్..

ఈరోజు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఆవిర్భవించింది. ప్రతీ భారతీయుడు గర్వించేలా దేశం ప్రగతి సాధిస్తోంది. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఏపీ యువతకు ఉద్యోగ, విద్యావకాశాలు కల్పించేందుకు కృషిచేస్తోంది. విశాఖ ఐఐఎం, పెట్రోలియం విశ్వవిద్యాలయం ప్రారంభించాం. నక్కపల్లిలో రూ.వెయ్యి కోట్లతో బల్క్‌డ్రగ్ పార్క్ నిర్మాణానికి సాయం అందించాం. పూడిమడకలో గ్రీన్‌ఎనర్జీ పార్కు ఏర్పాటుచేస్తున్నాం. అనకాపల్లి నుంచి అనందపురం వరకు ఆరులైన్ల జాతీయ రహదారి నిర్మాణం పూర్తిచేశాం. అలాగే, రాయ్‌పూర్ నుంచి విశాఖ వరకూ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో ఉంది. 2014 వరకూ ఏపీలో కేవలం 4 వేల కిలోమీటర్ల జాతీయ రహదారి మాత్రమే ఉండేది. అదే ఇప్పుడు 8 వేల కి.మీ. జాతీయ రహదారులు నిర్మాణం చేపట్టాం.

రాజకీయ వారసత్వమే కాదు.. సుజల స్రవంతి పూర్తిచేయాలి..

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. రాజకీయ వారసత్వంగా వచ్చిన జగన్ ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. రాజకీయ వారసత్వమే కాదు.. వాటి నిర్మాణాలను పూర్తిచేయాలి. పోలవరం నిర్మాణానికి మేం రూ.15 వేల కోట్లిచ్చాం. కానీ, నిర్మాణాలు జరగడంలేదు కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు దేవాలయాలను విస్మరించాయి. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. ఏపీలో దేవాలయాలకు రక్షణతో పాటు అభివృద్ధి జరుగుతుంది. మరోవైపు.. కాంగ్రెస్ నేతల ఇళ్లు నల్లధనం దాచుకునే గోదాములు. ఆ పార్టీ నేతల ఇళ్లలోనే ఎందుకు నోట్లు దొరుకుతున్నాయో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. ఇలా పట్టుబడుతున్న సొమ్మును లెక్కపెట్టేందుకు యంత్రాలే అలసిపోతున్నాయి. అవినీతి డబ్బు పేదలకు దక్కేలా కొత్త చట్టం తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నా.



ముదిగొండలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

గోదావరి, కృష్ణా జలాలతో రైతుల పాదాలు కడుగుతాం

- ఇప్పటివరకు 65 లక్షల మందికి రైతుభరోసా
- అబద్ధాల పునాదులపై పుట్టిందే బీఆర్‌ఎస్
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొంగులేటి

బోనకల్: గోదావరి, కృష్ణానది జలాలతో ఖమ్మం జిల్లా రైతుల పాదాలు కడుగుతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్, చింతకాని, ముదిగొండలో సోమవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లలో వారు మాట్లాడారు. అబద్ధపు పునాదులపై పుట్టిన పార్టీ బీఆర్‌ఎస్ అని, ఆ పార్టీ అధినేత కేసీఆర్ అబ ద్ధాలు వల్లిస్తూ కాంగ్రెస్‌పై బురద జల్లే కార్యక్రమం చేస్తున్నా నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని చెప్పారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒక్క సీటు కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి సన్నాసులు, దద్దమ్మలు అని మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని చెప్పారు. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతుల్లో 65 లక్షల మందికి రైతు భరోసా జమ చేశామని.. మిగిలిన వారికి ఈ రోజు జమ చేస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ రాష్ట్రం నెత్తిపై రూ.7 లక్షల కోట్ల అప్పును మోపినా.. తాము ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. కాగా, బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించగా.. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మాత్రం దేశ సంపద ప్రజలకే చెందాలని గ్యారంటీలను ప్రకటించారని తెలిపారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదని, కుల



బోనకల్ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, అభ్యర్థి రఘురాంరెడ్డి

మతాలు, ప్రాంతాల పేరుతో ఆ పార్టీ ప్రజలను రెచ్చగొడుతోందని, రాముడిని రాజకీయాల్లోకి తీసుకొచ్చి అక్షింతలు నెత్తిన చల్లి మూడోసారి ప్రధానమంత్రి కావాలని మోదీ కలలు కంటున్నారని తెలిపారు. అయితే, ఈసారి బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఖమ్మం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, రాష్ట్రంలోని మిగతా స్థానాలను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని భట్టి, పొంగులేటి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారిది చీకటి ఒప్పందం..

▶ మొదటి పేజీ తరువాయి

జీహెచ్‌ఎంసీలో కలిపేస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం వల్ల కంటోన్మెంట్‌కు కూడా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సహకారం అందుతుందని తెలిపారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి పేదల మనిషి కాదని విమర్శించారు. సోమవారం మల్కాజిగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థులు పట్నం సునీతా మహేందర్ రెడ్డి, దానం నాగేందర్, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి శ్రీగణేశ్‌లకు మద్దతుగా హైదరాబాద్‌లోని ఉప్పల్, మల్లాపూర్, అంబర్‌పేట, కంటోన్మెంట్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉప్పల్ వీటీ కమాన్, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, పికెట్ చౌరస్తాల వద్ద జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగులు, రోడ్ షోల్లో ప్రసంగించారు.

కిషన్‌రెడ్డి పేదల మనిషి కాదు

'వైఎస్ సారథ్యంలో మంత్రిగా పని చేసిన దానం నాగేందర్, అప్పటి ఎంపీ అంజన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నగరంలో చేసిన అభివృద్ధే నేటికీ ప్రజలకు అందుబాటులో ఉంది. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా కిషన్‌రెడ్డి అంబర్‌పేటకు చేసిందేమీ లేదు. ఆయన పేద ప్రజల మనిషి కాదు. ఆయనకు ఓటు వేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదు. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ముందు నగరంలో వరదలు వచ్చి పేదలు ఇబ్బందులు పడితే కిషన్‌రెడ్డి అణా పైసా ఇవ్వలేదు. ఆరేళ్లు గడిచినా అంబర్‌పేట ఫ్లైఓవర్ ఎందుకు పూర్తి కాలేదు?..' అని రేవంత్ నిలదీశారు.

ఈటల వేషాలు ప్రజలు గుర్తుపట్టేస్తారు

'ఈటల రాజేందర్ మల్కాజిగిరి ప్రాంతానికి చేసిన మేలు ఏంటో చెప్పాలి. గత పదేళ్లలో ఒక్కరోజు కూడా ఈటల పేద ప్రజల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. 2001 నుంచి 2021 వరకు కేసీఆర్, నువ్వు ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడుకోలేదా? ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ప్రతి ఫైల్ మీద సంతకం పెట్టింది నీవు కాదా? ధరణి ముసుగులో హైదరాబాద్ చుట్టూ వేలాది ఎకరాలు కొల్లగొట్టలేదా? కేసీఆర్ దోపిడీలో నీవు కూడా భాగస్వామివే. పంపకాల్లో తేడా వచ్చి విడి పోయారంతే తప్ప మరొకటి కాదు. బీజేపీలోకి వచ్చి మూడేళ్లు అయినా ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై నరేంద్ర మోదీ, అమిత్‌షాలతో ఎందుకు చర్చించలేదు? పదేళ్లలో ఏనాడైనా ఉప్పల్‌కు వచ్చావా? ఈటల ఎన్ని బైరూపుల వేషాలు వేసినా ఇక్కడి ప్రజలు ఇట్టే గుర్తు పట్టేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందాల్సిన ఫలితాలు అందకుండా ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ సర్కారు ఏర్పడితే రిజర్వేషన్లు తొలగిస్తుంది. తెలంగాణకు ఆయన గాడిద గుడ్డు ఇచ్చారు..' అని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు.

కేటీఆర్ చీర కట్టుకుని బస్సెక్కు

'రేవంత్ ప్రభుత్వం ఏమీ చేయలేదని అంటున్న వారందరికీ చెబుతున్నా. ఆడపడుచులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. 40 లక్షల మందికి గ్యాస్ సబ్సిడీ, 50 లక్షల కుటుంబాలకు ఉచిత కరెంటు ఇస్తున్నాం. మూడు నెలల్లో 30 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం. 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ఘనత మాది. కేటీఆర్ ఎర్రగా ఉన్నావు...చీర కట్టుకుని తెలంగాణలో ఎక్కడైనా ఆర్టీసీ బస్సు ఎక్కు.. టికెట్ అడిగితే మా పథకం అమలు కావడం లేదన్నట్టు.. అడగగకపోతే అమలవుతున్నట్లు తెలుసుకో..' అని రేవంత్ సవాల్ చేశారు.



అంబర్‌పేట కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో దానం, వీహెచ్ తదితరులు

దానం నాగేందర్‌ను కేంద్ర మంత్రిని చేస్తా

ఆరుసార్లు ఎమ్మెల్యేగా, వైఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన అనుభవజ్ఞుడు దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేస్తానని సీఎం అన్నారు. సునీతా మహేందర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో సేవలు, అభివృద్ధి పనులు చేశారని, తాను ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో సునీతమ్మను గెలిపిస్తే అభివృద్ధిలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, రోహిణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు మేడిగడ్డకు జస్టిస్ చంద్రఘోష్

- నీటిపారుదల శాఖ అధికారులతో భేటీ
- ప్రభుత్వానికి అయ్యర్ కమిటీ నివేదిక?



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ మంగళవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనుంది. గతేడాది అక్టోబర్ 21న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులోని లోపాలపై విచారణ కోసం కమిషన్ ఆఫ్ ఎంక్వైరీగా నియామకమైన జస్టిస్ చంద్రఘోష్ రెండో విడత రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమవారం హైదరాబాద్‌కు చేరుకుని బీఆర్‌కేఆర్ భవన్‌లో నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్‌తో సమావేశమై చర్చించారు. మంగళవారం ఉదయం ఆయన మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వెళ్లనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులను గుర్తించి వారికి త్వరలో జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయనుంది. బ్యారేజీలకి సంబంధించిన నిర్ణయాల్లో వారి పాత్రపై వివరణ కోరనుంది.

రాష్ట్ర ప్రభుత్వానికి అయ్యర్ కమిటీ మధ్యంతర నివేదిక?: గతేడాది అక్టోబర్ 21న కుంగిపోయిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు రానున్న వర్షాకాలంలో మరింత నష్టం జరగకుండా తీసుకోవాల్సిన అత్యవసర మరమ్మతు పనులను సిఫారసు చేస్తూ కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ చంద్రశేఖర అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక సమర్పించినట్టు తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీదేనని, దానితోనే బ్యారేజీకి మరమ్మతులు నిర్వహించాలని సిఫారసు చేసినట్టు సమాచారం. బ్యారేజీలకు వచ్చే వర్షాకాలంలో మరింత నష్టం జరగకుండా వాటిలో నీటిని నిల్వ చేయరాదని కోరినట్టు తెలిసింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఏర్పడిన సీపేజీలను గ్రౌంటింగ్ ద్వారా పూడ్చివేయాలని కోరినట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల డిజైన్లు, నిర్మాణంలో లోపాలపై అధ్యయనం చేసి వాటికి పరిష్కారాలను సూచించడానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఈ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

బోల్తా కొట్టిన బాబు బుల్‌బుల్ పిట్ట


బెడిసికొట్టిన రిటైర్డ్ ఐఏఎస్ పీవీ రమేశ్ దుష్ప్రచారం | బాబు పన్నాగంతో ఏపీ ప్రభుత్వంపై విష ప్రచారం



సాక్షి, అమరావతి : ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారాన్ని కొనసాగించేందుకు చంద్రబాబు వదిలిన బుల్ బుల్ పిట్ట బోల్తా కొటింది. టీడీపీ గూటి చిలు క, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్‌తో సోషల్ మీడియాలో చంద్రబాబు సాగించిన దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే పచ్చ ముఠా సభ్యుడైన ఆయన చంద్రబాబు ఆదేశాలతో రంగంలోకి దిగి అడ్డంగా దొరికిపోయారు. తన తండ్రి నుంచి వారసత్వంగా వస్తున్న భూములకు మ్యుటేషన్ చేయడంలేదని, అందుకు ల్యాండ్ టైట్లింగ్ చట్టమే కారణమనే భావన కలిగిస్తూ అసత్య ఆరోపణలు చేశారు. దీంతో నెటిజన్లు ఆయనపై విరుచుకుపడ్డారు. అసలు ఇంకా అమలులోకి రాని చట్టం దుర్వినియోగం కావడం ఏమిటంటూ మండిపడ్డారు. మరోవైపు తీగ లాగితే డొంక కదిలింది. ఆయన చెబుతున్న 11.04 ఎకరాల భూమిని పీవీ రమేశ్ కుటుంబం కబ్జా చేసిందన్న విషయం ఆధారాలతో సహా బయటపడింది. ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేటు భూములు కబ్జా చేసేసి, న్యాయస్థానం తీర్పును కూడా ధిక్కరిస్తున్న పీవీ రమేశ్ బరితెగింపు బట్టబయలైంది.

పీవీ రమేశ్ కుటుంబమే భూ దొంగ

పీవీ రమేశ్ చేసిన దుష్ప్రచారం ఆయన కుటుంబం భూ కబ్జాను కూడా వెలుగులోకి తెచ్చింది. ఏ భూమి గురించి అయితే పీవీ రమేశ్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేశారో.. ఆ భూమి ఆయన కుటుంబం కబ్జా చేసిందన్న విషయం కూడా బయటపడిపోయింది. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం విన్నకోటలో 25ఏళ్ల క్రితం పలువురు రైతులు తమ భూములను కలిపి దాదాపు 100 ఎకరాల్లో చెరువు తవ్వి సహకార వ్యవసాయం తరహాలో చేపల సాగు చేపట్టారు. ఈ భూముల్లో పీవీ రమేశ్ తండ్రి పెనుమాక సుబ్బారావుకు చెందినవి 11.04 ఎకరాలు ఉన్నాయి. కానీ వాటిలో 3.29 ఎకరాల అసైన్డ్ భూమి, 0.29 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు తన భూమి కూడా ఉందని గాలంకి నాగేంద్ర అనే వ్యక్తి న్యాయస్థానంలో గతంలోనే పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం పెనుమాక సుబ్బారావు ఆక్రమించిన భూమిని తిరిగి ఇచ్చేయాలని 2022లోనే తీర్పునిచ్చింది. పీవీ రమేశ్ పరపతికి భయపడి ఆ తీర్పును అధికారులు అమలు చేయలేక పోయారు. దాంతో బాధితుడు నాగేంద్ర కోర్టుధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉంది. అంటే పీవీ రమేశ్ ఆయన తండ్రి నుంచి వచ్చిన వారసత్వ భూమిగా చెబుతున్న 11.04 ఎకరాలు ఆయన కుటుంబం కబ్జా చేసిన భూమి అన్న విషయం బయటపడింది.



BRIEF NOTE
(Vinnakota Fish Tank)

భూముల రీ సర్వేకు పీవీ రమేశ్ కుటుంబం హాజరు కాలేదని, కబ్జా చేసిన భూమిని పీవీ రమేశ్ పేరిట మ్యుటేషన్ చేయటం సాధ్యం కాదని రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు

కబ్జా భూమికి మ్యుటేషన్ సాధ్యం కాదన్న అధికారులు

అయినా సరే తమ కుటుంబం కబ్జా చేసిన భూములను తమ పేరిట మ్యుటేషన్ చేయాలని పీవీ రమేశ్ యత్నించడం గమనార్హం. ఆ మేరకు ఆయన 2023 డిసెంబర్ 16న రెవెన్యూ అధికారులకు లేఖ రాశారు. తన తండ్రి పెనుమాక సుబ్బారావు మరణించినందున ఆయన పేరిట ఉన్న భూములను తమ పేరిట మ్యుటేషన్ చేయాలని కోరారు. అప్పటికే ఆ భూములపై న్యాయ వివాదం ఉందన్న విషయం రెవెన్యూ అధికారులకు తెలుసు. కబ్జా భూములను ఖాళీ చేయాల్సింది పోయి, మ్యుటేషన్ చేయాలని కోరడంతో పీవీ రమేశ్ దరఖాస్తును తిరస్కరిస్తున్నట్టు 2023 డిసెంబర్ 30న అధికారులు ఆయనకు లిఖితపూర్వకంగా తెలిపారు.

రీసర్వేకు ముఖం చాటేసిన పీవీ రమేశ్

అంతేకాదు.. తమ భూకబ్జా బాగోతం బయటపడుతుందనే ఉద్దేశంతోనే పీవీ రమేశ్ రెవెన్యూ అధికారుల రీ సర్వేకు ముఖం చాటేశారు. పీవీ రమేశ్ చెబుతున్న చెరువు భూముల్లో కూడా రీసర్వే నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. తద్వారా ఆ రైతుల భూములకు హద్దులను నిర్ణయించి వారి పేరిట పత్రాలు ఇవ్వాలని భావించారు. అందుకోసం ఈ ఏడాది (2024) ఫిబ్రవరి 26న కృష్ణా జిల్లా కలెక్టర్ జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీని కూడా నియమించారు. దాంతో గుడివాడ ఆర్డీవో ఆ చెరువు భూముల్లో 2024 మార్చి 5న నిర్వహించనున్న ఉమ్మడి సర్వేకు హాజరుకావాలని, ఇందుకు భూముల ఒరిజినల్ పత్రాలను తీసుకురావాలని భూ యజమానులు, రిట్ పిటిషన్లు దాఖలు చేసినవారందరికీ నోటీసులు జారీ చేశారు. పీవీ రమేశ్ కుటుంబానికి కూడా నోటీసులు జారీ చేశారు. ఆ రోజున రైతులందరూ వచ్చారు. వారి భూముల పత్రాలను చూపించి రీ సర్వేకు సహకరించారు. కానీ పీవీ రమేశ్ గానీ ఆయన కుటుంబ సభ్యులుగానీ ఆ రీ సర్వేకు హాజరు కాలేదు. రెవెన్యూ అధికారులు ఎన్ని సార్లు ఫోన్లు చేసినా, వాట్సాప్ ద్వారా సందేశాలు పంపినా వారు హాజరుకాలేదు. దాంతో అందరు రైతులు వచ్చి పత్రాలు చూపించే వరకు రీసర్వే పూర్తి చేయడం సాధ్యం కాదని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. అదీ పీవీ రమేశ్ కుటుంబ భూకబ్జా బాగోతం.

ఆయన తండ్రిపై వరకట్న వేధింపుల కేసు కూడా

పీవీ రమేశ్ తండ్రి పెనుమాక సుబ్బారావు భూముల కబ్జాకు పాల్పడమే కాదు.. ఆయనపై క్రిమినల్ కేసులు కూడా గతంలో నమోదు కావడం గమనార్హం. కట్నం కోసం కోడల్ని మానసికంగా, శారీరకంగా హింసించారన్న కారణంతో ఆయనపై విజయవాడ పోలీసులు 2018లో వరకట్న వేధింపుల కేసు నమోదు చేసిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. పీవీ రమేశ్ సోదరుడు రాజశేఖర్ జోషి భార్య పెనుమాక సంధ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. 1999లో తన పెళ్లి సమయంలో రూ.2 లక్షల కట్నం, నాలుగు ఎకరాల మామిడి తోట, కారు కట్నంగా ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరు పిల్లల తల్లినైన తనను వేధిస్తున్నారంటూ భర్త పెనుమాక రాజశేఖర్ జోషి, మామగారు పెనుమాక సుబ్బారావు, అత్తగారు పెనుమాక మణిలపై ఆమె ఫిర్యాదు చేశారు. దాంతో ఆ ముగ్గురిపై పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు.

తొందరపడి అబద్ధం కూసి.. ఆపై మరోపోస్టు పెట్టి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే చంద్రబాబు కుట్రలో పాత్రధారి అయిన పీవీ రమేశ్ సోమవారం ఉదయం సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్)లో ఓ పోస్టు పెట్టారు. 'తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూములను మ్యుటేషన్ చేయడానికి రెవెన్యూ అధికారులు నిరాకరించారు. తహశీల్దార్ నా దరఖాస్తును తిరస్కరించారు. పోస్టు ద్వారా పంపిన పత్రాలను తెరవకుండానే ఆర్డీవో తిరిగి ఇచ్చేశారు. నా తల్లిదండ్రుల భూములపై నాకు హక్కు లేకుండా చేస్తున్నారు. ఓ ఐఏఎస్ అధికారిగా 36 ఏళ్ల పాటు ఆంధ్రప్రదేశ్‌కు సేవ చేసిన ఓ అధికారి పరిస్థితే ఇలా ఉంటే.. సామాన్య రైతుల దుస్థితి ఊహించలేం' అంటూ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూహక్కు చట్టం (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్)పై దుష్ప్రచారం చేయాలన్న చంద్రబాబు కుట్రను పక్కాగా అమలు చేశారు. ప్రజల్ని తప్పుదారి పట్టించాలన్న దుర్బుద్ధితో పీవీ రమేశ్.. అసలు ఆ చట్టం రాష్ట్రంలో ఇంకా అమల్లోకి రాలేదన్న అసలు విషయాన్ని విస్మరించారు. వెంటనే నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. చట్టం ఇంకా అమల్లోకి రాకముందే ఎలా దుర్వినియోగం అవుతోందని అంటారు అంటూ నిలదీశారు. దాంతో బండారం బయటపడుతుందన్న ఆందోళనతో పీవీ రమేశ్ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో తన పోస్టును ఎడిట్ చేశారు. 'చట్టం అమలులోకి రాకముందే నా తల్లిదండ్రుల భూములపై నాకు హక్కులేకుండా చేస్తున్నారు' అంటూ పోస్టులో మార్పు చేశారు.

మళ్లీ బీజేపీ వస్తే రాజ్యాంగం రద్దే

- మోదీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తున్నారు
- మీట్ ది ప్రెస్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య

హిమాయత్‌నగర్: బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుందని, రిజర్వేషన్లు తొలగిస్తారని, మతవిద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చుపెడతారని, దేశ సమైక్యతకు, సమగ్రతకు ముప్పు ఏర్పడుతుందని, అందుకే మోదీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఎస్.వీరయ్యతో మీట్ ది ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ అధ్యక్షత వహించారు. వీరయ్య మాట్లాడుతూ... పదేళ్ల పాలనను చూపి ప్రజలను ఓట్లడిగే పరిస్థితి బీజేపీకి లేదన్నారు. అందుకే మతాన్ని, దేవుడిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాని విమర్శించారు. ఈనెల 13న జరిగే ఎన్నికలకు పోటీ చేసే వారిలో 246 మంది అభ్యర్థులు హత్యలు, లైంగికదాడులకు పాల్పడిన వారున్నారని, రాజకీయాల్లో విలువలు దిగజారాయనేందుకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు.

బీజేపీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు: మోదీ ప్రభుత్వం నిరంకుశ విధానాలను అవలంబిస్తోందని వీరయ్య విమర్శించారు. స్వతంత్రంగా పనిచేయాల్సిన ఈడీ, సీబీఐ వంటి రాజ్యాంగ సంస్థలను బీజేపీకి తనకి అనుకూలంగా పని చేయించుకుంటోందని ఆరోపించారు. అందుకే అవి ప్రశ్నించే వారి మీద దాడులు చేస్తున్నాయని నిందించారు. బీజేపీ బ్లాక్ మెయిలింగ్ రాజకీయాల్లో భాగంగానే కేజ్రీవాల్, హేమంత్ సోరెన్, కవితను అరెస్టు చేశారని ఆరోపించారు. బ్లాక్ మెయిలింగ్‌లో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డికి నోటీసులిచ్చారని అన్నారు.రాష్ట్రంలో భువనగిరిలో సీపీఐ(ఎం)ను, మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు వీరయ్య విజ్ఞప్తి చేశారు.



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న వీరయ్య. చిత్రంలో విరాహత్‌అలీ

ఎవరి మాటలు నమ్మాలో అర్థం కావడం లేదు

- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్



సాక్షి, హైదరాబాద్: 'బీజేపీ గెలిస్తే రాజ్యాంగ పీఠికను మారుస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ అంటుంటే.. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాత్రం రాజ్యాంగాన్ని మార్చబోం. సెక్యులర్ అనే పదాన్ని తొలగించబోం అని చెప్తున్నారు. వీరిలో ఎవరి మాటలు నమ్మాలో అర్థం కావడం లేదు' అని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని హోదాలో ఉండి మతపరమైన విద్వేషాలు రెచ్చగొట్టేలా మోదీ మాట్లాడటం వారి ఓటమి భయాన్ని తెలియజేస్తోందన్నారు. హోంమంత్రి అమిత్‌షా కూడా స్థాయి తగ్గి మాట్లాడుతున్నారని, ఇద్దరు నేతలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు.



రాంచీలోని మంత్రి ఆలంగీర్ పీఎస్ పనిమనిషి ఇంట్లో బయటపడిన నోట్ల కట్టలను లెక్కబెడుతున్న అధికారులు

మంత్రి పీఎస్ పనిమనిషి ఇంట్లో కోట్లు

- జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈడీ సోదాల్లో గుర్తింపు
- ఇప్పటి వరకు తేలిన సొత్తు రూ.35.23 కోట్లు
- నోట్ల లెక్కింపు కొనసాగుతోందన్న అధికారులు
- తనకు సమాచారం లేదంటున్న మంత్రి ఆలంగీర్ ఆలం

రాంచీ: కాంగ్రెస్ నేత, జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలం వ్యక్తిగత కార్యదర్శి(పీఎస్) పనిమనిషి ఇంట్లో బ్యాగుల కొద్దీ నోట్ల కట్టలు బయటపడటం సంచలనం రేపుతోంది. సోమవారం రాంచీలోని గడీఖానా చౌక్‌లోని పనిమనిషి జహంగీర్ ఆలం ఫ్లాట్‌లో సోదాలు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను బయటపెట్టారు. మంత్రి ఆలం వ్యక్తిగత కార్యదర్శి సంజీవ్ లాల్ కూడా ఇదే ప్రాంతంలో నివసిస్తున్నారని చెబుతున్నారు. దాదాపుగా అన్నీ రూ.500 నోట్ల కట్టలు కాగా, కొన్ని ఆభరణాలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి వరకు 17 గంటలపాటు లెక్కించిన సొమ్ము రూ.35.23 కోట్లుగా తేలిందన్నారు. ఆరు యంత్రాలతో లెక్కింపు కొనసాగుతోందని చెప్పారు. మొత్తం ఆరు చోట్ల సోదాలు జరపగా మరో చోట రూ.3 కోట్ల నగదు బయటపడినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల వేళ చోటుచేసుకున్న ఈ పరిణామంపై కాంగ్రెస్‌కు చెందిన మంత్రి ఆలం స్పందిస్తూ.. ప్రభుత్వం నాకు సమకూర్చిన ప్రైవేట్ కార్యదర్శికి చెందిన ఇంట్లో సోదాలు జరుగుతున్నట్లు టీవీల్లో చూశానన్నారు. దీనిపై అధికారికంగా ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. గత ఏడాది అరెస్ట్ చేసిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ రిటైర్డు చీఫ్ ఇంజినీర్ వీరేంద్రకుమార్ రామ్‌పై ఉన్న మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగానే తాజాగా దాడులు జరిపినట్లు ఈడీ తెలిపింది. ఈ కేసులో రామ్‌కు చెందిన రూ.39 కోట్ల ఆస్తులను సైతం అటాచ్ చేసింది.



ఎన్నికల విచిత్రం

పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లా సైంథియాలో సోమవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ధంసా అనే డ్రమ్మును వాయిస్తున్న ముఖ్యమంత్రి మమత

మల్లికార్జున ఖర్గే 'ఇంట' గెలిచేనా..?'

- గుల్బర్గా నుంచి బరిలో అల్లుడు
- ఆయన విజయం ఖర్గేకు ప్రతిష్టాత్మకం

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సొంత లోక్‌సభ స్థానం గుల్బర్గాలో బీజేపీ నుంచి మరోసారి గట్టి సవాలు ఎదురవుతుతోంది. కాంగ్రెస్ కంచుకోటగా పేరుగాంచిన గుల్బర్గాలో 2009, 2014ల్లో వరుసగా నెగ్గిన ఖర్గే 2019లో బీజేపీ అభ్యర్థి ఉమేశ్ జాదవ్ చేతిలో ఖర్గే ఓటమి చవిచూసి హ్యాట్రిక్‌కు దూరమయ్యారు. ఈసారి కాంగ్రెస్ నుంచి ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణిని బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి మరోసారి ఉమేశ్ జాదవ్ పోటీ చేస్తున్నారు. కలబురిగికి చెందిన దొడ్డమణికి పలు విద్యాసంస్థలున్నాయి. ఇంతకాలం ఖర్గే ఎన్నికల ప్రచారం, వ్యూహరచన తదితరాల్లో తెర వెనక దన్నుగా ఉన్నారు. వైద్యుడైన ఉమేశ్ పూర్వాశ్రమంలో కాంగ్రెస్ నాయకుడే. 2013, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీదర్‌లోని చించోలి నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. ఖర్గేతో విభేదాల కారణంగా 2019 లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీలో చేరారు. తన గురుతుల్యుడైన ఖర్గేపైనే గెలుపొందారు. గుల్బర్గాలోలో 65 శాతం కంటే ఎక్కువ గ్రామీణ ఓటర్లే. మొత్తమ్మీద 20 శాతం మంది ముస్లిం ఓటర్లు, 24 శాతానికి పైగా దళితులున్నారు. వీరి ఓట్లపై కాంగ్రెస్ నమ్మకం పెట్టుకుంది. గుల్బర్గా లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ కేవలం మూడుసార్లు మాత్రమే ఓడింది. బీజేపీ రెండుసార్లు మాత్రమే గెలిచింది. మూడో విడతలో భాగంగా మంగళవారం ఇక్కడ పోలింగ్ జరుగనుంది.

ఎన్‌డీఏకు 150 సీట్లూ కష్టమే

రాజ్యాంగాన్ని మేం రక్షిస్తుంటే వాళ్లు కూలదోసే కుట్రకు తెగించారు ● బీజేపీ కూటమిపై రాహుల్ గాంధీ నిప్పులు

అలీరాజ్‌పూర్/ఖర్గోన్: బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 150 స్థానాలను కూడా గెల్చుకోదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో పోరాడుతుంటే కమలంపార్టీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగాన్ని మార్చేందుకు కంకణం కట్టుకున్నాయని రాహుల్ ఆరోపించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని అలీరాజ్‌పూర్ జిల్లాలోని జోబాట్, సేగోన్ పట్టణాల్లో రాహుల్ ఎన్నికల ప్రచారంచేశారు. రాత్లాం-ఝుబువా, ఖర్గోన్ లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థుల తరఫున ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు.

హక్కుల్ని లాగేద్దామని మోదీ ఆశపడుతున్నారు

''కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరాక ప్రజా ప్రయోజనాల కోసం 50 రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తుంది. కులగణన అనేది ప్రజల జీవన స్థితిగతులపై వాస్తవ గణాంకాలను అందిస్తుంది, దీంతో దేశంలో రాజకీయ గతే మారిపోతుంది. రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ నేతలు ఇప్పటికే ప్రకటించేశారు. ఈసారి 400 ఖాయం అని బడాయిలుపోతున్నారుగానీ కనీసం వారికి 150 సీట్లుకూడా రావు. రాజ్యాంగాన్ని పరిరక్షించేది విపక్షాల 'ఇండియా' కూటమి మాత్రమే. రాజ్యాంగంలో ఉంది కాబట్టే గిరిజనులు, దళితులు, ఓబీసీలు లబ్ధిపొందగల్గుతున్నారు. జలం, జమీన్(భూమి), జంగల్(అడవి)పై గిరిజనులకు హక్కులున్నాయి. ప్రజల హక్కులను లాగేసుకోవాలని ప్రధాని మోదీ ఆశపడుతున్నారు. ఆ ఆశలు నెరవేరకుండా మేం అడ్డుకుంటాం'' అని రాహుల్ అన్నారు.



మేం చేయబోయే విప్లవాత్మకమైన పని ఇదే

''వాళ్లు ఇప్పుడున్న రిజర్వేషన్లను లాక్కోవడం సంగతి పక్కనబెట్టండి. మేం ఆ రిజర్వేషన్లను 50 శాతం దాటేలా చేస్తాం. కోర్టులు రిజర్వేషన్ల పరిమితిని 50 శాతం దగ్గరే నిలిపేశాయి. భూమి, అడవికి తొలి యజమానులైన మిమ్మల్ని ఆదివాసీలుగా మేం గుర్తిస్తున్నాం. బీజేపీ వాళ్లు మిమ్మల్ని వనవాసీలంటున్నారు. మీ హక్కుల పరిరక్షణ కోసమే అటవీ హక్కుల చట్టం, పేసా చట్టాలు అమల్లో ఉన్నాయి. మీ అందరికీ చేకూరిన లబ్ధిని మీకు దూరం చేయాలని వారు కుట్ర పన్నారు. విపక్షాల కూటమికి ఓటేసి అధికారం కట్టబెడితే కులగణన చేసి గిరిజనులు, దళితులు, ఓబీసీలు, జనరల్ కేటగిరీ పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తాం. మేం చేయబోయే విప్లవాత్మకమైన పని ఇదే. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామని మోదీ అబద్ధాలు చెప్పారు. మేం కోట్లాది మంది పేదలను లఖ్‌పతిలుగా మారుస్తాం'' అని చెప్పారు.

పాతికమందికే అన్ని ఇచ్చే కుట్ర

''రాజ్యాంగం, రిజర్వేషన్లు, గిరిజనుల అటవీభూములు, ప్రభుత్వరంగాన్ని కాపాడేందుకు మేం కష్టపడుతుంటే వీటిపై సర్వాధికారాన్ని అదానీ సహా ఓ పాతికమంది కుబేరులకు ధారాదత్తం చేద్దామని మోదీ ఆశపడుతున్నారు. మేం ఆ పని జరగనివ్వం'' అని ప్రకటించారు.

ఉపాధి కూలీ వేతనం రూ.400కు పెంచుతాం

''మహాలక్ష్మీ యోజన ద్వారా పేద మహిళల ఖాతాలో ఏటా రూ.1 లక్ష జమచేసి పేదరికం నుంచి బయటపడేస్తాం. పథకంలో భాగంగా మహిళకు నెలకు రూ.8,500 అందుతాయి. మేం గెలిస్తే రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం. అందుకోసం చట్టం తెస్తాం. మా ప్రభుత్వం ఏర్పడ్డాక వీలైనంత త్వరగా రైతుల రుణాలను మాఫీచేస్తాం. గత 45 ఏళ్ల గరిష్ట స్థాయికి నిరుద్యోగిత పెరిగింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రోజువారీ వేతనంను రూ.250 నుంచి రూ.400కు పెంచుతాం. పెహ్లీ నౌకరీ పక్కా పథకం కింద యువతకు కంపెనీల్లో అప్రెంటిస్‌షిప్ కింద ఏటా రూ.1లక్ష జమచేస్తాం. తర్వాత ఉద్యోగాలిస్తాం'' అని హామీ ఇచ్చారు.

ఎలక్షన్ బీట్

గెలిచేందుకు బీజేపీ అబద్ధాల బ్లూప్రింట్

పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు

సైంథియా: లోక్‌సభ ఎన్నికల్లో విజయం కోసం బీజేపీ అబద్ధాల బ్లూప్రింట్ తయారు చేసుకుందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. బీర్భూమ్ జిల్లా సైంథియాలో సోమవారం ఆమె టీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగించారు. దేశం మొత్తాన్ని దోచుకుంటున్న బీజేపీ అత్యున్నత నేతలిద్దరు ఆ పాపాలను దాచిపెట్టేందుకు బెంగాల్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. అల్లర్లకు కుట్రదారైన ప్రధానికి మీరు ఓటేస్తారా?అని ప్రజలను ఆమె ప్రశ్నించారు. సందేశ్‌ఖాలిపై బీజేపీ అసత్యాలను ప్రచారం చేస్తోందన్నారు. డబ్బులు వెదజల్లి బెంగాల్‌లోని కోట్లాదిమంది తల్లులు, సోదరీమణులకు అగౌరవం, అమర్యాదను ఆ పార్టీ అంటగడుతోందని ఆరోపించారు. డబ్బు కంటే ఆత్మగౌరవమే మహిళలకు ముఖ్యమన్న విషయం బీజేపీకి తెలియదని ఆమె వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని పేదలకు చెందాల్సిన నిధులను ఆపేసి, ప్రింట్, డిజిటల్ మీడియాలో ప్రచారానికి మోదీ ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందని మండిపడ్డారు.

బీజేపీకి మహిళలే బుద్ధి చెబుతారు

న్యూఢిల్లీ: కర్నాటకలో జేడీఎస్ నేత ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో బీజేపీపై కాంగ్రెస్ పార్టీ మరోసారి విరుచుకుపడింది. మహిళలపై నేరాలకు పాల్పడేవారికి మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగానే ఉంటోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి మహిళలు బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొంది. బేటీ బచావో, బేటీ పఢావో వంటి వాగ్దానాలను ఇస్తున్న బీజేపీ అసలు స్వరూపం ప్రజలకు తెలిసిపోయిందని అఖిల భారత మహిళా కాంగ్రెస్ చీఫ్ నెట్టా డిసౌజా సోమవారం మీడియాతో అన్నారు. వేధింపుల బాధితులైన మహిళా రెజ్లర్లు సహా ఏ ఒక్కరికీ ప్రధాని న్యాయం చేకూర్చే ప్రయత్నం చేయలేదని అన్నారు. 'ప్రజ్వల రేవణ్ణ అఘాయిత్యాలు బయటపడటంతో దేశంలోని మహిళలంతా ఆగ్రహంతో ఉన్నారు. వేరెవరైనా ఇవే నేరాలకు పాల్పడితే ప్రధాని మోదీ దేశమంతటా ప్రచారం చేసి ఉండేవారు. సొంత వ్యక్తి కావడంతో ప్రధాని వైఖరేమిటో తేటతెల్లమైంది'అని ఆమె వ్యాఖ్యానించారు.

శ్రీకళా రెడ్డి టికెట్ క్యాన్సిల్

జౌన్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ నియోజకవర్గం నుంచి బహుజన్ సమాజ్‌పార్టీ తమ అభ్యర్థిని మార్చింది. శ్రీకళా రెడ్డి బదులుగా సిట్టింగ్ ఎంపీ శ్యామ్‌సింగ్ యాదవ్‌కు టికెటిచ్చింది. శ్రీకళా రెడ్డి తెలంగాణకు చెందిన వారు. మాజీ ఎంపీ ధనంజయ్ సింగ్‌ను పెళ్లాడారు. జౌన్‌పూర్ జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్న శ్రీకళా రెడ్డిని లోక్‌సభ బరిలోకి దింపుతున్నట్లు బీఎస్పీ ఏప్రిల్ 16న ప్రకటించింది. తాజాగా సోమవారం ఆమె అభ్యర్థిత్వాన్ని మార్చి శ్యామ్‌సింగ్ యాదవ్ బీఎస్పీ తరఫున పోటీలో ఉంటారని ప్రకటించింది. దీనిపై ధనంజయ్ సింగ్ స్పందిస్తూ ' నా భార్య ఎంతో క్షోభ పడుతున్నారు. నన్ను అవమానించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని' ఆరోపించారు. శ్రీకళా రెడ్డి స్వయంగా టికెట్‌ను తిరిగి ఇచ్చేశారనే వార్తలు పూర్తిగా నిరాధారమని కొట్టిపారేశారు. ఒక కేసులో ఏడేళ్ల జైలు శిక్ష పడ్డ ధనంజయ్ సింగ్‌కు ఏప్రిల్ 27న అలహాబాద్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మరోవైపు శ్యామ్‌సింగ్ యాదవ్ మాట్లాడుతూ బీఎస్పీ అధినేత్రి మాయావతి తనను పిలిచి జౌన్‌పూర్ నుంచి పోటీచేయాలని కోరారని అన్నారు. ఈ నియోజకవర్గానికి మే 25న ఎన్నిక జరగనుంది.

ఫేక్ కంటెంట్‌ను మూడు గంటల్లో తొలగించండి: ఈసీ

న్యూఢిల్లీ: ఫేక్ కంటెంట్ ఉందని రాజకీయ పార్టీల దృష్టికి వచ్చిన వెంటనే.. మూడు గంటల్లోగా తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ నుంచి సదరు కంటెంట్‌ను తొలగించాలని ఎన్నికల కమిషన్ సోమవారం రాజకీయ పార్టీలకు ఆదేశాలు జారీచేసింది. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా, నైతికంగా వాడాలని సూచిస్తూ... ఒకరిని అనుకరించకూడదని, మహిళలను కించపరిచేలా ఉన్న కంటెంట్‌ను పోస్ట్ చేయకూడదని, డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారంలో పెట్టకూడదని నిర్దేశించింది. డీప్‌ఫేక్ ఆడియోలు, వీడియోలు ఉన్నట్లు పార్టీ దృష్టికి వచ్చిన వెంటనే మూడుగంటల్లో వాటిని తొలగించాలని, అందుకు బాధ్యులైన తమ పార్టీ వ్యక్తులను హెచ్చరించాలని సూచించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను దుర్వినియోగం చేస్తూ డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారంలో పెట్టవద్దని, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని ఈసీ రాజకీయ పార్టీలను కోరింది.

ఆప్‌కు ఖలిస్తానీ నిధులు..

కేజ్రీవాల్‌పై ఎన్ఐఏ విచారణకు ఢిల్లీ ఎల్జీ సిఫారసు

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ 'సిఖ్స్ ఫర్ జస్టిస్'అనే నిషేధిత ఉగ్ర సంస్థ నుంచి పార్టీ నిధులు అందుకున్నారన్న ఆరోపణలపై ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ)తో దర్యాప్తు జరిపించాలని లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) వీకే సక్సేనా కేంద్రానికి సిఫారసు చేశారు. దేవేంద్ర పాల్ భుల్లార్ అనే వ్యక్తిని జైలు నుంచి విడుదలయ్యేలా చేసేందుకు కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి ఖలిస్తానీ గ్రూపుల నుంచి 1.6 కోట్ల అమెరికన్ డాలర్ల నిధులు అందినట్లు తనకు ఫిర్యాదు అందిందని ఎల్జీ కేంద్ర హోం శాఖకు లేఖ రాశారని 'రాజ్ నివాస్'సోమవారం వెల్లడించింది. 2014–2022 మధ్య ఖలిస్తానీ గ్రూపులు కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ పార్టీకి 1.6 కోట్ల డాలర్ల నిధులిచ్చినట్లు ఖలిస్తానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ పేర్కొన్నట్లుగా కూడా ఫిర్యాదులో ఉందని తెలిపింది. 2014లో అమెరికా పర్యటన సమయంలో కేజ్రీవాల్ ఖలిస్తానీ నేతలతో రహస్య సమావేశం జరిపినట్లు కూడా ఆరోపణలున్నాయని ఎల్జీ తెలిపారని వెల్లడించింది.



అస్సాంలో ఈవీఎంలతో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

నేడే మూడో దశ పోలింగ్

11 రాష్ట్రాల్లో 93 స్థానాలు

జనరల్ 72
ఎస్టీ 11
ఎస్సీ 10

ఓటర్లు 17.24 కోట్లు | పురుషులు 8.85 కోట్లు | మహిళలు 8.39 కోట్లు

అహ్మదాబాద్/బెంగళూరు: పరస్పర వివాదాస్పద ఆరోపణలు, ఈసీకి ఫిర్యాదులతో రాజకీయ పార్టీలు పెంచిన ప్రచారవేడి చల్లారాక నేడు కేంద్ర ఎన్నికల సంఘం మూడో దశ పోలింగ్‌కు సిద్ధమైంది. 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 93 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ దశతో గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని అన్ని స్థానాలకూ పోలింగ్ పూర్తి కానుంది. ఈ రాష్ట్రాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగిన విషయం తెల్సిందే. ఈసారి మూడో దశలో 120 మంది మహిళలుసహా 1,300కు పైగా అభ్యర్థులు పోటీపడు తున్నారు.

రాష్ట్రం	సీట్లు
గుజరాత్	25
కర్ణాటక	14
మహారాష్ట్ర	11
ఉత్తరప్రదేశ్	10
మధ్యప్రదేశ్	9
ఛత్తీస్‌గఢ్	7
బిహార్	5
అస్సాం	4
బెంగాల్	4
గోవా	2
దాద్రానగర్, హవేలీ, దయ్యూదామన్	2

బరిలో అగ్రనేతలు, ప్రముఖులు

కేంద్రమంత్రులు అమిత్ షా(గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా(గుణ), మన్‌సుఖ్ మాండవీయ(పోర్‌బందర్), పురుషోత్తం రూపాలా(రాజ్‌కోట్), ప్రహ్లాద్ జోషి (ధార్వాడ్), ఎస్పీ సింగ్ బఘేల్(ఆగ్రా), మధ్యప్రదేశ్ మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ చౌహాన్(విదిశ), దిగ్విజయ్‌సింగ్(రాజ్‌గఢ్), ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్, కర్ణాటక మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై (హావేరీ), బారామతిలో వదినా, మరదళ్లు సునేత్రా పవార్, సుప్రియా సూలే తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

283 చోట్ల పోలింగ్ పూర్తి

ఇప్పటికే గుజరాత్‌లోని సూరత్ నియోజక వర్గంలో బీజేపీ ఏకగ్రీవంగా గెల్చింది. గతంలో వాయిదాపడిన బైతుల్ నియోజకవర్గంలో ఈరోజే పోలింగ్ నిర్వహిస్తు న్నారు. మూడోదశలో 11 కోట్లకుపైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పశ్చిమబెంగాల్‌లో ఈరోజు పోలింగ్ ఉన్న నాలుగు స్థానాల్లోనూ ముస్లిం ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. కర్ణాటకలో ఈరోజు పోలింగ్ ఉన్న 14 స్థానాలనూ 2019 ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేసింది. మూడో దశ ముగిస్తే మొత్తం 543 స్థానాలకుగాను ఇప్పటిదాకా పోలింగ్ పూర్తయిన స్థానాల సంఖ్య 283కి చేరుకుంటుంది. నాలుగో దశ మే 13న, ఐదో దశ మే 20న, ఆరో దశ మే 25న, ఏడో దశ జూన్ ఒకటో తేదీన నిర్వహిస్తారు. అన్ని స్థానాలకు ఓట్ల లెక్కింపును జూన్ 4న చేపడతారు.

బీజేడీ సర్కార్.. జూన్ 4తో సమాప్తం

ఒడిశాలో తొలి ఎన్నికల సభలో ప్రధాని మోదీ

బరంపూర్/నబారంగ్‌పూర్: ఒడిశా శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడే జూన్ 4వ తేదీన రాష్ట్రంలో బిజూజనతాదళ్ (బీజేడీ) ప్రభుత్వం అంతర్థానమవుతుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల హడావిడి మొదలయ్యాక మొదటి సారిగా ప్రధాని మోదీ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. దేశంలోనే అగ్రరాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్దే సదవకాశాన్ని బీజేపీకి ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. ఒరియా భాష, సంస్కృతులను అర్థంచేసుకునే ముఖ్యమంత్రే రాష్ట్రానికి అవసరమని బీజేడీ చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్‌పై మోదీ విమర్శలు గుప్పించారు. పట్నాయక్‌కు ఒరియా భాషపై పట్టులేదని ఓ అపవాదు ఉంది. గిరిజనుల జనాభా ఎక్కువగా ఉండే నబారంగ్‌పూర్, బరంపూర్‌లలో సోమవారం ఎన్నికల ర్యాలీల్లో మోదీ ప్రసంగించారు.



ఎన్నికలయ్యాక డబుల్ ఇంజన్ సర్కార్

''మోదీ నాయకత్వంలో పదేళ్ల అభివృద్ధిని మీరు కళ్లారాచూశారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే మోదీ ప్రభుత్వం గిరిజనులకు కేటాయింపులను ఐదు రెట్లు పెంచింది. గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను 400కు పెంచాం. ఒక్క నా మంత్రిత్వశాఖలోనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఉద్యోగులు 7 శాతం దాకా ఉన్నారు. బీజేడీ సర్కార్ కేంద్ర ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలుచేయని కారణంగా ఇక్కడి ప్రజలు ఆ పథక ప్రయోజనాలకు దూరమయ్యారు. జల్‌జీవన్ మిషన్ కింద ఒడిశాకు రూ.10,000 కోట్లు ఇచ్చాం. కానీ పట్నాయక్ సర్కార్ వాటిని సద్వినియోగం చేయలేదు'' అని ఆరోపించారు.

మాకు ఐదేళ్లు ఇవ్వండి

'' రాష్ట్రాన్ని పాలించే అవకాశాన్ని మీరు కాంగ్రెస్‌కు 50 ఏళ్లు ఇచ్చారు. బీజేడీకి 25 సంవత్సరాలు ఇచ్చారు. బీజేపీకి కేవలం ఐదు సంవత్సరాలు ఇచ్చి చూడండి. దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా ఒడిశాను తీర్చిదిద్ది చూపిస్తాం'' అని అన్నారు.

కాల్పుల విరమణకు హమాస్ ఓకే!

జెరూసలెం: ఈజిప్టు– ఖతార్ ప్రతిపాదించిన యుద్ధ విరమణ ప్రతిపాదనను తాము ఆమోదించామని హమాస్ సోమవారం ప్రకటించింది. గాజాలో ఏడు నెలలుగా హమాస్– ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. తమ అగ్రనేత ఇస్మాయిల్ హనియే కాల్పుల విరమణకు తాము అంగీకరిస్తున్నామనే విషయాన్ని ఖతారు ప్రధాని, ఈజిప్టు ఇంటెలిజెన్స్ మినిస్టర్‌లకు తెలియజేశారని హమాస్ ఒక ప్రకటనలో తెలిపింది. పూర్తి యుద్ధ విరమణ, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి మళ్లడం లాంటివి ఈ శాంతి ప్రతిపాదనలో ఉన్నాయో, లేదోననే విషయంపై స్పష్టత లేదు. లక్ష మంది పాలస్తీనియన్లు రఫా నగరం నుంచి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ హుకుం జారీచేసిన కొద్ది గంటల్లోనే హమాస్ ప్రకటన వెలువడటం గమనార్హం. హమాస్ నుంచి ఈ ప్రకటన వెలువడగానే రఫాలోని శిబిరాల్లో తలదాచుకుంటున్న పాలస్తీనియన్లు ఆనందోత్సాహాన్ని వెలిబుచ్చారు. రఫాపై ఇజ్రాయెల్ దాడి ముప్పు తప్పినట్లేనని వారు భావిస్తున్నారు. అయితే హమాస్ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

కర్కరే మృతిపై దర్యాప్తు జరపాలి

శశిథరూర్ డిమాండ్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి హేమంత్ కర్కరే మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ నేత శశిథరూర్ డిమాండ్‌చేశారు. పాక్ ఉగ్రవాది అజ్మల్ కసబ్ షూట్ చేయడం వల్ల యాంటీ టెర్రరిజం స్క్వాడ్ చీఫ్ కర్కరే చనిపోలేదని, ఆర్‌ఆర్‌ఎస్ భావజాలమున్న ఒక పోలీస్ అధికారి బుల్లెట్ తగలడం వల్లే కర్కరే మరణించారని మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వడెట్టివార్ ఆరోపించడంతో శశిథరూర్ సోమవారం స్పందించారు. '' ఇది నిజంగా తీవ్రమైన అంశం. విజయ్ ఆరోపణల్లో నిజం ఉందని నేను అనట్లేను. కానీ దర్యాప్తు చేస్తే నిజాలు బయటికొస్తాయి. 2008 ముంబై దాడుల ఘటన రాత్రి అసలేం జరిగిందనేది యావత్ భారతానికి తెలియాలి. మాజీ పోలీస్ ఐజీ ముష్రిఫ్ రాసిన పుస్తకంలోని అంశాలనే విపక్షనేత విజయ్ ప్రస్తావించారు. కసబ్ షూట్‌చేసిన గన్‌లోని బుల్లెట్‌తో కర్కరే శరీరంలోని బుల్లెట్ సరిపోలలేదని పుస్తకంలో రాశారు. శరీరంలోని బుల్లెట్ పోలీస్ రివాల్వర్‌లో వాడేదానిలా ఉందని పేర్కొన్నారు. అందుకే కర్కరే మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి'' అని థరూర్‌డిమాండ్ చేశారు. బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్ మీదా థరూర్ ఆరోపణలు గుప్పించారు. ''నాడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు కసబ్‌కు జైలులో బిర్యానీ పెట్టారని నికమ్ చెప్పారు. అది అబద్ధమని తేలింది. ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో దిగడం చూస్తుంటే ఆనాడే ఆయన తన పక్షపాత వైఖరిని బయటపెట్టినట్లు తెలుస్తోంది. ముంబై దాడుల కేసులో మాత్రమే ఈయన ఇలా పక్షపాతంగా వ్యవహరించారా లేదంటే ఇతరకేసుల్లోనూ ఇలాగే చేశారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి'' అని అన్నారు. మరోవైపు కర్కరేపై ఆర్‌ఎస్‌ఎస్ రగిలిపోయేదని శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. మాలేగావ్ పేలుడు కేసులో ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధాలున్న సాధ్వీ ప్రజ్ఞా ఠాకూర్, కల్నల్ పురోహిత్‌లను కర్కరే పోలీస్ టీం అరెస్ట్‌చేయడంతో ఆయనపై ఆర్‌ఎస్‌ఎస్ ద్వేషం పెంచుకుందని రౌత్ అన్నారు.



ఈసారి ఉల్లంఘిస్తే జైలే: ట్రంప్‌కు కోర్టు హెచ్చరిక

న్యూయార్క్: నీలిచిత్రాల తార స్టార్మీ డేనియల్‌తో సంబంధం విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఆమెకు తన లాయర్ ద్వారా అనైతిక మార్గంలో నగదు పంపించిన(హష్ మనీ) కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ కోర్టు ఆగ్రహానికి గురయ్యారు. జడ్జీలు, సాక్షులపై వ్యాఖ్యానాలు చేయొద్దని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టొద్దన్న గ్యాగ్ ఉత్తర్వులను మళ్లీ ఉల్లంఘించినందుకు 1,000 డాలర్ల జరిమానాను న్యాయస్థానం విధించింది. మరోసారి ఉల్లంఘిస్తే జైల్లో పడేస్తామని సోమవారం జడ్జి జువాన్ ఎం.మెర్చాన్ హెచ్చరించారు. ఇప్పటికే తొమ్మిదిసార్లు ఉల్లంఘించినందుకు గత వారమే ట్రంప్‌నకు 9,000 డాలర్ల జరిమానా విధించడం విదితమే.

16 స్కూళ్లకు బాంబు బెదిరింపు

అహ్మదాబాద్: లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని 16 వరకు స్కూళ్లను బాంబులతో పేల్చేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. దీంతో, అధికార యంత్రాంగం హుటాహుటిన బాంబు డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పాటు క్రైం బ్రాంచి పోలీసు బృందాలను రంగంలోకి దించింది. పూర్తి స్థాయిలో సోదాలు చేపట్టింది. ఎక్కడా ఎటువంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు వంటివి కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సెమీ క్రయోజనిక్ ఇంజిన్ పరీక్ష సక్సెస్

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఎల్‌వీఎం3 లాంటి భారీ ప్రయోగ వాహనాల్లో పంపించే పేలోడ్ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, భవిష్యత్తు ప్రయోగ వాహనాల కోసం ఎల్‌ఓఎక్స్ కిరోసిన్ ప్రొపెల్లెంట్ కలయికతో 2000 కేఎన్ థ్రస్ట్ సెమీ క్రయోజనిక్ ఇంజిన్ రూపొందించింది. ఈనెల 2న ఈ ఇంజిన్ సామర్థ్యాన్ని పరీక్షించి విజయం సాధించామని సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ కిరోసిన్ సెమీక్రయోజనిక్ ఇంజిన్ పూర్తిస్థాయిలో రూపాంతరం చెందితే రాకెట్ ప్రయోగాల్లో ఇంధన ఖర్చును బాగా తగ్గించుకునే వీలు కల్పించినట్టవుతుంది.

బీజేపీ నేతలు నేత్ర వైద్యుడ్ని సంప్రదించాలి

కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఎద్దేవా

న్యూఢిల్లీ: సంపదను సృష్టిస్తామంటూ తాము ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొనగా బీజేపీ నేతలు దానిని సంపద పునఃపంపిణీ అంటూ రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు మళ్లీ స్కూలుకెళ్లి చదువు కోవడమో, నేత్ర వైద్యుడిని సంప్రదించడమో చేయాలని ఎద్దేవా చేశారు. ఇందులోని సంపద సృష్టి అనే మాటలను బీజేపీ నేతలు సంపద పునఃపంపిణీగా అర్థం చేసుకున్నారని ఆయన విమర్శించారు.



ఉదయం 11.15 గంటలకు: రేపల్లెలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



మధ్యాహ్నం 2 గంటలకు: మాచర్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

కూటమి కుట్రలు

ఇప్పటికే కొనసాగుతున్న పథకాలనూ అడ్డుకుంటారా? ● ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఆపేస్తారా?

అక్కచెల్లెమ్మల ఖాతాలకు పోవాల్సిన డబ్బులను దిక్కుమాలిన చంద్రబాబు ఆపుతున్నాడు

ఇష్టానుసారంగా అధికారులను మారుస్తున్నారు.. ఎన్నికలు బాగా జరుగుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది

● రేపల్లె, మాచర్ల, మచిలీపట్నం ఎన్నికల సభల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట/ సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్నికల కమిషన్ మీద తీవ్ర ఒత్తిళ్లు తెచ్చి ఇప్పటికే అమలవుతున్న పథకాలను (ఆన్ గోయింగ్) సైతం అడ్డుకుంటూ పేదలు, రైతులు, మహిళలు, అవ్వాతాతల పట్ల పట్ల చంద్రబాబు రాక్షసంగా ప్రవరిస్తున్నారని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలోనే ప్రవేశపెట్టి కొనసాగుతున్న పథకాలకు సంబంధించి బటన్లు నొక్కినా కూడా అక్కచెల్లెమ్మల ఖాతాలకు డబ్బులు జమ కాకుండా కావాలని ఆపుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు అందాల్సిన మంచికి అడ్డుపడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ''ఇన్ని కుట్రలు పన్నుతున్నారు. ఇష్టానుసారంగా అధికారులను మారుస్తున్నారు. ఎన్నికలు బాగా జరుగుతాయనే నమ్మకం సన్నగిల్లుతోంది. కేవలం పేదలకు మంచి చేసే మీ జగన్ ఉండకూడదనే ఇవన్నీ చేస్తున్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత అన్నది చాలా అవసరం. అలాంటి వారికే ఓటు వేస్తామని గట్టి సందేశం ఇవ్వాలి. మనం ఓటు వేస్తే ఢిల్లీ దాకా ఆ మెసేజ్ వినిపించాలి''అని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కిరాణా దుకాణాల్లో గంజాయి అమ్ముతున్నారంటూ చంద్రబాబు, దత్తపుత్రుడు సంస్కార హీనంగా, పరమ దుర్మార్గంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దుష్ప్రచారాలతో రాష్ట్రం పరువు ఏమవుతుందనే కనీస ఇంగిత జ్ఞానం లేకుండా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా కిరాణా షాపులు నడుపుకొంటున్న అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలు గంజాయి విక్రయిస్తున్నారంటూ వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుకు ఓటు అనే అస్త్రంతో గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పైనా దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ వివాదాలు పెరిగిపోయి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ఎలాంటి వివాదం లేదని ప్రభుత్వమే గ్యారెంటీ ఇస్తూ టైటిల్ ఇన్సూరెన్స్‌తో సంస్కరణ తేవాలన్నది మీ బిడ్డ ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి అయిన 6 వేల రెవెన్యూ గ్రామాల్లో ఏ ఒక్క రైతు అయినా తన భూమి లాక్కున్నట్లు చెప్పారా? అని చంద్రబాబు, ఎల్లో మీడియాను నిలదీశారు. చంద్రబాబును నమ్మడం అంటే మరోసారి మోసపోవడం, కొండ చిలువ నోట్లో తలకాయ పెట్టడమేనని ప్రజలను హెచ్చరించారు. ఇది చరిత్ర చెబుతున్న సత్యమన్నారు. సోమవారం ఉదయం బాపట్ల జిల్లా రేపల్లెలో, మధ్యాహ్నం పల్నాడు జిల్లా మాచర్లలో, సాయంత్రం మచిలీపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. మూడు సభల్లో సీఎం ఏమన్నారంటే...

అవ్వాతాతల పెన్షన్ అడ్డుకున్నదీ బాబే

అవ్వాతాతలకు మొన్నటిదాకా ఇంటికే వచ్చిన పెన్షన్‌ను అడ్డుకున్నది ఎవరు? తన మనిషి నిమ్మగడ్డ రమేష్ ద్వారా సాక్షాత్తూ చంద్రబాబు నాయుడే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయించాడు. వలంటీర్లు ఇంటికి రాకూడదంటూ అప్పటి వరకూ ఇంటికే అందుతున్న పెన్షన్‌ను అడ్డుకున్నాడు. అంతేకాకుండా అవ్వాతాతలకు ఇచ్చే పెన్షన్‌ను బ్యాంక్ అకౌంట్లలో వేయాలని ఎన్నికల కమిషన్‌తో ఉత్తర్వులు ఇప్పించాడు. అవ్వా తాతలు చంద్రబాబును తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతుంటే ఆ నెపాన్ని మీ బిడ్డ జగన్‌పై వేస్తున్నాడు.



మచిలీపట్నం సభలో మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

భూమి లాక్కున్నట్లు ఒక్క రైతయినా చెప్పాడా?

చంద్రబాబు, ఎల్లో మీడియాకు బందరు సభలో సీఎం జగన్ సూటి ప్రశ్న

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి అయిన 6 వేల రెవెన్యూ గ్రామాల్లో ఏ ఒక్క రైతు అయినా తన భూమి లాక్కున్నారని చెప్పారా? అని సూటిగా ప్రశ్నించారు. సర్వే చేసి రికార్డులన్నీ అప్‌డేట్ చేస్తున్నామని, రైతన్నలకు భూ హక్కు పత్రాలను పదిలంగా అందిస్తున్నామని గుర్తు చేశారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఎవరి భూములపై వారికి సంపూర్ణ హక్కులు కల్పించటమే ఈ యాక్ట్ ఉద్దేశమని స్పష్టం చేశారు. భూ వివాదాలు పెరిగి కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. సంబంధిత భూమిపై ఎలాంటి వివాదం లేదని ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ సంస్కరణ తేవాలన్నది మీ బిడ్డ ప్రభుత్వం ఆలోచన అని వెల్లడించారు. సోమవారం మచిలీపట్నంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సీఎం జగన్ మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై పూర్తి స్పష్టతనిచ్చారు. ఈ యాక్ట్ చాలా గొప్పదని స్వయంగా టీడీపీ నేత పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో చెప్పాడని, బిల్లుకు టీడీపీ సైతం సభలో మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్నికలు రావడంతో చంద్రబాబు నాలుక మడతేసి మంచి సంస్కరణను ఆపేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై ఇంకా ఏమన్నారంటే..

వివాదాలు లేకుండా సంపూర్ణ హక్కులే లక్ష్యం..

ఈమధ్య కాలంలో బాబు బృందం ఇంకో దుష్ప్రచారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద. ప్రతి ఒక్కరికీ ఫోన్లు చేసి అబద్ధాలు చెబుతున్నారు. అసలు ల్యాండ్ టైటిలింగ్ అనేది ఏమిటో మీలో ఎవడికైనా తెలుసా? అని ఈ దుష్ప్రచారం చేసేవాళ్లను అడుగుతున్నా. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటే.. వారి భూముల మీద సంపూర్ణ హక్కులు రైతులకు, భూ యజమానులకు ఎల్లవేళలా ఉండేలా చట్టం చేయడమని ఈ మూర్ఖులకు తెలియజేస్తున్నా. ఈ రోజుల్లో ఎక్కడ భూమి కొనాలన్నా కూడా ఏదో ఒక వివాదాలు కనిపిస్తుంటాయి. భూములు అమ్మాలనుకునేవారికి, కొనాలనుకునేవారికి తెలియని భయం ఉంటుంది. కాగితం మీద ఉన్న భూమి కంటే ఎక్కువ, తక్కువగా ఉండటం, సబ్ డివిజన్ జరక్కపోవడం, రికార్డులన్నీ అప్‌డేట్ కాకపోవడం, మ్యుటేషన్ జరగకపోవడం.. ఇలాంటి వాటి కారణంగా భూ వివాదాలు పెరిగి అమ్ముకునే వారికి, కొనుక్కునే వారికి మనశ్శాంతి లేకుండా అధికారుల చుట్టూ, కోర్టుల చుట్టూ దశాబ్దాలుగా తిరుగుతున్నారు. మీ బిడ్డ తీసుకొచ్చిన సంస్కరణ వల్ల ఇటువంటి వివాదాలకు తావు వుండదు. ప్రతి ఒక్కరికీ వాళ్ల భూముల మీద సంపూర్ణ హక్కులు ఉండాలి, ఆ హక్కులకు గ్యారెంటీ ఇస్తూ గవర్నమెంట్ వాళ్లకు తోడుగా ఉండేలా చేయడమే ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు అర్థం. రైతులు, భూ యజమానులు కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఆ భూముల మీద యజమానులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ, ఎలాంటి వివాదం లేదని గ్యారెంటీ ఇచ్చే ఒక సంస్కరణే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్. ఇదొక్కటే కాదు.. రేపు వివాదం తలెత్తితే టైటిల్ ఇన్సూరెన్స్ ద్వారా ఆ భూ యజమానులకు కాంపన్‌సేషన్ ఇచ్చే విధంగా కూడా చేస్తున్నాం.

లాక్కున్నారని ఒక్కరైనా చెప్పారా?

భూమికి సంబంధించిన మ్యాప్‌తో కూడిన భూ హక్కు పత్రాలను కూడా రైతన్నలకు పదిలంగా అందించే కార్యక్రమం చేస్తున్నాడు మీ జగన్. మరి ఇంత మంచి కార్యక్రమం చేస్తుంటే సమర్థించాల్సింది పోయి ఎంత దుష్ప్రచారం చేస్తున్నారో గమనించాలని కోరుతున్నా. రాష్ట్రవ్యాప్తంగా సర్వే పూర్తి అయిన 6 వేల రెవెన్యూ గ్రామాల్లో ఏ ఒక్క రైతు అయినా తన భూమి లాక్కున్నారని చెప్పారా? అని చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5ను అడుగుతున్నా. ఒక మంచి సంస్కరణను ఆపడానికి వీరంతా ప్రయత్నం చేస్తున్నారు.

నాడు టీడీపీ, ఈటీవీ ప్రశంసలు..

నిజంగా వీళ్ల మాటల్లో ఎంత డొల్లతనం ఉందంటే.. ఇదే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఎంతో మంచిదంటూ శాసనసభలో చర్చ సందర్భంగా టీడీపీకి చెందిన పయ్యావుల కేశవ్ ఎంత పొగిడాడో అసెంబ్లీ రికార్డులు చూసుకోండి. చివరకు దుష్ప్రచారం చేస్తున్న ఇదే ఈటీవీలో నాలుగు నెలల క్రితం ఇది మంచి యాక్ట్, రైతన్నలకు మంచి జరుగుతుందని ప్రచారం చేశారు. ఇవాళ ఎన్నికలు రాగానే యూట్యూబ్ నుంచి వాళ్లు ప్రసారం చేసిన ఆ కథనాన్ని తొలగించి అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నారు. రాజకీయాలు ఏ స్థాయికి దిగజారిపోయాయో మీరే చూడండి.

కబ్జాకోరు రామోజీ



కర్నూలు సమీపంలో ఈనాడు ఎడిషన్ కేంద్రాన్ని ఆనుకుని రామోజీరావు కబ్జా చేసిన స్థలం

కర్నూలులో అత్యంత విలువైన మసీదు భూమి ఆక్రమణ

రాష్ట్ర వ్యాప్తంగా ఇలా ఎన్నో భూములు కబ్జా



రోజూ ఉషోదయం నుంచే గురివింద నీతులు చెప్పే ఓ రామోజీ.. దీనికి మీరేం సమాధానం చెబుతారు? వక్ఫ్ బోర్డు ఆస్తుల గురించి, ఆ చట్టం గురించి నీకు తెలీదా? లేక ఈ చట్టం చంద్రబాబు చుట్టం అనుకున్నావా? నాకు వర్తించదనే గర్వమా? ఒక మత సంస్థ భూమిని ఇంత దౌర్జన్యంగా, నిస్సిగ్గుగా లాక్కొన్నదే కాకుండా.. దౌర్జన్యం చేయడం, బెదిరించడం, పోలీసులను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు పెడతామని హెచ్చరించడం.. ఇవన్నీ మీ చంద్రబాబును చూసుకునే కదా! ఈనాడును అడ్డుపెట్టుకుని ఏమైనా చేయొచ్చు అనుకుంటున్నావా? అవునులే.. ఫిల్మ్ సిటీ భూములే కొట్టేశాను.. ఇవెంత అనుకున్నావేమో.. ఇలాంటి బాగోతాలు ప్రతి జిల్లాలోనూ లెక్కలేనన్ని ఉంటే ఇదొక్కటేగా బయటపడింది అనుకోవచ్చు.. తీగ లాగితే డొంక కదులుతుందన్న సామెతను ఓసారి గుర్తు చేసుకోండి.

కర్నూలు నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: కర్నూలు నగర సమీపంలో అత్యంత విలువ చేసే వక్ఫ్ బోర్డు (మసీదుకు చెందిన) భూమిని ఈనాడు రామోజీరావు అక్రమంగా చేజిక్కించుకున్నారు. తనకున్న పలుకుబడి, పత్రికను అడ్డం పెట్టుకుని అడ్డదారిలో వెళ్లి విలువైన భూమిలో పాగా వేశారు. వక్ఫ్ బోర్డు నోటీసులు, కోర్టులను లెక్క చేయక తను చెప్పిందే వేదమంటూ ఏకంగా ఆ భూమి తనదేనంటూ బోర్డు కూడా పెట్టారు. కర్నూలు–హైదరాబాద్ రహదారిలో సంతోష్‌నగర్ దాటిన తర్వాత ఈనాడు జిల్లా ఎడిషన్ (ఎడిటోరియల్ విభాగం + ప్రింటింగ్) ఏర్పాటు చేసిన చోటుకు పక్కనే వక్ఫ్ భూమి ఉంది. రామోజీ తన కుమారుడు, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎండీ సీహెచ్ కిరణ్ ద్వారా పావులు కదిపి.. ఈ కంపెనీ పేరుతో ఆ భూమిని కొనుగోలు చేసినట్లు మత పెద్ద ఒకరిని లోబరుచుకుని రికార్డులు సృష్టించారు. వక్ఫ్ భూములను కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమని అందరికీ గురివింద నీతులు చెప్పే రామోజీ రావు ఇలా అక్రమ మార్గంలో ఈ భూమిని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ భూమిని కాపాడుకునే విషయమై వక్ఫ్ అధికారులు పలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ రామోజీ పలుకుబడి ముందు అవి సరిపోలేదు.

కన్ను పడింది.. కబ్జా చేశాడు..

కర్నూలు నగర శివారులోని మునగాలపాడు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 80లో 4.68 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో, 1963 అక్టోబరు 24వ తేదీన ముద్రించిన వక్ఫ్ గెజిట్‌లో ఈ భూమి గ్రామ జామియా మసీదుకు చెందిన భూమి అని స్పష్టంగా నమోదై ఉంది. అంటే మసీదుకు చెందిన ఇనాం భూమి. కశ్మీర్ – కన్యాకుమారి 44వ నంబర్ జాతీయ రహదారి (గతంలో ఎన్‌హెచ్–7)ని ఆనుకుని ఉంది. ఈ 4.68 ఎకరాల్లో ఈనాడు గ్రూపునకు చెందిన ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ సంస్థ 2.78 ఎకరాలను 1995 డిసెంబర్ 15న అప్పటి ముతవల్లి మజీద్ హుసేన్‌ను మభ్యపెట్టి, భయపెట్టి అక్రమంగా రిజిస్టర్ చేయించుకుంది. అప్పట్లో ఈ స్థలంలో తన పత్రిక కార్యాలయం భవన నిర్మాణానికి ప్రయత్నించగా, వివాదం చెలరేగి, స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో వక్ఫ్ భూమి పక్కనే ఉన్న మరో ప్రైవేటు స్థలంలో ఈనాడు కార్యాలయాన్ని నిర్మించుకున్నారు. కానీ ఈ భూమిపై కన్ను పడటంతో ఆ తర్వాత తప్పుడు మార్గంలో చేజిక్కించుకుని అక్రమంగా తన ఆధీనంలోనే ఉంచుకున్నారు.

ఎండీ కిరణ్ పేరుతో నోటీసులు

మసీదులు, దర్గాల నిర్వహణ కోసం గతంలో పూరీకులు వక్ఫ్‌కు భూములు, స్థలాలు బోర్డుకు స్వాధీన పరుస్తారు. వీటిని ముతవల్లులు నిర్వహించి, వాటి ద్వారా వచ్చే సొమ్ముతో మసీదు నిర్వహణ ఖర్చులు పోనూ మిగిలిన సొమ్ములో కొంత బోర్డుకు కౌలు (గుత్త) రూపంలో చెల్లించాలి. ఇలాంటి భూమిని రామోజీ అక్రమంగా పొందారని గుర్తించిన వక్ఫ్ బోర్డు.. ఆ భూమిని తమకు స్వాధీన పరచాలని ఈనాడు సంస్థ, ఉషోదయ పబ్లికేషన్స్ ఎండీ కిరణ్ పేరుతో వక్ఫ్ అధికారులు పలుసార్లు నోటీసులు జారీ చేశారు. వాటన్నింటికీ రామోజీ, ఆయన తనయుడు ఇసుమంతైనా స్పందించలేదు.

ముతవల్లిని అరెస్టు చేయించిన ఈనాడు

జామియా మసీదుకు చెందిన సర్వే నంబర్ 80లోని మొత్తం 4.68 ఎకరాల ఇనాం భూమిలో ఈనాడు – ఉషోదయ సంస్థ 2.78 ఎకరాలను అప్పటి ముతవల్లి మజీద్ హుసేన్ నుంచి అక్రమంగా పొందడంతో మిగిలిన 1.90 ఎకరాల భూమిని సాగు చేసుకొని మసీదు బాగోగులు, నిర్వహణ కోసం ఉపయోగించుకుందామని ప్రస్తుత ముతవల్లి షేక్షావలి ఆ భూమిలోకి వెళ్లారు. ఈనాడు యాజమాన్యం తమ సంస్థ ప్రతినిధుల ద్వారా ముతవల్లి షేక్షావలిని తీవ్రంగా బెదిరించింది. ఆ భూమి అంశం కోర్టులో ఉందని, తమ భూమిలో అక్రమంగా ప్రవేశించారంటూ పోలీసులతో అరెస్టు చేయించింది. దీంతో వక్ఫ్ బోర్డు అధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలన్నీ వివరించడంతో పోలీసులు ఆయన్ను వదిలేశారు.

వక్ఫ్ చట్టం గురించి తెలీదా రారా..

వక్ఫ్ ఆస్తులు ఎప్పటికీ వక్ఫ్ బోర్డుకు చెందినవే అని గతంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. అవి మసీదులు, ఆ మత సంస్థలకే చెందాలని ఉత్తర్వుల్లో వెల్లడించింది. వక్ఫ్ ఆక్ట్ 52ఏ సవరణ (2013 నవంబరు 1వ తేదీ) ప్రకారం వక్ఫ్ బోర్డు భూములు కొనుగోలు చేసిన, అమ్మిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలి. ఇంత కఠినంగా చట్టాలున్నా, ఈనాడు రామోజీరావు (రారా) చంద్రబాబు ద్వారా వాటిని తన చుట్టాలుగా మార్చుకొని అనుభవిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోనే అత్యధిక వక్ఫ్ ఆస్తులు కర్నూలు జిల్లాలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,104 సంస్థలు వక్ఫ్ బోర్డు పరిధిలో ఉండగా, 741 సంస్థలు ఆస్తులు కలిగి ఉన్నాయి. వీటి పేర్లతో 22,599.89 ఎకరాల భూమి గెజిట్‌లో నమోదైంది. మరో 10 వేల ఎకరాలు గెజిట్‌లో నమోదు కాని భూములున్నాయి. ప్రస్తుతం రామోజీ రావు ఆక్రమించిన భూమి గెజిట్‌లో నమోదైనది కావడం గమనార్హం.

నిస్సిగ్గుగా బోర్డు..



రామోజీరావు ఆక్రమించిన భూమిలో రెండు బోర్డులు ఏర్పాటు చేశాడు. అందులో ''దిస్ ప్రాపర్టీ బిలాంగ్స్ టు ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్.. యాజ్ ఫర్ ది జడ్జిమెంట్ డేటెడ్ 22-04-2008 ఆఫ్ ఏపీ వక్ఫ్ ట్రిబ్యూనల్.. ట్రెస్‌పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్'' అని రాశాడు. దీన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటారట! అతిక్రమించింది ఎవరు రామోజీ? నువ్వు, నీ కుమారుడు కాదా? వక్ఫ్ చట్టాన్ని అతిక్రమించి కబ్జా చేసిందే మీరు. ఈ బోర్డు చూస్తుంటే దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్లుంది. మిమ్మల్ని చూసే ఈ నానుడి పుట్టుకొచ్చింది కాబోలు. ఆ జడ్జిమెంట్‌లో ఏముందో మీకు తెలియకపోతే ఇంగ్లిష్ తెలిసిన వాళ్లెవరితో అయినా చదివించుకోండి. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 54 ప్రకారం కాకుండా పూర్తి స్థాయి చర్యలకు 'వక్ఫ్ యాక్ట్ సెక్షన్లు 51, 52 కింద నోటీసులిచ్చే అధికారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓకు సంపూర్ణంగా ఉందని స్పష్టంగా చెప్పింది. ఆ తీర్పు మేరకే ఆ తర్వాత మీకు సెక్షన్ 51 కింద నోటీసులివ్వడం నిజం కాదా? ఆ భూమి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని 2019లో కర్నూలు జిల్లా కలెక్టర్ నోటీసులు ఇవ్వడం వాస్తవం కాదా? ఆ ఆదేశాలు అమలు కాకుండా మీరు బెదిరించలేదా? ఇన్ని వాస్తవాల మధ్య ఆ భూమి తమదని బోర్డు పెట్టుకోవడానికి కొంచెం అయినా సిగ్గుండాలి.

సమగ్ర విచారణలో బండారం బట్టబయలు

కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ తిరుపతి సాయి మండల సర్వేయర్‌తో కలిసి సమగ్ర విచారణ జరిపారు. 2019 ఆగస్టు 20వ తేదీన కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. సర్వే నంబర్ 80లోని 4.68 ఎకరాలు ఆర్.ఎస్.ఆర్, ఆర్.ఓ.ఆర్ రికార్డ్స్, ఆన్ లైన్ అడంగల్ ప్రకారం అది మసీదు ఇనామ్‌కు చెందిన భూమి అని స్పష్టం చేశారు. అదే సర్వే నంబర్‌లోని 2.78 ఎకరాల భూమిని 1995 డిసెంబరు 15 తేదీన ఈనాడు పేపర్‌కు చెందిన ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసిందని నివేదిక ఇచ్చారు. ఈ నివేదిక, ఇతరత్రా పరిశీలన అనంతరం 2019 అక్టోబర్ 14వ తేదీన అప్పటి జిల్లా కలెక్టర్ జి.వీరపాండియన్ ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.



సర్వే నంబర్ 80లోని 4.68 ఎకరాలు ఆర్.ఎస్.ఆర్, ఆర్.ఓ.ఆర్ రికార్డ్స్, ఆన్ లైన్ అడంగల్ ప్రకారం మసీదు ఇనామ్‌కు చెందిన భూమి అని నిర్ధారిస్తూ తహసీల్దార్ ఇచ్చిన నివేదిక


చర్యలు తీసుకోకుండా ఒత్తిడి



ఉషోదయ ఎంటర్ ప్రైజెస్ పేరుతో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కర్నూలు రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశిస్తూ జిల్లా కలెక్టర్ రాసిన లేఖ

రామోజీరావు చెరలో అక్రమంగా ఉన్న వక్ఫ్ భూములను రక్షించాలని కోరుతూ అప్పట్లో స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించారు. దీంతో రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధికారులు చర్యలు సిద్ధమయ్యారు. అక్రమంగా పొందిన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకునే ముందు వక్ఫ్ యాక్ట్ 51, 52 సెక్షన్ల కింద బోర్డు నోటీసులు జారీ చేయాల్సి ఉంది. అయితే బెదిరింపులు, ఒత్తిళ్ల కారణంగా అధికారులు వక్ఫ్ యాక్ట్ సెక్షన్ 54 కింద ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్‌కు 1999 జూన్ 7న నోటీసులు జారీ చేశారు. ఈ సెక్షన్ నిందితులు అని నిర్ధారించాకే చర్య తీసుకోవడానికి వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిడి తేవడంతోనే అధికారులు ఈ తిరకాసు సెక్షన్ కింద నోటీసులు జారీ చేశారని తెలుస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న రామోజీ రావు వక్ఫ్ బోర్డు నోటీసులను సవాలు చేస్తూ ఏపీ వక్ఫ్ ట్రిబ్యూనల్‌లో కేసు వేశారు. సుదీర్ఘంగా ఎనిమిదేళ్ల పాటు విచారణ సాగింది. 2008 ఏప్రిల్ 22న తీర్పు వెల్లడైంది. గెజిట్ నోటిఫికేషన్‌తో పాటు సర్వే కమిషనర్ రిపోర్టు ఆధారంగా సర్వే నంబర్ 80లో ఉన్న భూమి వక్ఫ్ భూమిగా నిర్ధారించింది. అధికారుల తప్పిదాన్ని ఎత్తిచూపి, వక్ఫ్ బోర్డు జారీ చేసిన నోటిసుల సెక్షన్లు సరైనవి కావని కూడా తప్పు పట్టింది. పూర్తి స్థాయి చర్యలకు 'వక్ఫ్ యాక్ట్ సెక్షన్లు 51, 52 కింద నోటీసులిచ్చే అధికారం రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓకు సంపూర్ణంగా ఉందని తీర్పునిచ్చిందని అధికారులు చెబుతున్నారు. వక్ఫ్ యాక్ట్ సెక్షన్ 54 కింద నోటిసులు జారీ చేసి, భూమిని స్వాధీనం చేసుకోడానికి చట్టం ఒప్పుకోదని.. సరైన మార్గంలో చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పింది. ఈ తీర్పు వెలువడిన మూడేళ్ల తర్వాత 2011 సెప్టెంబరు 20వ తేదీన ట్రిబ్యూనల్ సూచించిన సెక్షన్ 51 కింద బోర్డు సీఈఓ నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత జిల్లా వక్ఫ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు లేఖలు రాశారు. ఈ భూమి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని 2019లో కర్నూలు జిల్లా కలెక్టర్ నోటీసులు ఇచ్చారు. రామోజీ తన పలుకుబడితో రిజిస్ట్రేషన్ అధికారులను భయపెట్టి, ఆ నోటీసులు అమలు కాకుండా చూసుకున్నారు. దీంతో ఇప్పటికీ ఆ భూమి ఈనాడు చెరలోనే ఉండిపోయింది.

అది వంద శాతం వక్ఫ్ బోర్డు భూమే



ఈనాడు సంస్థ ఆధీనంతో ఉన్న సర్వే నంబర్ 80లోని 4.68 ఎకరాల భూమి పక్కాగా వంద శాతం వక్ఫ్ బోర్డు భూమే. వక్ఫ్ గెజిట్‌లో కూడా స్పష్టంగా ఉంది. ఆ భూమి మసీదుకే దక్కాలని నేను పని చేసిన కాలంలో పలుసార్లు నోటీసులు జారీ అయ్యాయి. అయినా స్పందించ లేదు. రాష్ట్ర బోర్డు అధికారులకు చెప్పాం. వాళ్లు పలుమార్లు నోటీసులు ఇచ్చారు. వాటిని వాళ్లు ఖాతరు చేయలేదు.


–నూర్ మహమ్మద్, వక్ఫ్ బోర్డు రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్

పొలం వద్దకు వెళ్తే అరెస్టు చేయించారు

ఈనాడు సంస్థ తమ ఆధీనంలో పెట్టుకున్న భూమి పక్కాగా మా గ్రామ మసీదుకు చెందినదే. దీనిని కాపాడుకునేందుకు మా గ్రామస్తులు, పెద్దలతో కలిసి ఎన్నో ప్రయత్నాలు చేశాను. ఆ భూమి మసీదుకు చెందినదని బోర్డులు పెట్టబోయాము. అది మా భూమి అని ఈనాడు బోర్డు పెట్టింది. ఆ భూమి వద్దకు వెళ్లిన నన్ను పోలీసులతో అరెస్టు చేయించారు.

– షేక్షావలి, జామియా మసీదు ముతవల్లి, మునగాలపాడు, కర్నూలు మండలం

మసీదు భూమిని అన్యాయంగా లాక్కున్నారు



మునగాలపడు గ్రామానికి చెందిన జామియా మసీదుకు చెందిన 4.68 ఎకరాల భూమిని గతంలో ముతవల్లి నుంచి ఈనాడు వాళ్లు అక్రమంగా పొందారు. చేసిన తప్పులను ఎత్తిచూపాల్సిన పత్రిక యజమానులే ఇలా అన్యాయానికి పాల్పడ్డారు. దీనిపై గతంలో మా సంఘం ఆందోళన చేసినా ఎవరూ పట్టించుకోలేదు. చాలా మంది కలెక్టర్లకు విన్నపాలు చేశాం. ఇప్పుడు ఆ భూమి విలువ రూ.25 కోట్లకు పైగా ఉంటుంది.

– సయ్యద్ రోషన్ అలీ, రిటైర్డు తహసీల్దార్, ఏపీ ముస్లిం కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు

క్లుప్తంగా...

పంట నష్ట పరిహారం నిధులు విడుదల

రూ. 15 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. గత మార్చి 16 నుంచి 21 మధ్య కాలంలో పది జిల్లాల్లో భారీ వర్షాలు, వడగండ్ల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు నష్ట పరిహారాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రూ. 15.81 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపింది. ఇన్‌పుట్ సబ్సిడీని ఆధార్‌తో అనుసంధానం చేసిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. 90 రోజుల వ్యవధిలో చెల్లింపులు పూర్తి చేస్తారు. ప్రతి రైతు ఒక వ్యవసాయ సీజన్‌లో ఒక విపత్తుకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ లభించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జిల్లాల వారీగా పంపిణీ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని వ్యవసాయ కమిషనర్‌ను ఆదేశించింది.

హత్యాయత్నాన్ని ఖండించిన వైద్య సంఘాలు

సాక్షి, హైదరాబాద్: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందిని రోగి బంధువులు గదిలో బంధించి వారిపై పెట్రోల్ పోసి హత్యాప్రయత్నం చేయడంపై వైద్యులు, వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా ఆసుపత్రిలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన రోగి బంధువులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనల వల్ల వైద్యులు, సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసింది. కోరుట్ల ఘటనను హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ నర్సుల అసోసియేషన్ (టీఎన్‌ఏ) తీవ్రంగా ఖండించాయి. వైద్యులు ఎప్పుడూ రోగి ప్రాణాలను కాపాడటానికే ప్రయత్నిస్తారని అటువంటి వైద్యులపై దాడులు చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-జూడా) డిమాండ్ చేసింది.

వడదెబ్బకు ముగ్గురు మృతి

శంకరపట్నం, రామన్నపేట: వడదెబ్బకు గురై సోమవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నానికి చెందిన పంజాల భారతి(56), తాడికల్ గ్రామానికి చెందిన చామంతుల మల్లయ్య(80), యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన పున్న కామేశ్వరమ్మ(70) మృతి చెందారు.

యాసంగి ధాన్యం సేకరణ అంతంతే!

కొనుగోళ్లు మొదలై నెల దాటినా సేకరించింది 22 లక్షల మెట్రిక్ టన్నులే

- లక్ష్యం 75 ఎల్ఎంటీ.. కానీ 40 ఎల్ఎంటీ కూడా కష్టమే: అధికారులు
- ప్రైవేటు వ్యాపారులు నేరుగా రైతుల నుంచి ధాన్యం కొంటుండటం వల్లే..!



సాక్షి, హైదరాబాద్: ఒకవైపు మండుతున్న ఎండలు... మరోవైపు అకాల వర్షాల నడుమ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. నెల క్రితమే ధాన్యం సేకరణ మొదలైనప్పటికీ ఇప్పటివరకు 22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. గతేడాది కొనుగోళ్లతో పోలిస్తే ఇది ఎక్కువే అయినప్పటికీ గత సంవత్సరంకన్నా ముందే ఈసారి కోతలు జరగడంతో ధాన్యం సేకరణ మందగించింది. ఇప్పటికే ఉమ్మడి నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు వచ్చింది. కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లోనూ 60 శాతానికిపైగా ధాన్యం సేకరణ పూర్తయింది. మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా మొదలయ్యాయి. రంగారెడ్డి, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో తక్కువ విస్తీర్ణంలో వరిసాగు చేయడంతో ఇక్కడ కొనుగోళ్లు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పౌరసరఫరాల శాఖ అంచనా వేసినట్లు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం లేదు. నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం కూడా మార్కెట్‌కు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

4,804 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

రాష్ట్రంలో హైదరాబాద్ మినహా వ్యవసాయం సాగే 32 జిల్లాల్లో సాగైన వరి పంట ఆధారంగా యాసంగిలో రైతుల నుంచి ధాన్యం సేకరణ 75.40 మెట్రిక్ టన్నులు ఉండొచ్చని పౌరసరఫరాల శాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా 7,210 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటిలో 7,154 కేంద్రాలను రాష్ట్రంలో తెరిచినప్పటికీ వాటిలో 4,804 కేంద్రాల్లోనే ప్రస్తుతం కొనుగోళ్లు సాగుతున్నాయి. వాటి ద్వారా ఇప్పటివరకు 22.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 3.51 లక్షల రైతుల నుంచి పౌరసరఫరాల సంస్థ సేకరించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం రైస్‌మిల్లులకు పంపించింది. అత్యధికంగా నిజామాబాద్, కామారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ధాన్యం సేకరణ జరిగింది. ఆ తరువాత కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ ఇప్పటికే చాలా వరకు ధాన్యాన్ని సేకరించారు. ఈ జిల్లాల నుంచి ఇక తక్కువ ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది.

ధాన్యం విలువ రూ. 4,875 కోట్లు

రాష్ట్రంలో ఇప్పటివరకు పౌరసరఫరాల సంస్థ సేకరించిన ధాన్యం విలువ రూ. 4,875.91 కోట్లు. అందులో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 3,085.62 కోట్లు చేరాయి. మరో రూ. 1,790.29 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే ఈ మొత్తాన్ని రైతులు విక్రయించిన ధాన్యం వివరాలు ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్)లోకి చేరిన వెంటనే ఖాతాల్లో వేయనున్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు తెలిపారు.

తనిఖీల భయంతో మిల్లర్ల కొనుగోళ్లు..

మార్చి మూడో వారంలోనే ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో వరి కోతలు మొదలవడంతో సన్న ధాన్యం కోసం వ్యాపారులు ఆ జిల్లాల్లోని రైతుల వద్దకు వచ్చి పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేశారు. దీంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలనుకున్న ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం మార్చి 25 నుంచే ప్రారంభించింది. పౌరసరఫరాల సంస్థకు చెందిన ధాన్యాన్ని గతంలో అక్రమంగా విక్రయించిన మిల్లర్లు... నిల్వల తనిఖీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వస్తుండటంతో రైతుల నుంచి అయినకాడికి కొనుగోలు చేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురావడంలేదు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయగా 40 లక్షల మెట్రిక్ టన్నులు కూడా వచ్చే అవకాశం లేదని అధికారులే అంటున్నారు.

3 రోజులు తేలికపాటి వానలు!

▶ మొదటి పేజీ తరువాయి

దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో మంగళ, బుధ, గురు వారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో) కూడిన తేలిక పాటి వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా.. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్ద పల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జన గామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మోస్తరు వానలు పడతాయని పేర్కొంది. వానలకు సంబంధించి ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలర్ట్ ఇచ్చింది.

జల్లులు పడినా ఎండల మంటలే..



రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి. దానితో ఆదివారం రాత్రి వాతావరణం కాస్త చల్లబడింది. అయినా సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదయ్యాయి. జగిత్యాల జిల్లా గుల్లకోట, అల్లిపూర్‌లో 46.8 డిగ్రీలు, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 23 ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైనే నమోదైంది. వచ్చే మూడు రోజులు కూడా గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగానే నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ..

నిజామాబాద్	44.5
మెదక్	44.0
ఆదిలాబాద్	43.8
ఖమ్మం	43.5
రామగుండం	43.4
మహబూబ్‌నగర్	43.1
హనుమకొండ	43.0
భద్రాచలం	42.6
హైదరాబాద్	41.9
హకీంపేట్	41.9
దుండిగల్	41.8
నల్లగొండ	41.0

హాస్టళ్లలో వసతులపై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- పాఠశాలల్లోని పరిస్థితిపై కూడా..




సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలు, వసతి గృహాల్లో మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక వసతుల స్థితిగతులపై సమగ్ర నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. జూన్ 10 వరకు సమయం ఇస్తున్నామని స్పష్టం చేస్తూ, విచారణను వాయిదా వేసింది. ప్రభుత్వ హాస్టళ్లలో బాలల హక్కుల పరిరక్షణ కోసం జాతీయ కమిషన్–2018 నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు సౌకర్యాలు అందించడం లేదని, 10 మందికి ఓ బాత్రూమ్, ఏడుగురికి ఓ మరుగుదొడ్డి, 50 మందికో వార్డెన్ ఉండాలని చెబుతున్నా.. ఆ మేరకు సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కీర్తినేడి అఖిల్ శ్రీ గురుతేజ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. విద్యాహక్కు, బాలల హక్కుల వంటి పలు చట్టాలతో పాటు రాజ్యాంగ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

సెలవుల్లోగా వసతులు కల్పిస్తారన్న ఏఏజీ

ఇన్ని రోజులూ విద్యార్థులు హాస్టళ్లలో ఉండటంతో నిర్మాణాలు చేపట్టడానికి ఇబ్బందులు ఉండేవని ఏఏజీ వాదించారు. ఇప్పుడు సెలవులు రావడంతో విద్యార్థులు హాస్టళ్ల నుంచి వెళ్లిపోయారని.. వేసవి సెలవులు జూన్ 11న ముగియనున్నాయని చెప్పారు. ఈ సెలవుల కాలంలో పాఠశాలలు, హాస్టళ్లలో వసతులు కల్పిస్తామని తెలియజేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణను జూన్ 10కి వాయిదా వేసింది.

పిటిషనర్లను భూమి నుంచి వెళ్లగొట్టొద్దు

- ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణలో ఎన్‌హెచ్‌ఏఐకి హైకోర్టు ఆదేశం
- ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్(ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగం నిర్మాణంలో భూమి కోల్పోతున్న పిటిషనర్లను తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు భూమి నుంచి వెళ్లగొట్టొద్దని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)ను హైకోర్టు ఆదేశించింది. అయితే ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని స్పష్టం చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూన్ 14కు వాయిదా వేసింది. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంలో భాగంగా మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామం సర్వే నంబర్ 375, 377, 336లోని 9.03 ఎకరాల భూమి మొత్తం పోతోందని శ్రీరాంరెడ్డి.. సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ మండలం పాములపర్తి గ్రామంలో సర్వే నంబర్‌లో 263లో 14 ఎకరాలున్న కట్ట ఆరులప్ప హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

3ఏ, 3డీ నోటిఫికేషన్లు కొట్టివేయాలన్న పిటిషనర్లు

ఎన్‌హెచ్ 44, ఆర్‌ఆర్‌ఆర్ ఇంటర్ జంక్షన్‌ను దాదాపు 60 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. దీని కోసం ఎన్‌హెచ్‌ఏఐ 2022, మే 25న 3ఏ నోటిఫికేషన్.. 2023, ఆగస్టు 8న 3డీ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్లను వారు సవాల్ చేశారు. దాదాపు 4,704.25 ఎకరాల్లో ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం చేపట్టనుంది. ఇందులో దాదాపు 4,315.33 ఎకరాల ప్రైవేట్ భూమిని సేకరిస్తున్నారు. అంటే మొత్తం భూ సేకరణలో ప్రైవేట్ భూమి వాటా 91.73 శాతం.. ప్రభుత్వ భూమి 5 శాతం.. అటవీ భూమి 3.27 శాతం. ప్రైవేట్ భూమి శాతాన్ని తగ్గించే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం ఆ ఇతర మార్గాలవైపు దృష్టి సారించలేదని పిటిషనర్లు వివరించారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది గొరారం రాజశేఖర్‌రెడ్డి వాదనలు వినిపించారు. జాతీయ రహదారుల చట్టాన్ని పాటించడంలో పలు వ్యత్యాసాలు ఉన్నందున 3ఏ, 3డీ నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని కోరారు.

పునరావాసం చట్టం అమలుకాదన్న ఎన్‌హెచ్‌ఏఐ

భూమి కోల్పోతున్న వారిని గుర్తించాలని, 3డీ నోటిఫికేషన్ కంటే ముందే రీహ్యాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్(ఆర్ఆర్) ప్యాకేజీ అమలు చేయాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రాజెక్టులకు భూసేకరణ ఉపశమనం, పునరావాస చట్టం 2013 అమలు కాదని, ఆర్ఆర్ ప్యాకేజీను అమలు చేయాల్సిన అవసరం లేదని ఎన్‌హెచ్‌ఏఐ న్యాయవాది వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కేంద్ర రోడ్డు రవాణా శాఖ కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఏఐ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

నగర వార్తలు

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి

హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

హిమాయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లను ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, ఇండియా కూటమికి ఓటు వేసి గెలిపించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మతతత్వ రాజకీయాలతో విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తున్న ప్రధాని మోదీకి ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సమాజ్‌వాద్ పార్టీ రాష్ట్ర అధ్యకుడు ప్రొఫెసర్ సింహాద్రి ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికలు–రాజ్యాంగ పరిరక్షణ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను మోదీ మరోసారి మోసం చేస్తున్నారన్నారు. ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మరోసారి మోదీ అధికారంలోకి వస్తే అన్ని వ్యవస్థలు సర్వనాశనం అవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రజా తెలంగాణ కన్వీనర్ సమ్మన్న, లోక్‌సత్తా పార్టీ అధ్యకుడు మన్నారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు-కన్నడ బంధం విడదీయలేనిది

కాచిగూడ: తెలుగు, కన్నడ భాషల మధ్య విడదీయరానంతగా బంధం పెనవేసుకుందని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ 110వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం పరిషత్ అధ్యక్షుడు విఠల్ జోషి అధ్యక్షతన స్థానిక అక్షయ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే ఈ రెండు భాషల మధ్య అనుబంధం కొనసాగుతోందన్నారు. ఉభయ భాషలపై సంస్కృతి, సాహిత్య ప్రభావం పరస్పరం కనిపిస్తుందన్నారు. హైదరాబాద్‌లో కన్నడ సంస్థలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో గత 55 సంవత్సరాలుగా పాల్గొంటున్న అమర దీక్షిత్ 'ప్రజల వద్దకు పరిషత్తు' అనే అంశంపై ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. జంట నగరాల్లో వివిధ క్షేత్రాలలో సేవలందిస్తున్న కన్నడిగులైన రఘునాథ్, హరిరావ్, రఘురామ్ ఓంకార్, వినయా నాయర్‌లను పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి సుమతి నిరంజన్, సి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ రోజున 'ర్యాపిడో' ఉచిత సేవలు

- ప్రారంభించిన సీఈవో వికాస్‌రాజ్
- నగరంలో పోలింగ్ 60 శాతం దాటాలని సూచన





ఉచిత బైక్, టాక్సీ రైడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న వికాస్‌రాజ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో కనీసం 60 శాతం ఓటింగ్ నమోదయ్యేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) వికాస్ రాజ్ అన్నారు. సోమవారం ఎల్‌బీ స్టేడియంలో ర్యాపిడో ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఉచిత బైక్, టాక్సీ రైడ్స్ కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ కె.శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేసిన ప్రజలను వారి ఇళ్లకు చేరవేసేందుకు వాహనాల ఏర్పాటుకు ముందుకొచ్చిన ర్యాపిడో నిర్వాహకులను అభినందించారు. హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు గత రెండు మూడు నెలలుగా ఓటరు అవగాహన కార్యక్రమాలు పెద్ద యెత్తున చేపట్టినట్లు చెప్పారు.

ర్యాపిడో ఉచిత సేవలుండాలి: రోనాల్డ్‌రాస్

జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ర్యాపిడో ఉచిత సేవలు కల్పించాలని కోరారు. పోలింగ్‌తేదీతోపాటు 'ఓటరుగా గర్వపడుతున్నాను'అనే స్టిక్కర్‌ను కూడా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సీపీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.స్వీప్ అసిస్టెంట్ అధికారి నాగమణి, రాపిడో బిజినెస్ హెడ్ రోహిత్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ అభ్యర్థులను గెలిపించండి

- గౌడ, కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్, భువనగిరి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌లను పార్టీలకు అతీతంగా గెలిపించాలని గౌడ, కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గౌడ హాస్టల్ ఉపాధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. బహుజనులంతా ఐక్యమై బలహీన వర్గాలకు చెందిన వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలను ఐక్యం చేసి గోల్కొండ కోటను జయించి బడుగుల రాజ్యం స్థాపించిన సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. పద్మారావుగౌడ్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా సేవలు అందించారని, నర్సయ్యగౌడ్ తెలంగాణ ఉద్యమంలో డాక్టర్స్ జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమించారని గుర్తు చేశారు. నిస్వార్థంగా ప్రజల కోసం పని చేసే వీరి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

టీఎస్ సెట్ పరీక్షల తేదీల మార్పు, ఫీజు తగ్గించాలని వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్–2024 పరీక్షల తేదీలను మార్చాలని, ఫీజును తగ్గించాలని సభ్య కార్యదర్శి ప్రొ.నరేష్‌రెడ్డికి విద్యార్థి నేతలు వినతిపత్రం అందజేశారు. సోమవారం తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జాక్ స్టేట్ ప్రెసిడెంట్ వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో అయనకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ప్రజల మధ్య వైరుధ్యాలు పెంచుతున్న రాహుల్

కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి రాందాస్ అథవాలే




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రాందాస్ అథవాలే

పంజగుట్ట: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేస్తూ భారతీయులను విడదీసే వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రాందాస్ అథవాలే అన్నారు. మరోమారు బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని, రాజ్యాంగం మారుస్తారని అసత్య ప్రచారం చేస్తూ మనషుల మధ్య వైరుధ్యం పెంచుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీపై ఇప్పటికే ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన 10 ఏళ్లల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు ముట్టుకోకుండా అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తుచేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, నేతలు శ్రీధర్, నాగేశ్వరరావు, శ్రీలత, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ కోసం రెండు నెలలుగా ప్రార్థనలు

మళ్లీ అధికారం చేపట్టాలని అల్లాహ్‌కు వేడుకోలు





చాంద్రాయణగుట్ట: ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి మరోసారి విజయం సాధించి అధికారం చేపట్టాలని పాతబస్తీ బాబానగర్‌కు చెందిన సంఘ సేవకుడు మీర్జా రఫిక్ బేగ్ రెండు నెలలుగా ప్రతిరోజు ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఫొటోతో బ్యానర్‌ను రూపొందించి ఈ ప్రార్థనలు కొనసాగిస్తున్నాడు. మార్చి 2వ తేదీ నుంచి ప్రతి రోజు తెల్లవారుజామున ఈ ప్రార్థనలు జరుపుతున్నానని ఆయన తెలిపారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న జగన్ మరోసారి ఘన విజయం సాధిస్తారన్నారు. ఈయన గత ఎన్నికల సమయంలో కూడా వై.ఎస్.జగన్ విజయం కోసం ప్రార్థనలు జరిపి సఫలీకృతుడయ్యాడు. పశ్చిమ బెంగాల్, కర్నాటక, తెలంగాణ ఎన్నికల్లో కూడా తమ నచ్చిన నాయకుల విజయం కోసం ఇదే తరహా ప్రార్థనలు జరిపారు.

వడివడిగా ఈవీఎం కమిషనింగ్ పనులు

అభ్యర్థుల పేరు, ఫొటో, ఎన్నికల గుర్తుల లోడింగ్

సాక్షి,సిటీబ్యూరో: ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు సంబంధించి హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఈవీఎంల బ్యాలెట్ యూనిట్‌ల కమిషనింగ్(బ్యాలెట్‌లో అభ్యర్థుల పేరు, ఫొటో, ఎన్నికల గుర్తు ఉంచే) ప్రక్రియ వడివడిగా సాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల సంఖ్యకనుగుణంగా పన్నెండున్నర వేలకుపైగా బ్యాలెట్ యూనిట్లలో ఈ పనుల్ని అధికార యంత్రాంగం చేస్తోంది. ఒక ఈవీఎంలోని బ్యాలెట్ యూనిట్‌లో నోటాసహా 16 గుర్తులకు అవకాశముంటుంది. అభ్యర్థులు 15 మంది మించితే రెండు ఈవీఎంలు అవసరమవుతాయి. వాటితోపాటు మరో 25 శాతం యూనిట్లు రిజర్వుగా ఉంచుతున్నారు. ఈవీఎంలు మొరాయించినప్పుడు వాటిని మార్చేందుకు వీలుగా రిజర్వులో ఉంచుతారు. అలా అభ్యర్థుల సంఖ్య, రిజర్వులో ఉంచాల్సిన వాటిని పరిగణనలోకి తీసుకొని ఈ పనులు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

- హైదరాబాద్ పార్లమెంట్ పోలింగ్ కేంద్రాలు: 1944
- అవసరమైన బ్యాలెట్ యూనిట్లు: 3,888
- సికింద్రాబాద్ పార్లమెంట్ పోలింగ్ కేంద్రాలు: 1,810
- అవసరమైన బ్యాలెట్ యూనిట్లు: 5,430
- కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ (మల్కాజిగిరి పార్లమెంట్) పోలింగ్ కేంద్రాలు: 232
- అవసరమైన బ్యాలెట్ యూనిట్లు: 464
- మొత్తం : 9782

కంటోన్మెంట్‌కు 232 యూనిట్లు

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు 232 బ్యాలెట్ యూనిట్లు అవసరం. లోక్‌సభ, కంటోన్మెంట్‌కు కలిపి మొత్తం 10,014 బ్యాలెట్ యూనిట్లు, రిజర్వులో మరో 2, 504 యూనిట్లలో బ్యాలెట్ యూనిట్‌ల కమిషనింగ్ పనులు జరుగుతున్నాయి.

- హైదరాబాద్ పార్లమెంట్‌లో 30 మంది అభ్యర్థులుండటంతో అక్కడ రెండేసి ఈవీఎంలు, సికింద్రాబాద్‌లో 45 మంది బరిలో ఉండటంతో అక్కడ మూడేసి ఈవీఎంలు, మల్కాజిగిరి పార్లమెంట్‌కు 22 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో అక్కడ రెండేసి ఈవీఎంలు, కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు 15 మంది అభ్యర్థులు మాత్రమే ఉండటంతో అక్కడ ఒక ఈవీఎం వంతున వినియోగించనున్నారు.



పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించాలి

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

బంజారాహిల్స్: ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. పోలింగ్ సరళిని సూక్ష్మస్థాయిలో పరిశీలించేందుకు నియమించిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం బంజారాహిల్స్‌లోని కొమురంభీమ్ ఆదివాసీభవన్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. మైక్రో అబ్జర్వర్ల పాత్ర ప్రతి దశలో నిర్ణయాత్మకంగా ఉంటుందని, నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ జరపాలన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జనరల్ అబ్జర్వర్ పి.ఐ.శ్రీవిద్య మాట్లాడుతూ ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైనదని అన్నారు. మైక్రో అబ్జర్వర్లు ప్రతి రిపోర్టును నేరుగా జనరల్ అబ్జర్వర్‌కు ఇవ్వాలన్నారు. అనంతరం ఈవీఎం, వీవీ ప్యాట్‌ల నిర్వాహణపై మైక్రో అబ్జర్వర్లకు హాండ్స్ ఆన్ శిక్షణ నిచ్చారు. శిక్షణ తరగతుల్లో మైక్రో అబ్జర్వర్లు, జిల్లా ఎన్నికల ట్రైనింగ్ నోడల్ అధికారి, అడిషనల్ కమిషనర్ (యూబీడీ) సునంద, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్

సాక్షి
హైదరాబాద్
మంగళవారం : 7 : మే : 2024



మాజీ మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా కొండాపూర్, రాజేంద్రనగర్‌లో పాల్గొని తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.



రాజేంద్రనగర్‌లో..



కొండాపూర్‌లో..



కంటోన్మెంట్‌లో..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం అంబర్‌పేట, ఉప్పల్, కంటోన్మెంట్ ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ఎంపీలుగా దానం నాగేందర్, పట్నం సునీతారెడ్డి, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి శ్రీగణేశ్‌లను గెలిపించాలని కోరారు.



భగ..భగ బతుకు సెగ



బాలానగర్‌లో ఓ మహిళ ఇలా..

ఎండైనా వానైనా.. బతుకుపోరులో నేను సగం..

ఎండ ప్రచండంతో 'చిరు' జీవుల కష్టాలు | పనులకు వెళ్లకుంటే పూటగడవని పరిస్థితి

వడదెబ్బతో అనారోగ్యం పాలవుతున్న వైనం

ఎండలో పనులు..రాత్రి వేళ వేడికి నిద్ర కరువు

నిర్మాణ రంగం, అసంఘటిత కార్మికులపై వేసవి ప్రభావం



ఘట్‌కేసర్‌లో..

సాక్షి స్పెషల్ స్టోరీ

కోలా వెంకటేశ్వర్లు

- ఎల్బీనగర్‌కు చెందిన ప్రమీల రోడ్డు వెంట బండి పెట్టుకుని పూలు అమ్ముతుంది. ఉదయం 8 నుంచి రాత్రి 9 వరకు ఆమె రోడ్డు వెంటే కూర్చొని ఎండలో పూలమ్మాల్సిందే. అధిక ఎండలున్నా జీవనం గడవడం తప్పదు కదా అని ఆమె వాపోయింది.

- ఎంత ఎండ ఉన్నా సీజనల్ వ్యాపారం చేసే నేను చెరుకు రసం బండి నడపక తప్పడం లేదు. ఈ బండి నడిపితేనే పూట గడిచేది అని చెప్పుకొచ్చారు మల్కాజిగిరికి చెందిన నాంచారయ్య.

- 20 ఏళ్లుగా వెల్డింగ్ పని చేస్తున్నా. అసలే వెల్డింగ్ మిషన్ వద్ద వేడి ఉంటుంది. ఇంక ఎండాకాలం మా పని చేయడం మరింత కష్టమే. కానీ తప్పదు అంటూ బాలానగర్‌కు చెందిన అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశాడు.

...ఈ ఏడాది దంచి కొడుతున్న మండు టెండలు నగర జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు, చిరు వ్యాపారులు విలవిల్లాడుతున్నారు. అటు ఎండలో పనిచేయక తప్పని పరిస్థితి. మరోవైపు ఎండల కారణంగా గిరాకీలు తగ్గిపోయాయి. వడదెబ్బ, జ్వరం, విరేచనాల వంటి అనారోగ్య సమస్యలూ చుట్టుముట్టి వీరు దుర్భర జీవనం గడుపుతున్నారు. ముఖ్యంగా వెల్డింగ్ పనులు, భవన నిర్మాణాల పనులు, రోడ్డు వెంట పూలు, పండ్లు, కూరగాయలు, పండ్ల రసాల బండ్లు, టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు ఎండలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అన్ని రంగాలూ కుదేలు..

ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు గ్రేటర్‌లో దాదాపు 42 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో నగర ప్రజలు ఉదయం పది గంటలు దాటితే చాలు గడప దాటి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో అన్ని రంగాల్లో స్తబ్దత నెలకొంది. భారీ పరిశ్రమలు మొదలుకొని మధ్యతరహా, చిన్న పరిశ్రమల్లోనూ పనులు నిలిచిపోతున్నాయి. వందలాది కుటీర పరిశ్రమలు కుదేలవుతున్నాయి. కార్మికులు మండుటెండల్లో పనులు చేయలేకపోతున్నారు. దీంతో నిర్మాణ రంగం స్తంభించింది. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు మందగించాయి. సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు, కూలీలు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండల కారణంగా ఉపాధిని కోల్పోతున్నట్లు వివిధ రంగాలకు చెందిన కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వ్యాపార వర్గాలు సైతం తమకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నట్లు ఆందోళన చెందుతున్నాయి. ఉదయం 10.30 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటలు దాటితే తప్ప పనులు జరగడం లేదు. ఉదయం రెండు గంటలు, సాయంత్రం మరో రెండు మూడు గంటలు మాత్రమే పనులకు అవకాశం ఉండడంతో మిగతా పగటి సమయం ఎలాంటి ఉత్పాదకత లేకుండా గడిచిపోతోంది. పగలు ఎండలే కాదు.. రాత్రుళ్లు కూడా వేడితో చెమటలు పట్టిస్తున్నాయి. ఏసీలు, కూలర్లు లేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు రాత్రి నిద్ర కరవు అవుతోంది. ఫ్యాన్లు వేస్తే భరించలేని వేడి గాలితో.. బంద్ చేస్తే ఉక్కపోతతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



ఖైరతాబాద్‌లో వెల్డింగ్ పనులు



అత్తాపూర్‌లో..

జనం బయటకు రాట్లే...

ఎండల దాటికి జనం బయటకు రావడం లేదు. నగరంతో పాటు శివార్లలోని పట్టణాలు, బస్తీలు, గ్రామాల నుంచి బయటికి వచ్చే వారి సంఖ్య కూడా తగ్గుతోంది. దీంతో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వ్యాపార లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి. చిరు వ్యాపారులు, ఆటోలు నడిపేవారు కూడా కనిపించడం లేదు.

- నగరంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్మాణ రంగంలో 20 లక్షల మంది కార్మికులు పని చేస్తుండగా, చిరు వ్యాపార సంస్థలు, ఫుట్‌పాత్ దుకాణాల్లో 10 లక్షల మంది వరకు పనిచేస్తున్నారు. వీరందరికీ ఇప్పుడు ఆదాయం బాగా తగ్గింది.
- చివరకు ఆర్టీసీ సంస్థ కూడా ప్రయాణికులు లేక మధ్యాహ్నం సర్వీసులను సైతం తగ్గించింది.
- నగర శివార్లలోని వందలాది పరిశ్రమల్లో 9,57,853 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిపై కూడా పగటి ఉష్ణోగ్రతల ప్రభావం ఉన్నప్పటికి, తగిన జాగ్రత్తలతో విధులకు హాజరవుతున్నట్లు వారు పేర్కొంటున్నారు.
- వందలాది అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 10.30 గంటల వరకు మాత్రమే నిర్వహిస్తున్నారు.
- దాదాపు 3.12 లక్షల మంది ఉపాధి హామీ కూలీలు ఉదయం 10.30 గంటల వరకే పనులకు వెళ్తున్నారు. తీవ్రమైన వేడితో పలుగు, పార, ఇనుప బొచ్చెలు కాలిపోతున్నాయని వారు వాపోతున్నారు.
- ఎండలకు భూగర్భ జలాలు తగ్గిపోయి పూలు, పండ్లు, కూరగాయల సాగు కూడా తగ్గింది.
- దీంతో నగరంలోని ఎల్బీనగర్, బోయినపల్లి, కొత్తపేట, ఉప్పల్, కుషాయిగూడ, శామీర్‌పేట, మాదన్నపేట, గుడి మల్కాపూర్ తదితర మార్కెట్లు, రైతు బజార్లకు కూరగాయలు, ఆకు కూరలు, పూల రాక తగ్గింది. దీంతో ధరలు పెరిగాయి.
- శివార్లలోని వందలాది ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న బిహార్ కార్మికులు ఎండ వేడిమి కారణంగా అల్లాడుతున్నారు. అడ్డా కూలీలు.. తోపుడు బళ్లపై పండ్లు, కూరగాయలు అమ్మేవారు. ఫుట్‌పాత్‌లపై దుప్పట్లు, ఆట బొమ్మలు విక్రయించే వారు, మలమల మండే కొలిమిలో ఇనుము పని చేసేవారు ఇలా..లక్షలాది మంది పేదలు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది.

ఆదాయం తగ్గింది...



ఎండలకు చికెన్ తినే వారి సంఖ్య తగ్గింది. దీంతో ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. గతంలో రోజుకు 60 నుంచి 65 కిలోల చికెన్ అమ్మేవాడిని. ప్రస్తుతం రోజుకు 25 కిలోల లోపు మాత్రమే అమ్ముతున్నాను. అద్దె చెల్లించడం కష్టంగా ఉంది.
– రామలింగం, చికెన్ సెంటర్, బోడుప్పల్

పూల రేట్లు బాగా పెరిగాయి..



గతంలో పూల ధర కిలో రూ.200 మాత్రమే ఉండేది. గడిచిన 15 రోజుల నుంచి రేటు బాగా పెరిగింది. ప్రస్తుతం కిలో రూ.400 నుంచి 4500 ఉన్నది. రోజుకు 10 నుంచి 15 కిలోల పూలు విక్రయించే వాళ్లం. ప్రస్తుతం ఎండలకు రోజుకు 6 కిలోలు లోపే అమ్ముతున్నాం. కుటుంబ పోషణ కష్టంగా మారింది.
– రాజేశ్వరి, పూల వ్యాపారి, బోడుప్పల్

పూట గడవాలంటే తప్పదు



ఇంట్లో ప్రతిరోజు పూట గడవాలంటే ఎంత ఎండలోనైనా పని చేయాల్సిందే. నేను 25 సంవత్సరాలుగా ఇంజినీరింగ్ పరిశ్రమలో పనిచేస్తున్నా. ఎండగా ఉందని ఇంట్లో కూర్చుంటే ఇల్లు గడవదు. ఎండ అనేది అలవాటైంది.
– సుదర్శన్, పరిశ్రమ ఇంజనీర్, జీడిమెట్ల

పరిశ్రమ నష్టాల్లోకి వెళ్తే.. కడుపు నిండదు



నేను ట్రాన్స్‌ఫార్మర్ల పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నా. పరిశ్రమకు ఆర్డర్స్ ఎక్కువగానే ఉన్నాయి. ఆర్డర్స్ ప్రకారం ఉత్పత్తి చేయాలంటే మేమంతా పరిశ్రమలో పనిచేయాల్సిందే. పరిశ్రమ నష్టాల్లోకి వెళ్తే కడుపు నిండదు. ఎంత ఎండ ఉన్నా కార్మికులు పని చేస్తూనే ఉన్నారు.
– నాయుడు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిశ్రమ సూపర్‌వైజర్, జీడిమెట్ల

పండ్లు ఎండిపోతున్నాయి



వేసవిలో పండ్ల వ్యాపారం పడిపోయింది. తెచ్చిన పండ్లు ఎండకు ఎండిపోతున్నాయి. ఎండకు భయపడి ప్రజలు బయటకు రావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే గిరాకీ ఉంటోంది. దీంతో నష్టాలు వస్తున్నాయి.
– కృష్ణకుమారి, పండ్ల విక్రేత, ఘట్‌కేసర్

పని ఉంది కానీ..



ఇప్పుడు మాకు చేతి నిండా పని ఉంది. కానీ ఎండ తీవ్రతకు షాపులో ఉండలేకపోతున్నాం మధ్యాహ్నం పని చేయలేకపోతున్నాం. దీంతో సమయం సరిపోవడం లేదు. ఉక్కపోతను భరించలేకపోతున్నాం. – ఎం.అశోక్, మోటారు వైండింగ్ మెకానిక్, ఘట్‌కేసర్

ఎండతో ఇబ్బంది పడుతున్నా



ఉదయం 9 గంటలకే ఎండ మండుతోంది. ఈ ఎండలో ఇటుక బట్టీలో పని చేయాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. అయినా తప్పదు. పూట గడవాలంటే పని చేయాల్సిందే. ఉదయం ఎనిమిది గంటలకు పనిలో చేరి మధ్యాహ్నం కాస్త పనులకు బ్రేక్ ఇస్తున్నాం. ఎండతో శరీరం నీరసంగా మారిపోతుంది. – విజయ్‌కుమార్ చౌహాన్, ఇటుక బట్టి కార్మికుడు



మండు టెండలో పొట్టకూటి కోసం తలపై సిమెంట్ తట్టతో దినసరి కూలీ..



ఎల్బీనగర్‌లో ముంజల విక్రయం



కూకట్‌పల్లిలో చెరుకు బండి



లక్ష్మీనగర్‌లో ఓ భవన నిర్మాణం వద్ద..



బాలానగర్‌లో చీపుర్లు అమ్ముతూ..

నాలుగు రాళ్లు కొడితేనే..



జవహర్‌నగర్‌లో దివ్యాంగుడు

నాలుగు రాళ్లను కొడితేనే మాకు పూటగడుస్తుంది. ఎండలో కొడితేనే రాయి తొందరగా పగులుద్ది. జవహర్‌నగర్‌లో గుట్టల్లో చిన్నతనం నుండి రాళ్లను కొట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. 10 రోజులుగా ఎండలు మండి పోతున్నాయి.
– లక్ష్మయ్య, చెన్నాపురం

సేల్స్ రెప్‌లకు తప్పదు




నేను ఓ ప్రైవేట్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నా. రోజుకు ఐదు నుంచి ఆరు గంటలు బైకుపైన బయటనే తిరగాల్సి ఉంటుంది. ఎండాకాలం ఈ డ్యూటీ చాలా కష్టం. కానీ ఉద్యోగం చేయకుంటే కుటుంబ పోషణ కష్టం కదా.
– సాయి నందకుమార్, చైతన్యపురి

నేను పక్కా లోకల్..

40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా...

- ఇంచు భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా.. నా ఆస్తులు మొత్తం వారికి రాసిచ్చేస్తా
- నా పని తీరే... నా గెలుపునకు కొలమానం
- చేవెళ్ల గడ్డపై ఎంపీగా మళ్లీ గెలిచేది నేనే..
- 'సాక్షి'తో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి



'సాక్షి' ఇంటర్వ్యూ

'నేను పక్కా లోకల్. ఇక్కడే చదువుకున్న. ఉద్యోగం చేసిన. ఆఫీసు, ఇల్లు..అన్నీ ఇక్కడే ఉన్నాయి. నేను భూములు కబ్జా చేసినట్లు నిరూపిస్తే నా ఆస్తులన్నీ రాసిస్తా...' అంటూ చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ, ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ ఎన్నికల్లోనూ నేనే గెలుస్తా. నాకు లభిస్తున్న ఆదరణ చూసి ప్రత్యర్థులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అయినా విజయం నాదే అంటూ 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ధీమా వ్యక్తం చేశారు.

- వివరాలు 10లో ▸

మోదీ రాక..నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు



సనత్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నగర పర్యటన దృష్ట్యా మంగళ, బుధవారాల్లో పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన (మంగళవారం) రాత్రి 7.50 నుంచి 8.25 మధ్య ప్రధానమంత్రి బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఎయిర్‌పోర్ట్ వై జంక్షన్, పీ అండ్ టీ ఫ్లైఓవర్ వద్ద యూ టర్న్, షాపర్స్‌స్టాప్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, బేగంపేట ఫ్లైఓవర్, గ్రీన్‌ల్యాండ్స్, రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద లెఫ్ట్ టర్న్, మోనప్ప ఐల్యాండ్ జంక్షన్, యశోద హాస్పటల్, ఎంఎంటీఎస్ మీదుగా రాజ్‌భవన్ చేరుకుంటారు. ఈ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధాని తిరుగు ప్రయాణంలో భాగంగా ఈ నెల 8న (బుధవారం) ఉదయం 8.35 నుంచి 9.10 గంటల మధ్యలో అదే మార్గంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న దృష్ట్యా నిర్ణీత సమయాల్లో యథావిధిగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు.

స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటింగ్ నిర్వహణ

- ఆదివారం వరకు 50 శాతం హోమ్ ఓటింగ్ పూర్తి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ గన్‌ఫౌండ్రిలోని ఆల్ సెయింట్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంను సందర్శించి స్ట్రాంగ్‌రూమ్, డేటా ఎంట్రీ, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతమంది ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చేశారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగుల కోసం వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మే 3 నుండి 8 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల వారిగా ఈవీఎం ర్యాండమైజేషన్ జరిగిందని, కమిషనింగ్ ప్రక్రియ మొదలు అయిందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

14 వేల మందితో బందోబస్తు

నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: పార్లమెంట్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ఈ నెల 13న జరుగనుందని, దీనికోసం దాదాపు 14 వేల మంది సిటీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వీరికి అదనంగా 22 కంపెనీల కేంద్రం సాయుధ బలగాలు వస్తున్నట్లు ఆయన వివరించారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్వాల్ మాట్లాడుతూ 'నగర కమిషనరేట్ పరిధిలో రెండు పార్లమెంట్ స్థానాలు (హైదరాబాద్, సికింద్రాబాద్) పూర్తిగా, మరో రెండు (మల్కాజ్‌గిరి, చేవెళ్ల) పాక్షికంగా వస్తాయి. నగర పోలీసు విభాగంలో ఉన్న 14 వేల మందితో పాటు కేంద్ర నుంచి వచ్చే 22 కంపెనీల సాయుధ బలగాలను పోలింగ్ రోజు బందోబస్తు కోసం వినియోగిస్తాం. ఇప్పటికే ఆరు కంపెనీలు రాగా.. మిగిలినవి వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మొత్తం 41 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు వచ్చాయి. ఇప్పుడూ ఆ స్థాయిలో కావాలనే ఉద్దేశంతో అదనపు బలగాల కోసం ప్రతిపాదనలు పంపాం. అవసరమైన స్థాయిలో టీఎస్ఎస్‌పీ, సీఏఆర్, ఏఆర్ బలగాలు వాడతాం. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల ఉన్న చోట్ల కేంద్ర బలగాలు మోహరిస్తాం. ఏఎస్డీగా పిలిచే 'ఆబ్‌సెంట్, షిఫ్ట్, డెత్' ఓటర్లు ఎక్కువగా ఉన్న వాటినీ క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌గా గుర్తించాలని ఈ ఏడాది ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓ వ్యక్తి రూ.50 వేలకు మించి తీసుకెళ్లొద్దు. అయితే నగరంలో ఉన్న ఆస్పత్రులు, ఇతర ఎమర్జెన్సీ సేవల వివరాలు పరిగణలోకి తీసుకుని ఆధారాలు చూపిస్తే రూ.లక్ష వరకు అనుమతిస్తున్నాం. అంతకు మించి ఉంటే స్వాధీనం చేసుకుంటాం'అని వివరించారు.

సోమవారం ఉష్ణోగ్రతలు ఇలా..	చందానగర్	ముసాపేట	కుత్బుల్లాపూర్	షేక్‌పేట	బీహెచ్‌ఈఎల్	రాజేంద్రనగర్	లంగర్‌హౌస్	ఐఎస్ సదన్	ఘాన్సీబజార్	అస్మాన్‌ఘడ్	మచ్చబొల్లారం	చిలకలగూడ	కూకట్‌పల్లి	రాజీవ్‌నగర్	ఫలక్‌నుమా
	43.8	43.7	43.5	43.4	43.3	43.3	43.1	43.0	43.0	42.9	42.9	42.8	42.8	42.7	42.7

బైక్ కనిపిస్తే మాయం!

- బహిరంగ ప్రదేశాల్లో నిలిపినవే టార్గెట్
- 13 బైక్‌లు స్వాధీనం
- ఇద్దరిని అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న ముఠాకు సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వీరి నుంచి 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ ఎస్.రష్మి పెరుమాల్ పేర్కొన్నారు. బార్కస్‌కు చెందిన ఆటోడ్రైవర్ షామ్స్ బిలాల్, మాసబ్‌ట్యాంక్‌కు చెందిన ప్రింటింగ్ ప్రెస్ కార్మికుడు సుఖేశ్వర్ ఓ ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి వేళల్లో నగరంలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ ఇళ్లు, బార్లు, రోడ్ల పక్కన పార్క్ చేసిన వాటిలో అనువైన బైక్స్ గుర్తించే వాళ్లు. కొందరు యజమానులు తమ వాహనం తాళాలను సైతం వాటికే ఉంచేయడం, ముందు ఉండే పౌచ్‌లో వేయడం చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఇలా గత రెండు మూడు నెలల్లో పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో 14 ద్విచక్ర వాహనాలు చోరీ చేశారు. వీటిని తక్కువ ధరకు విక్రయించి ఆ డబ్బుతో జల్సాలు చేశారు. వీరి వ్యవహారాలపై సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు ఎస్‌కే కవియుద్దీన్, పి.సాయిరాం వలపన్ని ఇద్దరినీ అరెస్టు చేశారు. వీరి నుంచి చోరీ చేసిన వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

దుబాయ్ కేంద్రంగా ట్రేడింగ్ ఫ్రాడ్

ఇద్దరి అరెస్టు, రూ.1.44 కోట్లు ఫ్రీజ్

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా ద్వారా ఎర వేసి, ట్రేడింగ్‌లో అధిక లాభాల పేరు చెప్పి అందినకాడికి దండుకుంటున్న సైబర్ నేరగాళ్లకు ముఠాకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చెక్ చెప్పారు. దుబాయ్‌లో ఉన్న సూత్రధారికి సహకరిస్తున్న ప్రధాన పాత్రధారితో పాటు అతడికి బ్యాంకు ఖాతాలు అందిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన బూరా రామ్ అలియాస్ రాజు భాయ్‌కి దుబాయ్‌లోని న్యూ సాత్వాలోనూ నివాసం ఉంది. తరచూ అక్కడికి వెళ్లి వచ్చే నేపథ్యంలో అతడికి దుబాయ్‌లోనే ఉంటున్న బెర్లిన్ అనే వ్యక్తితో పరిచయమైంది. ఆన్‌లైన్ ద్వారా ఎర వేసి ట్రేడింగ్ ఫ్రాడ్స్ చేయడంతో దిట్టగా ఉన్న బెర్లిన్ తనకు సహకరించాల్సిందిగా బూరా రామ్‌ను కోరాడు. భారీ కమీషన్ ఇస్తానని చెప్పడంతో ఇతగాడు షెల్ కంపెనీల పేర్లతో కరెంట్ ఖాతాలు తెరిచి ఇవ్వడానికి అంగీకరించాడు. జోధ్‌పూర్‌కు చెందిన తన స్నేహితుడు రామ్‌చంద్ర ద్వారా 47 బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. వీటి వివరాలతో పాటు లింకై ఉన్న మెయిల్ ఐడీలు, పాస్‌వర్డ్స్, మొబైల్ నెంబర్లను తీసుకుని బెర్లిన్‌కు అందించాడు. వాట్సాప్, టెలిగ్రామ్‌ల్లో ప్రత్యేక గ్రూపులు ఏర్పాటు చేసే బెర్లిన్ వాటి ద్వారా ట్రేడింగ్ పేరుతో ప్రకటనలు ఇచ్చాడు. వీటికి ఆకర్షితులైన వారితో మోతీలాల్ ఓస్వాల్ స్టాక్ బ్రోకర్ సహా మరికొన్ని పేర్లతో ఉన్న కంపెనీల ద్వారా పెట్టుబడులు పెట్టించి స్వాహా చేశాడు. ఇలా దేశ వ్యాప్తంగా 507 మంది నుంచి పెద్ద మొత్తం కాజేశాడు. ఇందులో బూరా రామ్‌కు 20 శాతం, రామ్‌చంద్రకు 5 శాతం కమీషన్‌గా ఇచ్చాడు. ఆయా కేసుల్లో 67 రాష్ట్రానికి సంబంధించినవే. రూ.1.03 కోట్లు పెట్టుబడిపెట్టి మోసపోయిన నగరానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలను బట్టి బూరా రామ్ దుబాయ్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ)జారీ చేశారు. ఇటీవల దుబాయ్ నుంచి నేపాల్ మీదుగా భారత్‌కు రోడ్డు మార్గంలో రావడానికి ప్రయత్నిస్తున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని సోనైలీ చెక్ పోస్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకుని సైబర్ క్రైమ్ ఠాణాకు సమాచారం ఇచ్చారు. అక్కడికు వెళ్లిన ప్రత్యేక బృందం అరెస్టు చేసి తీసుకువచ్చింది. ఇతడి విచారణలో రామ్‌చంద్ర పేరు వెలుగులోకి రావడంతో అతడినీ పట్టుకుంది. వీరి నుంచి గుర్తింపు కార్డులు తదితరాలు స్వాధీనం చేసుకుని, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1.44 కోట్లు ఫ్రీజ్ చేశారు. బెర్లిన్‌ను పట్టుకోవడం కోసం లెటర్ ఆఫ్ రెగొటరీ (ఎల్ఆర్) పద్ధతిలో దుబాయ్ అధికారులను సంప్రదించనున్నారు.

మోసాల కోసమే సిటీకి వచ్చారు!

- రాజస్థాన్‌కు చెందిన నలుగురి వ్యవహారమిది
- సైబర్ నేరగాళ్లకు కరెంట్ ఖాతాలు సరఫరా
- గుట్టురట్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు
- 192 కేసుల్లో రూ.16 కోట్ల మేరకు స్వాహా



సాక్షి, సిటీబ్యూరో: రాజస్థాన్ నుంచి వచ్చి నగర శివార్లలో స్థిరపడి షెల్ కంపెనీలు ఏర్పాటు చేయడంతో పాటు సైబర్ నేరగాళ్లకు అవసరమైన కరెంట్ ఖాతాలు తెరిచి సహకరిస్తున్న నలుగురు నిందితులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీళ్లు ఇచ్చిన బ్యాంకు ఖాతాల ఆధారంగా ప్రధాన సూత్రధారి కమలేష్ కుమార్ దేశ వ్యాప్తంగా 192 మందిని మోసం చేసి రూ.16 కోట్లు కాజేసినట్లు నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన కమలేష్ కుమార్ యుకాయిన్8.టాప్ పేరుతో ఓ వెబ్‌సైట్ ఏర్పాటు చేశాడు. దీని ముసుగులో పెట్టుబడుల పేరుతో భారీ ఆన్‌లైన్ మోసానికి తెరలేపాడు. బాధితుల నుంచి డబ్బు కాజేయడానికి అవసరమైన బ్యాంకు ఖాతాల నుంచి నగదు మళ్లించడానికి ఇతడికి కరెంట్ ఖాతాలు అవసరమయ్యాయి. దీనికోసం తనకు పరిచయస్తులైన మంగీలాల్ గోదారా, భజన్ లాల్, మహేష్ కుమార్, ప్రకాష్ చాంద్‌లను నగర శివార్లలోని సుచిత్ర ప్రాంతానికి పంపాడు. వీరు అక్కడ స్క్రాప్ వ్యాపారులుగా ఉంటూ వివిధ షెల్ కంపెనీల పేర్లతో కరెంట్ ఖాతాలు తెరిచి వాటి వివరాలను కమలేష్‌కు అందించారు. వీటిలో జరిగే ప్రతి లావాదేవీ పైనా 10 శాతం చొప్పున కమీషన్ తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ చేసే కమలేష్ ఇలాంటి 52 ఖాతాలను వినియోగించి దేశ వ్యాప్తంగా 192 మంది నుంచి రూ.16 కోట్లు కాజేశాడు. నగరానికి చెందిన ఇద్దరు బాధితులు రూ.13.65 లక్షలు, రూ.3.45 లక్షలు కోల్పోయి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలను బట్టి నిందితులను గుర్తించారు. నగరంలో ఉంటున్న నలుగురినీ అరెస్టు చేసింది. వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న 1.68 కోట్లు ఫ్రీజ్ చేసి పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

నేను పక్కా లోకల్..

అందరినీ గుర్తిస్తా.. ఆదరించినోళ్లకు అండగా ఉంటా...

- 40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా...
- ఇంచు భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా.. నా ఆస్తులు మొత్తం వారికి రాసిచ్చేస్తా
- ప్రజల్లో నాకు లభిస్తున్న ఆదరణను చూసి ప్రత్యర్థులు జీర్ణించుకోలేక పోతున్నారు..
- నా పని తీరే... నా గెలుపునకు కొలమానం
- చేవెళ్ల గడ్డపై ఎంపీగా మళ్లీ గెలిచేది నేనే..
- 'సాక్షి'తో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి

INTERVIEW



'ఇక్కడే చదువుకున్నా..ఇక్కడే ఉద్యోగం చేశా. ఆఫీసు, ఇళ్లు అన్నీ ఇక్కడే. 40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా. నేను పక్కా లోకల్. అంగుళం భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా, ఒక్క మక్క గింజ అక్రమంగా తీసుకున్నట్లు నిరూపించినా.. నా ఆస్తులన్నీ వారికి రాసిచ్చేస్తా'' అని చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజల్లో నాకు లభిస్తున్న ఆదరణ చూసి ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి జీర్ణించుకోలేక పోతున్నాడు. స్కాంలు, దోపిడీ అంటూ అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నాడు. ఎన్నికల్లో నాకు డిపాజిట్ దక్కదని చెబుతూనే నా తోనే ప్రధానంగా పోటీ ఉంటుందని అంటున్నాడు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి మళ్లీ గెలిచేది నేనే' అని ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆయన 'సాక్షి ప్రతినిధి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే....

–సాక్షి, రంగారెడ్డిజిల్లా

ప్రచారం ఎలా జరుగుతుంది.?

నా ప్రచారాన్ని, నాకు లభిస్తున్న మద్దతును చూసి ప్రత్యర్థి తట్టుకోలేక పోతున్నాడు. నాకు డిపాజిట్ రాదంటున్నాడు. ఎవరికి డిపాజిట్ రాదో త్వరలో తెలుస్తుంది. సీఎం రేవంత్‌రెడ్డితో రోజుకో నియోజకవర్గంలో రోడ్ షోలు నిర్వహిస్తున్నాం. పార్టీ అభిమానుల నుంచే కాదు, సాధారణ ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుంది. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలువబోయేదీ రంజిత్‌రెడ్డే.

ఐదేళ్లలో చేవెళ్లలో చేసిన అభివృద్ధి పనులేమిటి? మళ్లీ గెలిస్తే చేసే పనులేమిటి?

ఇప్పటికే 111 జీఓ ఎత్తివేయించాను. మన్నెగూడ రోడ్డు మంజూరు చేయించాను. రూ.100 కోట్లతో వికారాబాద్ రైల్వే బ్రిడ్జి నిర్మించాను. ఆ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, పరిగి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, శంషాబాద్‌కు రూ.60 కోట్లు, జల్‌పల్లికి రూ.30 కోట్లు మంజూరు చేయించా. వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేయించాను. రాజేంద్రనగర్‌కు డిగ్రీ కాలేజీ తీసుకొచ్చాను. కొండాపూర్‌లో ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేయించాను. గెలిచిన తర్వాత అడ్రస్ లేకుండా పారిపోయే వ్యక్తిని కాదు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటా. పార్టీలకు అతీతంగా ఆపదలో ఎవరు? ఏ రాత్రి? ఫోన్ చేసినా స్పందిస్తా. విద్యా, వైద్య పరంగా ఆర్థిక సహాయం చేస్తాం. అందరినీ గుర్తిస్తా. నా పని తీరే కొలమానం.

ప్రత్యర్థులు మిమ్మల్ని స్థానికేతరుడిగా ప్రచారం చేస్తున్నారు?

1982 నుంచి రాజేంద్రనగర్‌లో చదువుకున్నా. శంషాబాద్‌లో ఉద్యోగం చేశా. ఇక్కడే ఆఫీసు, ఇల్లు ఉంది. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆఫీసు ఎక్కడ? ఆయన ఇల్లెక్కడ? ఆయన ఇక్కడ పుట్టడం మినహా ఈ ప్రాంతానికి ఆయన చేసింది ఏముంది.? చేవెళ్లతో ఆయన కంటే నాకే ఎక్కువ అవినాభావ సంబంధం ఉంది.

బీజాపూర్ రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యానికి కారణం. క్రెడిట్ నాదంటే.. నాదే అని చెప్పకుంటున్నారు?

రోడ్డు విస్తరణ పనులు మంజూరు చేయించిందే నేను. ప్రతి దానికి నా వద్ద ఆధారాలు ఉన్నాయి. ప్రత్యర్థి కొండా దగ్గర ఏమైనా ఆధారం ఉంటే చూపించమనండి. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు 60 మీటర్ల రోడ్డుకు దరఖాస్తు మాత్రమే చేశారు. భారీ ట్రాఫిక్ ఉంటుందని కేంద్రం దానిని రద్దు చేసింది. డీపీఆర్‌ను మార్చింది. 45 మీటర్ల రోడ్డును మంజూరు చేసింది. భూ సేకరణ దాదాపు పూర్తైంది. కొందరు రైతులు కోర్టును ఆశ్రయించడం, రోడ్డుకు ఇరు వైపులా పెద్దపెద్ద చెట్లు ఉండటం, వాటి తొలగింపు అంశంపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించ డం వల్ల పనుల్లో కొంత జాప్యం చోటు చేసుకుంది. రోడ్డును మంజూరు చేయించిన పూర్తి క్రెడిట్ నాదే.

బీఆర్ఎస్ మీకు సముచిత స్థానం కల్పించినా.. పార్టీ ఎందుకు వీడాల్సి వచ్చింది?

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాకు రాజకీయంగా భవిష్యత్తు ఇచ్చిన మాట నిజమే. నేను అంతకంటే ఎక్కువగా పార్టీ కోసం పని చేశాను. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలు సర్వేలు చేయించాం. సర్వేల్లో పార్టీ వీక్‌గా ఉన్నట్లు తేలింది. నిజానికి పోటీ చేయకూడదని భావించాను. కేసీఆర్ సహా కేటీఆర్‌కు ఇదే అంశాన్ని వివరించాను. కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తికి తలొంచక తప్పలేదు.

భూకబ్జాలు, దాణా కేసు అంశాన్ని ప్రత్యర్థులు పదేపదే ప్రజల్లో ప్రస్తావిస్తున్నారు. వారికి మీరిచ్చే సమాధానం?

ప్రతి ఊర్లో మీటింగ్ పెడుతున్నా. నేను ఒక్క ఇంచు భూమి ఖబ్జా చేసినట్లు నిరూపించినా..నా భూములన్నీ రాసిస్తా. ఒక్క మక్క గింజ అక్రమంగా తీసుకున్నట్లు నిరూపించినా..వారికి నా మొత్తం ఆస్తులు రాసిస్తా. కోడిగుడ్లను కల్తీ చేస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరైనా గుడ్డును కల్తీ చేస్తారా?

ఫోన్ కోసం పొడిచి చంపాడు!

గుడిమల్కాపూర్‌లో సెల్‌ఫోన్ స్నాచర్ దురాగతం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- వ్యవస్థీకృత నేరాలపై డేగకన్ను: సీపీ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వ్యవస్థీకృతంగా సాగుతున్న సెల్‌ఫోన్ స్నాచింగ్ దందాకు గుడిమల్కాపూర్‌లో చోటు చేసుకున్న దారుణ హత్యే నిదర్శనమని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత నెల 30 రాత్రి ఈ ఘాతుకానికి ఒడిగట్టిన పాత నేరగాడితో పాటు బాలుడిని సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. గోల్కొండలోని బంజారీ దర్వాజా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఎజాజ్ ఖురేషీ కొన్నేళ్లుగా సెల్‌ఫోన్ స్నాచింగ్స్ చేస్తున్నాడు. వీటికి సంబంధించి ఇతడిపై ఫలక్‌నుమ, చంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లిల్లో ఆరు కేసులు నమోదయ్యాయి. ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో ఫలక్‌నుమలో మరో కేసు ఉంది. ఇతగాడు ఇటీవల ఓ బాలుడిని అనుచరుడిగా చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి గత నెల 29న కేపీహెచ్‌బీలో ఓ స్కూటీ చోరీ చేశారు. మర్నాడు రోజు మధ్యాహ్నం దానిపై తిరుగుతూ ఆరాంఘర్ వద్ద సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. అదే రోజు రాత్రి వీరు బైక్‌పై పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెం.66 వద్దకు చేరుకున్నారు. ఆ సమయంలో మురాద్‌నగర్‌కు చెందిన సనుల్లా తన సోదరుడితో కలిసి స్నేహితుడి దుకాణం వద్ద కూర్చుని ఫోన్ చూస్తున్నారు. దీనిని గమనించిన ఎజాజ్ వారి సమీపంలో బైక్ ఆపగా వెనుక కూర్చున్న బాలుడు దిగి సనుల్లా సెల్‌ఫోన్ లాక్కోవడంతో వారు ప్రతిఘటించారు. వీళ్లు ఎజాజ్‌ను పట్టుకునే ప్రయత్నం చేయడంతో అతడు తన వద్ద ఉన్న కత్తితో సనుల్లాపై దాడి చేసి, సెల్‌ఫోన్ లాక్కుని అక్కడినుంచి ఉడాయించాడు. దీనిపై గుడిమల్కాపూర్ ఠాణాలో కేసు నమోదు కాగా... సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసింది. సోమవారం ఇరువురినీ పట్టుకుని రెండు కత్తులు, వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంది. ఈ సెల్‌ఫోన్ స్నాచర్ల వెనుక ఉన్న సూత్రధారులు, రిసీవర్లను గుర్తించే ప్రయత్నం చేస్తోంది.

ఈ నేరగాళ్లపై త్వరలో పీడీ యాక్ట్

హైదరాబాద్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఉదంతాలను పరిగణలోకి తీసుకుంటే సెల్‌ఫోన్ స్నాచింగ్ వ్యవస్థీకృతంగా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. పది రోజుల క్రితమే ఓ గ్యాంగ్‌ను పట్టుకున్నాం... తాజాగా ఈ దారుణం జరిగింది. ఈ నేపథ్యంలో ఇలాంటి నేరగాళ్లపై త్వరలో పీడీ యాక్ట్‌లు ప్రయోగిస్తాం. సిటీలో చోరీ అయిన ఫోన్లు సూడాన్, మలేషియా, బంగ్లాదేశ్, శ్రీలంకలకు అక్రమ రవాణా అవుతున్నాయి. ప్రధాన సూత్రధారులు మైనర్లతో పాటు వ్యసనాలకు బానిసలైన వారిని ఎంపిక చేసుకుని సెల్‌ఫోన్ స్నాచింగ్స్ చేయిస్తున్నారు. ఇలాంటివి రెండుమూడు ముఠాలు ఉన్నట్లు సమాచారం ఉంది. వారికి చెక్ చెప్పడానికి సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు ఉమ్మడిగా పని చేస్తున్నారు. సెల్‌ఫోన్ స్నాచింగ్స్‌కు సంబంధించిన హాట్‌స్పాట్స్ గుర్తించి, గస్తీ వాహనాల రూట్ మ్యాప్‌ను పునర్ వ్యవస్థీకరిస్తాం. ఇప్పటికే జగదీష్ మార్కెట్‌పై డేగకన్ను వేశాం. చోరీ ఫోన్ల ఖరీదు చేసే కేంద్రాలు ఇంకా ఏవైనా ఉన్నాయా? అనేది ఆరా తీస్తున్నాం.

- కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.22 కోట్లు కొట్టేశారు

- ఢిల్లీ, రాజస్థాన్ కేంద్రంగా సాగుతున్న దందా
- ఈ ముఠాపై దేశ వ్యాప్తంగా 171 కేసులు నమోదు
- నలుగురు పాత్రధారుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియాతో పాటు ప్రత్యేక యాప్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ఎర వేసి, దేశ వ్యాప్తంగా 171 మంది నుంచి రూ.22 కోట్లకు పైగా కాజేసిన ఘరానా ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ప్రధాన సూత్రధారులతో పాటు బ్యాంకు ఖాతాలు సరఫరా చేసిన ఉత్తరాది వ్యక్తులకు చెక్ చెప్పారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.1.43 కోట్లు ఫ్రీజ్ చేసినట్లు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం డీసీపీలు ఎస్.శ్వేత, డి.కవిత, ఏసీపీ ఆర్‌జీ శివమారుతితో కలిసి బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. దుబాయ్‌లో ఉన్న సూత్రధారుల ఆదేశాల మేరకు రాజస్థాన్‌కు చెందిన డాక్టర్ మనోజ్ కుమార్, ఎంబీబీఎస్ విద్యార్థి కృష్ణ ధాకా పెంథియోన్ వెంచర్స్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేశారు. దీని పేరుతోనే సోషల్‌మీడియా ద్వారా పెట్టుబడుల పేరుతో ప్రకటనలు గుప్పించారు. వీటికి ఆకర్షితులై సంప్రదించిన వారిని వాట్సాప్‌లో ఆదిత్య స్టాక్ షేరింగ్ వీఐపీ పేరుతో ఉన్న గ్రూపులో చేర్చేవారు. వీరితో ప్లే స్టోర్ నుంచి పీటీ–వీసీ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. దీనికి వారి బ్యాంకు ఖాతా లింక్ చేసి ఐపీఓ సహా వివిధ రకాల స్టాకుల్లో ఇన్వెస్ట్ చేయించేవారు. బాధితుల నుంచి కాజేసిన డబ్బు డిపాజిట్, బదిలీ కోసం అవసరమైన బ్యాంకు ఖాతాలను ఈ ద్వయానికి ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మాజీ ఉద్యోగి అశుతోష్ రాజ్ అందించేవాడు. రాజస్థాన్‌కు చెందిన తన స్నేహితులు మనీస్ బన్సల్, గౌరవ్ చౌదరి, గిరిధర్ తదితరుల ద్వారా బ్యాంక్ అధికారుల సాయంతో ఈ ఖాతాలు తెరిచారు. ఇలా ఇప్పటి వరకు 24 బ్యాంకు ఖాతాలు వినియోగించి దేశ వ్యాప్తంగా 171 మంది నుంచి రూ.22.24 కోట్లు స్వాహా చేశారు. వీరి బారినపడిన ఓ నగరవాసి రూ.1.08 కోట్లు కోల్పోయి సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్‌రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సాంకేతిక ఆధారాలతో కృష్ణ ధాకా, మనోజ్ కుమార్, అశుతోష్ రాజ్, రాజస్థాన్‌కు చెందిన మనీష్ భన్సల్‌లను అరెస్టు చేశారు. వీరిపై రాష్ట్రంలో 11 కేసులు ఉన్నట్లు గుర్తించారు. దుబాయ్‌లో ఉన్న సూత్రధారులతో పాటు పరారీలో ఉన్న మిగిలిన నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ కేసులో నిందితులకు సహకరించిన బ్యాంకు సిబ్బంది పైనా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సీపీ పేర్కొన్నారు.

రిపీటెడ్ బాధితుల ఫిర్యాదులు స్వీకరించం

- సైబర్ నేరాల్లో రోజుకు రూ.2 కోట్లు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో బాధితులుగా మారుతున్న వారిలో ఉన్నత విద్యావంతులు, ప్రొఫెషనల్స్ సైతం ఉంటున్నారని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ నేరాలు చోటు చేసుకోవడానికి 70 నుంచి 80 శాతం బాధితుల స్వయంకృతాపరాధమే కారణమని, ఈ నేపథ్యంలోనే పదేపదే బాధితులుగా మారుతున్న వారు ఇస్తున్న ఫిర్యాదులు స్వీకరించకూడదని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు బాధితుల పేర్లు బయటపెట్టట్లేదని, అయితే కొన్ని కారణాల నేపథ్యంలో ఇకపై ఆ వివరాలు బహిర్గతం చేయాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. సోమవారం సీసీఎస్‌లో ఆయన మాట్లాడుతూ... 'సైబర్ నేరగాళ్లు నగరవాసుల నుంచి రోజుకు రూ.2 కోట్ల మేర స్వాహా చేస్తున్నారు. . ఇలాంటి ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్‌లో పదేపదే లాభాలు పొందిన వాళ్లు నిందితులే అవుతారు. ఇతరుల నుంచి కాజేసిన మొత్తాన్నే సైబర్ నేరగాళ్లు వీరికి ఇస్తున్నారు. వీలున్నంత వరకు ప్రతి ఒక్కరూ సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా స్వీయ నియంత్రణతోనే సైబర్ నేరాలకు చెక్ చెప్పే అవకాశం ఉంటుంది. ప్రజల్లో అవగాహన పెంచడానికి ఇప్పటికే కొన్ని కాలర్ ట్యూన్స్ తయారు చేశాం. వీటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ద్వారా ప్రతి ఫోన్‌లో వచ్చేలా చర్యలు తీసుకున్నాం. సైబర్ నేరాలపై అవగాహనకు సంబంధించిన లఘు చిత్రాలు ప్రదర్శించేలా ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఇప్పిస్తాం. ప్రతి రోజూ కచ్చితంగా కొన్ని నిమిషాలు ప్రదర్శించేలా నిబంధనలు తీసుకువస్తాం' అని పేర్కొన్నారు.

250కి పైగా చోరీలు.. వందలసార్లు జైలు

- పరివర్తన కింద ఉపాధి చూపించినా అదే పంథా
- ఘరానా దొంగ అరెస్టు



ఉప్పల్: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 200కు పైగా . వందల మార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. చివరకు విసుగెత్తిన పోలీసులే మైత్రి స్కీం కింద విరాళాలు సేకరించి ఉప్పల్ చౌరాస్తాలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేయించారు. అడపాదడపా హోటల్ నడిపి పోలీసుల కళ్లు కప్పి మళ్లీ చోరీల బాట పట్టిన ఘరానా దొంగను ఉప్పల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. మల్కాజిగిరి డీసీపీ పద్మజ సోమవారం వివరాలు వెల్లడించారు. విజయవాడ ప్రాంతానికి చెందిన శీలంశెట్టి వెంకటరమణ అలియాస్ శ్రీను(50) నగరానికి వలస వచ్చి బాలానగర్‌లో ఉంటూ స్క్రాప్ దుకాణంలో పని చేసేవాడు. ప్రస్తుతం జనగామలో ఉంటున్న అతను ఉమ్మడి రాష్ట్రంలో దాదాపు 250 దొంగతనాలకు పాల్పడి వందలసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతడి వైఖరిలో మార్పు రాకపోవడంతో పలుమార్లు కౌన్సెలింగ్ చేసిన పోలీసులు అప్పటి సైబరాబాద్ కమిషనర్ సీవీ ఆనంద్ చొరవతో ఉప్పల్ రింగ్ రోడ్డులో మైత్రి టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేయించారు. కొన్నేళ్లు టిఫిన్ సెంటర్‌ను నడిపిన అతను మళ్లీ నేరబాట పట్టాడు. తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడి 2023 ఏప్రిల్‌లో జైల్‌కు వెళ్లివచ్చాడు. గత నెల 26న చౌదరిగూడ ప్రాంతానికి చెందిన సునీల్ కుమార్ తన మరదలు స్వాతి ఇంట్లో చోరీ జరిగిందని ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత వరసగా పోచారం, ఘట్ కేసర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పట్ట పగలు నాలుగు చోరీలు జరగడంతో సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా జోడిమెట్ల ఎక్స్‌రోడ్డులో నిందితుడు వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 21 తులాల బంగారు నగలు, కిలో వెండి వస్తువులు, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కోవిడ్ టీకా బాధితులకు పరిహారం అందించాలి

సాక్షి, సిటీబ్యూరో: కోవిడ్ టీకా వేసుకోవడం వల్ల ఎంత మందికి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చాయనే సమాచారాన్ని సేకరించి, వారికి తగిన నష్టపరిహారం అందించాలని అవేకన్ ఇండియా మూమెంట్ ప్రతినిధులు సరస్వతి, నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... టీకా వేసుకున్న తరువాత ఆరోగ్య సమస్యలు ఎదురైతే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. టీకా వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని 2021లోనే గుర్తించినప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తయారీదారులే సైడ్ ఎఫెక్ట్స్ ఉన్నాయని ఒప్పుకుంటున్నారని, ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైద్యులు సురేందర్ రాజు, సుధ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 40, పచ్చ కాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 28, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి రూ. 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఈవీఎంల కమిషనింగ్ పూర్తి



ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ లోడింగ్ చేసిన దృశ్యం



ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్లు లోడింగ్ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

- ఈసీఐఎల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో కొనసాగిన ప్రక్రియ
- భారీ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఈవీఎంలలో అభ్యర్థి పేరు, ఫొటో గుర్తుతో కూడిన బ్యాలెట్ పేపర్‌ను లోడింగ్ చేసే ప్రక్రియ పూర్తి చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల కమిషనింగ్ (బ్యాలెట్ కాగితం అమర్చడం, నమూనా పోలింగ్) ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఖైరతాబాద్ అసెంబ్లీ సహాయ రిటర్నింగ్ అధికారులు హేమంత్ బోర్కాడే, ప్రశాంతి, అనితారెడ్డిలతో పాటు 150 మంది ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ కాగితం ఈవీఎంలలో అమర్చే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 245 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇందుకోసం 2.99 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 45 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా నోటాతో కలిసి 46 గుర్తులను బ్యాలెట్ పేపర్ల ద్వారా ఈవీఎంలను అమర్చారు.

- ఈసీఐఎల్ ఇంజినీర్ల పర్యవేక్షణలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఏజెంట్ల ఆధ్వర్యంలో కమిషనింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ మంగళవారం కూడా కొనసాగనుంది.
- ఈవీఎంలో భాగాలైన బ్యాలెట్ యూనిట్‌కు 3, కంట్రోల్ యూనిట్ 3, వీవీ ప్యాట్‌కు 3 చొప్పున పోలింగ్ కేంద్రం చిరునామా ట్యాగ్‌లను అమర్చడం ద్వారా ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా ఈసీఐఎల్ ఇంజినీర్లు ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్‌ను అమర్చడం ప్రారంభించారు.
- అనంతరం ప్రింట్‌ను ఎన్నికల అధికారులు, సహాయ అధికారులు పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్‌లో కాగితాన్ని అమర్చిన తర్వాత వాటికి సీల్ వేశారు. దీని తర్వాత కంట్రోల్ యూనిట్‌లోనూ బ్యాటరీని అమర్చారు.
- ఆ తర్వాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లను సక్రమంగా అనుసంధానం చేశారు. కంట్రోల్ యూనిట్ స్విచ్ ఆన్‌చేసి నమూనా పోలింగ్‌కు నిర్వహించారు. నమూనా పోలింగ్‌లో భాగంగా ప్రతి అభ్యర్థితో పాటు నోటాకు సైతం ఒక ఓటు చొప్పున వేశారు.
- కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లోని ఫలితాలను పోల్చి నమూనా పోలింగ్ డేటా, వీవీ ప్యాట్ల చిట్టీలను తొలగించారు.
- కంట్రోల్ యూనిట్‌ను స్విచ్ ఆఫ్ చేసి పేపర్ రోల్‌ను లాక్ చేసి వీవీ ప్యాట్ అనుసంధానాన్ని తొలగించారు.
- మరోవైపు ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ అమర్చే ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిఘా నేత్రాల కింద ఈ ప్రక్రియ జరిగింది. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచారు. కేంద్ర సాయుధ బలగాల పహారాలో స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత కొనసాగుతుండగా, యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం చుట్టూ పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కిషన్‌రెడ్డి భారీ బైక్ ర్యాలీ



ఫిలింనగర్‌లో బైక్ ర్యాలీలో కిషన్‌రెడ్డి

ఫిలింనగర్: మోదీ జైత్రయాత్రను ఎవరూ ఆపలేరని, ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ దేశ వ్యాప్తంగా 400 సీట్లలో విజయభేరి మోగించడం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి అన్నారు. ఫిలింనగర్‌లో ఆయన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలిసి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫిలింనగర్, పటేల్‌నగర్, గౌతమ్‌నగర్, బంజారాహిల్స్, మీదుగా ఖైరతాబాద్ వరకు ఆయన బైక్ ర్యాలీ కొనసాగింది.

కాంగ్రెస్ పార్టీకే ప్రజాదరణ: నవీన్‌యాదవ్



ఎర్రగడ్డలో ప్రచారం నిర్వహిస్తున్న నవీన్‌యాదవ్ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించిన కాంగ్రెస్ పార్టీనే పార్లమెంట్ ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తుందని కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు నవీన్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్‌లోని పలుబస్తీల్లో ఇంటింటికీ ప్రచారాన్ని నిర్వహించి కాంగ్రెస్ ఆరు పథకాలను వివరించారు. ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పట్ల పూర్తిగా ఆకర్షితులవుతున్నారన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నేతలు గొంటి సాయినాథ్‌యాదవ్, నయీమ్, సంపత్, అనిల్, శరత్ పాల్గొన్నారు.

డ్రైనేజీలు పొంగుతున్నా స్పందించరా?



డ్రైనేజీల సమస్యలను వివరిస్తున్న నగేష్, నాగరాజు

శ్రీనగర్‌కాలనీ: డ్రైనేజీలు పొంగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, డ్రైనేజీలపై నిర్లక్ష్యం రివాజుగా మారిందని ఎల్లారెడ్డిగూడ నేతలు నగేష్, నాగరాజు ఆరోపించారు. ఎల్లారెడ్డిగూడలోని పలు బస్తీల్లో డ్రైనేజీలు పొంగుతున్నాయని, సమస్యలను వాటర్‌వర్క్స్ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. సోమవారం బస్తీల్లో తిరుగుతూ డ్రైనేజీల సమస్యలను పరిశీలించారు. వేసవిలోనే ఇలా ఉండే రానున్న వర్షాకాలంలో డ్రైనేజీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని త్వరితగతిన డ్రైనేజీ లేకేజీల సమస్యను శాశ్వత పరిష్కారాలను చూడాలని కోరారు.

బాలిక అదృశ్యం

వెంగళరావునగర్: బాలిక అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్‌లో చోటు చేసుకుంది. వివరాలివీ... మధురానగర్ పీఎస్ పరిధిలో ఓ కాలనీలోని నివాసం ఉండే హన్మంతుకు ఇద్దరు పిల్లలు. అతని మైనర్ కుమార్తె ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ వేసవి సెలవులకు ఇంటికి వచ్చింది. ఇటీవల గార్మెంట్స్ షాపులో చేరింది. ఈ నెల 4వ తేదీన షాపునకు వెళ్లి వస్తానని చెప్పి మళ్లీ రాలేదు. ఆమె సోదరుడు సదరు దుకాణానికి వెళ్లి వాకబు చేస్తే రాలేదని చెప్పారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్కూటర్ ఢీకొని ముగ్గురికి గాయాలు

స్కూటర్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... ఎల్లారెడ్డిగూడకు చెందిన బొమ్మ మహేష్ ఈ నెల 4న తన కజిన్స్‌ను ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఎర్రగడ్డకు వెళ్తున్నాడు. మైత్రీవనం వద్దకు రాగానే ఎస్.వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి తన వాహనంతో అతి వేగంగా వచ్చి మహేష్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో మహేష్‌తో పాటుగా సౌమ్య, ప్రణీతలకు గాయాలయ్యాయి.

ఎన్నికల ప్రచార సభలో రౌడీ షీటర్

నిర్వాహకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఎన్నికల సభకు రౌడీషీటర్‌ను ఆహ్వానించిన ఘటనలో కాంగ్రెస్ నేతపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన అనుమతిలో రౌడీషీటర్ల ప్రచారంపై నిషేధం ఉండగా కృష్ణానగర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రచార సభలో నిబంధనలు ఉల్లంఘించినట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే... కృష్ణానగర్ సీ–బ్లాక్‌లో కాంగ్రెస్ నేత కాలే రోహిత్ ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా నమోదై ఉన్న బిల్లా పవన్ ఈ ప్రచారంలో పాల్గొన్నారు. అక్కడే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న జూబ్లీహిల్స్ పోలీసులు పి.రవీందర్‌రెడ్డి గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. బిల్లా పవన్ నేరుగా వేదిక పైనే ఉండటం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంతో ఈ కార్యక్రమం నిర్వహించిన కాంగ్రెస్ నేత కాలే రోహిత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజకీయ సభలు, ప్రచారాల్లో రౌడీషీటర్లు పాల్గొనడం నిషేధం. రౌడీషీటర్లను బైండోవర్ కూడా చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు బిల్లా పవన్ కోసం ఓ బెదిరింపు కేసులో గాలిస్తున్న నేపథ్యంలోనే ఇక్కడ ప్రచార సభల్లో పాల్గొన్నాడు. ఎన్నికల ప్రచారంలో భంగం కలిగించే రౌడీ షీటర్లను ప్రచారంలో పాల్గొనేలా చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గెలుపు మాదే.. భారీ మెజార్టీనే లక్ష్యం: దానం



గౌరీశంకర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ బంపర్ మెజార్టీతో గెలవబోతున్నదని ఇప్పటికే తన విజయం ఖరారైపోయిందని, భారీ మెజార్టీపై దృష్టి పెట్టినట్లు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ తెలిపారు. సోమవారం ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీశంకర్ కాలనీ బస్తీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ తనను గెలిపించాల్సిందిగా ఓటర్లను విజ్ఞప్తి చేశారు. తాను అందరికీ అందుబాటులో ఉండే నేతనని అన్నారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఈ ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పి ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. అయిదేళ్లుగా ఆయన ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఏ నియోజకవర్గానికి కూడా ఏం చేసింది లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, రాములు నాయక్, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, బీఎస్.రెడ్డి, బస్తీ అధ్యక్షుడు ముత్తు తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన యువకుడికి జైలు శిక్ష



నిందితుడు మహ్మద్ ఖాజా

బంజారాహిల్స్: మహిళను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న యువకుడికి ఆరు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. మాసబ్‌ట్యాంక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాసబ్‌ట్యాంక్ ఓవైసీపురాకు చెందిన మహ్మద్‌ఖాజా (27) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ మహిళను వెంటాడుతూ తీవ్రంగా వేధిస్తుండటంతో బాధితురాలు మాసబ్‌ట్యాంక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం పోలీసులు నిందితుడిని నాంపల్లిలోని 12వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కె.లలిత ఎదుట హాజరుపరిచారు. కేసు తీవ్రతను గుర్తించిన జడ్జి నిందితుడికి ఆరు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెలువరించారు. మాసబ్‌ట్యాంక్ ఎస్ఐ సతీష్ ఈ కేసును దర్యాప్తు చేశారు.

జూబ్లీహిల్స్‌లో వ్యక్తి దారుణహత్య

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ కింద సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని యువకుడిని ఇద్దరు వ్యక్తులు తలపై కర్రలతో బాది దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ స్టేడియం ఎదురుగా మెట్రో స్టేషన్ కింద సోమవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌పై పడుకుని ఉండగా ఇద్దరు వ్యక్తులు కర్రలతో తీవ్రంగా కొట్టారు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి మృతుని వివరాల కోసం ఆరా తీయగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికంగా యాచిస్తూ రాత్రిపూట ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తుంటాడని ఇక్కడి వ్యాపారులు పోలీసులకు తెలిపారు. మద్యం మత్తులో ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

‘బీజేపీ-ఎన్డీఏ కూటమిని ఓడించాలి’

హిమాయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ, దాని మిత్ర పక్షాల ఎన్డీయే కూటమిని చిత్తుగా ఓడించి, మోదీ పాలనకు చరమ గీతం పాడాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ కన్నెగంటి రవికుమార్ కోరారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర సమితి ప్రచురించిన ‘అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీజేపీ’ అనే పుస్తకాన్ని సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహాతో కలిసి వారు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఎప్.కరుణ కుమారి, బి.వెంకటేశం, కమతం యాదగిరి, స్టాలిన్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రచారంలో.. దాహార్తి తీర్చుకుంటూ..



గౌరీశంకర్ కాలనీలో కొబ్బరి నీరు తాగుతున్న దానం

బంజారాహిల్స్: ఒక వైపు భానుడి భగభగలు.. మరో వైపు ఎన్నికల వేడి.. వెరసి కార్యకర్తలు, నేతలు భానుడి ప్రతాపానికి గురవుతున్నారు. ఎన్నికల ప్రచారాల వేళ కార్యకర్తలకు, నేతలకు ప్రత్యేకంగా ఓ వాహనాన్ని పెట్టి దాహార్తిని సైతం తీరుస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి దానం సోమవారం గౌరీశంకర్ కాలనీలో ప్రచారాన్ని ముగించుకొని దాహార్తిని తీర్చుకునేందుకు ఇలా కొబ్బరి బొండం తాగి చల్లబడ్డారు.

పద్మారావుగౌడ్‌కు పెరుగుతున్న ఆదరణ



ఉదయ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విష్ణుకుమార్

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజల మనిషి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్‌కు ఎక్కడ చూసినా ప్రజల నుంచి మంచి ఆదరణ కనిపిస్తున్నదని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కంచర్ల విష్ణుకుమార్ అన్నారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఆయన సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 13లోని అంబేద్కర్‌నగర్, ఉదయ్‌నగర్, సింగాడికుంట బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మొన్నటి ఎన్నికల్లో ఏ విధంగా అయితే బీఆర్ఎస్ పార్టీని ఆదరించారో అదే విధంగా పార్లమెంటు ఎన్నికల్లో సైతం పద్మారావుగౌడ్‌ను ఆదరించాలని ఆయన ఓటర్లను కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు రాజు జేజోళ్ల, రాజేశ్వరి, శంకర్, ముర్తుజా, రాధ, నాగరాజు తదిదతరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దాసోహం అంటున్న బీజేపీని ఓడించండి

ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్

హిమాయత్‌నగర్: రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను ధారాదత్తం చేస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగన్న గౌడ్ విజ్ఞప్తి చేశారు. నారాయణగూడలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేసి లక్షలాది మంది పౌరులకు ఉద్యోగావకాశాలు కల్పించాయన్నారు. ఇప్పటికీ లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి ఉద్యోగావకాశాలు లేకుండా చేసిందని మండిపడ్డారు. ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎం.బి.విజయ్‌కుమార్, కార్యదర్శులు ఎస్.నరసింహారెడ్డి, గోదా మల్లేష్‌గౌడ్, ఐఎన్టీయూసీ రాష్ట్ర నేతలు ఎం.రమేష్ గౌడ్, ఎం.రాజేందర్ రెడ్డి, కె. ఉపేందర్, బి.రామకృష్ణ రెడ్డి, శంకర్ నాయక్, డి.మహేష్, బి. వీరన్న, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరు’

రహమత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని, అందుకే అ పార్టీని వీడి స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. రాజీవ్‌నగర్ బస్తీ మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నేత భూపతిరెడ్డితో పాటు యాభై మంది బస్తీవాసులు బాబాఫసియుద్దీన్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్‌వాసులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని.. ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. పాత, కొత్త నాయకులు సమన్వయంతో పనిచేసి సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. బోరబండ డివిజన్ నుంచి అత్యధిక మెజారిటీ తీసుకోరావడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్తా పనిచేయాలన్నారు. రాజీవ్‌నగర్ బస్తీ నాయకులు జస్వంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మారెడ్డి, శంకర్ ముదిరాజ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సంజీవ, ఓంకార్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు నరసింహ, మహేష్ గౌడ్ ఇమ్రాన్, ఖయ్యూం, సరళ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేత మల్లేష్



హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు మల్లేష్ బీజేపీలో చేరారు. గతేడాది బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన ఆయన సోమవారం తిరిగి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డిలు పార్టీ కండువా కప్పి మల్లేష్‌ను పార్టీలోకి ఆహ్వానించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల అరెస్టు

రహమత్‌నగర్: బెల్ట్‌షాపును నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ సమాచారం మేరకు... వినాయక రావునగర్‌కు చెందిన రాములు, మరియ బెల్ట్ షాపును నిర్వహిస్తున్నారు. సోమవారం వారిని అరెస్టు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చట్టపరంగా శిక్షలు ఉంటాయని ఎస్‌హెచ్‌ఓ హెచ్చరించారు.

మైనార్టీల మద్దతు బీఆర్ఎస్‌కే...



దేవరకొండ బస్తీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: మైనార్టీలు బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతునిస్తున్నారని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 5లోని దేవరకొండ బస్తీలో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవితారెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీలకు కేసీఆర్ ఎంతో చేశారన్నారు. ఎన్నో అద్భుతమైన పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేసిన ఘనత తమదని అన్నారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలిన ఆమె కోరారు.

దానంతోనే పేదల అభ్యున్నతి



దానంకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పంజగుట్ట: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ గెలిస్తేనే పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు నారికెల నరేష్, మధురవేణిలు సోమవారం తుమ్మలబస్తీ, చింతల్‌బస్తీ, బిస్తీవాడ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి చెయ్యి గుర్తు ఓటు వేసి దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

వెంగళరావునగర్: తల్లి మందలించిందని ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కె.రవి, స్వప్న దంపతులు తమ పిల్లలు జగదీష్, సాయివైష్ణవితో కలిసి గత కొన్నేళ్లుగా కార్మికనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న స్వప్న తన కుమార్తె సాయివైష్ణవిని భోజనం చేయకుండా పడుకున్నందుకు మందలించింది. దీంతో మనస్తాపానికిలోనైన సాయివైష్ణవి. మేడపై గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిని గుర్తించిన ఆమె తల్లి స్థానికుల సహాయంతో కిందకు దించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

పంజగుట్ట: కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ రైతులకు ఎందుకు రుణాలు మాఫీ చెయ్యదని సంయుక్త కిసాన్ మోర్చా ప్రశ్నించింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోర్చా జాతీయ నాయకులు డాక్టర్ విజ్జు కృష్ణన్, డాక్టర్ సునీలం, అవతార్ సింగ్ మోహ్మా మాట్లాడుతూ... రైతాంగానికి లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా బీజేపీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. నేతలు కె.బాలకృష్ణన్, సుంకెట అన్వేశ్ రెడ్డి, సాగర్, రాయల చంద్రశేఖర్, విస్సా కిరణ్, వెంకట్రాములు, ప్రసాద్, నాగేంద్ర, కోటేశ్వర రావు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా నరేందర్

వెంగళరావునగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్‌సెల్ కన్వీనర్‌గా వెంగళరావునగర్ డివిజన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది కె.నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ సోమవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. న్యాయవాదిగా తాను చేసిన సేవలను గుర్తించి తనను టీపీసీసీ కన్వీనర్‌గా నియమించిన చైర్మన్ అశోక్‌గౌడ్ తదితర లీగల్‌సెల్ నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు

వెంగళరావునగర్: అకారణంగా దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... వెంగళరావునగర్‌కు చెందిన జీవన్‌కుమార్ అతని సోదరుడు మణిరత్నం ఈ నెల 4న మధురానగర్‌లో టీ తాగుతున్నారు. నా సమయంలో జవహర్‌నగర్‌కు చెందిన శ్రావణ్, సర్ఫ్‌రాజ్ అనే యువకులు వచ్చి వారిపై అకారణంగా దాడి చేసి గాయపరిచారు. అంతేగాకుండా కులం పేరుతో దూషించి వెళ్లిపోయారు. బాధితులు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సోమవారం ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ సమీపంలో మింట్ కంపౌండ్‌కు వెళ్లే రోడ్డులో డివైడర్‌పై ఓ వ్యక్తి విగత జీవిగా పడి ఉన్నాడు. ఈ సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి కడుపు, కాళ్లపై గాయాలున్నాయి. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

గిరిజనులు, ఆదివాసీలు ఎక్కువగా ఉన్న మహబూబాబాద్ ఎంపీ సెగ్మెంట్ నాలుగు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఇందులో నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్ మినహా మిగతావన్నీ ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలే. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాచలం మినహా ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన తెల్లం వెంకట్రావు సైతం కారు దిగి 'చేయి'అందుకున్నారు. గడిచిన పదేళ్ల పాలన, ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఇమేజ్‌పైనే ప్రధానంగా ఆధారపడి బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఈ లోక్‌సభ ఎన్నికల గోదాలో దిగారు.

- సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/సాక్షి, మహబూబాబాద్

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

సెగ్మెంట్	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,09,150	1,13,455	7	2,22,612
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451
నర్సంపేట	1,15,068	1,20,370	9	2,35,447
ములుగు	1,13,592	1,19,172	27	2,32,791
పినపాక	99,824	1,03,798	5	2,03,627
ఇల్లెందు	1,0,9812	1,15,094	4	2,24,910
భద్రాచలం	72,925	79,597	7	1,52,529
	7,46,982	7,83,280	105	15,30,367

పాతవారే ప్రత్యర్థులు..



ముగ్గురిలో మానుకోట ఎవరిది? ● తొలిఎన్నికలో విజేతగా నిలిచిన కాంగ్రెస్... వరుసగా రెండుసార్లు టీఆర్ఎస్

ఆయా ఎన్నికల్లో ఇలా...

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి 2009లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయం సాధించి, కేంద్ర కేబినేట్‌లో చోటు దక్కించుకున్నారు. ఆ తర్వాత 2014, 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులు అజ్మీరా సీతారాంనాయక్, మాలోత్ కవిత గెలిచారు. ఈ స్థానంలో వరుస మూడు ఎన్నికల్లో గెలిచిన బలరాంనాయక్, అజ్మీరా సీతారాంనాయక్, మాలోత్ కవిత ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా నాలుగోసారి వేర్వేరు పార్టీల నుంచి పోటీలో ఉండటం విశేషం.

ముందంజలో హస్తం



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎన్నికల్ కోడ్ అమల్లోకి రాకముందే బలరాంనాయక్‌ను తమ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆ వెంటనే మార్చి 11న మణుగూరులో నిర్వహించిన భారీ బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇటీవల మహబూబాబాద్, కొత్తగూడెంల్లో జరిగిన జనజాతర సభలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. పైగా ఇటీవల కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఈ నియోజకవర్గానికి సంబంధించి మేడారం జాతర, గిరిజన వర్సిటీ, భద్రాచలం విలీన గ్రామాలు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ వంటి అంశాలను చోటు కల్పించింది. దీంతో ప్రచారంలో హస్తం పార్టీ దూసుకుపోతోంది.

సిట్టింగ్‌కే సీటు



సిట్టింగ్ ఎంపీగా ఉన్న కవితకే బీఆర్ఎస్ మరోసారి టికెట్ కేటాయించింది. ఆమె గెలుపును కాంక్షిస్తూ గులాబీ బాస్ కేసీఆర్ భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందంటూ కేసీఆర్ విమర్శిస్తున్నారు. రైతుబంధు, రుణమాఫీ, కరెంటు కోతలు వంటి అంశాలను లేవనెత్తుతున్నారు. దీంతోపాటు కొత్త జిల్లాలైన కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలను రద్దు చేస్తారంటూ అధికార పార్టీని కార్నర్ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ సభలకు వచ్చిన అశేష జనసందోహం ఓట్లుగా మారితే గెలుపు తమనే అనే ధీమా గులాబీదళంలో ఉంది.

2019 ఎంపీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

మాలోత్ కవిత (టీఆర్ఎస్)	4,62,109
పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్)	3,15,446
అరుణ్‌కుమార్ (టీజేఎస్)	57,073
వెంకటేశ్వరరావు (సీపీఐ)	45,719
జాటోత్ హుస్సేన్ (బీజేపీ)	25,487

మోదీపైనే ఆశలు



మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ బీజేపీపైనే నమ్మకం పెట్టుకున్నారు. ప్రధాని మోదీ బ్రాండ్ ఇమేజ్ పైనే ఆయన పూర్తిగా ఆధారపడ్డారు. సీతారాంనాయక్ తరఫున ఇప్పటికే ఆ పార్టీకి చెందిన జాతీయ నేతలు ఒక దఫా ప్రచారం చేశారు. అయితే ఇదంతా ఉమ్మడి వరంగల్ జిల్లాకే ఎక్కువగా పరిమితమైంది. పోలింగ్ ముందు భద్రాద్రి జిల్లాలో ఉన్న మూడు అసెంబ్లీ స్థానాల్లో కమలం పార్టీ ప్రచారం ఉధృతం చేయనుంది.

ప్రభావితం చేసే అంశాలు

- ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు
- భద్రాచలంలో విలీన మండలాలు / గ్రామాల్లో కొన్నింటిని తిరిగి తెలంగాణలో కలపడం
- భద్రాచలం ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- సింగరేణి విస్తరణ, ఇల్లెందు, మణుగూరు పట్టణాల భవిష్యత్‌కు గ్యారంటీ
- గౌరెల్లి (హైదరాబాద్) – మహబూబాబాద్ – ఇల్లెందు – కొత్తగూడెం జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 930పీ) విస్తరణకు నిధుల మంజూరు.
- బొగ్గు గనుల ప్రాంతాలను కలుపుతూ బల్లార్షా – మణుగూరుల మధ్య రాత్రి సమయంలో ఎక్స్‌ప్రెస్ రైలు
- నిర్మాణంలో ఉన్న కొత్త / ట్రిప్లింగ్ / డబ్లింగ్ పనుల్లో వేగం పెంచడం
- సమ్మక్క – సారలమ్మ జాతరకు కేంద్రం నుంచి నిధులు
- యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు
- ట్రైబల్ టూరిజం సర్క్యూట్ మలిదశ అభివృద్ధి
- సమ్మక్క – సారలమ్మ గిరిజన వర్సిటీకి మౌలిక సదుపాయల కల్పన, పక్కా భవనాల నిర్మాణం
- మహిళా ఓటర్లే కీలకం

మహబూబాబాద్ స్కాన్

అప్పటి ప్రజల్లోనే చైతన్యం ఎక్కువ

బారులుదీరి ఓట్లు వేసేవారు

ఏ పార్టీ నేత వచ్చినా స్వచ్ఛందంగా తరలివచ్చేవారు

ప్రచార ఖర్చు.. హంగూ ఆర్భాటాలు తక్కువ

నా తొలి ఎన్నికల్లో ఖర్చు రూ.7,500 మాత్రమే

'సాక్షి'తో కాంగ్రెస్ కురువృద్ధ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికలు పండుగలా సాగేవి. ప్రజలు చైతన్య గీతికలై బారులుదీరి ఓట్లు వేసేవారు. ఓ నేత పల్లె, పట్టణానికి వస్తున్నాడని తెలిస్తే వారి ప్రసంగం వినడానికి ఆసక్తి చూపేవారు. అప్పట్లో హంగూఆర్భాటాలు లేకపోగా, ప్రచార ఖర్చు కూడా నామమాత్రమే. ఎలాంటి హడావుడి లేకుండా అభ్యర్థుల ప్రచారం సాగేది. అప్పటికీ, ఇప్పటికి పరిశీలిస్తే ప్రచారంలో పెను మార్పులు వచ్చాయి..'అని కాంగ్రెస్ పార్టీ కురువృద్ధ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు రామసహాయం రఘురాంరెడ్డి ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా 94 ఏళ్ల వయస్సు ఉన్న ఆయన నాటి ఎన్నికల తీరును సోమవారం ఖమ్మంలో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు సురేందర్‌రెడ్డి మాటల్లోనే..

వ్యక్తిగత విమర్శలు ఉండేవి కావు..

ఎన్నికల ప్రచారంలో విధి విధానాలపైనే ప్రత్యర్థి పార్టీల మధ్య, అభ్యర్థుల మధ్య ప్రసంగాలు సాగే వి. పార్టీలపరంగా, అభ్యర్థుల పరంగా అసలు వ్యక్తిగత విమర్శలు ఉండేవి కావు. దిగజారుడు విమర్శ లనేవి నాడు ఏ పార్టీలోనూ చోటు చేసుకునేవి కావు.

ప్రజలు అక్కున చేర్చుకునే వారు..

ప్రచారానికి నేతలు వస్తున్నారంటే నాడు ప్రజలు అక్కున చేర్చుకునే వారు. సభలు, సమావేశాలను వారే సొంతంగా ఏర్పాటు చేయడమే కాక వచ్చిన వారికి చందాలు వేసుకుని మరీ భోజనాలు పెట్టేవారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రసంగంలో ఏం చెబుతున్నారనేది శ్రద్ధగా వినేవారు. నాడు కాంగ్రెస్, కమ్యూనిస్టుల నడుమ పోటీ ఉండగా.. సభలు, సమావేశాలకు మాత్రం ప్రజలందరూ హాజరయ్యేవారు. ఈ పార్టీ, ఆ పార్టీ అని చూడకుండా గ్రామాల్లో ప్రజలు కలిసిపోయి సమావేశాలకు తరలివచ్చేవారు. రెండు జీపులు వాడడంతో పాటు రూ.వేలల్లోనే మా ప్రచార ఖర్చు పూర్తయ్యేది. నా తొలి ఎన్నికల్లో రూ.7,500 ఖర్చు చేశా.

నాలుగేసిసార్లు ఎంపీగా, ఎమ్మెల్యేగా..

ఖమ్మం జిల్లాలో నా తండ్రి రాఘవరెడ్డి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని రాజకీయాల్లోకి అ డుగు పెట్టా. 1965లో మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీగా ఉన్న ఇటికాల మధుసూదన్‌రావు మృతితో జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి కమ్యూనిస్టు నేత ఎం.ఓంకార్‌పై గెలిచా. ఆ తర్వాత 1967లో వరంగల్ నుంచి పోటీ చేసి బీజేఎస్ అభ్యర్థి ఎల్.ఎస్.రాజుపై విజయం సాధించా. 1989, 1991లోనూ వరంగల్ నుంచే గెలిచా. 1974లో డోర్నకల్ ఎమ్మెల్యేగా ఉన్న మా బావ నూకల రామచంద్రారెడ్డి మరణించడంతో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యా. ఆపై 1978, 1983, 1985ల్లో వరుసగా డోర్నకల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందా. ఇలా నాలుగుసార్లు ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశా.

13న పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు

ప్రభుత్వ, ప్రైవేటురంగ ఉద్యోగులకు వర్తింపు

సెలవు ఇవ్వకుంటే కఠిన చర్యలకు సీఈఓ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ నెల 13న పోలింగ్ జరగనుండటంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవును ప్రకటించింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ 1881 కింద ఈ మేరకు సెలవు ప్రకటిస్తూ మార్చి 19న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1974 కింద ఫ్యాక్టరీలు, షాపులు, ఇండస్ట్రియల్ అండర్‌టేకింగ్స్, ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ మార్చి 22న రాష్ట్ర కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణికుముదిని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగుల కు సెలవు ఇవ్వని పక్షంలో కార్మిక, ఎన్నికల చట్టాల కింద కఠిన చర్యలు తీసుకోవాల ని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశించారు. ఈ మేరకు సీఈఓ కార్యాలయం సోమవారం ఉత్తర్వులను విడుదల చేసింది.

పోలింగ్/కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే సెలవులు..

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏదైనా ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల భవనాల్లో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆయా కార్యాలయాలు, సంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవులను ప్రకటించే అధికారాన్ని స్థానిక జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. పోలింగ్‌కు ముందు రోజు అనగా మే 12న, 13న పోలింగ్ రోజు, జూన్ 4న కౌటింగ్ రోజు అక్కడి ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించాలని సూచించింది.

సాయంత్రం సభలు.. కార్నర్ మీటింగ్‌లు



- 11వ తేదీ వరకు సీఎం రేవంత్ వరుస ఎన్నికల ప్రచారం
- 9, 10 తేదీల్లో రాహుల్, ప్రియాంకలతో కలిసి హాజరు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాల్లో పర్యటించనున్నారు. మంగళవారం నుంచి ఎన్నికల ప్రచారం గడువు ముగిసే 11వ తేదీ వరకు ఆయన ప్రచారసభలు, కార్నర్ మీటింగ్‌లకు హాజరవుతారు. ఈ మేరకు గాంధీభవన్‌వర్గాలు ప్రచార షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశాయి.

- మంగళవారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్‌లో జరిగే జనజాతరసభకు హాజరుకానున్న సీఎం రేవంత్, ఆ తర్వాత వరంగల్ ఈస్ట్, వెస్ట్ నియోజకవర్గాల్లో రోడ్‌షో నిర్వహించి కార్నర్ మీటింగ్‌లలో మాట్లాడతారు.
- బుధవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఆర్మూర్ కార్నర్ మీటింగ్‌కు వెళ్లనున్న రేవంత్, ఆ తర్వాత నిజామాబాద్‌లో రోడ్‌షో చేసి..కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారు.
- ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు పటాన్‌చెరు కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్న సీఎం రేవంత్, సాయంత్రం 3 గంటలకు మక్తల్‌లో జరిగే జనజాతర సభతో ఎన్నికల ప్రచారం ముగిస్తారు. తన సొంత పార్లమెంట్ నియోజకవర్గమైన మహబూబ్‌నగర్ నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ అదే నియోజకవర్గంలో ప్రచారం ముగించనున్నారు.

ఆ ఇద్దరితో కలిసి

- ఈనెల 9,10 తేదీల్లో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకాగాంధీలు తెలంగాణ ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. వీరితో కలిసి సీఎం రేవంత్ కూడా పాల్గొంటారు.
- 9వ తేదీన రాహుల్‌గాంధీ నర్సాపూర్ జనజాతర సభలో పాల్గొంటారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియం సభకు హాజరవుతారు.
- 10వ తేదీన కామారెడ్డి, తాండూరులలో ప్రియాంకాగాంధీ పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు కామారెడ్డి, ఒంటిగంటకు తాండూరు జనజాతర సభల్లో ప్రసంగించనున్న ప్రియాంకాగాంధీ సాయంత్రం కూకట్‌పల్లి, మణికొండల్లో జరిగే కార్నర్ మీటింగ్‌లకు హాజరవుతారు.

మోదీ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు

10న నారాయణపేటకు ప్రధాని మోదీ: డీకే అరుణ



పాలమూరు: 'అవినీతి సామ్రాట్‌లు.. బ్లాక్ మెయిల్ దందాలు చేసే సన్యాసులు.. ఓటుకు నోటు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన దొంగలకు విశ్వ గురువు నరేంద్ర మోదీ గురించి మాట్లాడే అర్హత లేదు. సీఎంగా రేవంత్‌కు ఎలాంటి అనుభవం లేదు. కనీసం ఒక మంత్రిగా పని చేసి ప్రజల సమస్యలు పరిష్కారం చేసింది లేదు. లక్కీడిప్‌లో సీఎం అయ్యాడు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిల్లాకేంద్రంలోని ఆమె నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 'నాది కల్తీ రక్తమా? కల్తీ రక్తం అంటే ఏంటో కాంగ్రెస్ చిల్లర నేతలు సమాధానం చెప్పాలి. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికీ పడుతుంది. ముఖ్యమంత్రికి దమ్ముంటే పాలమూరుకు జూరాల నుంచి నీళ్ల తీసుకునేలా అడ్మినిస్ట్రేషన్ అనుమతులు ఇప్పించాలి'అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణపేటకు ఈనెల 10న ప్రధాని మోదీ రానున్నట్లు తెలిపారు.

కుట్రలు చేస్తే అడుగు పెట్టనివ్వబోం

బీజేపీ నేతలకు టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: దొరలు, దోపిడీదారుల మీద పోరాటం చేసి ఏర్పాటు చేసుకున్న ప్రజాపాలనను అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కుట్రలు చేయాలని చూస్తే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాలను హైదరాబాద్‌లో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కూడా జీర్ణించుకోలేని మోదీకి ఇక్కడ ఓట్లడిగే హక్కు లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు రాజకీయ చీకటి దొంగలని, బీజేపీకి సీట్ల కోసమే కేసీఆర్ యాత్రలు చేస్తున్నారని దయాకర్ ఆరోపించారు. వేముల రోహిత్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, రోహిత్‌కు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తామని తెలిపారు.

అద్దంకి దయాకర్‌పై నిషేధం విధించాలి

సీఈవోకు బీజేపీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా విద్వేష ప్రసంగం చేసిన కాంగ్రెస్‌నేత అద్దంకి దయాకర్ తదుపరి ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా నిషేధం విధించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం బీజేపీ కార్యదర్శి కొల్లి మాధవి, బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత, బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్ గోకుల రామారావు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నిర్మల్ కాంగ్రెస్ ప్రచార సభలో అద్దంకి దయాకర్ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా సీఈవోకు అందజేసినట్లు వారు తెలిపారు. హిందూ దేవుళ్లను కించపరిచినందుకు దయాకర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ కార్యాలయంలో కొల్లి మాధవి మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరేమిటో ఆ పార్టీ నేతలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఒక వర్గానికి, మతానికి వంత పాడుతున్నారని ధ్వజమెత్తారు.



నల్లగొండలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉద్యోగులు

ఎన్నారైల మద్దతు కాంగ్రెస్ పార్టీకే

- ఐఓసీ కార్యదర్శి ఆరతి కృష్ణన్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నారైలు కాంగ్రెస్ పార్టీకే మద్దతిస్తున్నారని పార్టీ ఇండియన్ ఓవర్సీస్ కార్యదర్శి ఆరతి కృష్ణన్ చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రవాస భారతీయులు కోరుకుంటున్నారని ఆమె అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఓసీ అమెరికా అధ్యక్షుడు మహేందర్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్ సామల, నేతలు గంప వేణుగోపాల్, రాజేశ్వర్‌రెడ్డి, వంగ సందీప్‌లతో కలసి ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా బీజేపీ అన్యాయం చేసిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్ల లాంటి అంశాల్లో పోరాటం చేయాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు గల్ఫ్ కార్మికుల కోసం ఎన్నో ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టిందన్నారు.

రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



రామన్నపేట: బీసీ, ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కే మనువాద ఎజెండా కలిగిన బీజేపీ.. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు వ్యతిరేకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సోమవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌కు మద్దతుగా భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులగణన చేయకుండా రిజర్వేషన్లు కొనసాగిస్తామని బీజేపీ నాయకులు చెప్పే మాటలు నమ్మశక్యం కావని, మోదీ పదేళ్ల పాలన పేదలు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా సాగిందని ఆరోపించారు. బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని అన్నారు. ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిస్టులకు చట్టసభల్లో పోరాడే ఆయుధాలను ఇవ్వాలని కోరారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో చట్టసభల్లో కమ్యూనిస్టు పార్టీల ప్రాతినిధ్యం బలంగా ఉంది కాబట్టే ఉపాధి హామీ పథకం, ఆహారభద్రత, పోడుభూముల వంటి చట్టాలు అమలులోకి వచ్చాయని తమ్మినేని వివరించారు. కేసీఆర్ గెలిస్తే కేంద్రంలో మోదీకి మద్దతు ఇవ్వరనే గ్యారంటీ లేదన్నారు. రోడ్‌షోలో అభ్యర్థి ఎండీ జహంగీర్, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కటకం మల్లమ్మకు ఓటు వేసేందుకు సాయం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఇదే చివరి ఓటు.. ఓటేసిన తెల్లారే వృద్ధురాలు మృతి

హోం ఓటింగ్‌లో ఓటు హక్కు వినియోగం

మంచిర్యాలఅగ్రికల్చర్/భీమిని: హోం ఓటింగ్ ద్వారా ఆదివారం ఓటేసిన ఓ వృద్ధురాలు సోమవారం కన్నుమూసిన ఘటన మంచిర్యాల జిల్లా భీమిని మండలం ఖర్జీభీంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల సంఘం హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖర్జీభీంపూర్‌కి చెందిన కటకం మల్లమ్మ(88) హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా, ఎన్నికల సిబ్బంది ఆదివారం ఇంటి వద్దకే వెళ్లడంతో ఇంట్లో నుంచే ఓటు వేసింది. అయితే హఠాత్తుగా ఆరోగ్యం విషమించి సోమవారం కన్నుమూసింది. ఓటు వేసేందుకు యువత కూడా బద్ధకిస్తున్న ఈ తరుణంలో జీవిత చరమాంకంలోనూ ఓటేసి కన్నుమూసిన ఆమె ఆదర్శంగా నిలిచిందని గ్రామస్తులు అంటున్నారు.

రాష్ట్రంలో 2 వేల సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలు

- విధుల్లో 160 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు
- ఇతర రాష్ట్రాల నుంచి 7వేల మంది హోంగార్డుల వినియోగం... లోక్‌సభ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు
- శాంతి భద్రతల అడిషనల్ డీజీ, ఎన్నికల నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 13న రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు శాంతి భద్రతల అడిషనల్ డీజీ, ఎన్నికల నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్ 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 19,500 పోలింగ్ ప్రాంతాల్లో రెండు వేల పోలింగ్ ప్రాంతాలను సమస్యాత్మక లొకేషన్స్‌గా గుర్తించినట్టు చెప్పారు. గతంలో జరిగిన ఘటనల ఆధారంగా వీటిని గుర్తించామని, ఇక్కడ అవసరం మేరకు స్థానిక పోలీస్ బలగాలతోపాటు అదనంగా కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. రాష్ట్ర పోలీసులతోపాటు ఎన్నికల బందోబస్తు విధుల్లో 160 కంపెనీల కేంద్ర సాయుధ పోలీస్ బలగాలను వినియోగించనున్నట్టు జైన్ వెల్లడించారు. ఇప్పటికే 110 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రంలో ఎన్నికల విధుల్లో ఉన్నట్టు తెలిపారు. ఇంకా 50 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రానికి వస్తాయని చెప్పారు. ఈ బలగాలతో పాటు ఎన్నికల విధుల్లో ఇతర రాష్ట్రాల నుంచి ఏడువేల మంది హోంగార్డులను వినియోగించనున్నట్టు జైన్ తెలిపారు. నగదు, మద్యం, బంగారం, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాపై నిఘా కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 477 చెక్‌పోస్టులు , రాష్ట్ర సరిహద్దుల్లో 89 ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్టు ఆయన వివరించారు.

దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో శుక్రవారం మూడో విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. కీలకమైన రాష్ట్రం గుజరాత్‌లో మొత్తం స్థానాలకూ ఇదే విడతలో పోలింగ్ జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్ స్వీప్‌చేసింది. అదే ఊపులో ఈసారి హ్యాట్రిక్‌పై కన్నేసింది. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో అంతకంతకూ చిక్కిపోతున్న కాంగ్రెస్ ఈసారి ఆప్‌తో కలిసి 'ఇండియా' కూటమి కింద బీజేపీని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో గుజరాత్‌లోని కీలక లోక్‌సభ స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



మోదీ, షా కంచుకోటలో...

కాంగ్రెస్‌కు పెనుసవాల్

గుజరాత్‌లో 25 స్థానాలకు నేడే పోలింగ్

స్టేట్ స్కాన్

వదోదర... కొత్త ముఖాలు


• హేమంగ్ జోషీ


గుజరాత్‌లో మూడో అతి పెద్ద నగరమిది. ఇక్కడ వరుసగా రెండు ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలుపొందిన రంజన్‌బెన్ ధనంజయ్ భట్‌ను బీజేపీ అనూహ్యంగా పక్కనబెట్టింది. డాక్టర్ హేమంగ్ జోషీని పార్టీ బరిలో నిలిపింది. కాంగ్రెస్ తరఫున పఢియార్ జస్పాల్‌సింగ్ మహేంద్రసింగ్ పోటీలో ఉన్నారు. వీరిద్దరూ కొత్తవారే కావడం విశేషం. ఈ సీటు 1998 నుంచి బీజేపీ గుప్పిట్లోనే ఉంది. మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదంతో మరోసారి నెగ్గుతామని కమలనాథులు ధీమాగా ఉన్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 7 సెగ్మెంట్లలో 6 బీజేపీ ఖాతాలోనే పడ్డాయి. మిగతా చోట స్వతంత్ర అభ్యర్థి నెగ్గారు. 2014లో మోదీ లోక్‌సభ అరంగేట్రం వారణాసి, వదోదరల నుంచే జరగడం తెలిసిందే. ఇక్కడ ఆయనకు ఏకంగా 5.7 లక్షల మెజారిటీ లభించింది. వారణాసి నుంచి ఎంపీగా కొనసాగి వదోదరను వదులుకున్నారు.

రాజ్‌కోట్... రూపాలాకు రాజ్‌పుత్ గండం


• పురుషోత్తం రూపాలా

గుజరాత్‌లో ఎదురే లేని కమలనాథులకు కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా కొత్త చిక్కులు తెచ్చిపెట్టారు. సిట్టింగ్ ఎంపీ మోహన్ కుందరియాను కాదని బీజేపీ ఆయనకు టికెటిచ్చింది. కానీ 'మహారాజులు బ్రిటిష్‌వారికి, విదేశీ పాలకులకు లొంగిపోయారని, వారితో విందువినోదాల్లో మునగడమే గాక వాళ్లకు తమ కుమార్తెలనిచ్చి పెళ్లిళ్లు చేశా'రని రాజ్‌పుత్‌లపై రూపాలా చేసిన వ్యాఖ్యలతో ఆ సామాజికవర్గం భగ్గుమంది. ఆయన్ను రాజ్‌కోట్ బరి నుంచి తప్పించాలని, లేదంటే ఓడించి తీరుతామని బీజేపీకి వారు అల్టిమేటమిచ్చారు! ఆందోళనలు కూడా చేశారు. రూపాలా పలుమార్లు క్షమాపణలు చెప్పినా వివాదం సద్దుమణగలేదు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి పరేశ్‌బాయ్ ధనాని పోటీలో ఉన్నారు. రాజ్‌పుత్‌లు, పటీదార్ల మధ్య ఎప్పటినుంచో వైరముంది. పటీదార్ సామాజికవర్గానికి చెందిన రూపాలా దానికిలా ఆజ్యం పోయడం తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది.

గాంధీనగర్..
అద్వానీ కోటలో షా పాగా!


• అమిత్ షా

ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటైన ఈ నియోజకవర్గం 1989 నుంచి కమలనాథుల గుప్పిట్లోనే ఉంది. శంకర్ సింఘ్ వాఘేలా, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ వంటి హేమాహేమీలకు నెలవైన ఈ స్థానంలో కేంద్ర హోం మంత్రి, బీజేపీ దిగ్గజం అమిత్ షా పాగా వేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 5,57,014 ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు. ఈసారి మెజారిటీ మరింత పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన్ను ఢీకొట్టేందుకు కాంగ్రెస్ అభ్యర్థులను వెతుక్కోవాల్సిన పరిస్థితి! చివరకు 62 ఏళ్ల సోనల్ పటేల్‌ను రంగంలోకి దించింది. ఆమె ఏఐసీసీ సెక్రటరీగా, ముంబై, పశ్చిమ మహారాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్నారు. గిఫ్ట్ సిటీ అభివృద్ధి, గాంధీ సబర్మతి ఆశ్రమానికి మెరుగులు, అయోధ్య రామ మందిరం, మోదీ ఫ్యాక్టర్ తదితరాలతో తనకు తిరుగులేదని షా ధీమాతో ఉన్నారు. గాంధీనగర్ పరిధిలోని మొత్తం 7 అసెంబ్లీ స్థానాలూ బీజేపీవే! సీఎం భూపేంద్ర పటేల్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఘట్లోడియా కూడా వాటిలో ఒకటి.

భావనగర్.. బరిలో ఆప్


• నింబూబెన్ బంభానియా

ఈ స్థానంపై ఆమ్ ఆద్మీ పార్టీ కన్నేసింది. కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా భావనగర్, బరుచ్‌లను ఆ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ గట్టి పట్టున్న బీజేపీని ఢీకొట్టేందుకు ఉమేశ్‌బాయ్ నరన్‌బాయ్ మక్వానాను పోటీకి దించింది. బీజేపీ కూడా సిట్టింగ్ ఎంపీ భారతీబెన్ ధీరూబాయ్ శియాల్‌ను పక్కనబెట్టి నింబూబెన్ బంభానియాకు టికెటిచ్చింది. 1991 నుంచీ ఇక్కడ కాషాయ జెండానే ఎగురుతోంది. గత ఎన్నికల్లో భారతీబెన్‌కు 4.29 లక్షల మెజారిటీ లభించింది. ఈ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు బీజేపీ చేతిలోనే ఉన్నాయి. మిగతా స్థానం ఆప్‌ది కావడం విశేషం. గత అసెంబ్లీ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసి 5 సీట్లు నెగ్గిన ఆప్ లోక్‌సభ బరిలో బీజేపీకి సవాలు విసురుతోంది. మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్‌ను అక్రమంగా అరెస్టు చేశారంటూ ప్రచారంతో హోరెత్తిస్తోంది. కేజ్రీవాల్ భార్య సునీత కూడా ప్రచారానికి దిగారు.

పోర్‌బందర్.. మన్‌సుఖ్ అరంగేట్రం


• మన్‌సుఖ్ మాండవీయ

బీజేపీకి గట్టి పట్టున్న ఈ నియోజకవర్గం నుంచి కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తొలిసారి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. 2012 నుంచీ రాజ్యసభకు ఎన్నికవుతున్న ఆయన పోటీతో పోర్‌బందర్‌పై ఆసక్తి నెలకొంది. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రమేశ్‌బాయ్ ధడక్ చేతిలో 2.3 లక్షల ఓట్ల తేడాతో ఓడిన లలిత్ వసోయాకే కాంగ్రెస్ మళ్లీ టికెటిచ్చింది. ఈ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో ఆరు బీజేపీ చేతిలోనే ఉన్నాయి. కుతియానాలో మాత్రం సమాజ్‌వాదీ పార్టీ గెలిచింది.

బనస్కాంత.. గెనీబెన్ సవాల్


రేఖా బెన్ చౌదరి • గెనీబెన్ ఠాకోర్

ఉత్తర గుజరాత్‌లోని ఈ స్థానంలో బీజేపీకి గట్టి పోటీ ఎదురవుతోంది. 'వావ్' నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గెనీబెన్ ఠాకోర్‌ను కాంగ్రెస్ బరిలోకి దించడమే అందుకు కారణం. దాంతో బీజేపీ కూడా సిట్టింగ్ ఎంపీ పర్వత్‌బాయ్ పటేల్‌ను కాదని ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రేఖాబెన్ చౌదరి రూపంలో మహిళకే టికెటివ్వాల్సి వచ్చింది. ఆమెకు రాజకీయ అనుభవం లేదు. తొలిసారి ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. గుజరాత్‌లో ఇరు పార్టీల నుంచీ మహిళలే రంగంలో ఉన్న ఏకైక సీటు కావడంతో బనస్కాంత అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. దీని పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నాలుగు చోట్ల గెలిచింది. అయితే గెనీబెన్ కమలం హవాలో కూడా విజయం సాధించి 'వావ్' అనిపించారు. రేఖాబెన్‌కు రాజకీయ అనుభవం లేకున్నా నియోజకవర్గంతో సత్సంబంధాలున్నాయి. బనస్ డెయిరీ ఈ నియోజకవర్గంలోని 4.5 లక్షల మంది రైతుల నుంచి రోజూ పాలు సేకరిస్తుంది. దీని వ్యవస్థాపకుడు గల్బాబాయ్ చౌదరి మనుమరాలు రేఖ. ఆమె భర్త హితేశ్ చౌదరి బీజేపీ నాయకుడు. అయినా గెనీబెన్ వంటి బలమైన ప్రత్యర్థిపై రేఖ వంటి కొత్త ముఖాన్ని నిలబెట్టడంపై బీజేపీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి నెలకొందని పార్టీ వర్గాలే చెవులు కొరుక్కుంటున్నాయి!

ఎన్నికల ఉపాధి... 9 లక్షల మందికి!



లోక్‌సభ ఎన్నికలు ఎంతోమంది ఆకలి బాధ తీరుస్తున్నాయి. తాత్కాలికంగానైనా ఉపాధి కల్పిస్తున్నాయి. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 దాకా ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతుండడం తెలిసిందే. ఈ ఎన్నికల సీజన్‌లో దేశవ్యాప్తంగా కనీసం 9 లక్షల తాత్కాలిక ఉపాధి అవకాశాలు లభిస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పలు రకాల అవసరాలను తీర్చే విధంగా ఉద్యోగాలుంటాయని 'వర్క్ ఇండియా' సీఈవో సహ వ్యవస్థాపకుడు నీలేశ్ దుంగార్‌వాల్ తెలిపారు. ప్రధానంగా డేటా ఎంట్రీ ఉద్యోగాలు, బ్యాక్ ఆఫీస్, డెలివరీ, డ్రైవర్లు, కంటెంట్ రైటింగ్, సేల్స్ వంటి రూపాల్లో ఉపాధి లభిస్తోంది. ఏప్రిల్ 19న తొలి విడత దశ పోలింగ్ నాటికే 2 లక్షల తాత్కాలిక ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చినట్టు సీఐఈఎల్ హెచ్‌ఆర్ డైరెక్టర్ ఆదిత్య నారాయణన్ మిశ్రా తెలిపారు. డేటా విశ్లేషణ, ప్రణాళిక, ప్రజలతో సంబంధాలు, మార్కెట్ సర్వే, మీడియా సంబంధాలు, కంటెంట్ డిజైన్, కంటెంట్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఏఐ స్ట్రాటజీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ఈ అవకాశాలు అందివచ్చినట్టు చెప్పారు. 8 నుంచి 13 వారాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రింటింగ్, రవాణా, ఫుడ్, బెవరేజెస్, క్యాటరింగ్, సెక్యూరిటీ, ఐటీ నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్, అనలిటిక్స్‌లో 4 నుంచి 5 లక్షల మందిని తాత్కాలిక ప్రాతిపదికగా నియమించుకుంటున్నట్టు మిశ్రా అంచనా వేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మూడో దశలో... ముమ్మర పోరు

ఛత్తీస్‌గఢ్, బెంగాల్, అసోంల్లో కీలక స్థానాల్లో హోరాహోరీ

ఒంటరి పోరుతో పశ్చిమ బెంగాల్‌లో కమ్యూనిస్టుల కోటను బద్దలు కొట్టిన మమత ఇప్పుడు బీజేపీ నుంచి రాష్ట్రంలో గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. మూడో విడతలో భాగంగా అక్కడ నాలుగు లోక్‌సభ స్థానాలకు, బీజేపీ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో ఏడింటికి, అసోంలో నాలుగింటికి మంగళవారం పోలింగ్ జరగనుంది. వాటిల్లో కీలక స్థానాలను ఓసారి చూస్తే...

- సాక్షి, నేషనల్ డెస్క్

జాంగీపూర్ (పశ్చిమ బెంగాల్)


• ఖలీలుర్ రెహమాన్

మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రాతినిధ్యం వహించిన ఈ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొంది. 2019లో బీజేపీ అభ్యర్థి మఫుజా ఖాతూన్‌పై తృణమూల్ కాంగ్రెస్ నేత ఖలీలుర్ రెహమాన్ 2.4 లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారీ ఆయనే పోటీలో ఉన్నారు. బీజేపీ ధనుంజయ్ ఘోష్‌కు టికెటివ్వగా కాంగ్రెస్ ప్రణబ్ ముఖర్జీ కుమారుడు అభిజిత్‌ను పక్కన పెట్టి మొర్తజా హుస్సేన్‌ను పోటీకి దింపింది. దాంతో ఇక్కడ ముక్కోణపు పోటీ నెలకొంది.

ఉత్తర మాల్డా (పశ్చిమ బెంగాల్)


• ప్రసూన్ బెనర్జీ

ఇక్కడి ఓటర్లలో చైతన్యం ఎక్కువ. బీజేపీ సిట్టింగ్ ఎంపీ అభ్యర్థి ఖగేన్ ముర్ముకు తృణమూల్ నుంచి బరిలో దిగిన మాజీ ఐపీఎస్ అధికారి ప్రసూన్ బెనర్జీ గట్టి పోటీ ఇస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ముస్తాక్ ఆలం బరిలో ఉన్నారు. ఇక్కడ 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన మౌసమ్ నూర్ 2019లో తృణమూల్ నుంచి పోటీ చేశారు. ఖగేన్ చేతిలో 1.85 లక్షల ఓట్ల తేడాతో ఓడారు. ఇక్కడా ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది.

గువాహటి (అసోం)


• బిజులి కలిత మేధి

ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ రెండూ మహిళలకే టికెటిచ్చాయి. బీజేపీ సిట్టింగ్ ఎంపీ క్వీన్ ఓజాను కాదని రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షురాలు బిజులి కలిత మేధిను బరిలో దింపింది. ఇక కాంగ్రెస్ అభ్యర్థి బీరా బోర్తకుమార్ గోస్వామి పూర్వాశ్రమంలో బీజేపీ నేతే! పర్వత, మారుమూల ప్రాంతాల్లోనూ ఆమె సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. నిరుద్యోగం, వరదలు, తాగునీరు ఇక్కడి సమస్యలు.

దుబ్రి (అసోం)


• బద్రుద్దీన్ అజ్మల్

ఈ లోక్‌సభ స్థానం ఏకంగా 142 కిలోమీటర్ల మేర బంగ్లాదేశ్‌తో సరిహద్దును పంచుకుంటోంది. బ్రహ్మపుత్ర పొంగినప్పుడల్లా ఇక్కడి ప్రజలకు కష్టాలు తప్పవు. వరదలు, పేదరికం, బాల్య వివాహాలు ప్రధాన సమస్యలు. ముస్లింలు ఏకంగా 80 శాతమున్నారు. దాంతో వారి ఓట్లే ఫలితాన్ని నిర్దేశిస్తుంటాయి. ఏఐయూడీఎఫ్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్ ఇక్కడ వరుసగా నాలుగోసారి గెలిచేందుకు శ్రమిస్తున్నారు. బీజేపీ మిత్రపక్షం ఏజీపీ నుంచి జబేద్ ఇస్లాం, కాంగ్రెస్ నుంచి రకీబుల్ హుస్సేన్ పోటీలో ఉన్నారు.

దక్షిణ మాల్డా (పశ్చిమ బెంగాల్)


• శ్రీరూప మిత్ర చౌదరి

ఉత్తర మాల్డాతో పాటు ఈ స్థానం కూడా ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. జమిందారీ కుటుంబీకుడు ఘనీఖాన్ చౌదరి హవా నడిచేది. రెండు దశాబ్దాలు మాల్డా రాజకీయాలను శాసించిన ఆయన మరణానంతరం పరిస్థితి మారింది. ముస్లిం ప్రాబల్య స్థానమైన దక్షిణ మాల్డాలో ముక్కోణపు పోటీ నెలకొంది. 2009, 2014, 2019ల్లో ఘనీఖాన్ సోదరుడు అబూ హసీం ఖాన్ కాంగ్రెస్ నుంచి గెలిచారు. ఈసారి ఆయన కుమారుడు ఇషా ఖాన్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి శ్రీరూప మిత్ర చౌదరి, టీఎంసీ తరఫున షానవాజ్ అలీ రెహమాన్ పోటీ చేస్తున్నారు.

మాధేపుర (బిహార్)


• దినేశ్ చంద్ర యాదవ్

మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరీ ప్రసాద్ మండల్, జేడీ(యూ) దిగ్గజం శరద్ యాదవ్, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ వంటి రాజకీయ ప్రముఖులు ప్రాతినిధ్యం వహించిన స్థానమిది. ఆర్జేడీ సారథ్యంలోని మహా కూటమి నుంచి ప్రొఫెసర్ కుమార్ చంద్రదీప్ యాదవ్ పోటీలో ఉన్నారు. జేడీ(యూ) నుంచి సిట్టింగ్ ఎంపీ దినేశ్ చంద్ర యాదవ్ మరోసారి పోటీకి నిలబడ్డారు.

అరారియా (బిహార్)

బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రదీప్‌కుమార్ సింగ్ బరిలో ఉన్నారు. 2019లో ఆయన చేతిలో 1.37 లక్షల ఓట్ల తేడాతో ఓడిన మహమ్మద్ సర్ఫరాజ్ ఆలంకే ఆర్జేడీ మళ్లీ టికెటిచ్చింది. ఇద్దరు బలమైన స్వతంత్ర అభ్యర్థులూ బరిలో ఉన్నారు.


• ప్రదీప్‌కుమార్ సింగ్

రాయ్‌గఢ్ (ఛత్తీస్‌గఢ్)


• రాధేశ్యామ్ రతియా

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి 1999 నుంచి 2014 దాకా ఇక్కడినుంచే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. పైగా ఆయన అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానం కూడా రాయ్‌గఢ్ లోక్‌సభ స్థానం పరిధిలోనే ఉంది. దాంతో ఇక్కడ బీజేపీని గెలిపించుకోవడం సీఎంకు ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ నుంచి రాధేశ్యామ్ రతియా, కాంగ్రెస్ నుంచి మేనకాదేవి సింగ్ పోటీ చేస్తున్నారు. గోండ్ రాజ కుటుంబ వారసురాలైన మేనకాదేవి డాక్టర్ కూడా.

పేలేది మళ్లీ షాట్ గన్నే!

ఆసన్‌సోల్‌లో టీఎంసీ, బీజేపీ హోరాహోరీ


• శత్రుఘ్న సిన్హా

ఆసన్‌సోల్. పశ్చిమ బెంగాల్‌లో కీలక లోక్‌సభ స్థానం. గత ఉప ఎన్నికలో బీజేపీని ఓడించిన తృణమూల్ కాంగ్రెస్ ఈసారి పట్టు నిలుపుకోవాలని చూస్తోంది. ఆ పార్టీ దూకుడుకు అడ్డుకట్ట వేయడంపై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. 'షాట్‌గన్', 'బిహారీ బాబు'గా ప్రసిద్ధుడైన బాలీవుడ్ దిగ్గజం, సిట్టింగ్ ఎంపీ శత్రుఘ్న సిన్హా టీఎంసీ నుంచి మళ్లీ బరిలో ఉన్నారు. సీనియర్ నేత సురేంద్రజీత్‌సింగ్ అహ్లువాలియాను బీజేపీ బరిలో నిలిపింది. ఈ హాట్ సీట్‌లో నాలుగో విడతలో భాగంగా మే 13న పోలింగ్ జరగనుంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

హై ప్రొఫైల్ లోక్‌సభ స్థానమైన ఆసన్‌సోల్‌లో హిందీ మాట్లాడేవారు ఎక్కువ. జార్ఖండ్ సరిహద్దు కావడమే అందుకు కారణం. ఇక్కడ పరిశ్రమలు అధికం. రాణిగంజ్, పాండవేశ్వర్, జమురియాల్లో బొగ్గు గనులున్నాయి. దాంతో బిహార్, యూపీ వలస కార్మికులు ఎక్కువ. తాగునీటి ఎద్దడి, అక్రమ మైనింగ్ ఇక్కడి ప్రధాన సమస్యలు. ఒకప్పుడు సీపీఎం కంచుకోట. 2014లో దానికి బీటలు వారాయి. బీజేపీ నుంచి బాబుల్ సుప్రియో బరాల్ గెలుపొందారు. 2019లోనూ ఆ పరంపరను కొనసాగించారు. 2021లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత సుప్రియో తృణమూల్‌లో చేరడంతో ఉప ఎన్నిక జరిగింది. టీఎంసీ నుంచి శత్రుఘ్న సిన్హా గెలుపొందారు.

అహ్లువాలియాపైనే బీజేపీ ఆశలు...


• అహ్లువాలియా

ఈసారి బీజేపీ తమ తొలి జాబితాలోనే భోజ్‌పురి గాయకుడు పవన్ సింగ్‌కు ఆసన్‌సోల్ టికెటిచ్చింది. తన పాటల్లో మహిళలను అగౌరవపరిచే వ్యక్తికి టికెటిచ్చారంటూ టీఎంసీ తదితర పక్షాలు విమర్శలు గుప్పించాయి. దాంతో పవన్ స్వచ్ఛందంగా తప్పుకున్నారు. అనంతరం 'సర్దార్జీ'గా పిలుచుకునే ఎస్.ఎస్. అహ్లువాలియాకు బీజేపీ టికెట్ దక్కింది. ఆయన రాజ్యసభ మాజీ సభ్యుడు. 2014లో డార్జిలింగ్, 2019లో బర్ధమాన్–దుర్గాపూర్ లోక్‌సభ స్థానాల నుంచి గెలుపొందారు. ఆయన కచ్చితంగా నెగ్గుతారని బీజేపీ అంటోంది. ఎంపీగా పార్లమెంటు ముఖమే చూడని వ్యక్తి ప్రజా సమస్యలను ఏం పట్టించుకుంటారన్న టీఎంసీ విమర్శలను అహ్లువాలియా తిప్పికొడుతున్నారు. ''నేను సర్దార్‌ను. ఆసన్‌సోల్ బిడ్డను. ఇక్కడే పుట్టి పెరిగా. నా మూలాలిక్కడే ఉన్నాయి. నా ప్రజలకు సేవ చేయాలన్న ఆకాంక్షే నన్నిక్కడికి నడిపించింది'' అంటున్నారు.

కీలకం

భారీ మెజారిటీపై శత్రుఘ్న కన్ను

శత్రుఘ్న సిన్హా పూర్వాశ్రమంలో బీజేపీ నాయకుడే కావడం విశేషం! పట్నా సాహిబ్ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ టికెట్‌పై గెలుపొందారు. 2019 లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. 2022లో టీఎంసీకి మారారు. అపారమైన ఫ్యాన్ ఫాలోయింగ్ తన బలమంటున్నారాయన. ''ఎంపీగా రెండేళ్లలో చేసిన కృషే నా తరఫున మాట్లాడుతుంది. పైగా ఆసన్‌సోల్‌లో యూపీ, బిహార్ కార్మికుల సంఖ్య చాలా ఎక్కువ. ఈసారి మరింత భారీ మెజారిటీతో గెలుస్తా'' అని ధీమాగా చెబుతున్నారు. సీపీఎం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జహనారా ఖాన్ బరిలో ఉన్నారు. లోక్‌సభకు పోటీ చేయడం ఆమెకిదే తొలిసారి. 55 ఏళ్ల జహనారాది దిగువ మధ్యతరగతి నేపథ్యం. రెండుసార్లు జమురియా నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ''ఆసన్‌సోల్ పదేళ్లుగా ప్రాభవాన్ని కోల్పోయింది. ఈ సుప్రియోలు, సిన్హాలు నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదు. గ్రామీణ గిరిజనులు, మైనారిటీలు తాగునీటి కొరతతో అల్లాడుతున్నారు. పదేళ్లలో ప్రభుత్వ యాజమాన్యంలోని హిందుస్థాన్ కేబుల్స్ సహా ఎన్నో కర్మాగారాలు మూతపడ్డాయి'' అంటూ జోరుగా ప్రచారం చేస్తున్నారు.

ఈ కామర్స్ వేదికలకు ఎన్నికళ

అమెజాన్, ఫ్లిప్‌కార్టుల్లో అమ్మకానికి ఎన్నికల సామగ్రి





ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ కామర్స్ వేదికలు ఎన్నికల సీజన్‌ను సొమ్ము చేసుకునే ప్రయత్నాల్లో పడ్డాయి. పార్టీల ప్రచార సామగ్రి, వాటి అభిమానించే ఓటర్లు ధరించే ఉత్పత్తులను అమ్మకానికి పెట్టాయి. దాంతో ఎన్ని'కళ' ఈ వేదికలనూ చేరింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో పార్టీల రంగులతో కూడిన టీ షర్టులు, క్యాప్‌లను విక్రయిస్తున్నాయి. 'నమో హ్యాట్రిక్', 'రాహుల్ ఈజ్ హోప్' (రాహులే ఆశాకిరణం) వంటి సందేశాలతో కూడిన టీ షర్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. ''సుమారు 12 మంది విక్రేతలు ఈ కామర్స్ వేదికలపై ఎన్నికల సామగ్రి అమ్మకాలకు నమోదు చేసుకున్నారు. ఎన్నికల హీట్ పెరుగుతున్న కొద్దీ మరింత మంది ఆసక్తి చూపిస్తున్నారు'' అని ఓ ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఉద్యోగి వెల్లడించారు. స్వతంత్ర రిటైలర్లు, బ్రాండ్ లైసెన్స్ తీసుకున్న కంపెనీలు వినూత్న ఉత్పత్తులతో యువ ఓటర్లను ఆకర్షించేలా అమ్మకాల వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. ఖరీదైన వస్త్రాలు, కీ చైన్లు, కార్లు, ఇళ్లలో పెట్టుకోగలిగిన జెండాలు, ల్యాంపులు, క్లాక్‌ల వంటివి వీటిలో ఉన్నాయి. బ్లాక్ వైట్ ఆరెంజ్ కంపెనీ 'హౌ టు బి యాన్ ఇన్‌ఫ్లుయెన్సర్', 'ఐ వాంట్ టు వోట్ ఫర్ ఇండియా' వంటి సందేశాలతో 'ఏ47' బ్రాండ్‌పై ఖరీదైన వస్త్రాలను విక్రయిస్తోంది. అమెరికాలో ఎన్నికల సామగ్రి మార్కెట్ చాలా పెద్దది. భారత్‌లోనూ ఇప్పుడిప్పుడే విస్తరిస్తోందని బ్లాక్‌వైట్ వ్యవస్థాపకుడు భవిక్ వోరా తెలిపారు. బీజేపీ ఇప్పటికే నమో యాప్‌పై టీ షర్ట్‌లు, మగ్‌లు, స్టేషనరీని విక్రయిస్తుండడం తెలిసిందే.

దొందూ దొందే!



బాబుకు ఏటీఎం పోలవరం: మోదీ



కరుడు గట్టిన ఉగ్రవాది మోదీ: బాబు

2019 ఎన్నికల్లో పరస్పర విమర్శలు..

తిట్టుకున్న గతం మరిచి నేడు ఇద్దరూ చెట్టాపట్టాల్

అసహజ కూటమి మాటున మోదీ–బాబుల అనాలోచిత వ్యాఖ్యలు..

మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి


పేదల అక్షరంపై కక్ష

పుట్టుకతో వచ్చే మాతృభాషను చంపడం సాధ్యమా?

- పెత్తందార్ల పిల్లలే ఇంగ్లిష్‌లో చదివి పెద్ద కొలువులు చేయాలా?
- పేద బిడ్డలకు మాత్రం ఇంగ్లిష్ విద్యను దూరం చేయాలని కుట్రలు చేస్తారా?
- పేదోళ్ల బిడ్డలు ఎప్పటికీ కూలీలుగానే ఉండిపోవాలా?
- పెత్తందార్ల పోకడలను తప్పుబడుతున్న మేధావులు, విద్యావంతులు
- ఇంగ్లిష్ మీడియంపై ఇంకా కొనసాగుతున్న ఏడుపు
- ఏపీలో ఇంగ్లిష్ మీడియం సృష్టించిన ప్రభంజనంతో కుళ్లు
- పేదల పిల్లలంతా తెలుగు మీడియంలోనే చదువుకోవాలంటున్న పెత్తందార్లు
- తెలుగు భాష పరిరక్షణకు చర్యలు తీసుకుంటారట
- చంద్రబాబు మాటలను అమిత్ షా నోటితో పలికించడంపై సర్వత్రా ఆగ్రహం
- కంచ ఐలయ్య, కత్తి పద్మారావు, ఆర్ కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్య తదితర మేధావుల మండిపాటు

నిరుపేదల చదువుపై ఇంకా పెత్తందార్ల కక్ష తీరడం లేదు. జగన్ ప్రభుత్వంలో వారికి ఉచితంగా ఇంగ్లిష్ మీడియం చదువు చెప్పిస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనూ ఏపీ విధానాలపై ప్రశంసలు కురిపిస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు సైతం ఇక్కడి విద్యా విధానంలో తెచ్చిన సంస్కరణలను వేనోళ్ల పొగుడుతుంటే వీరికి గిట్టడం లేదు. ఉన్న పళంగా వారికి మాతృభాషపై ప్రేమ పుట్టుకొచ్చేసింది. దానిని జగన్ తొక్కేస్తున్నారంటూ అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఏదోలా జగన్‌ను ఇరుకున పెట్టాలని వారు లేనిపోని కుట్రలు చేస్తున్నారు. బీజేపీ అగ్రనేత అమిత్ షా సైతం ఇక్కడి పచ్చనేతల స్క్రిప్టునే వల్లె వేస్తూ నిరుపేదల చదువుపై కుట్రకు పన్నాగం పన్నుతున్నారు.

–సాక్షి, అమరావతి





బడుగులు ఎదుగుతున్నారనే బాబు భయం

కత్తి పద్మారావు, కవి, సామాజిక ఉద్యమకారుడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన విద్యా సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తుండటంతో బడుగులు ప్రపంచ మానవులుగా ఎదుగుతుండటంతో చంద్రబాబుకు భయం పట్టుకుంది. అందుకే కేంద్ర ప్రభుత్వానికి చెందిన పెద్దలు రాష్ట్రానికి వచ్చినప్పుడు మన రాష్ట్రానికి కావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు అడగడం మానేసి ఇంగ్లిష్‌పై విషం నూరిపోశారు. చంద్రబాబు మొదట్నుంచి కులవాది, తన కుల ఆధిపత్యం కోరుకునే వ్యక్తి. అందుకే తన సామాజికవర్గం వారే ఇంగ్లిష్ చదువులతో విదేశాలకు వెళ్లాలని కోరుకుంటున్నారు. పేద పిల్లలు మాత్రం ఇక్కడే అరకొర వేతనాలతో ఉండిపోవాలన్నది ఆయన దురుద్దేశం. విభజనాంధ్రకు తొలి ముఖ్యమంత్రిగా ఆయన ఐదేళ్లపాటు నారాయణ, చైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించి, వారి ఆర్థిక సహకారంతో రాజకీయం నడిపారు. పేద పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. విద్యా వ్యవస్థను కులతత్వ పూరితంగా మార్చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇంగ్లిష్ చదువులను దూరం చేసే కుట్ర చేశారు. సీఎం వైఎస్ జగన్ మాత్రం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. దేశంలోనే తొలిసారిగా బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు అందించారు. ఇంగ్లిష్ మీడియంను ప్రోత్సహించారు. ఖరీదైన బైజూస్ కంటెంట్‌ను ఉచితంగా అందించారు. ట్యాబ్‌లు ఇచ్చారు. విశ్వవిజ్ఞానాన్ని అందుకునేలా పేద పిల్లలను తీర్చిదిద్దారు. దీనిపై పెత్తందార్లు కుయుక్తులు పన్నడం సరికాదు.

తెలుగు కోసం కాదు విద్యా వెలుగు అడ్డుకోవాలనే..



ఏపీలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కి దీటుగా జగన్ అభివృద్ధి చేస్తున్నారు. నిరుపేద విద్యార్థులు కెరీర్‌లో ఉన్నత స్థాయికి వెళ్లేందుకు వీలుగా ఇంగ్లిష్ మీడియం కూడా తీసుకువచ్చారు. వాటి ఫలితాలు కూడా ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. ఇది ఇంకా పెరిగి దేశం మొత్తం అనుసరిస్తే విద్యా వ్యాపారానికి నూకలు చెల్లుతాయనే కేంద్రంలోని పెద్దల భయం. అయినా ప్రస్తుతం ఐఏఎస్, ఐపీఎస్ ఇతర ప్రభుత్వ ఉన్నతోద్యోగులు ఏ భాషలో చదివారు? తెలుగు మీడియంలో చదువుకున్నవారిలో అత్యధికులు నిరుద్యోగులుగా, లేదా చిరుద్యోగులుగా ఎందుకు మిగిలారు? అమిత్‌షా పిల్లలు ఎక్కడ చదివారు? భాజాపా నేత వెంకయ్యనాయుడు, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, చంద్రబాబు... వాళ్ల పిల్లలు, మనవళ్లను ఏ మీడియంలో చదివించారు? అదే చదువు బడుగు బలహీన వర్గాల వారికి వద్దని ఎలా చెబుతారు? అందరూ విద్యావంతులైతే హెచ్చుతగ్గులుండవన్నది అంబేడ్కర్ మాట. అందుకు తగ్గట్టుగా ఏపీలో అడుగులు పడుతున్నాయి. ఇది చూసి తమ ఆధిపత్యం ఎక్కడ పోతుందోనని కొందరు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు.

– జస్టిస్ ఈశ్వరయ్య

అమిత్ షా ఇంట పిల్లలు ఏ మీడియం చదువుతున్నారు



అమిత్‌షా పిల్లలు ఏ మీడియంలో చదువుతున్నారో చెప్పాలి. డబ్బున్నవారంతా తమ పిల్లలను ఇంగ్లిష్ మీడియంలో చదివిస్తున్నారు. కూటమిలో ఉన్న నాయకుల మాట విని తెలుగు భాష గురించి అమిత్‌షా మాట్లాడటం బాధగా ఉంది. చంద్రబాబు కొడుకు ఎక్కడ చదివాడు? ఏం మీడియంలో చదివాడు? పేద ప్రజల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదివితే తప్పేంటి? విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిన నాయకుడు సీఎం జగన్. ఓటుకి ఇంగ్లిష్ మీడియానికి ముడిపెట్టడం సరికాదు. ఇంగ్లిష్ మీడియం తీసుకు రాను అని చెప్పే దమ్ము చంద్రబాబుకు ఉందా?

– యార్లగడ్డ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ కో–ఆర్డినేటర్

బాబొస్తే ఇంగ్లిష్ మీడియం తీసేయడం తథ్యం



భవిష్యత్తులో చంద్రబాబు తీసుకోబోయే చర్యలకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. మోదీ, అమిత్ షాల మాటను బాబు తూచా తప్పరు కాబట్టి.. టీడీపీ అధికారంలోకి వస్తే ఇంగ్లిష్ మీడియం తీసేయడం తథ్యం. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పిల్లలకు మంచి స్కూళ్లు, మౌలిక సదుపాయాలు, భోజన వసతి, బైలింగ్వల్ బుక్స్ అందుబాటులోకి తెచ్చారు. దీని వల్ల రానున్న రోజుల్లో పెట్టుబడి దారుల పిల్లలకు పోటీపడే స్థాయిలో పేద వర్గాల పిల్లలు ఎదుగుతారు. ప్రాంతీయ భాషలోనే చదువు అంటున్న అమిత్ షా కొడుకు జయ్ షా పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో చదువుకుని చిన్న వయసులోనే నేషనల్ క్రికెట్ బోర్డ్ చైర్మన్ అయ్యాడు. మరి తన కొడుకుని అమిత్ షా గుజరాతీలో ఎందుకు చదివించలేదు? అంబానీకి ధీరూబాయ్ అంబానీ పేరుతో ముంబయిలో పెద్ద ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఉంది. అక్కడ గుజరాతీ, మరాఠీ సబ్జెక్టే లేదు. మరి వాటిని మరాఠీ లోకో, గుజరాతీ భాషలోకో అమిత్ షా ఎందుకు మార్పించలేదు? ఏ మీడియంలో చదివితే పిల్లలు బాగా రాణించగలరో అదే మీడియంలో చదివించాలి కదా. ఇంగ్లిష్ మీడియంలో చదివినంత మాత్రాన తెలుగు రాకుండా ఎలా పోతుంది? పల్లెల్లో వ్యవసాయ కూలీలు, చెప్పులు కుట్టేవారు, కుండలు చేసుకునేవారికి ఇంగ్లిష్ చదువులు వస్తే తమ పిల్లలతో పోటీ పడతారని వీరి భయం. కూటమి అధికారంలోకి వస్తే విద్యావ్యవస్థను కుక్కలు చింపిన విస్తరి చేద్దామని చూస్తున్నారు.

– కంచ ఐలయ్య, విద్యావేత్త

అమిత్ షా, చంద్రబాబు పిల్లలు మాతృభాషలోనే చదివారా?



మాతృభాషకు మద్దతు సాకుతో జరుగుతున్న ప్రచారం వెనుక పేదల చదువులను దెబ్బతీసే కుట్ర దాగి ఉంది. మాతృభాషను చంపేస్తున్నారంటూ విమర్శలు చేస్తున్న అమిత్ షా, చంద్రబాబు, రామోజీరావు వంటి పెద్దల వారసులు, మనుమలు మాతృభాషలోనే చదివారా? మాతృభాషపై ఎంతో ప్రేమ ఉన్నట్టు నటిస్తున్న వారి పిల్లలు మాత్రం ఇంగ్లిష్‌లో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేదోళ్లు మాత్రం మాతృభాషను బతికించాలనే నిబంధనతో ప్యూన్లు, క్లర్కులు, గుమాస్తాలు, కూలీలుగా మిగిలిపోవాలా? ఇదెక్కడి ఆటవిక న్యాయం. పేద పిల్లలు ఇంగ్లిష్ చదువులు చదవకూడదా? పెత్తందార్లకు మాత్రమే ఇంగ్లిష్ చదువులు రాసిపెట్టారా? ఏ బిడ్డ అయినా పుట్టినప్పటి నుంచి మాతృభాషలోనే అక్షరాభ్యాసం చేస్తారు కదా. అలాంటి మాతృభాషను ఎవరో చంపేస్తే చచ్చిపోతుందా? చంద్రబాబు చెబితే మాత్రం అమిత్ షాకు అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పేద బిడ్డలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఇంగ్లిష్‌కు అధిక ప్రాధాన్యమిస్తుంటే తట్టుకోలేకపోతున్నారు. ఆయన కృషివల్లే ఈ రోజు మన పేద బిడ్డలు అమెరికాలోని శ్వేతసౌధం, ఐక్యరాజ్యసమితి, వరల్డ్ బ్యాంకు, ఐఎంఎఫ్, కొలంబియా యూనివర్సిటీ వంటి అంతర్జాతీయ వేదికలపై ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడి సత్తా చూపారు. ఇక్కడి తల్లిదండ్రులు కూడా ఇంగ్లిష్ మీడియంనే కోరుకుంటున్నారు. ఎన్నికల వేళ దీనిపై రాజకీయం తగదు.

–ఆర్.కృష్ణయ్య, రాజ్యసభ సభ్యుడు

ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో మీ భూమికి భద్రత

ఈ చట్టంపై చంద్రబాబు, ఎల్లో మీడియా బరితెగించి దుష్ప్రచారం

కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు

- హక్కుల కల్పన సులభతరం
- రూ.2 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తూ చట్టాన్ని తీసుకొస్తున్న ప్రభుత్వం
- భూములకు గ్యారంటీ ఇస్తూ రైతు ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రూపకల్పన
- సచివాలయాలు, వలంటీర్లు, సంక్షేమ పథకాల తరహాలోనే ఈ కొత్త భూ సంస్కరణలు
- రైతుకు రూపాయి ఖర్చు కాకుండా ఉచితంగా సర్వే.. భూ హక్కు పత్రాల ఒరిజినల్స్ అందజేత
- రైతులకు లబ్ధి చేకూర్చే చట్టం రావడం జీర్ణించుకోలేక ఎల్లో గ్యాంగ్ రోత రాతలు
- సచివాలయాలు, వలంటీర్లు, పథకాలపైనా గతంలోనూ ఎల్లో మీడియా దుష్ప్రచారం

'స్థల వివాదాల్లో కేసు ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే.. నెగ్గినవాడు ఇంటికెళ్లి ఏడ్చాడట..' ఇది సామెత కాదు. నిజం.. గతంలో ఏదైనా స్థల వివాదం పరిష్కారానికి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ లోగా వాద, ప్రతివాదుల ఆస్తులు తరిగిపోవడమే కాక.. వారి మానసిక, శారీరక శ్రమ అంతా ఇంతా కాదు. అలాంటి భూ వివాదాలకు సులభంగా పరిష్కారం చూపేలా, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సిన అవసరం లేకుండా భూముల అమ్మకాలు, కొనుగోళ్లు సులభతరం చేసేలా.. ప్రజలకు వారి భూములపై సంపూర్ణ హక్కులు కల్పించేలా కేంద్రం రూపొందించిన 'ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్' అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం భూములను రీ సర్వే చేయిస్తోంది. అయితే ప్రజల భూముల్ని ప్రభుత్వం లాగేసుకుంటుందంటూ నిలువెల్లా 'పచ్చ విషం' నింపుకున్న కుహనా మేధావులతో కలిసి చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా బరితెగించింది.

రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేసారి

భూమి రికార్డుల్లో ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతూనే ఉంటాయి. క్రయ విక్రయాలు, వారసత్వ హక్కులు, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లు, నాలా మార్పులు... ఇలా అనేక సందర్భాల్లో భూ రికార్డులు మార్చాల్సి ఉంటుంది. అలా భూమిపై లావాదేవీల సమయంలో రిజిస్ట్రేషన్ అధికారులు డీడ్ రిజిస్ట్రేషన్ మాత్రమే చేస్తారు. ఆ రిజిస్ట్రేషన్‌ను రెవెన్యూ రికార్డుల్లో మార్చుకునేందుకు పాతచట్టం ప్రకారం 45 రోజుల్లో సంబంధిత తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలి. అప్పుడు విచారణ చేసి హక్కులు మారిన మాట వాస్తవమని భావిస్తే 1బీ రికార్డులో కొత్తగా భూమి ఎవరి పేరుమీద వచ్చిందో వారి పేరును రికార్డు చేస్తారు. అలా చేయకపోతే రిజిస్ట్రేషన్ జరిగినా రికార్డు మారదు. పాసు పుస్తకం రాదు. కొత్త చట్టం ప్రకారం భూమిపై హక్కులను సింగిల్ విండో మెకానిజం ద్వారా టీఆర్వోనే మార్చేస్తాడు. మళ్లీ తహసీల్దార్ల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సిన పని ఉండదు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అక్కడే అవుతుంది. రైతుల పని మరింత సులువవుతుంది.

అభ్యంతరాలుంటే దరఖాస్తుకు రెండేళ్ల సమయం

పాత చట్టం ప్రకారం తయారు చేసిన రికార్డుల్లో ఏవైనా అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకునేందుకు ఏడాది సమయం ఇచ్చారు. అభ్యంతరాలను పరిశీలించి వాటిని పరిష్కరించిన తర్వాత 1బీ రిజిస్టర్ తయారు చేసి అందులో భూ యాజమాన్య వివరాలను పొందుపరిచారు. కొత్త చట్టం ప్రకారం ఇదే పద్ధతి అమలుచేస్తారు. టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్వో) నేతృత్వంలో జరిగే ఈ ప్రక్రియలో భూములు సర్వే చేసి, వాటి పటాల ఆధారంగా గ్రామ స్థాయిలో రికార్డు తయారు చేస్తారు. ఈ రికార్డులపై అభ్యంతరాలుంటే రెండేళ్లలోపు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని వాటిని పరిష్కరించిన తర్వాతే ఈ రిజిస్టర్ తయారుచేస్తారు. సర్వే చేసి, అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత రూపొందించే ఈ టైటి ల్ రిజిస్టర్ మరింత పకడ్బందీగా ఉంటుంది. రికార్డు తయారు చేసేటప్పుడు వెళ్లి హక్కులు నిరూపించుకోవాల్సిన అవసరం లేదు.

కొత్త చట్టంతో సులువుగా వివాదాల పరిష్కారం

పాతచట్టం ప్రకారం ఇచ్చే పాస్ పుస్తకం పూర్తి స్థాయి హక్కు కాదు. అది ప్రిజంప్టివ్ మాత్రమే. ఆ హక్కులను ఎవరూ సవాలు చేయనంత వరకే అది రికార్డుగా మనుగడలో ఉంటుంది. ఎవరైనా సవాలు చేస్తే మళ్లీ అన్ని రికార్డులను పరిశీలించి యాజమాన్య హక్కులను నిర్ధారిస్తారు. 1బీలో పేరున్నంత మాత్రాన సరిపోదు. వివాదం వస్తే అడంగల్, రీ సర్వే రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్), రికార్డ్ ఆఫ్ హోల్డింగ్స్ (ఆర్వోహెచ్)... ఇలా మిగిలిన అన్ని రికార్డులు సరిచూడాల్సిందే. భూమి కొనాలన్నా, అమ్మాలన్నా, వివాదాలు వచ్చినా, బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా అన్ని రికార్డులను పరిశీలించాలి. టైట్లింగ్ చట్టం అమల్లోకి వస్తే టైటిల్ రిజిస్టర్ ఒక్కటి చూస్తే చాలు. కొత్త చట్టంతో సులువుగా వివాదాన్ని పరిష్కరించవచ్చు.

సీఎం జగన్ పాలన అద్భుతమంటూ ప్రజలు కితాబునిస్తుంటే.. ఏం చేయాలో తెలియక జుత్తు పీక్కుంటున్న చంద్రబాబు తన వక్ర బుద్ధిని మరోసారి బయటపెట్టాడు. ఈ సారి వ్యవసాయ రంగాన్ని ఎంచుకున్నాడు. రైతులకు ఎంతో మేలు చేసే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారాన్ని తెరపైకి తెచ్చాడు. దానికి 'పచ్చ' మీడియా గొంతు కలిపింది. ఈ యాక్ట్‌పై ప్రజల్లో అపోహలు కలిగించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రజల్లో విషబీజాలు నాటుతున్నారు. ప్రజల భూములకు ప్రభుత్వమే భరోసా ఉండేలా రూపొందించిన ఈ 'ల్యాండ్ టైట్లింగ్' చట్టంపై చంద్రబాబు, ఎల్లో మీడియా విషప్రచారం చూసి భూచట్టాల నిపుణులు, రెవెన్యూ సంస్కరణలపై అవగాహన ఉన్న నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టంలోని అంశాలు కనీసం చదవకుండా, అవగాహన లేకుండా మాట్లాడుతున్న మాటలు, రాస్తున్న రోత రాతలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

రూ.2 వేల కోట్లకు పైగా ఖర్చును ప్రభుత్వమే భరిస్తూ.. ఈ చట్టాన్ని తీసుకొస్తుంది. మన భూముల్ని ఉచితంగా సర్వే చేసి.. సరిహద్దు రాళ్లు వేయించి.. భూహక్కు పత్రాలు అందించి.. రైతులకు ఒక్క రూపాయి ఖర్చుకాకుండా ఈ సంస్కరణలకు జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ఓట్ల కోసం బరితెగించిన ఎల్లో మీడియా, చంద్రబాబు బృందం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పగలదా? ఒక ప్రభుత్వం ఎవరి భూమినైనా లాక్కునేందుకు మన రాజ్యాంగం అంగీకరిస్తుందా? ఒక ముఖ్యమంత్రికి భూములు లాక్కునే హక్కు ఉంటుందా? ఈ ఐదేళ్లలో ఎవరి భూములనైనా ప్రభుత్వం లాక్కుందా?

ఈ నేపథ్యంలో ప్రస్తుతం భూముల విషయంలో అమలవుతున్న రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్)–1971 చట్టం ఏం చెబుతోంది? ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ – 2023 ఏం చెబుతోంది? పాత చట్టాలుండగా కొత్త చట్టం ఎందుకు అవసరం? ఇప్పటివరకు అమల్లో ఉన్న రెవెన్యూ చట్టానికి, కొత్త రెవెన్యూ చట్టానికి వ్యత్యాసమేంటి? ఈ చట్టం వల్ల నిజంగా మేలు జరుగుతుందా? అనే విషయాలను ఒక్కసారి రాష్ట్ర ప్రజలు, రాజకీయ పక్షాలు తప్పని సరిగా తెలుసుకోవాలి.

అప్పుడు పన్ను రసీదులే రికార్డులు

వందల ఏళ్ల క్రితం వరకు భూములకు సంబంధించి ఏ రికార్డు లేకపోయినా ఇబ్బంది ఉండేది కాదు. రాజ్యాలు ఏర్పడ్డాక భూములకు రికార్డుల అవసరం ఏర్పడింది. భూమిపై పన్ను వసూలు కోసం రికార్డులు అవసరమయ్యాయి. మొదట్లో రైతులు కట్టే పన్నులకు రసీదులిచ్చేవారు. దీంతో పన్ను రికార్డులు అందుబాటులో ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్వోఆర్ చట్టం అమల్లోకి వచ్చేంతవరకు పన్ను రసీదు, పన్ను వసూలు రికార్డు, భూమి కొలిచినప్పుడు తయారు చేసిన సర్వే సెటిల్‌మెంట్ రికార్డు మాత్రమే ఉండేవి. ఈ రికార్డులు యజమానులకు హక్కుల కోసం తయారు చేసినవి కావు. పన్ను వసూళ్ల కోసమే వీటిని నిర్వహించేవారు. రైతులకు ఏం అవసరమొచ్చినా వీటినే సాక్ష్యంగా చూపెట్టేవారు. బ్యాంకు రుణాలు కావాలన్నా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సబ్సిడీలు అవసరమైనా ఈ రికార్డుల్లోని కాగితాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు.

1971లో ఆర్వోఆర్ చట్టం రూపకల్పన

అయితే రైతుకు ఇబ్బంది లేకుండా ఏదో ఒక కాగితం ఇవ్వాలన్న ఆలోచనతో ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల రికార్డు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టం–1971 రూపొందించారు. దీన్నే ఆర్వోఆర్ అంటారు. ఈ చట్టం ప్రకారం ఇప్పటివరకు పాసు పుస్తకాలిస్తున్నారు. పాసు పుస్తకాలిచ్చేందుకు ఆర్వోఆర్ చట్టముండగా కొత్తగా చట్టం ఎందుకనేది కొందరు లేవనెత్తుతున్న ప్రశ్న. పాత చట్టంలోని లోపాలు, ఇబ్బందులు సరిచేసి.. కొత్త చట్టం రూపొందిస్తున్నారని భూ చట్టాల నిపుణులు చెబుతున్నారు. ఈ కొత్త చట్టం రెవెన్యూ నిబంధనల్ని అధునాతన విధానాలతో సంస్కరించేదని, రైతుకు ఎలాంటి నష్టం కలిగించేది కాదని స్పష్టం చేస్తున్నారు.

హక్కుల నిరూపణకు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు

ఆర్వోఆర్ చట్టాన్ని 1971లో రూపొందించినా 1989లో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతి గ్రామానికి భూమి హక్కుల రికార్డు ఉంటుంది. ప్రతి రైతుకు ఖాతా నంబరు ఇచ్చి ఎన్ని ఖాతాల్లో ఎంత భూమి ఆ గ్రామంలో ఉందనే రికార్డు రాశారు. దీన్ని 1బీ రికార్డు(భూమి హక్కుదారుల రికార్డు) అంటారు. ఇది తయారు చేసేటప్పుడు ఏ రైతూ రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి తమ హక్కులు నిరూపించుకోలేదు. అంతకుముందు అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే కొత్త రికార్డు తయారు చేశారు. ఇప్పుడు ఈ రికార్డు స్థానంలోనే కొత్తగా 'టైటిల్' రిజిస్టర్ వస్తుంది. ఏ రైతు కూడా భూములపై తమ యాజమాన్య హక్కులు నిరూపించుకునేందుకు ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేకుండానే కొత్త చట్టం రూపొందుతోంది.

పాత చట్టంతో మన భూమిని సవాలు చేసే ప్రమాదం

పాత చట్టం ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో పేరుండి, పాస్ పుస్తకం ఉన్నా సదరు భూమిపై ఎవరైనా ఎప్పుడైనా సవాలు చేసే వెసులుబాటు ఉంది. దశాబ్దాల నుంచి ఓ రైతు స్వాధీనంలో ఉన్న భూమిపై 20–30 ఏళ్ల తర్వాత కూడా సవాలుకు వెళ్లి ఆ భూమి తనదని ఎవరైనా క్లెయిమ్ చేసుకోవచ్చు. రికార్డులు సృష్టించి, ఫోర్జరీ చేసి, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయి ఇలాంటి చర్యలకు పాల్పడే వెసులుబాటును పాత చట్టం కల్పిస్తుంది.

కొత్త చట్టంలో రికార్డులు తారుమారు చేయలేరు

కొత్త చట్టం ప్రకారం ఇలాంటి అవకాశం ఉండదు. రైతులు నిర్భయంగా ఉండొచ్చు. ఒక్కసారి టైటిల్ వచ్చిన తర్వాత ఎన్ని సంవత్సరాలు గడిచినా ఆ భూమిని సవాలు చేసే అవకాశం ఉండదు. రెండేళ్ల గడువు ముగిసిన తర్వాత అసలు రికార్డులను మార్చే అధికారం ఏ రెవెన్యూ అధికారికీ ఉండదు. అంటే... అనవసరమైన లిటిగేషన్లను ఈ చట్టం నిరోధిస్తుంది. రెవెన్యూ అధికారుల ఇష్టారాజ్యాన్ని, రియల్ ఎస్టేట్ మాఫియాను కట్టడి చేస్తుంది. తప్పులకు అవకాశం ఉండదు.

గతంలో లాగే కోర్టుకు వెళ్లొచ్చు

భూముల విషయంలో రికార్డుల మార్పు కోసం పాత చట్టం ప్రకారం ఆర్డీవో దగ్గర అప్పీలు చేసుకోవచ్చు లేదంటే జాయింట్ కలెక్టరు దగ్గర రివిజన్ పిటిషన్ చేసుకోవచ్చు. ఆపైన హైకోర్టుకు వెళ్లవచ్చు. కొత్త చట్టం ప్రకారం కూడా టీఆర్వో చేసిన మ్యుటేషన్‌పై జిల్లా అథారిటీకి అప్పీలు చేసుకోవచ్చు. ఆపైన హైకోర్టుకు వెళ్లవచ్చు. కొత్త చట్టం అమల్లోకి వస్తే కోర్టుకు వెళ్లే అవకాశమే లేదన్న ప్రచారంలో వాస్తవం లేదు.

టైటిల్ సర్టిఫికెట్‌కు ప్రభుత్వమే గ్యారంటీ

కొత్త చట్టం అమల్లోకి వస్తే పాసు పుస్తకాలను ప్రభుత్వం తీసేసుకుని జిరాక్స్ కాపీలను మాత్రమే రైతులకు ఇస్తుందనేది తప్పుడు ప్రచారమని భూ చట్టాల నిపుణులు చెబుతున్నారు. ఆర్వోఆర్ చట్టం ప్రకారం పట్టాదారు పాసు పుస్తకం, కొత్త చట్టం ప్రకారం టైటిల్ సర్టిఫికెట్ (ఒరిజినల్) రైతులకే ఇస్తారు. రికార్డు అప్పుడూ ఇప్పుడూ ప్రభుత్వం దగ్గరే ఉంటుంది. కొత్త చట్టంలో మౌలికమైన తేడా ఏంటంటే... పాత చట్టం ఇచ్చే పాసు పుస్తకానికి గ్యారంటీ లేదు. ఇప్పుడిచ్చే టైటిల్ సర్టిఫికెట్‌కు మాత్రం ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది.

1971లోనే 'ల్యాండ్ టైట్లింగ్'పై చర్చ

ఆర్వోఆర్ చట్టం తెచ్చేటప్పుడే టైటిల్ గ్యారంటీపై చర్చ జరిగింది. కానీ, భూముల సర్వే జరగలేదు. రికార్డులు సరిగా లేవు.. దేశం సిద్ధంగా లేదన్న రకరకాల కారణాలతో అప్పటి ప్రభుత్వాలు వాయిదా వేశాయి. ఆర్వోఆర్ కంటే టైటిల్ గ్యారంటీనే మేలని అప్పుడే అనుకున్నారు. అమలులో ఇబ్బందులు, రాజకీయ చిత్తశుద్ధి లేకపోవడం, నాటి దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వాయిదా వేశారు. అప్పుడు కూడా టైటిల్ గ్యారంటీ మంచిదేననే అభిప్రాయం ఉంది. ఇప్పుడు మాత్రం చిత్తశుద్ధి, ధైర్యంతో కేంద్రం ఆదేశాల మేరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది.

ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు

ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని, భూములు లాక్కుంటారని ప్రచారం చేస్తున్న ఎల్లోగ్యాంగ్‌కు అర్థం కావాల్సిన విషయం ఏంటంటే... భారతదేశంలో ఏ చట్టాన్ని ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు. రాజ్యాంగాన్నే అనేకసార్లు సవరించుకున్న దేశం మనది. అంతెందుకు ఇప్పుడు అమల్లో ఉన్న ఆర్వోఆర్ చట్టాన్ని 25 సార్లకు పైగా మార్చుకున్నాం. కొత్త చట్టం అమల్లో ఇబ్బందులు, అవసరాలను బట్టి ఎన్నిసార్లయినా, ఎవరు అధికారంలో ఉన్నా మార్చుకోవచ్చు.

- (మేకల కళ్యాణ్ చక్రవర్తి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్)



కన్యాకుమారిలో సృష్టి బక్షి పాదయాత్ర మొదలుపెట్టినప్పటి చిత్రం

డాక్యుమెంటరీ

కలిసి నడిచే గొంతులు



తమిళనాడులోని ఒక బామ్మతో మాట్లాడుతూ...

కన్యాకుమారి నుంచి
శ్రీ నగర్ వరకూ
260 రోజుల పాటు
3,800 కిలోమీటర్లు
దేశమంతా నడిచింది
సృష్టి బక్షి.
ఎందుకు?
స్త్రీలపై జరిగే దురాగతాలపై
చైతన్యం కలిగించడానికే కాదు
స్త్రీల శక్తియుక్తులను వారికి గుర్తు చేయడానికి.
ఆ సుదీర్ఘ ప్రయాణం ఇప్పుడు
'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో
అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది.
నటి ప్రియాంకా చోప్రా నిర్మాత.

తాను నడిచి చేరుకున్న ఊరిలో ఏదైనా స్కూల్‌లోగాని, పబ్లిక్ హాల్‌లో కాని మహిళలను పోగు చేస్తుంది సృష్టి బక్షి. 'అందరూ కళ్లు మూసుకుని దీర్ఘంగా శ్వాస పీల్చి వదలండి' అంటుంది. 'ఇప్పుడు మీ కళ్ల ఎదురుగా మీ 11 ఏళ్ల వయసున్న మీ రూపాన్ని గుర్తు చేసుకోండి. ఆ 11 ఏళ్ల అమ్మాయిలో ఉండే విశ్వాసం, ఆనందం ఎన్ని విధాలుగా ధ్వంసమైందో గుర్తుకు తెచ్చుకోండి. ఆ అమ్మాయికి సారీ చెప్పండి. ఎందుకంటే ఆ విధ్వంసమంతా మీ అనుమతితోనే జరిగింది' అంటుంది. చాలామంది ఆ మాటలకు ఏడుస్తారు. గడిచివచ్చిన జీవితాన్ని తలుచుకుని బాధలో మునిగిపోతారు. అప్పుడు సృష్టి బక్షి ఒక బోర్డు మీద స్త్రీ శరీర నిర్మాణం గీచి 'ఇదిగో ఈ అవయవాల రీత్యా మీరు మగవారి కంటే భిన్నంగా పుట్టారు. ప్రకృతి ఈ అవయవాలను మీకు ఇస్తే సమాజం అదుపు, ఆంక్షలు, వివక్ష, కుటుంబ హింస, ఆర్థిక బానిసత్వం, ఇంటి పని... ఇన్ని ఇచ్చింది. మనం ఎందుకు మగవారితో సమానం కాము?' అని ప్రశ్నిస్తుంది.

మార్పు కోసం

సృష్టి బక్షిది ముంబై. ఆమె హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుకుంది. హాంగ్‌కాంగ్‌లో మార్కెటింగ్‌లో పెద్ద సంస్థల్లో పని చేసింది. తండ్రి ఆర్మీలో పని చేయడం వల్ల ఆమెకు దేశం పట్ల ఒక ఉద్వేగం ఉండేది. అయితే తాను ప్రేమించే దేశంలో స్త్రీలపై జరిగే అన్యాయాలను చూసి చలించి పోయేది. '2017లో హాంకాంగ్‌లో సిటీ బస్ ఎక్కి ఇంటికి వెళుతున్నప్పుడు నా ఫోన్‌లో ఇండియాలో తల్లీ కూతుళ్లపై తండ్రి ఎదుటే అత్యాచారం చేసి చంపేశారన్న వార్త చదివాను. చాలా నిస్పృహ కలిగింది. నాలాంటి వాళ్లు సౌకర్యంగా పడక్కుర్చీలో కూచుని చింతించడం సరికాదని రంగంలో దిగాలని అనుకున్నాను. అలా నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇండియా వచ్చి దేశంలోని స్త్రీలందరితో మాట్లాడాలని 2018 మే నెలలో పాదయాత్ర ప్రారంభించాను' అని చెప్పింది సృష్టి.

రోజూ వేలాది మంది

'ఉమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో సృష్టి బక్షి మే 2018లో కన్యాకుమారి నుంచి పాదయాత్ర ప్రారంభించింది. ఈ యాత్ర రికార్డు అయ్యేలా టీమ్‌ను ఏర్పాటు చేసుకుంది. 260 రోజుల పాటు దాదాపు 4 వేల కిలోమీటర్ల పాటు సాగే ఈ యాత్రకు కోటి రూపాయలు ఖర్చవుతాయి. 50 లక్షలను క్రౌడ్ ఫండింగ్ ద్వారా పోగు చేసింది.

'ఈ యాత్రలో స్త్రీల కలలు, ఆకాంక్షలు, వారి హక్కులు, సంఘర్షణలు. విజయాలు వినదలుచుకున్నాను. వారు ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలుసుకోవాలనుకున్నాను. నా సుదీర్ఘ యాత్రలో మన దేశంలో వరకట్నం ఇంకా పెద్ద సమస్యగా ఉందని అర్థమైంది. వరకట్నం స్త్రీలను మానసికంగా పురుషులతో సమానం అనుకోనివ్వడం లేదు. స్త్రీలను అసభ్యంగా తాకడం, హింసించడం, అణిచి పెట్టడం కొనసాగుతూనే ఉంది. ఒక దశలో నేను యాత్ర చేయలేననుకున్నాను. కాని ఆ మరుసటి రోజు నా మీటింగ్‌కు హాజరైన ఒక ఆశా వర్కర్– ''రాత్రి నన్ను నా భర్త కొట్టాడు. నీ మాటలు విన్నాక ఇక ఇలాంటిది జరగనివ్వకూడదని నిశ్చయించుకున్నాను. నేను నా భర్తను నిలువరించడానికి నలుగురి సాయం తీసుకుంటాను'' అని చెప్పింది. నా యాత్ర వల్ల జరుగుతున్న మేలు అర్థమయ్యాక కొనసాగాను' అని తెలిపింది సృష్టి.

డాక్యుమెంటరీ విడుదల

సృష్టి చేసిన యాత్ర అంతా 'విమెన్ ఆఫ్ మై బిలియన్' పేరుతో డాక్యుమెంటరీగా రూపొందింది. మే 3 నుంచి అమెజాన్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఈ డాక్యుమెంటరీ మీద మంచి రివ్యూలు వస్తున్నాయి. 'ఎందరో స్త్రీలు. వారి జీవితానుభవాలను ఈ డాక్యుమెంటరీలో పంచుకున్నారు. వారు సమస్యలు వారి తెచ్చుకున్నవి కాదు. వారికి తెచ్చిపెట్టినవి. అందుకే నటి ప్రియాంకా చోప్రా నా డాక్యుమెంటరీని చూసి తాను నిర్మాతగా మారి విడుదల చేయడానికి ముందుకు వచ్చారు. ఒక స్త్రీగా, ఆడపిల్ల తల్లిగా ఆమెకు స్త్రీల సాధికారత, ఆత్మగౌరవం గురించి అక్కర ఉంది. జెండర్ ఈక్వాలిటీ గురించి స్త్రీ, పురుషుల్లో చైతన్యం రావడానికి ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడుతుందని ఆమె విశ్వసిస్తున్నారు' అని తెలిపింది సృష్టి బక్షి.

కళను రాశి పోస్తోంది!





రాశి అగర్వాల్

ఒక తావు పేపర్ తయారు కావాలంటే పది లీటర్ల నీళ్లు కావాల్సి వస్తుంది. రాసుకోవడానికి ఒక రీము పేపర్ సిద్ధం అవ్వాలంటే పాతికేళ్లు పెరిగిన చెట్టు కొమ్మలను సమూలంగా నరకాలి. చెట్టును నరక్కుండా, నీటిని వృథా చేయకుండా ఒక డైరీ తయారయితే? అంతకంటే ఇంకేం కావాలి? ఇంతే కాదు, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ వృథాను హరాయించుకోవడానికి భూమాత పడే యాతన కూడా తగ్గిపోతుంది. ఇలాంటి వినూత్న ప్రయత్నానికి తెర తీసింది సూరత్‌లో ఓ ఆర్కిటెక్ట్. స్టేషనరీ వస్తువులు, ఇంటీరియర్ డెకరేషన్‌ని కలగలుపుతూ చేసిన ప్రయోగమే రుహానీ రంగ్. ఆ ప్రయోగం వెనుక దాగిన నేపథ్యాన్ని వివరించింది రాశి అగర్వాల్. ఆమె మదిలో వెలిగిన ఈ ఆలోచన తొమ్మిది వేల కిలోల పత్తికి పుస్తక రూపాన్నిచ్చింది.

మనదేశంలో కళ ఉంది!

''నేను ఆర్కిటెక్చర్ ఫైనలియర్‌లో ఉన్నప్పుడు మన సంప్రదాయ నిర్మాణాలు, కళలు, చేతివృత్తుల అధ్యయనం కోసం విస్తృతంగా పర్యటించాను. ఢిల్లీ నుంచి జైపూర్, అహ్మదాబాద్, కచ్, పాండిచ్చేరి నుంచి పూనా వరకు పరిశీలిస్తే మనదేశంలో రకరకాల కళలు, కళా నైపుణ్యాలున్న పని వాళ్లున్నారని తెలిసింది. వాళ్ల చేతుల్లో ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదికలు తగినంతగా లేవు. అలాంటి ఒక వేదికను ఏర్పాటు చేసి, నా వృత్తిలో ఇంటీరియర్ డిజైనింగ్‌కు దోహదం చేసే విధంగా ఒక ప్రయోగం చేశాను. అది విజయవంతమైంది. రకరకాల కళలను ఒక వేదిక మీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 'రుహానీ రంగ్' పేరుతో ఆర్ట్ స్టార్టప్ మొదలు పెట్టాను. ప్లానర్ బుక్ కవర్ పేజీ మీద మధుబని ఆర్ట్ ఉంటే ఇంట్లో అందమైన షో పీస్ ఉన్నట్లే. ప్లానర్ బుక్‌ని కార్నర్ స్టాండ్‌లో అందంగా అమరిస్తే డ్రాయింగ్ రూమ్ కళాత్మకంగా ఉంటుంది. ఇలాంటి ఎన్నో హస్త కళలను పునరుద్ధరించగలుగుతున్నాను.



రుహానీ రంగ్‌ను ఐదు వేల రూపాయలతో మొదలు పెట్టాను. నాతో కలిసి 50 మంది కళాకారులు, 40 మంది ఇతర ఉద్యోగులు పని చేస్తున్నారు. వస్త్రాలను తయారు చేసే భారీ పరిశ్రమలకు పెద్ద సంఖ్యలో పత్తి బేళ్లు వస్తుంటాయి. ప్రతి బేలులోనూ మెషీన్‌లో అమరికకు తగినట్లు ఉపయోగించగా మిగిలిన పత్తి వృథా అవుతూ ఉంటుంది. అది భూమిలో కలిసి పోవాల్సిందే తప్ప మరో పనికి ఉపయోగించేవారు కాదు. ఎందుకూ పనికి రాదని వదిలేస్తున్న ఆ పత్తే నా కుటీర పరిశ్రమకు ముడిసరుకు. నాకు కోవిడ్ సమయం కూడా మంచే చేసింది. ఆ టైమ్‌లో పెద్ద చిన్న పరిశ్రమలన్నీ మూత పడ్డాయి. హస్తకళాకారులు పని లేక ఆర్థికంగా మానసికంగా దెబ్బతిని ఉన్నారు. ఆ సమయంలో నేను ఒక్కొక్కరిని కలిసి నా ఆలోచన చెప్తుంటే వాళ్లు ఉత్సాహంగా నాకు మరికొన్ని ఐడియాలు చెప్తూ తమ అనుభవాన్ని జోడించారు. అలా 2020లో మొదలు పెట్టిన నా కుటీర పరిశ్రమ ఇంత వరకు హ్యాండ్ మేడ్ పేపర్‌తో ప్లానర్స్, క్యాలెండర్‌లు, నోట్‌బుక్స్, జర్నల్స్, స్కెచ్ బుక్స్ వంటి 15 వేల ఉత్పత్తులకు రూపమిచ్చింది. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తే నలభై వేల ఫాలోవర్స్‌ను తెచ్చి పెట్టింది. ఆర్ట్ పీస్ కేవలం కళాభిరుచి, కళారాధన కోసమే కాదు. అది మన దైనందిన జీవితంలో భాగంగా మారాలి. అప్పుడే కళ ఎప్పటికీ నిలిచి ఉంటుంది'' అని వివరించింది రాశి అగర్వాల్.

సన్ బర్న్ ముప్పు!



- పండ్ల తోటలు, కూరగాయ తోటలకు ముప్పుగా మారిన ప్రచండమైన ఎండ
- అధిక ఉష్ణోగ్రతలతో పాటు తార స్థాయికి చేరిన లైట్ ఇంటెన్సిటీ, యు.వి. రేడియేషన్
- మామిడి, జామ కాయలు పక్వానికి రాక ముందే ఎర్రగా మారి రాలిపోవటం లేదా నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్న రైతులు
- రోజూ సాయంత్రం నీటిని, వారానికోసారి పోషకాలను చల్లమంటున్న 'అంగ్రూ' మాజీ డీన్ డా. పి.వి. రావు

ఈ వేసవిలో ఎల్‌నినో పుణ్యాన సాధారణం కన్నా ఐదారు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యాన తోటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా సీజనల్ పండ్ల తోటలైన మామిడి, జామతో పాటు కూరగాయలు, డ్రాగన్ వంటి తోటలకు నిప్పుల కుంపటి వంటి వేడి ఒత్తిడి తీవ్ర సమస్యగా మారింది.

47 డిగ్రీలకు చేరిన పగటి గరిష్ట ఉష్ణోగ్రత వల్ల భూమి విపరీతంగా వేడెక్కి రాత్రి 7–8 గంటల వరకు సెగలు కక్కుతూ ఉంది. దీన్నే 'రిఫ్లెక్టెడ్ రేడియేషన్' అంటారు. పొలాల్లో కన్నా కాంక్రీటు అరణ్యాలుగా మారిన నగరాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. చెట్లు, మొక్కలు వేర్ల ద్వారా తీసుకునే నీటి కన్నా ఎక్కువగా నీరు ఆవిరైపోతుండటం వల్ల లేత ఆకుల చివర్లు ఎండిపోతున్నాయి. లేత కణాలు ఉంటాయి కాబట్టి లేత ఆకుల చివరలు మాడిపోతున్నాయి.

పగటి గరిష్ట ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్షియస్ వరకు ఉన్న వాతావరణం పంటల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. 40 డిగ్రీలు దాటిన తర్వాత పంటలు, తోటలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇప్పుడు 47–48 డిగ్రీల సెల్షియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉండటంతో కూరగాయ పంటలు, పండ్ల తోటలు సన్ బర్న్‌తో సతమతమవుతూ ఉన్నాయని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ పీవీ రావు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

సాధారణంగా ఎండను రక్షణకు కొన్ని పంటలపై 50% సూర్యరశ్మిని ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌ను వాడుతుంటారు. అయితే, ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోవటం వల్ల 80% ఎండను ఆపే గ్రీన్ షేడ్‌నెట్‌లు వేసుకోవాల్సి వస్తోందని డా. పివి రావు అన్నారు.




సన్‌బర్న్‌కు గురైన మామిడి కాయ

సన్‌బర్న్‌కు గురైన జామ కాయ

సన్‌బర్న్‌కు గురైన డ్రాగన్ పంట

అల్ఫాన్సో, పచ్చడి కాయలు 80% రాలిపోతున్నాయి

ఈ ఏడాది ఉష్ణోగ్రతలు చాలా ఎక్కువగా ఉండటం వల్ల అల్ఫాన్సో, దేశీ పచ్చడి రకాల చిన్న కాయలు రాలిపోతున్నాయి. ఆర్గానిక్ మామిడి తోటల్లో గతంలో 10–20% రాలే కాయలు ఈ సీజన్‌లో 70–80% రాలిపోతున్నాయి. ఇతర రకాల్లో కూడా జనవరిలో వచ్చిన ఆఖరి పూత ద్వారా వచ్చిన చిన్న కాయలు ఎక్కువగా ఎండదెబ్బకు రాలిపోతున్నాయి. ఎండలు ముదిరే నాటికి నిమ్మ కాయ సైజు ఉన్న కాయలకు ప్రాబ్లం లేదు. సన్‌బర్న్ సమస్య వల్ల కాయలు ఒకవైపు అకాలంగా రంగు మారిపోతుంటే, వెనుక వైపు మాత్రం పచ్చిగానే ఉంటున్నాయి. బంగనిపల్లి పూత రాలిపోవటంతో ఈ ఏడాది 20% కూడా కాయ మిగల్లేదు. దశేరి కాపు మాత్రం అన్నిచోట్లా బాగుంది. మామిడి చెట్లకు రోజూ నీరు స్ప్రే చేస్తున్నాం. చెట్ల కింద మల్చింగ్ చేసి నీటి తేమ ఆరిపోకుండా కాపాడుకుంటున్నాం. ఇదిలా ఉంటే, మధ్యప్రాచ్య దేశాల్లో యుద్ధం వల్ల నౌకల్లో వెళ్లే సరుకు విమానాల ద్వారా ఎగుమతి అవుతోంది. దీనికితోడు, దుబాయ్‌లో భారీ వరదల వల్ల అమెరికా తదితర దేశాలకు మామిడి పండ్ల ఎగుమతి ఈ ఏడాది బాగా దెబ్బతింది. గత 15 రోజుల్లో 350 ఎమిరేట్స్ విమానాలు రద్దయ్యాయి. దీంతో ఖతర్ తదితర దేశాల విమానాలు ధరలు పెంచేశాయి. అమెరికాకు కిలో మామిడి రవాణా చార్జీ రూ. 180 నుంచి 600కు పెరిగిపోయింది. అమెరికాలో 4 కిలోల మామిడి పండ్ల బాక్స్ గతంలో 40 డాలర్లకు అమ్మేవాళ్లం. ఇప్పుడు 60–70 డాలర్లకు అమ్మాల్సివస్తోంది. దీంతో అమెరికాకు మామిడి ఎగుమతులు బాగా తగ్గిపోయాయి.



– **రఫీ** (98480 02221), సేంద్రియ మామిడి రైతు, ఎగుమతిదారు, ఏఆర్4మ్యాంగోస్, హైదరాబాద్

సూర్యకాంతి తీవ్రత

పంటలపై ప్రతికూల ప్రభావం ఎంతగా ఉందన్నది ఉష్ణోగ్రతతో పాటు సూర్యకాంతి తీవ్రత (లైట్ ఇంటెన్సిటీ)పై కూడా ఆధారపడి ఉంటుందని డా. రావు వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్న రోజుల్లో చదరపు మీటరుకు 20,000 – 25,000 కిలో లక్స్ వరకు సూర్యకాంతి ఉంటుంది. వేసవిలో సాధారణంగా ఇది 80,000 కిలో లక్స్‌కు పెరుగుతూ ఉంటుంది. అయితే, ఈ ఏడాది ఇది విపరీతంగా పెరిగి, ఏకంగా 1,20,000 కిలో లక్స్‌కు చేరటం పండ్ల తోటలకు, కూరగాయల పంటలకు ముప్పుగా మారిందని డాక్టర్ పి వి రావు తెలిపారు.

ఫొటో ఆక్సిడేషన్ వల్ల ఆకులలో కిరణజన్య సంయోగ క్రియ సజావుగా జరగటం లేదు. లేత ఆకుల్లో క్లోరోఫిల్ మాలిక్యూల్ చిట్లిపోవటం వల్ల ఆకుపచ్చగా ఉండాల్సిన ఆకులు జీవం కోల్పోయి పసుపు రంగుకు మారి ఎండిపోతున్నాయన్నారు.

సాగుబడి
కృత్తిక కార్తె : మే 11 నుంచి

తారస్థాయికి చేరిన యువి రేడియేషన్

అతినీలలోహిత కిరణాల (యువి) రేడియేషన్ సూచిక సాధారణంగా 3–4 వరకు ఉంటుంది. వేసవిలో ఈ సూచిక 8–9 వరకు పెరుగుతుంది. అయితే, ఈ ఏడాది మాత్రం ఇది 12కు పెరగటంతో సూర్యరశ్మిని పంటలు, తోటలు తట్టుకోలేకుండా ఉన్నాయని డా. పి వి రావు వివరించారు. మామిడి, జామ తదితర కాయలు ఎండ పడిన చోట ఎర్రగా మారి దెబ్బతింటున్నాయి. వెనుక వైపు పచ్చిగానే ఉంటూ ఎండ సోకిన దగ్గర రంగు మారుతుండటంతో పండ్లు నాణ్యతను కోల్పోతున్నాయి. అల్ఫాన్సో, పచ్చడి రకాల మామిడి కాయలు బాగా రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

నీరు, పోషకాలు పిచికారీ చేయాలి



విపరీత ఉష్ణోగ్రతలకు తోడైన వడగాడ్పులకు కూరగాయ తోటలు, పండ్ల తోటల్లో లేత ఆకులు మాడిపోతున్నాయి. ఉష్ణోగ్రత, అతినీలలోహిత వికిరణాలతో పాటు సూర్యరశ్మి తీవ్రత చాలా పెరిగిపోయింది. ప్రతి రోజూ సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయటం ద్వారా పంటలకు రక్షించుకోవచ్చు. వారం, పది రోజులకోసారి ఇంటిపంటలపై నానో యూరియా/ వర్మీవాష్/ జీవామృతం/ ఆవు మూత్రంను ఒకటికి పది (1:10) పాళ్లలో నీటిలో కలిపి పిచికారీ చేసుకొని, అతి వేడి వత్తిడి నుంచి తోటలకు ఉపశమనం కలిగించాలి.

– **డాక్టర్ పి.వి. రావు** (94901 92672), రిటైర్డ్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్, ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ అధ్యక్షులు, హైదరాబాద్

యు.వి. రేడియేషన్ పండ్లను దెబ్బతీస్తోంది!

అతి నీలలోహిత వికిరణాల (యు.వి. రేడియేషన్) తీవ్రత బాగా పెరిగిపోయి మామిడి, జామ పండ్లు ఎండదెబ్బకు గురవుతున్నాయి. యు.వి. రేడియేషన్ ఏప్రిల్ ఆఖరి, మే మొదటి వారాల్లో తీవ్రస్థాయికి చేరింది. యు.వి. ఇండెక్స్ ఇప్పుడు 12–13కి పెరిగిపోయింది. మామిడి, జామ వంటి పండ్ల తోటల్లో కాయలపై ఎండ మచ్చలు ఏర్పడుతూ పండ్ల నాణ్యతను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. టొమాటోలు వంటి కూరగాయలపై కూడా ఈ ఎండ మచ్చలు సమస్యగా మారాయి. ఎండ తగిలిన వైపు పండినట్లు రంగు మారుతుంది. వెనుకవైపు పచ్చిగానే ఉంటుంది. నాణ్యత కోల్పోయిన ఈ కాయలను కొయ్యలేక, చెట్లకు ఉంచలేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధిక వేడికి అనేక పోషకాలు అందక కొన్ని కాయలు రాలిపోతున్నాయి. యు.వి. రేడియేషన్ ఉద్యాన తోటల రైతులను ఈ ఏడాది చాలా నష్టపరుస్తోంది. నత్రజని కోసం ఫిష్ అమినో యాసిడ్ లేదా పంచగవ్యలను ద్రవజీవామృతంతో కలిపి చల్లాలి. బోరాన్ కోసం జిల్లేడు+ఉమ్మెత్త కషాయం, పొటాష్ కోసం అరటి పండ్ల (తొక్కలతో కలిపి తయారు చేసిన) కషాయాన్ని పిచికారీ చేయాలి.

– **ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు** (76598 55588), తెలంగాణా గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం

పోషకాలు, హార్మోన్ అసమతుల్యత

వేసవిలో టొమాటో, మిర్చి వంటి కూరగాయ పంటల మొక్కలు నాటుకునేటప్పుడు వీటికి ఉత్తర, దక్షిణ వైపున నీడనిచ్చే మొక్కలను వేసుకుంటే ఎండ బారి నుంచి కొంత మేరకు కాపాడుకోవచ్చు. ఉదాహరణకు.. టొమాటో మొక్కలు ఉత్తర దక్షిణాల్లో మొక్కజొన్న లేదా ఆముదం మొక్కలు వత్తుకోవాలి. వడగాలుల నుంచి పంటలను రక్షించుకోవటానికి పొలం సరిహద్దుల్లో విండ్ బ్రేకర్‌గా పనికొచ్చే ఎత్తయిన చెట్లు పెంచుకోవాలి. ఈ ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్న వారి తోటలు ఉపశమనం పొందుతాయి.

దాదాపు మరో నెల రోజులు మండే ఎండలు కొనసాగే పరిస్థితి ఉండటంతో తోటలకు చాలినంతగా నీటి తడులు ఇవ్వటంతో పాటు, చెట్లపైన కూడా సాయంత్రం 3 గంటల తర్వాత నీటిని పిచికారీ చేయాలి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ నేల నుంచి వేర్ల ద్వారా పోషకాలను తీసుకునే సామర్థ్యం తగ్గుతుందని, అందుకు తగినట్లు నీరు, పోషకాలు సైతం అందిస్తే తోటలకు ఉపశమనం కలుగుతుందని డాక్టర్ పివి రావు సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల కాలంలో పంటలు పోషకాలను నేల నుంచి తీసుకోవటంలో ఇబ్బంది వస్తుంది. జింక్ లోపం ఏర్పడుతుంది. హార్మోన్లను కూడా చెట్లు, మొక్కలు తయారు చేసుకోలేవు. హార్మోన్ అసమతుల్యత ఏర్పడుతుంది.

ఎండ తీవ్రతకు రెస్పిరేషన్ రేటు ఎక్కువ అవటం వల్ల కిరణజన్య సంయోగ క్రియ ద్వారా తయారయ్యే పిండి పదార్థం మొక్క/చెట్టు నిర్వహణకే సరిపోతాయి. పెరుగుదల లోపిస్తుంది. అదనపు పిండిపదార్థం అందుబాటులో వుండక పూలకు, కాయలకు పోషకాలను అందించలేని సంక్షోభ స్థితి నెలకొంటుంది. అందువల్ల పూలు, కాయలు రాలిపోయే పరిస్థితి ఎదురవుతుంది.




టొమాటో పంటకు షేడ్‌నెట్

అతి వేడి వత్తిడి ఎదుర్కొంటున్న మామిడి తోటలపై జింక్, ప్లానోఫిక్స్, బోరాన్‌లను సాయంత్రం 3 గంటల తర్వాత పిచికారీ చేయాలి. టొమాటో, మిరప, వంగ తదితర కూరగాయ మొక్కలపైన నాఫ్తలిన్ అసిటిక్ యాసిడ్‌ను 5 లీటర్ల నీటికి 1.5 నుంచి 2 ఎం.ఎల్. మోతాదులో కలిపి పిచికారీ చేయాలని డా. రావు తెలిపారు.

సేంద్రియ సేద్యం, వ్యాపార నైపుణ్యాలపై 6 రోజుల శిక్షణా శిబిరం

తెలుగు రాష్ట్రాలకు చెందిన ఔత్సాహికులను సేంద్రియ వ్యవసాయంలో మెళకువలు నేర్పటంతో పాటు.. సేంద్రియ ఆహారోత్పత్తుల వ్యాపార అవకాశాలను సృష్టించటంలో నిపుణులైన ఫెసిలిటేటర్‌గా మారడానికి నైపుణ్యం, విజ్ఞానాభివృద్ధి శిక్షణా కోర్సును నిర్వహించనుంది కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ. 20 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయ శిక్షణలో విశేష కృషి చేస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు సారథ్యంలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో సకల వసతులతో



కృష్ణ సుధా అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ అంతర్జాతీయ స్థాయి వసతులతో ఇటీవలే ప్రారంభమైంది. సేంద్రియ వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనలు చేయటంతో పాటు సేంద్రియ వ్యవసాయం, వ్యాపారం తదితర అంశాలపై ప్రామాణికమైన శిక్షణ ఇవ్వటమే ఈ అకాడమీ లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా తదితర సంస్థల తోడ్పాటుతో మే 22 నుంచి 27 వరకు తెలుగులో నిర్వహించనున్న ఉచిత రెసిడెన్షియల్ శిక్షణా శిబిరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డా. రామాంజనేయులు తెలిపారు. గుగుల్ ఫామ్ ద్వారా అభ్యర్థులు విధిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవటం తప్పనిసరి. 30–35 మందికి మాత్రమే అవకాశం.
ఇతర వివరాలకు.. 85002 83300.
www.krishnasudhaacademy.org

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

సాక్షి స్పోర్ట్స్

మంగళవారం
7-5-2024



మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి శ్రీలంక, స్కాట్లాండ్ అర్హత

బంగ్లాదేశ్ వేదికగా ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే మహిళల టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి శ్రీలంక, స్కాట్లాండ్ జట్లు అర్హత సాధించాయి. అబుదాబిలో జరుగుతున్న క్వాలిఫయింగ్ టోర్నీలో ఈ రెండు జట్లు ఫైనల్లోకి ప్రవేశించి మిగిలిన రెండు బెర్త్‌లను సొంతం చేసుకున్నాయి. సెమీఫైనల్స్‌లో చమరి అటపట్టు నాయకత్వంలోని శ్రీలంక జట్టు 15 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టును ఓడించగా... కేథరీన్ బ్రైస్ సారథ్యంలోని స్కాట్లాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. తొలిసారి టి20 ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందిన స్కాట్లాండ్ ఈరోజు జరిగే క్వాలిఫయింగ్ టోర్నీ ఫైనల్లో శ్రీలంకతో ఆడుతుంది. టి20 ప్రపంచ కప్ అక్టోబర్ 3 నుంచి 20 వరకు ఢాకా, సిల్హెట్‌లో జరుగుతుంది. గత టి20 ప్రపంచ కప్‌లో టాప్–6లో నిలిచిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ భారత్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, వెస్టిండీస్ నేరుగా ఈ టోర్నీకి అర్హత పొందాయి. ఆతిథ్య దేశం హోదాలో బంగ్లాదేశ్, ఐసీసీ ర్యాంక్ ప్రకారం పాకిస్తాన్ ఈ టోర్నీలో ఆడనున్నాయి.


ఎదురులేని భారత్

- నాలుగో టి20 మ్యాచ్‌లో 56 పరుగులతో బంగ్లాదేశ్‌పై విజయం
- రాణించిన హర్మన్‌ప్రీత్, ఆశా శోభన



సిల్హెట్: బంగ్లాదేశ్ పర్యటనలో భారత మహిళల టి20 జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. సోమవారం జరిగిన నాలుగో టి20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 56 పరుగుల తేడాతో గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 4–0తో ముందంజ వేసింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను 14 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టు 14 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ కౌర్ (26 బంతుల్లో 39; 5 ఫోర్లు), రిచా ఘోష్ (15 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (14 బంతుల్లో 22; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం బంగ్లాదేశ్ లక్ష్యాన్ని 14 ఓవర్లలో 125 పరుగులుగా నిర్ణయించారు. బంగ్లాదేశ్ 14 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి వరుసగా నాలుగో ఓటమి చవిచూసింది. భారత బౌలర్లలో ఆశా శోభన (2/18), దీప్తి శర్మ (2/13) రాణించారు. ఈ మ్యాచ్‌తో భారత్ తరఫున టి20ల్లో అరంగేట్రం చేసిన పెద్ద వయస్కురాలిగా ఆశా శోభన (33 ఏళ్ల 51 రోజులు) గుర్తింపు పొందింది. సిరీస్‌లో చివరిదైన ఐదో టి20 గురువారం జరుగుతుంది.

'మయామి' విజేత నోరిస్



ఫ్లోరిడా: ఫార్ములావన్ సీజన్‌లోని ఆరో రేసు మయామి గ్రాండ్‌ప్రిలో కొత్త విజేత అవతరించాడు. మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లాండో నోరిస్ తన కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నాడు. నిర్ణీత 57 ల్యాప్‌ల రేసును నోరిస్ (బ్రిటన్) ఒక గంటా 30 నిమిషాల 49.876 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ప్రపంచ చాంపియన్, ఈ సీజన్‌లో నాలుగు విజయాలు సాధించి జోరు మీదున్న వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ ఒక గంటా 30 నిమిషాల 57.488 సెకన్లలో గమ్యానికి చేరాడు.

ముంబై ఆశలకు సూర్య ఊపిరి

7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై గెలుపు

- సూర్యకుమార్ వీరోచిత శతకం
- రాణించిన తిలక్, హార్దిక్, చావ్లా


సూర్యకుమార్

ముంబై: ఐపీఎల్ నుంచి 'ఫైవ్ స్టార్' చాంపియన్ ముంబై ఇండియన్స్ అందరికంటే ముందుగా నిష్క్రమించే ముప్పును సూర్యకుమార్ యాదవ్ (51 బంతుల్లో 102 నాటౌట్; 12 ఫోర్లు, 6 సిక్స్‌లు) తప్పించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లపై విరుచుకుపడి ముంబైని రేసులో నిలిపాడు. సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌పై ఘనవిజయం సాధించింది. మొదట సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. హెడ్ (30 బంతుల్లో 48; 7 ఫోర్లు, 1 సిక్స్), ప్యాట్ కమిన్స్ (17 బంతుల్లో 35 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. హార్దిక్ పాండ్యా, పియూశ్ చావ్లా చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ముంబై 17.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్‌కు అండగా తిలక్ వర్మ (32 బంతుల్లో 37 నాటౌట్; 6 ఫోర్లు) నిలిచాడు.

ఆదుకున్న హెడ్

ఆరంభంలో హెడ్, ఆఖర్లో కమిన్స్ మెరుపులు మినహా సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ ఈ మ్యాచ్‌లో బోర్ కొట్టించింది. పవర్‌ప్లేలో 56/1 స్కోరు చేసిన హైదరాబాద్ 10 ఓవర్ల దాకా 88/2 స్కోరుతో పటిష్టంగానే కనిపించింది. అభిషేక్ (11), మయాంక్ అగర్వాల్ (5), నితీశ్ కుమార్ రెడ్డి (15 బంతుల్లో 20; 2 ఫోర్లు), క్లాసెన్ (2)... ఇలా కీలక బ్యాటర్లందరినీ వరుస విరామంలో కోల్పోవడంతో హైదరాబాద్ కోలుకోలేదు. 16వ ఓవర్ వేసిన పాండ్యా... షహబాజ్ అహ్మద్ (10), మార్కో జాన్సెన్ (17)లను అవుట్ చేయగా, సమద్ (3)ను చావ్లా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. దీంతో 136 పరుగులకే 8 వికెట్లు పడిపోవడంతో డెత్ ఓవర్లలో దూకుడుగా ఆడే స్పెషలిస్టు బ్యాటరే కరువయ్యాడు. అయితే కెప్టెన్ కమిన్స్ 2 ఫోర్లు, 2 సిక్సర్లతో సత్తాచాటడంతో హైదరాబాద్ 170 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

'సూర్య' మేటి ఇన్నింగ్స్

నాలుగో ఓవర్లో రోహిత్ (4) అవుటవగానే సూర్యకుమార్ క్రీజులోకి వచ్చాడు. అంతకుముందే ఇషాన్ కిషన్ (9) పెవిలియన్‌లో కూర్చున్నాడు. ఆ తర్వాత నమన్ ధీర్ (0) డకౌటయ్యాడు. ముంబై స్కోరు 31/3. సంబరాల్లో హైదరాబాద్! ఒత్తిడిలో ముంబై... ఈ దశలో తిలక్ వర్మ అండతో ముంబైని పీకల్లోతు కష్టాల్లోంచి ఘనవిజయం దాకా సూర్యకుమార్ గ్రేటెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. మొదట్లో బౌండరీలతో జట్టును నడిపించిన 'భారత 360' డిగ్రీ బ్యాటర్ తర్వాత భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. దీంతో జట్టు స్కోరు ఆరో ఓవర్లో 50 దాటగా... 12వ ఓవర్లో వంద పరుగుల్ని అధిగమించింది. ఈ భాగస్వామ్యం మెరుపులతో లక్ష్యాన్ని చేరింది. 30 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న సూర్య... శతక్కొట్టేందుకు మరో 21 బంతుల్లే అవసరమయ్యాయి. 18వ ఓవర్లో భారీ సిక్సర్‌తో 51 బంతుల్లో సెంచరీని పూర్తిచేసుకోవడంతోనే మ్యాచ్ కూడా ముగిసింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	11	8	3	16	1.453
రాజస్తాన్	10	8	2	16	0.622
చెన్నై	11	6	5	12	0.700
హైదరాబాద్	11	6	5	12	-0.065
లక్నో	11	6	5	12	-0.371
ఢిల్లీ	11	5	6	10	-0.442
బెంగళూరు	11	4	7	8	-0.049
పంజాబ్	11	4	7	8	-0.187
ముంబై	12	4	8	8	-0.212
గుజరాత్	11	4	7	8	-1.320

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ఢిల్లీ × రాజస్తాన్
వేదిక: న్యూఢిల్లీ

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) తిలక్ వర్మ (బి) చావ్లా 48; అభిషేక్ (సి) ఇషాన్ (బి) బుమ్రా 11; మయాంక్ (బి) అన్షుల్ 5; నితీశ్ కుమార్ రెడ్డి (సి) అన్షుల్ (బి) హార్దిక్ 20; క్లాసెన్ (బి) చావ్లా 2; జాన్సెన్ (బి) హార్దిక్ 17; షహబాజ్ (సి) సూర్యకుమార్ (బి) హార్దిక్ 10; సమద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) చావ్లా 3; కమిన్స్ (నాటౌట్) 35; సన్వీర్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 173. వికెట్ల పతనం:** 1–56, 2–68, 3–90, 4–92, 5–96, 6–120, 7–124, 8–136. **బౌలింగ్:** తుషార 4–0–42–0, అన్షుల్ 4–0–42–1, బుమ్రా 4–0–23–1, హార్దిక్ పాండ్యా 4–0–31–3, పియూశ్ చావ్లా 4–0–33–3.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) మయాంక్ (బి) జాన్సెన్ 9; రోహిత్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 4; నమన్ (సి) జాన్సెన్ (బి) భువనేశ్వర్ 0; సూర్యకుమార్ (నాటౌట్) 102; తిలక్ వర్మ (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (17.2 ఓవర్లలో 3 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1–26, 2–31, 3–31. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–1–22–1, జాన్సెన్ 3–0–45–1, కమిన్స్ 4–1–35–1, నటరాజన్ 3.2–0–31–0, నితీశ్ కుమార్ రెడ్డి 2–0–16–0, షహబాజ్ 1–0–11–0.

పారిస్ ఒలింపిక్స్‌కు భారత రిలే జట్లు అర్హత


అమోజ్ జేకబ్, అరోకియా రాజీవ్, అనస్, అజ్మల్


రూపల్, పూవమ్మ, దండి జ్యోతిక శ్రీ, శుభ

నసావు (బహామస్): వరల్డ్ అథ్లెటిక్స్ రిలే పోటీల్లో రాణించిన భారత పురుషుల, మహిళల 4x400 రిలే జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీ, రూపల్ చౌదరీ, పూవమ్మ, శుభ వెంకటేశన్‌లతో కూడిన భారత మహిళల రిలే జట్టు రెండో హీట్‌లో 3 నిమిషాల 29.35 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని దక్కించుకొని పారిస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 4x400 మీటర్ల విభాగంలో భారత మహిళల జట్టు ఒలింపిక్స్‌కు అర్హత పొందడం ఇది ఎనిమిదోసారి కావడం విశేషం. గత టోక్యో ఒలింపిక్స్‌లో ఈ విభాగంలో భారత జట్టు అర్హత పొందలేదు. మరోవైపు అనస్ యాహియా, మొహమ్మద్ అజ్మల్, అరోకియా రాజీవ్, అమోజ్ జేకబ్‌లతో కూడిన భారత పురుషుల 4x400 మీటర్ల రిలే జట్టు కూడా పారిస్ ఒలింపిక్స్ టికెట్‌ను దక్కించుకుంది. రెండో హీట్‌లో అనస్, అజ్మల్, అరోకియా, అమోజ్ బృందం 3 నిమిషాల 3.23 సెకన్లలో లక్ష్యానికి చేరి రెండో స్థానంతో ఒలింపిక్స్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. ఒలింపిక్స్‌కు అర్హత పొందడం భారత పురుషుల రిలే జట్టుకిది నాలుగోసారి. టోక్యో ఒలింపిక్స్‌లో, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత రిలే జట్టు పతకాలు సాధించకపోయినా కొత్త ఆసియా రికార్డులను నెలకొల్పింది. వరల్డ్ రిలే పోటీల ద్వారా మొత్తం 70 జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాయి.

మనిక సంచలనం

- ప్రపంచ రెండో ర్యాంకర్‌పై విజయం
- తొలి రౌండ్‌లో ఓడిన శ్రీజ, శరత్



జిద్దా: సౌదీ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నీలో భారత క్రీడాకారిణి మనిక బత్రా పెను సంచలనం సృష్టించింది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ మాన్యు వాంగ్ (చైనా)పై మనిక గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 39వ ర్యాంకర్ మనిక 6–11, 11–5, 11–7, 12–10తో మాన్యు వాంగ్‌ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లో గొప్ప విజయం నమోదు చేసింది. మరోవైపు భారత నంబర్‌వన్, ప్రపంచ 38వ ర్యాంకర్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. శ్రీజ 7–11, 11–13, 11–9, 12–14తో ప్రపంచ 71వ ర్యాంకర్ జియెని షావో (పోర్చుగల్) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్‌వన్, 37వ ర్యాంకర్ ఆచంట శరత్ కమల్ 11–8, 13–11, 8–11, 5–11, 11–13 తో ప్రపంచ 19వ ర్యాంకర్ అరునా ఖాద్రీ (నైజీరియా) చేతిలో ఓడిపోయాడు.

భారత బాక్సర్లకు ఐదు పసిడి పతకాలు

అస్తానా: ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఐదు స్వర్ణ పతకాలు లభించాయి. పురుషుల విభాగంలో బ్రిజేశ్ (48 కేజీలు), ఆర్యన్ (51 కేజీలు), యశ్‌వర్ధన్ (63.5 కేజీలు)... మహిళల విభాగంలో నిషా (52 కేజీలు), లక్ష్మి (50 కేజీలు) పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో బ్రిజేశ్ 5–0తో ముమినోవ్ (తజికిస్తాన్)పై, ఆర్యన్ 5–0తో కమిలోవ్ (కిర్గిస్తాన్)పై, యశ్‌వర్ధన్ 4–1తో రుస్లాన్ (తజికిస్తాన్)పై గెలిచారు. నొముందారి (మంగోలియా)పై లక్ష్మి, బజిగాన్ (కజకిస్తాన్)పై నిషా నెగ్గారు. సాగర్ (60 కేజీలు), ప్రియాంశు (71 కేజీలు), రాహుల్ (75 కేజీలు), ఆర్యన్ (92 కేజీలు), తమన్నా (54 కేజీలు), నికిత (60 కేజీలు), సృష్టి (63 కేజీలు), రుద్రిక (75 కేజీలు), ఖుషి (81 కేజీలు) రజత పతకాలు దక్కించుకున్నారు.

సినిమా

లాక్ డౌన్‌లో ఏం జరిగింది?


అనుపమ

ఇప్పటికే తెలుగు, తమిళ, మలయాళం భాషల్లో నాలుగైదు సినిమాలు అంగీకరించి, ఫుల్ ఫామ్‌లో ఉన్నారు అనుపమా పరమేశ్వరన్. తమిళంలో విక్రమ్ తనయుడు ధ్రువ్ సరసన అనుపమ నటిస్తున్న చిత్రానికి 'బైసన్' టైటిల్ ఖరారు చేసినట్లు సోమవారం యూనిట్ ప్రకటించింది. అనుపమ లీడ్ రోల్‌లో రూపొందనున్న మరో చిత్రం 'లాక్ డౌన్' ప్రకటన కూడా వచ్చింది. ఈ చిత్రాన్ని ప్రకటించి, ''భావోద్వేగాలతో కూడిన కథను చూడ్డానికి సిద్ధం అవ్వండి'' అంటూ అనుపమా పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో అనుపమ బాధతో అరుస్తున్నట్లుగా కనిపిస్తున్నారు. 'లాక్ డౌన్'లో ఆమె పాత్ర ఎలా ఉంటుంది? ఈ రేంజ్‌లో ఎందుకు బాధపడుతున్నారనే విషయాలు తెలియాల్సి ఉంది. ఏఆర్ జీవా దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.

శ్రీకాంత్ కథలో నటించడం గౌరవంగా ఉంది - జ్యోతిక


రాజ్‌కుమార్ రావు, జ్యోతిక

''పుట్టుకతోనే అంధుడైన శ్రీకాంత్ బొల్లా తన లోపాన్ని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని పారిశ్రామికవేత్తగా ఎలా ఎదిగారు? అనేది 'శ్రీకాంత్' సినిమా కథ. కళ్లు లేకుండా జీవితాన్ని గెలవడమన్నది చాలా పెద్ద విషయం. అందుకే శ్రీకాంత్‌లాంటి గొప్ప వ్యక్తి కథతో రూపొందిన 'శ్రీకాంత్' మూవీలో నటించడం గౌరవంగా ఉంది'' అని నటి జ్యోతిక అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నానికి చెందిన శ్రీకాంత్ బొల్లా (అంధ పారిశ్రామికవేత్త) బయోపిక్‌గా రూపొందిన హిందీ చిత్రం 'శ్రీకాంత్'. శ్రీకాంత్ పాత్రలో రాజ్‌కుమార్ రావు నటించారు. తుషార్ హీరానందని దర్శకత్వం వహించారు. టీ సిరీస్, ఛాక్ అండ్ ఛీస్ ఫిల్మ్ ప్రొడక్షన్స్‌పై భూషణ్ కుమార్, కిషన్ కుమార్, నిధి పర్మార్ హీరానందని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాలో కీలక పాత్రలో నటించిన జ్యోతిక హైదరాబాద్‌లో మాట్లాడుతూ– ''తుషార్‌గారు 'శ్రీకాంత్' కథ చెప్పినప్పుడు షాక్‌కి గురయ్యాను. శ్రీకాంత్ బొల్లాలాంటి వ్యక్తి ప్రపంచంలో ఉన్నాడా? అనిపించింది. పూర్తి కథ వినగానే కచ్చితంగా ఈ మూవీలో భాగమవ్వాలని వెంటనే ఒప్పుకున్నాను. శ్రీకాంత్‌గారి పాత్రలో రాజ్‌కుమార్ రావు నటన అద్భుతం.

ఈ మూవీలో టీచర్ పాత్ర చేశాను. నేను ఉపాధ్యాయురాలిగా నటించిన మూడో చిత్రం ఇది (నవ్వుతూ). శ్రీకాంత్‌ని ప్రభావితం చేసే గొప్ప పాత్ర చేశాను. నా భర్త (హీరో సూర్య) తన సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను. నేను తెలుగులో నటించి చాలా రోజులైంది. మంచి పాత్ర కుదిరితే నటిస్తాను'' అన్నారు.

జూన్‌లో రాయన్


ధనుష్

ధనుష్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'రాయన్' చిత్రం జూన్‌లో విడుదలకు సిద్ధం అవుతోంది. సన్ పిక్చర్స్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, విష్ణు విశాల్, సందీప్ కిషన్, కాళిదాస్ జయరాం, ఎస్‌జే సూర్య, సెల్వ రాఘవన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని జూన్‌లో విడుదల చేయనున్నట్లు ప్రకటించడంతో పాటు ఈ సినిమా నుంచి తొలి పాటని ఈ నెల 9న రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు ధనుష్. ఆ మధ్య ఈ మూవీ నుంచి విడుదలైన మటన్ కొట్టు రాయన్‌గా ధనుష్ ఫస్ట్ లుక్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

లండన్‌లో ఫైట్


రణ్‌వీర్ సింగ్

డాన్‌గా ఫైట్ చేయడానికి లండన్ వెళ్లనున్నారట రణ్‌వీర్ సింగ్. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించనున్న చిత్రం 'డాన్ 3'. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తారు. ఈపాటికే ఈ సినిమా చిత్రీకరణ ఆరంభం కావాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయింది. ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది చివర్లో లండన్‌లో ప్రారంభం కానుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. లండన్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాల్లో 'డాన్ 3' సినిమా చిత్రీకరణను ప్లాన్ చేశారట ఫర్హాన్ అక్తర్. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌లో భాగంగా ఫర్హాన్ అక్తర్ ప్రస్తుతం లండన్‌లో ఉన్నారట. ఓ యాక్షన్ సీక్వెన్స్‌తో లండన్‌లో 'డాన్ 3' షూట్‌ని ఆరంభించేలా ప్లాన్ చేస్తున్నారట. ఈ సినిమాను 2025లో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. అయితే చిత్రీకరణ ఇంకా ప్రారంభం కాని నేపథ్యంలో 2026 ప్రారంభంలో విడుదలయ్యే అవకాశం ఉందని టాక్.



ప్రగ్యా జైస్వాల్

పాఠశాలలో...


హమరేశ్, ప్రార్థన

హమరేశ్, ప్రార్థనా సందీప్ జంటగా ఆడుగలం మురుగదాస్, సాయిశ్రీ, అక్షయ ప్రధాన పాత్రల్లో రూపొందిన తమిళ చిత్రం 'రంగోలి'. వాలీ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని 'సత్య' పేరుతో శివమ్ మీడియాపై శివ మల్లాల తెలుగులో ఈ నెల 10న రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుకని సోమవారం నిర్వహించారు. దర్శకులు శశికిరణ్ తిక్క, సతీష్ వేగేశ్న, కృష్ణ చైతన్య, 'మధుర' శ్రీధర్, పవన్ సాదినేని, అర్జున్ ముఖ్య అతిథులుగా హాజరై 'సత్య' ట్రైలర్‌ని విడుదల చేసి, సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. ''సత్య' సినిమాని తప్పకుండా చూడండి. అందరికీ నచ్చుతుంది'' అన్నారు శివ మల్లాల. ''సత్య' చిత్రాన్ని తమిళ్‌లో 'రంగోలి' పేరుతో తీశాను. పాఠశాల జీవితం నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామా చిత్రమిది'' అన్నారు వాలీ మోహన్ దాస్.

ఫాస్ట్‌లో... ఇదే లాస్ట్ అవుతుందా?


విన్ డీజిల్

హాలీవుడ్ సూపర్ హిట్ యాక్షన్ ఫ్రాంచైజీ 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్'కు ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉంది. ఇప్పటివరకు ఈ సినిమా ఫ్రాంచైజీ నుంచి వచ్చిన పది సినిమాలు ఘనవిజయం సాధించి, మంచి వసూళ్లను రాబట్టుకోవడం ఇందుకు ఓ నిదర్శనంగా చెప్పుకోవచ్చు. తాజాగా 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీ నుంచి 11వ చిత్రం రానుంది. 'ఫాస్ట్ ఎక్స్' ('ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' పదో చిత్రం) సినిమాకు దర్శకత్వం వహించిన లూయిస్ లెటర్రియర్ పదకొండవ సినిమానూ తెరకెక్కించనున్నారు. కాగా ఈ సినిమా గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించారు లూయిస్. ''ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ 11వ చిత్రం షూట్‌ను ఈ ఏడాదే ఆరంభిస్తాం. ప్రస్తుతం నేనో హారర్ మూవీ చేస్తున్నాను. ఈ సినిమా చిత్రీకరణ సెప్టెంబరు 15న పూర్తవుతుంది. సెప్టెంబరు 16న 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' 11వ సినిమా చిత్రీకరణను ప్రారంభిస్తాను. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' సిరీస్‌లో తొలి భాగం 2001లో విడుదలైంది. సరిగ్గా పాతికేళ్ల తర్వాత 2026లో ఈ సిరీస్‌లోని 11వ చిత్రం విడుదల చేస్తాం. తొలి చిత్రాన్ని విడుదల చేసిన తేదీనే (జూన్ 18) 11వ చిత్రాన్ని కూడా విడుదల చేయాలని ఉంది. కానీ నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ పరంగా కుదురుతుందో లేదో చూడాలి'' అని చెప్పుకొచ్చారు లూయిస్. కాగా 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీలో ఇదే లాస్ట్ చిత్రం అవుతుందని హాలీవుడ్ టాక్.

పదేళ్లకు...

'కంచె, ఆచారి అమెరికా యాత్ర, అఖండ' వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించిన హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ ఖుషీగా ఉన్నారు. ఆమె ఆనందానికి కారణం అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న 'ఖేల్ ఖేల్ మే' సినిమాలో చాన్స్ రావడమే. పదేళ్ల క్రితం చేజారిన అవకాశం ఇప్పుడు రావడంతో ప్రగ్యా తన ఆనందాన్ని పంచుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ– ''అక్షయ్ కుమార్ హీరోగా దర్శకుడు క్రిష్ 'గబ్బర్ ఈజ్ బ్యాక్' సినిమా తీశారు. ఆ మూవీ కోసం 2014లో ఆడిషన్ ఇచ్చాను. కొన్ని కారణాల వల్ల ఆ సినిమాలో నటించే అవకాశం నాకు రాలేదు. అప్పుడు నిరుత్సాహపడ్డాను. అయితే పదేళ్ల తర్వాత ఇప్పుడు అక్షయ్‌గారి 'ఖేల్ ఖేల్ మే'లో నటించే చాన్స్ రావడం హ్యాపీ. ఈ చిత్రంలో కీలక పాత్ర చేస్తున్నాను'' అన్నారు. ముదాస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో తాప్సీ, వాణీ కపూర్ నటిస్తున్నారు. ఇదిలా ఉంటే... హిందీలో 'టిటూ ఎమ్‌బీఏ' (2014) చిత్రంలో హీరోయిన్‌గా నటించారు ప్రగ్యా. బాలీవుడ్‌లో ఆమెకు అది తొలి చిత్రం. పదేళ్లకు ప్రగ్యా మళ్లీ హిందీలో అవకాశం తెచ్చుకున్నారు.

సందేశంతో...


కృష్ణ భగవాన్

నవీద్ ఖాన్, స్నేహ శర్మ, ఇంద్రజ, కృష్ణ భగవాన్, రాజా రవీంద్ర ప్రధాన పాత్రల్లో 'ద స్కూల్' (ప్లేస్ ఆఫ్ లర్నింగ్ ఉపశీర్షిక) మూవీ ప్రారంభమైంది. వాల్మీకి దర్శకత్వంలో ఎల్ఎన్ క్రియేషన్స్‌పై శివ రెమిడాల నిర్మిస్తున్నారు. ప్రిన్స్ నవీద్ ఖాన్ మాట్లాడుతూ–''సమాజంలో జరిగే సహజ ఘటనలకు అద్దం పట్టేలా సందేశాత్మకంగా ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో కృష్ణ భగవాన్, రాజా రవీంద్ర, టీఎఫ్‌సీసీ ఈసీ మెంబర్ పద్మిని పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ ఠాగూర్, సంగీతం–స్క్రీన్‌ప్లే–దర్శకత్వం: వాల్మీకి.

వాసు... విద్య... అహం


రాహుల్ విజయ్, శివాని

వాసు, విద్య.. కొత్తగా పెళ్లయిన జంట. ఈ ఇద్దరికీ ఒకరంటే మరొకరికి బోలెడంత ప్రేమ. ప్రేమకు సమానంగా ఈగో కూడా ఉంటుంది. ఇద్దరికీ ఉన్న ఈ అహం వీరి జీవితాలను ఎలా ప్రభావితం చేసింది? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'విద్య వాసుల అహం'. వాసు పాత్రలో రాహుల్ విజయ్, విద్యగా శివానీ రాజశేఖర్ నటించిన ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్, అభినయ, శ్రీనివాస్ రెడ్డి, తనికెళ్ల భరణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో మహేశ్ దత్త మొతూరు, లక్ష్మీ నవ్య మక్కపాటి నిర్మించారు. త్వరలో ఈ చిత్రాన్ని ఆహాలో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▼
17	33
73,896	22,443

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,284	▲	128
డోజోన్స్	38,798	▲	118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,213	▲	41
డాక్స్	18,175	▲	174
షాంఘై	3,141	▲	36
నికాయ్ (గురువారం ముగింపు)	38,236	▼	38

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,816
బంగారం (99.5 స్వచ్ఛత)	71,528
వెండి (కేజీ)	81,292

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్	ధామస్‌కుక్	81.84	85.13
£	బ్రిటన్‌ పౌండ్	ధామస్‌కుక్	102.36	106.93
€	యూరో	ధామస్‌కుక్	87.44	91.55
¥	జపాన్‌ ఎన్ (100)	ధామస్‌కుక్	43.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	52.71	56.97
S$	సింగపూర్‌ డాలర్	ధామస్‌కుక్	59.29	63.53
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.85	23.62
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.39	12.39

ఇండియన్‌ బ్యాంక్‌ లాభం జూమ్

క్యూ4లో రూ. 2,247 కోట్లు

ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్‌ బ్యాంక్‌ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 55 శాతం జంప్‌చేసి రూ. 2,247 కోట్లను తాకింది.



అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో కేవలం రూ. 1,447 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 14,238 కోట్ల నుంచి రూ. 16,887 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 9 శాతం వృద్ధితో రూ. 6,015 కోట్లకు చేరింది. పూర్తి ఏడాదికి సైతం బ్యాంక్‌ నికర లాభం 53 శాతం దూసుకెళ్లి రూ. 8,063 కోట్లయ్యింది. 2022–23లో కేవలం రూ. 5,282 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 52,085 కోట్ల నుంచి రూ. 63,482 కోట్లకు బలపడింది.

ఎన్‌ఎస్‌ఈలో ఇండియన్‌ బ్యాంక్‌ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.3 శాతం క్షీణించి రూ. 537 వద్ద ముగిసింది.

అరవింద్‌ డివిడెండ్‌ రూ. 4.75

నికర లాభం రూ. 104 కోట్లు

న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్‌ రంగ కంపెనీ అరవింద్‌ లిమిటెడ్‌ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 7 శాతంపైగా పుంజుకుని రూ. 104 కోట్లను అధిగమించింది.



అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 97 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,881 కోట్ల నుంచి రూ. 2,075 కోట్లకు బలపడింది. వాటాదారులకు షేరుకి రూ. 4.75 చొప్పున తుది డివిడెండ్‌ ప్రకటించింది. దీనిలో రూ. 1 ప్రత్యేక డివిడెండ్‌ కలసి ఉంది. కాగా.. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన అరవింద్‌ నికర లాభం రూ. 413 కోట్ల నుంచి రూ. 353 కోట్లకు క్షీణించింది. మొత్తం ఆదాయం సైతం రూ.8,382 కోట్ల నుంచి రూ. 7,738 కోట్లకు తగ్గింది.

ఎన్‌ఎస్‌ఈలో అరవింద్‌ షేరు 0.5 శాతం నష్టంతో రూ. 332 వద్ద ముగిసింది.

రూట్‌ మొబైల్‌.. నేలచూపు

లాభం రూ. 95 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: ఎంటర్‌ప్రైజ్‌ కమ్యూనికేషన్‌ కంపెనీ రూట్‌ మొబైల్‌ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం దాదాపు 9 శాతం క్షీణించి రూ. 95 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 104 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,009 కోట్ల నుంచి రూ. 1,017 కోట్లకు స్వల్పంగా బలపడింది. కాగా.. పూర్తి ఏడాదికి రూట్‌ మొబైల్‌ కన్సాలిడేటెడ్‌ నికర లాభం 17 శాతం ఎగసి రూ. 389 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 333 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,569 కోట్ల నుంచి రూ. 4,023 కోట్లకు పుంజుకుంది. ఐసీఐసీఐ బ్యాంక్‌ నుంచి రూ. 105 కోట్లకు మించని ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌(సెక్యూరిటీ)పై రూ. 100 కోట్లవరకూ రుణం(ఎస్‌బీఎల్‌సీ) అందుకునేందుకు బోర్డు అనుమతించింది.

ఎన్‌ఎస్‌ఈలో రూట్‌ మొబైల్‌ షేరు 1 శాతం లాభంతో రూ. 1,538 వద్ద ముగిసింది.

మారికో లాభం అప్

రూ. 320 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం మారికో లిమిటెడ్‌ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్‌ నికర లాభం 5 శాతం వృద్ధితో రూ. 320 కోట్లను తాకింది.



అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 305 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,240 కోట్ల నుంచి రూ. 2,278 కోట్లకు స్వల్పంగా బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,907 కోట్ల నుంచి రూ. 1,894 కోట్లకు తగ్గాయి. పూర్తి ఏడాదికి మారికో కన్సాలిడేటెడ్‌ నికర లాభం రూ. 1,322 కోట్ల నుంచి రూ. 1,502 కోట్లకు ఎగసింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 9,764 కోట్ల నుంచి రూ. 9,653 కోట్లకు నీరసించింది.

ఎన్‌ఎస్‌ఈలో మారికో షేరు 3 శాతం లాభంతో రూ. 532 వద్ద ముగిసింది.

ఆగస్టు నుంచి దేశవ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్‌ 4జీ

పూర్తి స్వదేశీ టెక్నాలజీతో సర్వీసులు ప్రారంభం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం దిగ్గజం బీఎస్‌ఎన్‌ఎల్‌ ఆగస్టు నుంచి దేశవ్యాప్తంగా 4జీ సర్వీసులను ప్రారంభించనుంది. ఇందుకు పూర్తి స్వదేశీ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఐటీ కంపెనీ టీసీఎస్, ప్రభుత్వ రంగ టెలికం రీసెర్చ్‌ సంస్థ సీ–డాట్‌ సారథ్యంలోని కన్సార్షియం రూపొందించిన దేశీ టెక్నాలజీతో బీఎస్‌ఎన్‌ఎల్‌ ఇప్పటికే పంజాబ్‌లో 4జీ సేవలు అందిస్తోంది. 8 లక్షల మంది పైచిలుకు సబ్‌స్క్రయిబర్స్‌ ఉన్నారు. 4జీ, 5జీ సేవల కోసం దేశవ్యాప్తంగా 1.12 లక్షల టవర్లను నెలకొల్పడంపై బీఎస్‌ఎన్‌ఎల్‌ దృష్టి పెట్టింది. 5జీకి అప్‌గ్రేడ్‌ చేయగలిగే 4జీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు టీసీఎస్, తేజస్‌ నెట్‌వర్క్స్, ప్రభుత్వ ఐటీఐలకు రూ. 19,000 కోట్ల విలువ చేసే ఆర్డర్లు ఇచ్చింది.

ఫండ్స్‌ పెట్టుబడుల జోరు..

ఎన్‌ఎస్‌ఈలో కొత్త రికార్డ్ ● ఎఫ్‌పీఐ పెట్టుబడులు డౌన్



ముంబై: స్టాక్‌ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీలలో మ్యూచువల్‌ ఫండ్స్‌(ఎంఎఫ్‌లు) పెట్టుబడులు చరిత్రాత్మక గరిష్టానికి చేరాయి. మార్చితో ముగిసిన గతేడాది(2023–24) చివరి త్రైమాసికంలో లిస్టెడ్‌ కంపెనీలలో ఎంఎఫ్‌ల వాటా 9 శాతానికి ఎగసింది. ఇందుకు ఈ కాలంలో తరలివచ్చిన రూ. 81,539 కోట్ల నికర పెట్టుబడులు దోహదపడ్డాయి. ప్రైమ్‌ డేటాబేస్‌ గ్రూప్‌ వివరాల ప్రకారం 2023 డిసెంబర్‌ చివరికల్లా ఈ వాటా 8.8 శాతంగా నమోదైంది. ఈ కాలంలో దేశీయంగా అతిపెద్ద సంస్థాగత ఇన్వెస్టర్‌ అయిన ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ వాటా 3.64 శాతం నుంచి 3.75 శాతానికి బలపడింది. ఎల్‌ఐసీకి 280 లిస్టెడ్‌ కంపెనీలలో 1 శాతానికిపైగా వాటా ఉంది. వెరసి ఎంఎఫ్‌లు, బీమా కంపెనీలు, బ్యాంకులు, ఫైనాన్షియల్‌ సంస్థలు, పెన్షన్‌ ఫండ్స్‌తోకూడిన దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల(డీఐఐలు) వాటా మొత్తంగా 15.96 శాతం నుంచి 16.05 శాతానికి మెరుగుపడింది. ఇందుకు భారీగా తరలివచ్చిన రూ. 1.08 లక్షల కోట్ల పెట్టుబడులు తోడ్పాటునిచ్చాయి.

విదేశీ ఇన్వెస్ట్‌మెంట్‌.. 11ఏళ్ల కనిష్టం

2024 మార్చికల్లా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) పెట్టుబడుల వాటా 17.68 శాతానికి నీరసించింది. ఇది గత 11ఏళ్లలోనే కనిష్టంకాగా.. 2023 డిసెంబర్‌కల్లా 18.19 శాతంగా నమోదైంది. ఫలితంగా ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీలలో డీఐఐలు, ఎఫ్‌పీఐల హోల్డింగ్(వాటాలు) మధ్య అంతరం చరిత్రాత్మక కనిష్టానికి చేరింది. ఎఫ్‌పీఐలు డీఐఐల మధ్య వాటాల అంతరం 9.23 శాతానికి తగ్గింది. గతంలో 2015 మార్చిలో ఎఫ్‌పీఐలు, డీఐఐల మధ్య వాటాల అంతరం అత్యధికంగా 49.82 శాతంగా నమోదైంది. ఇది ఎన్‌ఎస్‌ఈలో లిస్టయిన 1,989 కంపెనీలలో 1,956 కంపెనీలను లెక్కలోకి తీసుకుని చేసిన మదింపు.

సెన్సెక్స్‌ ప్లస్, నిఫ్టీ మైనస్

ట్రేడింగ్‌ ఆద్యంతం ఒడిదుడుకులు

అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో స్టాక్‌ సూచీలు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్‌ 17 పాయింట్లు లాభపడి 73,896 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్లు నష్టపోయి 22,443 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్‌ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. కన్జూమర్‌ డ్యూరబుల్స్, సర్వీసెస్, యుటిలిటీ, విద్యుత్, పారిశ్రామికోత్పత్తి, కమోడిటీ షేర్లు నష్టాలను చవిచూశాయి.



బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌ సూచీలు 1% నష్టపోయాయి. అమెరికా వడ్డీరేట్ల పెంపు ఆశలతో ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, ఆటో, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియాలో జపాన్, దక్షిణ కొరియా, తైవాన్‌ దేశాల స్టాక్‌ మార్కెట్లు పనిచేయలేదు. చైనా, హాంగ్‌కాంగ్‌ సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి. యూరప్‌ మార్కెట్లు అరశాతం లాభపడ్డాయి. నిర్మాణంలో ఉన్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రుణాల కేటాయింపు కఠినతరం చేస్తూ రూపొందించిన ముసాయిదాను ఆర్‌బీఐ ఆమోదించడంతో ప్రభుత్వరంగ బ్యాంకులు, కంపెనీల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.


కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

7-5-2024 ఫామ్‌ ధర...

విశాఖ	470–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్‌ గోదావరి	460–00
విజయవాడ	460–00
రిటైల్‌ ధర (డజను)	60.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్‌ ధర	5.40

కేకేఆర్‌ చేతికి హెల్దియం మెడ్‌టెక్

డీల్‌ విలువ రూ. 7,000 కోట్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్‌ దిగ్గజం కేకేఆర్‌ తాజాగా వైద్య పరికరాల సంస్థ హెల్దియం మెడ్‌టెక్‌లో నియంత్రణాధికారాలు ఉండే వాటాలను దక్కించుకోనుంది. ఎపాక్స్‌ పార్ట్‌నర్స్‌ అనుబంధ సంస్థ నుంచి దీన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్‌ విలువ రూ. 6,500 కోట్ల నుంచి రూ. 7,000 కోట్ల వరకు ఉండొచ్చని, 2024 మూడో త్రైమాసికంలో ఈ ఒప్పందం పూర్తి కాగలదని సమాచారం. 1992లో ఏర్పాటైన హెల్దియం వివిధ రకాల సర్జికల్‌ ఉత్పత్తులను తయారు చేస్తోంది. దీనికి అనీష్‌ బాఫ్నా సీఈవోగా ఉన్నారు. 2018లో హెల్దియంను ఎపాక్స్‌ ఫండ్స్‌ కొనుగోలు చేసింది. కాగా కేకేఆర్‌ ఇప్పటికే భారత హెల్త్‌కేర్‌ రంగంలో జేబీ, మ్యాక్స్‌ హెల్త్‌కేర్, గ్లాండ్‌ ఫార్మా తదితర సంస్థల్లో ఇన్వెస్ట్‌ చేసింది.

భారత్‌ సేవల రంగం నెమ్మది

ఏప్రిల్‌లో 60.8కి డౌన్



న్యూఢిల్లీ: భారత్‌ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటినెల ఏప్రిల్‌లో నెమ్మదించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్‌ బిజినెస్‌ యాక్టివిటీ ఇండెక్స్‌ మార్చిలో 61.2 వద్ద ఉంటే, ఏప్రిల్‌లో 60.8కి తగ్గింది. అయితే ఈ స్థాయి కూడా 14 ఏళ్ల గరిష్ట స్థాయిలోనే కొనసాగుతుండటం గమనార్హం. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి బాటగా, దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణించడం గమనార్హం. మరోవైపు తయారీ, సేవలు కలగలిపిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్‌ పీఎంఐ అవుట్‌పుట్‌ ఇండెక్స్‌ మార్చిలో 61.8 ఉంటే, ఏప్రిల్‌లో 61.5కు తగ్గడం మరో అంశం. అయితే ఇది కూడా 14 సంవత్సరాల గరిష్ట స్థాయే కావడం గమనార్హం.

భవిత

- గ్రూప్‌1, గ్రూప్‌2 ప్రత్యేకం- కరెంట్‌ అఫైర్స్‌ కోసం

ఈ క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయండి

కెరీర్‌ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నైపర్‌ జేఈఈ-2024

గువాహటిలోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఫార్మాస్యూటికల్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ రీసెర్చ్‌ (నైపర్‌-జి).. నైపర్‌ జాయింట్‌ ఎంట్రన్స్‌ ఎగ్జామినేషన్‌ (జేఈఈ) 2024 ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న నైపర్‌ క్యాంపస్‌లలో మాస్టర్స్‌ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **నైపర్‌ క్యాంపస్‌లు:** అహ్మదాబాద్, గువాహటి, హాజీపూర్, హైదరాబాద్, కోల్‌కతా, రాయ్‌బరేలి, ఎస్‌ఏఎస్‌ నగర్.

కోర్సు, సీట్ల వివరాలు

» **మాస్టర్‌ ఆఫ్‌ సైన్స్‌(ఫార్మసీ):** **విభాగాలు:** మెడిసినల్‌ కెమిస్ట్రీ–122, నేచురల్‌ ప్రొడక్ట్స్–58, ట్రెడిషనల్‌ మెడిసినల్–5, ఫార్మాస్యూటికల్‌ అనాలిసిస్–108, ఫార్మకాలజీ–టాక్సికాలజీ–140, రెగ్యులేటరీ టాక్సికాలజీ–21, ఫార్మాస్యూటిక్స్–142, ఫార్మాకోఇన్ఫర్మేటిక్స్–147, రెగ్యులేటరీ అఫైర్స్–18.

» **మాస్టర్‌ ఆఫ్‌ ఫార్మసీ: విభాగాలు:** ఫార్మాస్యూటికల్‌ టెక్నాలజీ (ఫార్ములేషన్స్)–23, ఫార్మసీ ప్రాక్టీస్–35, క్లినికల్‌ రీసెర్చ్–09.

» **మాస్టర్‌ ఆఫ్‌ టెక్నాలజీ(ఫార్మసీ): విభాగాలు:** బయో టెక్నాలజీ/ఫార్మాస్యూటికల్‌ టెక్నాలజీ (బయో టెక్నాలజీ)–120, ఫార్మాస్యూటికల్‌ టెక్నాలజీ (ప్రాసెస్‌ కెమిస్ట్రీ)/మెడిసినల్‌ కెమిస్ట్రీ–40, మెడికల్‌ డివైజెస్–62.

» **మాస్టర్‌ ఆఫ్‌ బిజినెస్‌ అడ్మినిస్ట్రేషన్‌ (ఫార్మసీ):** **విభాగాలు:**ఫార్మాస్యూటికల్‌ మేనేజ్‌మెంట్–50.

» **అర్హత:** బీఫార్మసీ/ఎంఎస్సీ/బీఈ, బీటెక్/ఎంబీబీఎస్/బీవీఎస్సీ/బీడీఎస్‌తోపాటు జీప్యాట్/గేట్/నెట్/ఇతర జాతీయ ఫెలోషిప్‌ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

» **ఎంపిక విధానం:** ఉమ్మడి ప్రవేశ పరీక్ష, గ్రూప్‌ డిస్కషన్, కౌన్సెలింగ్, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తు ప్రారంభతేది:** 25.04.2024.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2024

» **వెబ్‌సైట్:** https://niperguwahati.ac.in/niperjee

ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఇంటర్‌ ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(గురుకులం)..గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్‌ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

» **ఎంపిక విధానం:** పదో తరగతి మార్కులు, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్, కౌన్సెలింగ్‌ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024

» **మెరిట్‌ జాబితా వెల్లడి తేది:** 20.05.2024.

» **కౌన్సెలింగ్‌ నిర్వహణ తేది:** 22.05.2024.

» **ఫేజ్–1 అడ్మిషన్లకు చివరితేది:** 01.06.2024.

» **తరగతుల ప్రారంభం:** 01.06.2024.

» **వెబ్‌సైట్:** https://twreiscet.apcfss.in

యూనివర్సిటీ ఆఫ్‌ హైదరాబాద్‌లో పీజీ ప్రవేశాలు

యూనివర్సిటీ ఆఫ్‌ హైదరాబాద్.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సులు:** ఎంఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, ఎంపీఏ, ఎంఈడీ, ఎంపీహెచ్, ఎంపీఏ, ఎంఎఫ్‌ఏ.

» **సబ్జెక్టులు:** మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, ప్లాంట్‌ బయాలజీ, యానిమల్‌ బయాలజీ, మాస్టర్‌ ఆఫ్‌ పబ్లిక్‌ హెల్త్, ఇంగ్లిష్, హిందీ, ఫిలాసఫీ, తెలుగు, ఉర్దూ తదితరాలు.

» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో బ్యాచిలర్‌ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సీయూఈటీ (పీజీ)–2024 స్కోరు సాధించి ఉండాలి.

» **ఎంపిక విధానం:** కామన్‌ యూనివర్సిటీ ఎంట్రన్స్‌ టెస్ట్‌(సీయూఈటీ) పీజీ–2024 స్కోర్, ఇంటర్వ్యూ, రూల్‌ ఆఫ్‌ రిజర్వేషన్‌ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024

» **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

డీఆర్‌డీవో-డీఎంఆర్‌ఎల్, హైదరాబాద్‌లో 127 ఐటీఐ అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌ కాంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవోకి చెందిన డిఫెన్స్‌ మెటలర్జికల్‌ రీసెర్చ్‌ ల్యాబొరేటరీ(డీఎంఆర్‌ఎల్).. ఐటీఐ అప్రెంటిస్‌ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 127

» **ట్రేడులు:** ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్‌ ఆపరేటర్‌ అండ్‌ ప్రోగ్రామింగ్‌ అసిస్టెంట్, కార్పెంటర్, బుక్‌ బైండర్.

» **అర్హత:** సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.

» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2024.

» **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

ఫైన్‌ ఆర్ట్స్‌.. కెరీర్‌ షైనింగ్

» డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ఎఫ్‌ఏయూ ఏడీసెట్‌ 2024 నోటిఫికేషన్‌ విడుదల
» బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌లో పలు కోర్సులు
» ఏడీసెట్‌ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు
» ఇంటర్మీడియెట్‌ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు

కళలు, ఫోటోగ్రఫీ, డిజైన్, యానిమేషన్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు స్వాగతం పలుకుతోంది.. డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ యూనివర్సిటీ! చిత్రకళలు, అప్లైడ్‌ ఆర్ట్స్, స్కల్ప్చర్, యానిమేషన్, డిజైన్, పెయింటింగ్, ఫోటోగ్రఫీ విభాగాల్లో.. బ్యాచిలర్‌ కోర్సులను అందిస్తోంది!! ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఆర్ట్‌ అండ్‌ డిజైన్‌ కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్(ఏడీసెట్)-2024 నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏడీసెట్-2024 వివరాలు, డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ఎఫ్‌ఏయూ అందిస్తున్న కోర్సులు, ప్రవేశ పరీక్ష విధానం తదితర వివరాలు..

ఫైన్‌ ఆర్ట్స్‌ విభాగంలో.. నిపుణులను తీర్చిదిద్ది అవకాశాలు కల్పించేందుకు.. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకంగా డాక్టర్‌ వైఎస్‌ఆర్‌ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ యూనివర్సిటీని నెలకొల్పారు. ప్రస్తుతం ఫైన్‌ ఆర్ట్స్, డిజైన్‌ విభాగాల్లో బ్యాచిలర్‌ స్థాయి కోర్సుల్లో ప్రవేశాలకు ఆర్కిటెక్చర్‌ అండ్‌ డిజైన్‌ కామన్‌ ఎంట్రన్స్‌(ఏడీసెట్) టెస్ట్‌కు నోటిఫికేషన్‌ విడుదలైంది. ఇందులో ర్యాంకు ఆధారంగా.. ప్రవేశాలు కల్పిస్తారు.

ఆరు కోర్సులు.. 280 సీట్లు

ఆర్కిటెక్చర్‌ అండ్‌ డిజైన్‌ కామన్‌ ఎంట్రన్స్‌ టెస్ట్‌ స్కోర్‌ ఆధారంగా మొత్తం ఆరు కోర్సుల్లో 280 సీట్లు భర్తీ చేస్తారు. కోర్సుల వారీగా సీట్ల వివరాలు..

- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ (అప్లయిడ్‌ ఆర్ట్స్)–40; వ్యవధి–నాలుగేళ్లు.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ (పెయింటింగ్)–40; వ్యవధి–నాలుగేళ్లు.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ (ఫొటోగ్రఫీ)–40; వ్యవధి –నాలుగేళ్లు.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ (స్కల్ప్చర్)–40; వ్యవధి –నాలుగేళ్లు.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ (యానిమేషన్)–60: వ్యవధి –నాలుగేళ్లు.
- బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ (ఇంటీరియర్‌ డిజైన్)–60; వ్యవధి –నాలుగేళ్లు.

అర్హతలు

ఏడీ సెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏదైనా గ్రూప్‌తో ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణత ఉండాలి.

ఏడీసెట్‌ ఇలా

బ్యాచిలర్‌ ఆఫ్‌ ఫైన్‌ ఆర్ట్స్, బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్‌ కోర్సుల్లో ప్రవేశానికి ఏడీసెట్‌ను 100 ప్రశ్నలు–100 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్‌ నాలెడ్జ్, ఆర్ట్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ స్కిల్స్, టెక్నికల్‌ డిటెయిల్స్‌ ఆఫ్‌ అప్లైడ్‌ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్, ఫొటోగ్రఫీ, ఆర్ట్‌ హిస్టరీ, డిజైన్‌ స్కిల్స్‌ నుంచి ప్రశ్నలు అడుగుతారు.

కనీస ఉత్తీర్ణత మార్కులు

ఏడీసెట్‌లో కనీస ఉత్తీర్ణత మార్కుల నిబంధన అమల్లో ఉంది. అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు సాధిస్తేనే ఏడీసెట్‌లో అర్హత పొందినట్లు ప్రకటిస్తారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకు ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంది.

కెరీర్‌ అవకాశాలు

బీఎఫ్‌ఏ-అప్లయిడ్‌ ఆర్ట్

ఆర్ట్‌ డైరెక్టర్‌గా రాణించాలనుకునే వారికి చక్కటి కోర్సు.. అప్లయిడ్‌ ఆర్ట్! ఈ కోర్సులో భాగంగా డ్రాయింగ్, పెయింటింగ్, క్లే మోడలింగ్‌లో బేసిక్స్‌ తోపాటు విజువల్‌ కమ్యూనికేషన్‌ అండ్‌ గ్రాఫిక్స్‌ అంశాలపై మెళకువలు నేర్పుతారు. గ్రాఫిక్‌ డిజైన్, అడ్వర్‌టైజింగ్, లోగో డిజైనింగ్‌పై నైపుణ్యం లభిస్తుంది. దీంతో సినిమా రంగంలో ఆర్ట్‌ డైరెక్టర్, సెట్‌ డిజైనర్, విజువలైజర్‌గా అవకాశాలు అందుకోవచ్చు. వస్త్ర పరిశ్రమ, ఆభరణాల డిజైనింగ్, కలినరీ ఆర్ట్, గేమ్‌ డిజైనర్, యాడ్‌ ఫిలిం ఏజెన్సీలలో.. స్టోరీ బోర్డ్‌ ఆర్టిస్ట్‌గా, క్రియేటివ్‌ ఆర్ట్‌ డైరెక్టర్‌గా అవకాశాలు లభిస్తాయి.

బీఎఫ్‌ఏ-పెయింటింగ్

ప్రకృతి అందాలను మనసులో నిక్షిప్తం చేసుకొని, సృజనాత్మకతను జోడించి.. కుంచెతో అద్భుతంగా ఆవిష్కరించే కళ.. పెయింటింగ్. ప్రస్తుతం పెయింటింగ్‌ యువతకు మంచి కెరీర్‌ మార్గంగా నిలుస్తోంది. పెయింటింగ్‌లో ఆయిల్‌ పెయింట్, వాటర్‌ కలర్‌ పెయింట్, ఆక్రిలిక్‌ పెయింట్, టెంపెరా పెయింట్‌ వంటి రకాలు ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన వారు ఫ్రీలాన్స్‌ ఆర్టిస్ట్, సెట్‌ డిజైనర్‌గా ఉపాధి పొందొచ్చు. దీంతోపాటు కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్‌ స్కూల్స్‌ తదితరాల్లో బోధన అవకాశాలు లభిస్తాయి.



ఏడీ సెట్‌లో రాణించాలంటే

- ఈ పరీక్షలో రాణించేందుకు కళలకు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి. భారత్‌లో చిత్రకళల చరిత్ర మొదలు తాజా పరిణామాల వరకు తెలుసుకోవాలి.
- అదే విధంగా భారత దేశంలో శిల్ప కళ, నిర్మాణ రంగం, వారసత్వం, సంస్కృతి వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.
- దేశంలో ఫిల్మ్, లిటరేచర్, మ్యూజిక్, థియేటర్‌ రంగాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ఇంగ్లిష్‌ కమ్యూనికేషన్‌ స్కిల్స్‌ పెంచుకోవాలి.
- అప్లైడ్‌ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్, ఫొటోగ్రఫీ, డిజైన్‌ స్కిల్స్‌ను పెంచుకునేలా ప్రిపరేషన్‌ సాగించాలి. దీంతోపాటు జనరల్‌ నాలెడ్జ్‌పై పట్టు సాధించాలి.

మోడల్‌ పేపర్స్‌ ప్రాక్టీస్

ఏడీ సెట్‌కు హాజరయ్యే విద్యార్థులు.. మోడల్‌ పేపర్స్‌ను ప్రాక్టీస్‌ చేయడం కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఏపీ ఉన్నత విద్యా మండలి అందుబాటులో ఉంచిన మోడల్‌ పేపర్లను ప్రాక్టీస్‌ చేయడం ద్వారా పరీక్ష తీరు తెన్నులు, ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకోవచ్చు.

బీఎఫ్‌ఏ-ఫొటోగ్రఫీ

ఫొటోగ్రఫీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ, ప్రైవేట్‌ రంగాల్లో అవకాశాలు అందుకునే వీలుంది. కోర్సు అభ్యసించే సమయంలో ఫొటోగ్రఫీలో అన్ని రకాల మెళకువలు నేర్పిస్తారు. ప్రాక్టికల్‌ నైపుణ్యాలు పొందేలా శిక్షణ ఇస్తారు. దీంతో కోర్సు పూర్తయ్యేనాటికి ఈ విభాగంపై విద్యార్థులకు మంచి అవగాహన ఏర్పడుతోంది. వీరికి ఫ్యాషన్‌ ఫొటోగ్రఫీ, ఆటోమొబైల్‌ ఫొటోగ్రఫీ, కార్పొరేట్‌ ఫొటోగ్రఫీ, వైల్డ్‌లైఫ్‌ ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో చక్కటి అవకాశాలు లభిస్తున్నాయి.

బీఎఫ్‌ఏ-స్కల్ప్చర్ (శిల్ప కళ)

శిల్పకళ అత్యంత ప్రాచీనమైన, ఎంతో ప్రత్యేకమైన కళ. రాళ్లకు సైతం జీవ కళ కల్పించి.. అందరి దృష్టి ఆకర్షించే నైపుణ్యం శిల్పకళతోనే సాధ్యం. బీఎఫ్‌ఏ స్కల్ప్చర్‌ అనంతరం కొంతమంది ఇంటి వద్దే శిల్పాలు రూపొందిస్తుంటే.. మరికొందరు ప్రత్యేకంగా హోం స్టూడియోలు నిర్వహిస్తున్నారు. వీరంతా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, వ్యక్తులకు శిల్పాలను సరఫరా చేస్తున్నారు. చక్కటి పరిశీలనా నైపుణ్యం, భావోద్వేగాలు, ఆలోచనలకు రూపం ఇవ్వగలిగే నేర్పు ఉన్నవారికి ఈ కోర్సు చక్కగా సరిపోతుంది.

బీఎఫ్‌ఏ-యానిమేషన్..

ప్రస్తుతం యానిమేషన్‌ రంగం వేగంగా విస్తరిస్తోంది. ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్‌ రంగాల్లో యానిమేషన్‌ కోర్సులు పూర్తిచేసిన వారికి కెరీర్‌ అవకాశాలకు కొదవలేదు. యానిమేషన్‌కు సంబంధించి సినిమాలు, టెలివిజన్, అడ్వర్‌టైజింగ్‌ విభాగాలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

బ్యాచిలర్‌ ఆఫ్‌ డిజైన్-ఇంటీరియర్‌ డిజైన్

నగరాల్లోని ప్రజలు ఇంటీరియర్‌ డిజైనింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కాని డిమాండ్‌కు తగ్గ స్థాయిలో ఇంటీరియర్‌ నిపుణులు అందుబాటులో లేరు. దేశంలో లక్ష మందికిపైగా ఇంటీరియర్‌ డిజైనింగ్‌ నిపుణుల కొరత ఉన్నట్లు అంచనా. కాబట్టి ఆసక్తి ఉన్న యువత ఇంటీరియర్‌ డిజైనింగ్‌ కోర్సులను ఎంచుకొని.. ఉపాధి మార్గాలు అందుకోవచ్చు. వీరు ఫర్నిచర్‌ డిజైనింగ్, లైటింగ్‌ డిజైనర్, కిచెన్‌ డిజైనర్, ఆర్కిటెక్ట్, ఆర్కిటెక్చురల్‌ టెక్నాలజిస్టు, ప్రొడక్ట్‌ డిజైనర్, టెక్స్‌టైల్‌ డిజైనర్‌ కొలువుల్లో స్థిరపడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తుకు చివరి తేదీ:** 2024, మే 22. (రూ.500 ఆలస్య ఫీజుతో మే 28; రూ.వేయి ఆలస్య ఫీజుతో మే 31 వరకు)
- **ఆన్‌లైన్‌ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, జూన్‌ 1– జూన్‌ 3.
- **హాల్‌ టికెట్‌ డౌన్‌లోడ్‌ తేదీ:** 2024, జూన్‌ 4.
- **ఏడీ సెట్‌ కంప్యూటర్‌ బేస్డ్‌ టెస్ట్‌ తేదీ:** 2024, జూన్‌ 13.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in/ADCET

ఏపీ డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తా

- అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి బదిలీ
- కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు



సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ)గా హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు 1992వ బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి హరీశ్‌కుమార్ గుప్తాను ఏపీ డీజీపీగా నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు డీజీపీగా ఉన్న కేవీ రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేస్తూ ఈసీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కొత్త డీజీపీ నియామకం కోసం ముగ్గురు డీజీ ర్యాంక్ కలిగిన అధికారుల పేర్లను సూచించాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఎన్నికల సంఘం కోరింది. దీంతో ద్వారకా తిరుమలరావు, హరీశ్‌కుమార్ గుప్తా, మాదిరెడ్డి ప్రతాప్ పేర్లను సీఎస్ పంపించగా.. వీటిని పరిశీలించిన కేంద్ర ఎన్నిక సంఘం హరీశ్‌కుమార్ గుప్తాను డీజీపీగా నియమించింది. కాగా, అనంతపురం డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డిని బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

నేటి నుంచే టీఎస్ ఈఏపీ సెట్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశపరీక్ష (టీఎస్ ఈఏపీసెట్) మంగళవారం నుంచి ప్రారంభం అవుతోంది. ఈ నెల 11వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో తొలి రెండు రోజులు (7, 8 తేదీలు) ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాలకు సంబంధించిన సెట్ ఉంటుంది. 9 నుంచి 11వ తేదీ వరకు ఇంజనీరింగ్ సెట్ నిర్వహిస్తారు. ఈ పరీక్షలు కంప్యూటర్ బేస్డ్‌గా.. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు మరో సెషన్ జరుగుతాయి. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షకు మొత్తంగా 1,00,260 మంది రిజిస్టర్ చేసుకున్నారు. అందులో ఏపీ నుంచి దరఖాస్తు చేసుకున్నవారు 12,349 మంది. ఇంజనీరింగ్‌కు మొత్తం 2,54,543 మంది దరఖాస్తు చేశారు. వీరిలో ఏపీ నుంచి 49,071 మంది ఉన్నారు.

విస్తృతంగా ఏర్పాట్లు..

హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) నిర్వహించే ఈఏపీ సెట్ కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్టు సెట్ కన్వీనర్ కుమార్ తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష జరుగుతుందన్నారు. తెలంగాణలో 16, ఏపీలో 5 కలిపి మొత్తం 21 టెస్ట్ జోన్లు ఏర్పాటు చేశామని.. అగ్రికల్చర్, ఫార్మసీ కోసం 135, ఇంజనీరింగ్ కోసం 166 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీలో కర్నూల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలు ఉంటాయన్నారు. అభ్యర్థులకు ఇప్పటికే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ సౌకర్యం కల్పించామని.. పరీక్ష కేంద్రం ఎక్కడనేది అందులో స్పష్టంగా పేర్కొన్నామని వివరించారు.

తొలుత అగ్రి, ఫార్మసీ పరీక్ష.. 9వ తేదీ నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు..

- ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా పరీక్షలు.. నిమిషం ఆలస్యమైనా నో చాన్స్
- 90 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవడం మంచిదని అధికారుల సూచన



విద్యార్థులకు సూచనలివీ..



పరీక్ష రాసే విద్యార్థులు 90 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం సెషన్ వారు ఉదయం 7.30 గంటలకు, సాయంత్రం సెషన్‌వారు మధ్యాహ్నం 1.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవడం మంచిది. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా హాల్‌లోకి అనుమతించరు.

పరీక్ష హాల్‌లోకి ప్రవేశించే ముందే బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారు. ఈసారి ఫేషియల్ రికగ్నిషన్ కూడా అమలు చేస్తున్నారు.

పూర్తిచేసిన అప్లికేషన్‌తోపాటు ఇటీవలి పాస్‌పోర్టు ఫొటోను కూడా తీసుకెళ్లాలి. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ వంటి వాటిల్లో ఏదైనా గుర్తింపు కార్డు కూడా తీసుకెళ్లాలి.

విద్యార్థులు మెహెందీ, టాటూస్, ఇతర స్టిక్కర్లను బయోమెట్రిక్ తీసుకునే వేళ్లకు వేసుకోకూడదు.

కాలిక్యులేటర్లు, ట్యాబ్‌లు, రిస్ట్ వాచీలు, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. నోట్‌బుక్స్, ప్రింటెడ్ మెటీరియల్ ఏదైనా నిషిద్ధమే. అవసరమైన రఫ్ పేపర్లు పరీక్ష హాల్‌లోనే ఇస్తారు.

మంచినీళ్లు, మందులు ఏవైనా అవసరమైతే పరీక్ష కేంద్రాల నిర్వాహకులే అందజేస్తారు. సొంతంగా మంచి నీళ్ల బాటిళ్లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు.

ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయండి



విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా టీఎస్‌ఈఏపీ సెట్ రాయాలి. పరీక్ష కోసం అన్నిచోట్లా ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రానికి త్వరగా చేరుకోవాలి. అన్ని పరీక్షల తరహాలోనే ఇదీ తేలికగా రాయగలమన్న నమ్మకంతో ఉండాలి. దీనివల్ల ఒత్తిడికి దూరంగా ఉండొచ్చు.

- ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యా మండలి చైర్మన్

ఇంగ్లిష్‌లోని ప్రశ్నలనే పరిగణనలోకి తీసుకోవాలి



ద్విభాష విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఒక్కోసారి తెలుగులోకి ట్రాన్స్‌లేట్ చేసిన పదాలు అర్థం కాని పరిస్థితి ఉండొచ్చు. ఇలాంటప్పుడు ఇంగ్లిష్‌లో ఉన్న ప్రశ్నలు/పదాలకు ఉన్న అర్థాన్ని ప్రామాణికంగా తీసుకోవాలి. ఆ మేరకే సమాధానం రాయాలి.

- ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ

తేలికగా.. మధ్యస్థంగానే పరీక్ష

సెట్ ప్రశ్నపత్రం పూర్తిగా రాష్ట్ర సిలబస్ నుంచే ఉంటుంది. 40శాతం తేలికైన, 40శాతం మధ్యస్థం 20శాతం మాత్రమే కఠిన ప్రశ్నలు ఉంటాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా తేలికగా సెట్ రాసే పరిస్థితి ఉంటుంది. ఎలాంటి తడబాటు లేకుండా పరీక్ష రాయాలి.

- విజయకుమార్‌రెడ్డి, టీఎస్‌ఈఏపీ సెట్ కో-కన్వీనర్



ప్లాస్టిక్‌పై ఫైటింగ్‌లో కొత్త హీరో!

వాడటం సులువు.. ఖర్చు తక్కువ.. కానీ ముప్పు మాత్రం ఎక్కువ. అదే ప్లాస్టిక్. ఇప్పుడిది ప్రపంచానికి అతిపెద్ద సమస్యగా మారింది. ప్లాస్టిక్ వందల ఏళ్లపాటు భూమిలో కలసిపోకుండా అలా ఉండిపోవడం, ఎన్నో వ్యాధులకు కారణం అవుతుండటమే దీనికి కారణం. దీనితో రోజురోజుకు భూమితో పాటు సముద్రాల్లోనూ భారీగా పేరుకుపోతున్న ప్లాస్టిక్ చెత్తను నిర్మూలించడంపై సైంటిస్టులు ఫోకస్ చేశారు. ఈ ఫైటింగ్‌లో సరికొత్తగా తెరపైకి వచ్చిన హీరో.. వ్యాక్స్ వార్మ్.

తేనెపట్టుల్లో ఉండే పురుగులు

తేనెటీగలు కట్టుకునే తేనెపట్టుల్లో నివసించే చిన్నపాటి పురుగులే.. వ్యాక్స్ వార్మ్స్. వీటి లాలాజలంలో ఉండే కొన్ని ఎంజైమ్‌లు 'పాలీఇథైలీన్'ను బ్రేక్ చేస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్యాకింగ్ మెటీరియల్, క్యారీ బ్యాగ్‌లలో ఉపయోగించే ప్లాస్టిక్.. 'పాలీఇథైలీన్'.

అనుకోకుండా కనుగొని..

స్పెయిన్‌కు చెందిన ఫెడరికా బెర్టోచిని అనే మాలిక్యులర్ బయాలజిస్ట్‌కు తేనెటీగలను పెంచేవారు. ఒకసారి తేనెపట్టును పరిశీలిస్తున్న ఆమె.. అందులోని పురుగులు ప్లాస్టిక్‌ను తినేస్తున్నట్టు గుర్తించారు. దీనిపై లోతుగా పరిశోధన చేసి.. వ్యాక్స్ వార్మ్‌ల లాలాజలంలోని రెండు ఎంజైమ్‌లు 'పాలీఈథైలీన్'ను బ్రేక్ చేస్తున్నట్టు తేల్చారు. మన జీర్ణవ్యవస్థలో ఉండే ఎంజైమ్‌లు ఆహారాన్ని అరిగించే తరహాలోనే.. వ్యాక్స్ వార్మ్‌లోని ఎంజైమ్‌లు ప్లాస్టిక్‌ను అరిగిస్తున్నట్టు గుర్తించారు. ఆ ఎంజైమ్‌లకు రోమన్ పంటల దేవతలు సెరెస్, డెమెటర్ పేర్లు పెట్టారు.

అప్పుడే అయిపోలేదు..

వ్యాక్స్ వార్మ్‌లతో ప్లాస్టిక్ చెక్ పెట్టడం ప్రకృతి సహజమైన పద్ధతే అయినా.. ఇబ్బందులూ ఉన్నాయట. ప్లాస్టిక్ చెత్తను అరగదీయడానికి వందలకోట్ల కొద్దీ వ్యాక్స్ వార్మ్‌లు కావాలి. వాటి నుంచి ఎంతో కార్బన్ డయాక్సైడ్ కూడా ఉత్పత్తి అవుతుంది కూడా. దీంతో ఈ సమస్యను అధిగమించడంపై శాస్త్రవేత్తలు ఫోకస్ చేశారు.



ప్లాస్టిక్‌ను తింటున్న వ్యాక్స్ వార్మ్

ప్లాస్టిక్‌ను తినగలిగేవి మరికొన్నీ ఉన్నాయ్..

ప్రకృతిలో ప్లాస్టిక్‌ను అరగదీయగలిగేవి మరికొన్ని కూడా ఉన్నాయి. 'జొఫొబస్ మొరియో'గా పిలిచే పురుగులు 'పాలీస్టైరిన్' ప్లాస్టిక్‌ను తినగలవని ఇప్పటికే గుర్తించారు. కొన్ని రకాల ఫంగస్, బ్యాక్టీరియాలు కూడా ప్లాస్టిక్‌ను అరిగించుకోగలవని తేల్చారు.

కొన్ని ప్లాస్టిక్ లెక్కలివీ..

- ఏటా ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ వేస్ట్.. 40 కోట్ల టన్నులు
- అందులో సముద్రాలు, ఇతర జలవనరుల్లో చేరి కలుషితం చేస్తున్నవి.. 2.3 కోట్ల టన్నులు.
- వివిధ రకాల ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోవడానికి పట్టే సమయం.. 70 సంవత్సరాల నుంచి 500 సంవత్సరాలు

- సాక్షి సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లోకి బొమ్మ శ్రీరాం

- సీఎం సమక్షంలో సొంతగూటికి వచ్చిన బీజేపీ నేత



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలోకి వెళ్లిన బొమ్మ శ్రీరాం తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయనకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అర్వింద్'

- గాంధీ భవన్‌లో చార్జిషీట్ పోస్టర్‌ను విడుదల చేసిన కాంగ్రెస్



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బీజేపీ అభ్యర్థి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గల్ఫ్ కార్మికులను మోసం చేశారని కాంగ్రెస్ ఆరోపిస్తూ సోమవారం గాంధీభవన్‌లో 'గల్ఫ్ కార్మిక ద్రోహి.. గప్పాల అర్వింద్'పేరిట చార్జిషీట్ పోస్టర్‌ను టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ విడుదల చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ చార్జిషీట్‌లోని నాలుగు ప్రశ్నలకు జవాబు ఇవ్వకపోతే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో గల్ఫ్ కార్మికుల ఓట్లు అడిగే నైతిక అర్హత అర్వింద్‌కు లేదన్నారు. చార్జిషీట్ పోస్టర్ ఆవిష్కరణలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, టీపీసీసీ ఎన్నారై సెల్ నాయకులు మంద భీం రెడ్డి, నంగి దేవేందర్ రెడ్డి, కేరళ ప్రవాసీ కాంగ్రెస్ నేత మునీర్ పాల్గొన్నారు.

'రాజ్యాంగ రక్షణ- రిజర్వేషన్ల పరిరక్షణ'పై నేడు అఖిలపక్ష సమావేశం



దాసు సురేశ్

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్ల ఎత్తివేత ఆరోపణలపై ప్రధాని స్పష్టత నివ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం 'రాజ్యాంగ రక్షణ- రిజర్వేషన్ల పరిరక్షణ'పై బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నామని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నేతలు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ఉద్యమకారులు, మహిళా సంఘాల నాయకులు హాజరవుతారని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందకముందే రిజర్వేషన్లను ఎత్తేస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తారన్న చర్చను ప్రతిపక్షాలు నేడు జాతీయవ్యాప్తంగా కొనసాగిస్తున్న నేపథ్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆందోళన చెందుతున్నారని, ఈ అంశంపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని దాసు సురేశ్ తెలిపారు.

డ్రైవరే కండక్టర్!

రెండు డ్యూటీలు చేసేలా ఇక నియామకాలు

ఆర్టీసీ యోచన

ఎన్నికల తర్వాత 2 వేల డ్రైవర్ పోస్టుల భర్తీకి కార్యాచరణ

ఆ సమయంలోగా దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్న ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో ఇక విడిగా డ్రైవర్, విడిగా కండక్టర్ పోస్టుల భర్తీ పద్ధతి ఉండదు. ఆ ఉద్యోగంలోకి వచ్చే వ్యక్తి అవసరమైతే డ్రైవర్‌గా, అవసరాన్ని బట్టి కండక్టర్‌గా రెండు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం డ్రైవర్ కం కండక్టర్ పేరుతో ఉమ్మడిగా ఆ రెండు పోస్టులు భర్తీ చేసే యోచనలో ఆర్టీసీ ఉంది. అయితే దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఎన్నికలవగానే పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పార్లమెంటు ఎన్నికలు ముగియగానే ఆర్టీసీలో దాదాపు మూడు వేల పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే ఆర్టీసీ సమర్పించిన ప్రతిపాదన సీఎం పరిశీలనకు వెళ్లనుంది. ఆయన ఆమోద ముద్ర వేస్తే వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదలవుతుంది. ఆ భర్తీ ప్రక్రియలో డ్రైవర్ కం కండక్టర్ పేరుతో పోస్టులను భర్తీ చేస్తే ఎలా ఉంటుందన్న విషయాన్ని ఆర్టీసీ పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మినహా మిగతావాటికి డ్రైవర్లే టికెట్లు జారీ చేస్తున్నారు. కొన్ని నాన్ స్టాప్ సర్వీసుల్లో నిర్ధారిత పాయింట్ల వద్ద కండక్టర్లు బస్సు ఎక్కి టికెట్లు జారీ చేసి దిగిపోతున్నారు. టికెట్లు జారీ చేస్తూ డ్రైవింగ్ చేయటం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉంది. కొన్ని విదేశాల్లో మన కంటే ముందు నుంచే అమలవుతోంది. కానీ, టికెట్లు జారీ చేస్తూ బస్సు నడపటాన్ని డ్రైవర్లు అదనపు భారంగా భావిస్తున్నారు. అసలే ఒత్తిడిలో ఉంటూ ఈ అదనపు పని తమపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంటున్నారు.

కండక్టర్ పోస్టులకు ఇక గుడ్‌బై?

భవిష్యత్తులో జీతాల భారాన్ని తగ్గించుకోవాలని ఆర్టీసీ చూస్తున్న నేపథ్యంలో, ప్రత్యేకంగా కండక్టర్ల రిక్రూట్ మెంట్ అవసరం లేదన్న అభిప్రాయం కూడా ఉంది. మరోవైపు డ్రైవర్ పోస్టులకు ఉన్న కొరత కండక్టర్ పోస్టులకు లేదు. ఈ నేపథ్యంలో అసలు ఆ పోస్టు పేరే మార్చి రెండు పనులు చేసే డ్యూటీగా అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ భావిస్తోంది. ఏ బస్సులో ఏ డ్యూటీ అవసరమో ఆ డ్యూటీ చేసేలా వారికి శిక్షణ ఇవ్వాలని భావిస్తున్నారు. ప్రత్యేకంగా కండక్టర్ ఉండి టికెట్లు జారీ చేయాల్సిన పరిస్థితి ఉంటే కొందరిని టికెట్ల జారీకి, మిగతావారిని డ్రైవింగ్‌కు వినియోగించుకుంటారు. ప్రస్తుతం మూడు వేల పోస్టుల భర్తీకి ఇటీవల ఆర్టీసీ ప్రతిపాదించింది. ఇందులో 2 వేలు డ్రైవర్ పోస్టులే ఉన్నాయి. మిగతావి కార్యాలయాలకు సంబంధించిన పోస్టులు. ఈ డ్రైవర్ పోస్టుల సమయంలోనే ఈ కొత్త విధానాన్ని అనుసరిస్తే బాగుటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తుది నిర్ణయం తీసుకున్నాకే ఇందులో స్పష్టత రానుంది.

ఎన్నికల కమిషనా.. ఎన్‌డీఏ జేబు సంస్థా?

చంద్రబాబు చెప్పినట్టల్లా ఆడితే ఇక ప్రజాస్వామ్యమెక్కడ?..

ఇళ్ల వద్ద పింఛన్లు అడ్డుకుని వృద్ధుల క్షోభకు కారణమయ్యారు

- ఇపుడు విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకూ అడ్డంకులు.. ఆఖరికి సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయటానికీ బ్రేకులే
- ఎన్నికలయ్యేవరకూ ఇవ్వరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు.. పథకమూ పాతదే.. లబ్ధిదారులూ పాతవారే.. అయినా ఏంటిది?
- ఐదేళ్ల నుంచీ కొనసాగుతున్న పథకాలకు కోడ్ వర్తించదని తెలీదా?.. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.610 కోట్ల మేర ఆగిన విద్యా దీవెన నిధులు
- 6,95,897 మంది రైతులకు నిలిచిపోయిన రూ.847.22 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ
- రైతుల, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బాబు
- అధికారం కోసం ఎంతకైనా దిగజారొచ్చుననే రీతిలో 'రాజకీయం
- 2019లో చంద్రబాబు సీఎంగా ఉండగా పసుపు, కుంకుమకు అనుమతి..
- అది కొత్త పథకం: పైపెచ్చు ఎన్నికలకు 3 రోజుల ముందు ఖాతాల్లో జమ.. వచ్చే రెండురోజులూ తెలంగాణలో రైతుల ఖాతాల్లోకి 'రైతు బంధు' నిధులు.. తెలంగాణలో పంట నష్టపోయిన రైతుల ఇన్‌పుట్ సబ్సిడీకీ ఓకే
- జగన్ టార్గెట్‌గా... ఏపీలో మాత్రం పూర్తి భిన్నంగా ఈసీ నిర్ణయాలు.. ఇక్కడ బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు తరువాత ఈసీ వైఖరిలో మార్పు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎమ్మెల్సీ కవిత బెయిల్‌కు ఢిల్లీ కోర్టు నో

ఈ దశలో బెయిల్ ఇచ్చేందుకు కారణాలు కనిపించట్లేదన్న జడ్జి

సీబీఐ, ఈడీ కేసుల్లో బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్ల కొట్టివేత

తీర్పును హైకోర్టులో సవాల్ చేయనున్న కవిత తరపు లాయర్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో సూత్రధారి, పాత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశ ఎదురైంది. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్లను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కొట్టేసింది. ఆయా పిటిషన్లపై గతంలో తీర్పు రిజర్వ్ చేసిన ప్రత్యేక కోర్టు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. కవితకు బెయిల్ ఇవ్వడానికి ఎలాంటి కారణాలు కనిపించడం లేదని తెలిపింది. అలాగే బెయిల్ కోసం ఆమె చూపిన అనారోగ్య సమస్యలు అంత తీవ్రమైనవి కావని పేర్కొంది. కేవలం శిక్ష అనే పదం తీవ్రతను బట్టి బెయిల్ దరఖాస్తును పరిష్కరించలేమని చెప్పింది. నేరం తీవ్రత, ఆరోపణల స్వభావం, సమాజంపై పడే ప్రభావం, నిందితుల ప్రవర్తన, సాక్షాల తారుమారు చేసే అవకాశాలు వంటి అంశాలనూ పరిగణనలోకి తీసుకోవాలని తీర్పులో కోర్టు వివరించింది.



దర్యాప్తు సంస్థ ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటున్నాం..

'బెయిల్ మంజూరు చేస్తే రాజకీయ పలుకుబడితో పిటిషనర్ సాక్ష్యాలను ధ్వంసం చేయడంతోపాటు సాక్షులను ప్రభావితం చేస్తారన్న దర్యాప్తు సంస్థ ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటున్నాం. నేరాల తీవ్రత, సందేహాస్పదమైన నేర స్వభావం, ఆర్థిక కారణాలను పరిశీలిస్తే ఈ దశలో బెయిల్ మంజూరు చేసేందుకు ఎలాంటి కారణం కనిపించడం లేదు. కేసు వాస్తవాలు, పరిస్థితులు, సంబంధిత కేసు చట్టానికి సంబంధించి ఈ దశలో పిటిషనర్‌ను బెయిల్‌పై విడుదల చేయడం సాధ్యంకాదు. ఈ నేపథ్యంలో పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేస్తున్నాం' అని ఢిల్లీ కోర్టు జడ్జి కావేరి బవేజా తన తీర్పులో పేర్కొన్నారు. అలాగే వైద్య పరిస్థితుల కారణంగా బెయిల్ ఇవ్వాలని పిటిషనర్ కోరారని కానీ అందుకు చూపిన అనారోగ్యాలు తీవ్రమైనవిగా లేవని జడ్జి అభిప్రాయపడ్డారు. జైలు డిస్పెన్సరీలో వైద్య సమస్యలకు తగిన చికిత్స అందడం లేదని పిటిషనర్ ఎక్కడా ఆరోపించలేదని పేర్కొన్నారు.


నేడు కోర్టులో హాజరు

ఈడీ, సీబీఐ కేసుల్లో జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అధికారులు హాజరుపరచనున్నారు. మరోవైపు బెయిల్‌పై హైకోర్టుకు వెళ్లడానికి కవిత తరపు న్యాయవాదులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ఒకే నేరంపై రెండు కేసులెందుకు..?

'అమిత్ షా వీడియో'పై సీపీ శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్య

- ముందు సిటీలోనే కేసు పెట్టాం
- అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేసి ఐదుగురి అరెస్టు
- ఢిల్లీ పోలీసులు జోక్యం చేసుకుంటే గందరగోళమే
- మీడియా సమావేశంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మార్ఫింగ్ వీడియో నేరంపై నగరంతో పాటు ఢిల్లీలో కేసు అవసరం లేదని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంపై తామే ముందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని స్పష్టం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన దీనిపై మాట్లాడుతూ... 'ఈ వ్యవహారంపై బీజేపీ నాయకులు గత నెల 26నే ఫిర్యాదు చేశారు. అయితే దాంతో పాటు వీడియో సమర్పించాలని కోరాం. మరుసటి రోజు (27న) ఫిర్యాదుదారులు పెన్‌డ్రైవ్ ఇవ్వడంతో కేసు నమోదు చేశాం. 'ఎక్స్'ను సంప్రదించడం ద్వారా 72 గంటల్లో వివరాలు సేకరించాం. ఇప్పటి వరకు ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశాం. 'ఎక్స్' నుంచి అదనపు సమాచారం కోసం వేచి చూస్తున్నాం. ఢిల్లీలో ఈ అంశంపై 28న కేసు నమోదైంది. ఒకే నేరంపై రెండు చోట్ల కేసులు అవసరం లేదు. రెండు చోట్ల దర్యాప్తు చేస్తే అనవసర గందరగోళానికి కారణం అవుతుంది. ఇటీవల నన్ను కలిసిన ఢిల్లీ స్పెషల్ సెల్ డీసీపీకి ఇదే విషయం చెప్పా. ఆయన అడిగిన వివరాలు అందించాం' అని సీపీ వివరించారు.

పొలిటీషియన్ల పాత్ర ఉందని తెలిస్తే వదిలేదు లేదు

'ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు సరైన దిశలో వెళుతోంది. ఈ కేసులో ప్రభాకర్‌రావుపై కోర్టు నుంచి అరెస్టు వారెంట్ కోరాం. అది వచ్చిన తర్వాత రెడ్ కార్నర్ నోటీసు జారీ ప్రక్రియ ప్రారంభిస్తాం. నేరానికి సంబంధించి మా వద్ద సమగ్ర ఆధారాలు ఉన్నాయి. నిందితులు ధ్వంసం చేసినప్పటికీ కీలకమైనవి సేకరించాం. బ్యూరోక్రాట్ల తర్వాత పొలిటీషియన్ల పాత్ర ఉందని వెలుగులోకి వస్తే వదలం. ఈ కేసులో ఏ స్థాయి వారి ప్రమేయం ఉన్నా విడిచిపెట్టేది లేదు. తొలుత నేరం చేసిన వాళ్లపై చర్యలు తీసుకుంటాం. ఆ తర్వాత చేయించిన వాళ్లు, ప్రోద్బలం ఇచ్చిన వాళ్లు... ఇలా అందరి పైనా చర్యలు తప్పవు. ఇతరుల వ్యక్తిగత జీవితాల్లోకి ఎవరూ జోక్యం చేసుకోకూడదన్నది ప్రభుత్వ ఉద్దేశం. అందుకే ఈ కేసు దర్యాప్తును సమగ్రంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది' అని శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.



ఈసెట్‌కు 96% హాజరు

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా కోర్సుల ద్వారా బీఈ, బీటెక్‌లో ప్రవేశానికి సంబంధించిన సోమవారం జరిగిన టీఎస్‌ఈసెట్ పరీక్షకు 23,330 (96.12 శాతం) మంది హాజరైనట్లు ఈసెట్ కన్వీనర్ చంద్రశేఖర్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 24,272 మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు. వీరిలో ఏపీ, తెలంగాణతో కలిపి మొత్తం 99 కేంద్రాల్లో ఈసెట్ నిర్వహించినట్లు చెప్పారు.



కలెక్టరేట్‌లో నీట్ రాసిన విద్యార్థులు

నీట్ ప్రశ్నపత్రం తారుమారు

కుమురంభీం ఆసిఫాబాద్‌లో ఒక సెట్‌కు బదులు మరో సెట్

ఆసిఫాబాద్ రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్–2024) ప్రశ్నపత్రం తారుమారైంది. వివరాల్లోకి వెళితే.. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పరీక్షకు 323 మంది విద్యార్థులకు 299 మంది హాజరయ్యారు. పరీక్షకు రెండు సెట్ల ప్రశ్నపత్రాలు జిల్లాకు పంపించారు. వీటిని పట్టణంలోని ఎస్‌బీఐ, కెనరా బ్యాంకుల్లో భద్రపరిచారు. ఎన్‌టీఏ నుంచి అందిన మెయిల్ ప్రకారం ఎస్‌బీఐలో భద్రపరిచిన జీఆర్ఐడీయూ సెట్ ప్రశ్నపత్రం వినియోగించాల్సి ఉంది. జిల్లా అధికారులు కెనరా బ్యాంకులో ఉంచిన ప్రశ్నపత్రాలతో పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా జీఆర్ఐడీయూ సెట్ పేపర్‌తో పరీక్ష నిర్వహించగా.. జిల్లాలో ఎస్ఏజీఎస్‌యూ సెట్‌తో పరీక్ష రాయించారు. ఘటనపై ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. విద్యార్థులు ఆందోళన చెందొద్దని, అధికారికంగా రెండు పేపర్లకు 'కీ' వస్తుందని ఎన్‌టీఏ అధికారులకు మెయిల్ పంపించి న్యాయం జరిగేలా చూస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

టెట్‌పై నిర్ణయాధికారం పాఠశాల విద్య కమిషనర్‌కు ఉండదు: టీఎస్‌పీటీఏ

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అర్హతపై నిర్ణయాధికారం పాఠశాల విద్య కమిషనర్‌కు ఉండదని అది మంత్రి స్థాయిలో తీసుకోవలసిన విధానపర నిర్ణయమని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) స్పష్టం చేసింది. టెట్‌పై కమిషనర్‌ను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవాలని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య సోమవారం ఓ ప్రకటనలో కోరారు. యూఎస్‌పీసీ తరఫున జారీ చేసిన ఆ ప్రకటనతో టీఎస్‌పీటీఏకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.